సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 157

మంగళవారం 27-8-2024



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



'ఆర్థిక' పటిష్టతే లక్ష్యంగా..


ఆర్బీఐ నిరంతరం పనిచేస్తుందన్న శక్తికాంతదాస్ -15లో



రైతుకు త్వరగా చేరితేనే..

కొత్త వంగడాలు రైతులకు త్వరగా చేరితేనే ఫలితమన్న డా. జనీల -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



హిమసీమలో ఎన్నికల వేడి

జమ్మూ కశ్మీర్ ఉగ్ర దాడులకు, కల్లోలానికి పర్యాయపదం. పదేళ్ల విరామం తర్వాత ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.

వివరాలు 6లో ▸



పాక్‌లో 50 మంది కాల్చివేత

బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ రెచ్చిపోయింది. రెండ్రోజుల్లో వివిధ చోట్ల దాడులు జరిపి 50 మందిని కాల్చి చంపింది.

వివరాలు 6లో ▸



... భారత్ బంగ్లా అయ్యేది

బీజేపీ ఎంపీ కంగన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతు ఉద్యమం ఉధృతంగా సాగి ఉంటే భారత్ బంగ్లాదేశ్‌లా మారేదన్నారు.

వివరాలు 6లో ▸



కుప్పకూలిన శివాజీ విగ్రహం

మహారాష్ట్ర తీరప్రాంత జిల్లా సింధుదుర్గ్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం 8 నెలలకే కుప్పకూలింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

లద్దాఖ్‌లో మరో 5 జిల్లాలు



కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో కొత్తగా లద్దాఖ్–జన్స్కర్, ద్రాస్, నుబ్రా, షామ్, చాంగ్‌తంగ్ జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది.

- వివరాలు 6లో▶

మూడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి



మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారి తలను పట్టి ఈడ్చుకెళ్లడంతో చర్మంతో సహా తల వెంట్రుకలు ఊడిపోయాయి. కొన ఊపిరితో ఆ పాప హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

- వివరాలు 5లో▶

బిగ్.. హంబగ్!



పెద్ద కంపెనీలు క్యాంపస్ నియామకాలు చేపడతాయంటే విద్యార్థులు ఆ కాలేజీకి ఎగబడతారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. బడా ఐటీ కంపెనీల కన్నా.. చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలే ఎక్కువ జీతాలిస్తున్నాయని తాజా అధ్యయనంలో తేలింది.

- వివరాలు 16లో▶

సింగరేణిలోనూ జల విద్యుదుత్పత్తి



సింగరేణి జలవిద్యుత్ రంగంలోకి అడుగు పెట్టబోతోంది. రూ. 3 వేల కోట్ల బడ్జెట్‌తో 500 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్లాంట్ నెలకొల్పుతోంది. దీనికి సంబంధించిన డీపీఆర్ సమర్పించాలని టాటా కన్సల్టెన్సీకి కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించింది.

- వివరాలు 5లో▶

ఇదండీ జగత్



ఇచ్చిన హామీలు నెరవేర్చితే ఆటోమేటిక్‌గా నమ్మకం కలుగుతుంది సార్!



ఒకప్పుడు ఇక్కడ చెరువు ఉండేది.. మరి ఇప్పుడు..

మేడ్చల్ జిల్లా కీసర మండలం అహ్మద్‌గూడలోని తుమ్మలకుంట చెరువు ఇది. 101 ఎకరాల్లో ఉండాల్సిన ఈ చెరువు పూర్తిగా మాయమైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సర్వే తేల్చింది. ఇదిప్పుడు మొత్తం కాలనీగా మారిపోయింది.

చెరువు తప్పిపోయింది

వెతికి పెట్టండంటూ 'హైడ్రా'కు ఇబ్బడిముబ్బడిగా ప్రజల ఫిర్యాదులు

గ్రేటర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక జలవనరులు, నాలాల కబ్జా.. ఆక్రమణలు తొలగించాలంటూ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల విన్నపాలు

- ఆషామాషీగా కాకుండా సాంకేతిక ఆధారాలు సైతం సమర్పణ
- గూగుల్ మ్యాప్స్, ఎర్త్ ఫొటోల్లాంటివీ జోడిస్తున్న వైనం
- తుమ్మలకుంట చెరువు పూర్తిగా మాయం..
- అనేక చెరువులు 20 నుంచి 90 శాతం వరకు కబ్జా
- నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధ్యయనం వెల్లడి
- మొత్తం చెరువుల విస్తీర్ణంలో 61 శాతం ఆక్రమణకు గురైనట్లు హైడ్రాకు నివేదిక.. హైదరాబాద్ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందంటూ ఆందోళన

2 లో

బెంగళూరు తరహాలో చెరువుల పునరుద్ధరణ: హైడ్రా కమిషనర్





మిర్యాలగూడ చెరువు మొత్తం విస్తీర్ణం **413.4** ఎకరాలు

ప్రస్తుతం **40.5** ఎకరాలకు 'చిక్కిపోయింది'

అంటే, **90%** చెరువు ఆక్రమణకు గురైంది


ఆక్రమణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



- పాతబస్తీకి చెరువుల కబ్జాల నుంచి విముక్తి కల్పించాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2 లో

కలెక్టర్ పట్టాలిస్తే.. కమిషనర్ కూలుస్తారా?



- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు విస్మయం
- వరంగల్ ఎంహెచ్ నగర్ వాసుల పిటిషన్‌పై వ్యాఖ్యలు

2 లో

నాపై కాల్పులు జరపండి.. కాలేజీని మాత్రం కూల్చొద్దు



- మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు
- హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో భావోద్వేగ ప్రసంగం

2 లో

సివిల్స్ మెయిన్స్‌కు క్వాలిఫై అయిన అభ్యర్థినికి చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు



రైతులు.. వర్సిటీలు.. ఉద్యోగాలు

- 10 రోజుల్లో అన్ని వర్సిటీలకు వీసీలు..
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద మెయిన్స్‌కు ఎంపికైన 135 మందికి రూ. లక్ష చొప్పున సాయం
- ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ. లక్ష సాయం

మా ప్రభుత్వ ప్రాథమ్యాలు ఇవే: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ కల్పన, మెరుగైన విద్య కోసం విశ్వవిద్యాలయాల అభివృద్ధి, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. గత ప్రభుత్వం కేవలం పదవులు, ఫామ్‌హౌస్‌లు, బంగళాలు, ఆస్తుల జమ లాంటి ప్రాధాన్యతలతో పదేళ్లు అధికారం చలాయించిందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటోందని.. తనతోపాటు మంత్రులు, అధికారులను ఎవరైనా కలిసి ప్రశ్నించే వెసులుబాటు ఉందన్నారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమంలో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు సింగరేణి కాలరీస్ లిమిటెడ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు.

స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీలతో..

'గత ప్రభుత్వం పదేళ్లలో పరీక్షలు నిర్వహించకుండా తీవ్ర జాప్యం చేస్తే మేం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు వేగవంతం చేశాం. రాష్ట్రంలో సర్టిఫికెట్ కోర్సులకే విద్య పరిమితమైంది. చదువుకు మిగతా 3వ పేజీలో ▶

100 క్షిపణులు.. డ్రోన్లు..!

పేలుళ్లతో దద్దరిల్లిన ఉక్రెయిన్

- విద్యుత్, నీటి వనరులే లక్ష్యంగా రష్యా దాడులు
- ఐదుగురు మృత్యువాత, 13 మందికి గాయాలు

6 లో

4 వేల లావాదేవీలు.. రూ.20.8 కోట్ల ఆదాయం

రోజుకు నగటున రాష్ట్రంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల లెక్క ఇది

తెలంగాణ ఏర్పాటైన పదేళ్లలో కోటిన్నర క్రయవిక్రయాలు.. రూ.76 వేల కోట్ల ఆదాయం

- 2023–24లో 18.41 లక్షల లావాదేవీలు.. రూ.14,588 కోట్ల రాబడి.. 2021–22లో ఏకంగా 20 లక్షలు దాటిన డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు
- పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రిజిస్ట్రేషన్ల వృద్ధి రేటు తక్కువే
- కేరళ మినహా ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో మనకంటే ఎక్కువ లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: భూములు, ఆస్తుల క్రయ విక్రయాలు సర్వసాధారణంగా జరిగేవే. భూమిని అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా ప్రభుత్వ కార్యాలయంలో అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే. హక్కుల రికార్డు మ్యుటేషన్ జరగాల్సిందే. ఇలాంటి రిజిస్ట్రేషన్లు రాష్ట్రంలో రోజుకు ఎన్ని జరుగుతాయో తెలుసా.. తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తాజాగా విడుదల చేసిన అధికారిక నివేదిక ప్రకారం మన రాష్ట్రంలో రోజుకు సగటున 4 వేల వరకు క్రయవిక్రయ లావాదేవీలు మిగతా 12వ పేజీలో ▶



మహిళలే యజమానులు

- మహిళలే యజమానులుగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఇందిరా డెయిరీ ఏర్పాటు కానుంది. 61 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందులో వాటాదారులుగా ఉన్నారు. ఈ డెయిరీ నిర్వహణకు ప్రభుత్వం రూ.80 కోట్లు వెచ్చించనుంది. డెయిరీకి సంబంధించిన ప్రక్రియ చకచకా సాగుతుండగా.. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్‌లో త్వరలోనే నిర్మాణ పనులు మొదలుకానున్నాయి.

వివరాలు 12లో

లగేజీ చెకింగ్ తర్వాతే లోనికి..

- సికింద్రాబాద్ స్టేషన్‌లో విమానాశ్రయ తరహా పద్ధతులు
- స్టేషన్‌కు రెండు వైపులా రూ.6 కోట్లతో ఆధునిక బ్యాగేజీ స్క్రీనింగ్ వ్యవస్థ ఏర్పాటు
- రైలు వస్తోందని అనౌన్స్‌మెంట్ వచ్చాకే ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతి
- రైలు వచ్చే వరకు వెయిటింగ్ హాల్‌లో ఉండాల్సిందే
- ప్రయాణికులు కాని వారికి ప్లాట్‌ఫామ్ వైపు నో ఎంట్రీ



వేలాదిమంది ప్రయాణికులు... ఎటువైపు నుంచి వస్తున్నారో, ఎటు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. ఒకటి-పది.. ప్లాట్‌ఫామ్స్ వైపు ఉన్న ప్రవేశద్వారాల్లో బ్యాగేజీ చెకింగ్ వ్యవస్థ ఉన్నా.. అది పని చేయదు. పక్కనే భద్రతా సిబ్బంది ఉన్నా పట్టించుకోరు.. వచ్చిపోయే రైళ్లతో ప్రమేయం లేకుండా ఎప్పుడు చూసినా.. ప్లాట్‌ఫామ్‌లు వందల మందితో కిక్కిరిసి కనిపిస్తాయి. కాస్త చీకటి పడితే చాలు.. ప్లాట్‌ఫామ్‌లపై గురకపెట్టి నిద్రలోకి జారుకునే వారెందరో... వెరసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అంతా గందరగోళం. కానీ, ఇప్పుడు ఈ పరిస్థితి పూర్తిగా మారబోతోంది.

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్‌గా రూపుదిద్దుకొంటున్న సికింద్రాబాద్ స్టేషన్ మరో ఏడాదిన్నరలో సరికొత్త రూపును సంతరించుకోనుంది. రూ.700 కోట్ల భారీ వ్యయంతో ఆధునిక స్టేషన్‌గా రూపాంతరం మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

చెరువులపై పదేళ్లు ఏం చేశారు?



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ చెరువుల సంరక్షణ ఎందుకు చేపట్టలేదని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా ప్రోత్సహించింది బీఆర్ఎస్ నేతలేనని విమర్శించారు. అందుకే ఇప్పుడు ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు అల్లంభాస్కర్, భవానీరెడ్డి, జ్ఞానసుందర్, పద్మలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, జలాశయాల పరిరక్షణతో.. రాబోయే 50 ఏళ్లలో పెరిగే జనాభాకు తాగునీటి సమస్య రాకుండా దూరదృష్టితో రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు.

ధైర్యం ఉంటే ఆరోపణలు నిరూపించాలి

కేటీఆర్‌కు ఎమ్మెల్యే వివేక్ సవాల్



సాక్షి, హైదరాబాద్: ఎవరిదో చూపించి అది నా ఫామ్‌హౌస్ అని చెబుతున్నారని, అదే విధంగా మీడియా సంస్థ, బిజినెస్ సొల్యూషన్స్‌పై చేసిన ఆరోపణలను మాజీ మంత్రి కేటీఆర్ నిరూపించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సవాల్ విసిరారు. సోమవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నప్పుడే ఫామ్‌హౌస్‌కు కాంపౌండ్ వాల్ ఉందని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనల ప్రకారమే కట్టారని స్పష్టం చేశారు. మీడియా సంస్థకు, బిజినెస్ సొల్యూషన్స్‌కు కేటీఆర్‌కు తేడా తెలియదని, దాని డైరెక్టర్లు, స్థాపకులు ఎవరో తెలుసుకోకుండా ఆరోపణ చేస్తున్నారని, దీనిపై గూగుల్‌కు వెళ్లి వాస్తవం తెలుసుకోవాలని హితవు పలికారు. గత వారంరోజులుగా మాజీ మంత్రి కేటీఆర్, అతని మనుషులు ఇష్టం వచ్చినట్లుగా ట్రోల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే మీడియా హౌస్‌ను ప్రారంభించామని, దాన్ని అణగదొక్కాలని చాలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను మించిన పెద్ద తుగ్లక్ కేటీఆర్ అని, ఎన్నికల్లో సొంత చెల్లెను గెలిపించుకోలేని కేటీఆర్ లీడర్ ఎలా అవుతాడని వివేక్ ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా చెరువులను కాపాడండి

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: చెరువులు, కుంటలు, జలాశయాలను కబ్జా చేసి ఫామ్‌హౌస్‌లు, విలాస భవనాలు నిర్మించుకున్న వారిపై తీసుకుంటున్న చర్యలను.. రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయాలని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు. రాష్ట్రంలోని లక్షలాది మత్స్యకార కుటుంబాల ప్రధాన జీవన వనరులు చెరువులు, కుంటలేనని స్పష్టం చేశారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కబ్జాలను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వంపై కొందరు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా ఏర్పాటును ప్రజలు స్వాగతిస్తున్నారని, రాష్ట్రమంతటా దీన్ని విస్తరిస్తే మత్స్యకార కుటుంబాలు సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాయని సాయి పేర్కొన్నారు.



చెరువు తప్పిపోయింది!

మిర్యాలగూడ, కుంట్లూరు చెరువుతో పాటు నల్ల చెరువు, ఇతర అనేక చెరువులు 80 శాతం నుంచి 90 శాతం వరకు ఆక్రమణకు గురయ్యాయని ఎన్ఆర్ఎస్‌సీ తెలిపింది.

నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ సైతం ఆక్రమణకు గురి కావడం విస్తుగొలిపే అంశం. ఈ చెరువు కూడా 20 శాతం అంటే మొత్తం విస్తీర్ణంలో ఐదో వంతు ఆక్రమణకు గురైనట్లు ఎన్ఆర్ఎస్‌సీ తేల్చడం గమనార్హం.

వెతికి పెట్టండంటూ హైడ్రాకు ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు

గ్రేటర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక జలవనరులు, నాలాల కబ్జా









సాక్షి, హైదరాబాద్: కబ్జాకు ఏ చెరువూ కాదు అనర్హం అన్నట్టుగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగరం చుట్టుపక్కల ఉన్న అనేక చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. హైదరాబాద్ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం ఓ మోస్తరు వాన కురిసినా కాలనీలను వరద ముంచెత్తుతోంది. రోడ్లే చెరువుల్ని తలపిస్తున్నాయి. ఇక భారీ వర్షం అంటే నగరజీవి బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంటోంది. చెరువులు, కుంటల్లాంటి జలవనరులు, నాలాలు ఆక్రమణలకు గురి కావడం వల్లే ఈ దుస్థితి ఏర్పడుతోందని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఇప్పుడు సామాన్య ప్రజలు సైతం దీనిపై స్పందిస్తున్నారు. ఇటీవలి కాలంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చెరువుల్లో ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తుండటంతో ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్రాంతంలో చెరువుల ఆక్రమణపై హైడ్రాతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలకు ఫిర్యాదు చేస్తున్నారు. మా చెరువేదీ అంటూ ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలు తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఆధారాలతో సహా..

'తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్‌లో రికార్డుల ప్రకారం 8 ఎకరాల విస్తీర్ణంలో తుమ్మల చెరువు ఉండాలి. కానీ ప్రస్తుతం దాని అలుగు మాత్రమే కనిపిస్తోంది కానీ చెరువు కనిపించట్లేదు..'అని బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్ సోమవారం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న జలవనరుల పరిరక్షణ కోసం.. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో ఉన్న 158 అక్రమ నిర్మాణాలను తొలగించిన ఈ ఏజెన్సీ 43.94 ఎకరాల చెరువులు, ప్రభుత్వ భూములను కాపాడింది. ఈ నేపథ్యంలో ప్రధానంగా చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలకు సంబంధించి ఈ విభాగానికి ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు వస్తున్నాయి. సాధారణంగా వివిధ విభాగాలకు చేసే ఫిర్యాదులకు బాధితులు, ప్రజలు.. పలు పత్రాలు, ఫొటోలు, ఆడియో, వీడియో సీడీల్లాంటివి జత చేస్తుంటారు. కానీ హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులు మాత్రం కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ తరహా శాటిలైట్ ఫొటోలను జత చేసి మరీ ఫిర్యాదు చేస్తుండటం గమనార్హం. కాగా ఈ ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను హైడ్రా, ఇతర విభాగాలు గోప్యంగా ఉంచుతున్నాయి. అయితే హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్న వారిలో బాధితులతో పాటు సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు ఉంటున్నట్లు సమాచారం. మాదాపూర్ ఖానామెట్‌లోని తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్టుగా చెబుతున్న సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌పై.. 'జనం కోసం'అనే సంస్థతో పాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ కూల్చివేత తర్వాతే హైడ్రాకు లెక్కకుమిక్కిలిగా ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి ఫిర్యాదునూ వివిధ కోణాల్లో పరిశీలించి, రికార్డులు తనిఖీ చేసిన తర్వాతే హైడ్రా చర్యలకు ఉపక్రమిస్తోంది.

అన్ని అనుమతులతో దర్జాగా..!

ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల్లో.. అలాగే నాలలపై నిర్మించిన కట్టడాల్లో రెండు రకాలైనవి ఉంటున్నాయి. కొన్నింటిని అసలు అనుమతులే తీసుకోకుండా నిర్మించేయగా.. మరికొన్నింటికి అవసరమైన అన్ని అనుమతులూ ఉండటం గమనార్హం. ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి అనుమతులు తీసుకుని మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ కనెక్షన్ ఇస్తుండగా.. ఇతర విభాగాలు రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాలన్నీ కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అనేక చోట్ల లేఔట్లు, వెంచర్లు, అపార్ట్‌మెంట్లు కూడా యథేచ్ఛగా వెలిశాయి. ఈ క్రమంలో రూ.లక్షల నుంచి రూ.కోట్ల వరకు చేతులు మారాయన్నది బహిరంగ రహస్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముందే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ!

ఏదైనా భవనం నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు ఆద్యంతం పరిశీలించాల్సి ఉంటుంది. నిర్మాణంలో నిబంధనలు పూర్తి స్థాయిలో పాటించారని నిర్ధారించాల్సి ఉంటుంది. ఆ తర్వాత మాత్రమే 'నివాసానికి యోగ్యం'అంటూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయాల్సి ఉంటుంది. అయితే రాజధానిలోని చెరువులు, కుంటలు, బఫర్ జోన్లలో నిర్మితమవుతున్న కొన్ని భవనాలకు పనులు పూర్తి కాకుండానే ఓసీలు జారీ అయిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. దీనికి ఆ విభాగం అధికారుల అవినీతే కారణమనే ఆరోపణలు కూడా ఉంటున్నాయి. ఇలాంటి వ్యవహారాలకు సంబంధించి ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు అందుకున్న హైడ్రా అధికారులు వాటిపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కొన్ని నిర్మాణాలకు ప్రభుత్వ విభాగాలు అనుమతులు ఇవ్వడాన్ని గుర్తించిన హైడ్రా అధికారులు వాటిని రద్దు చేయాల్సిందిగా కోరుతూ హెచ్ఎండీఏకు లేఖ రాశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టనున్నారు.

ఆ అధికారుల గుండెల్లో రైళ్లు

ప్రస్తుతానికి ఆయా నిర్మాణాల కూల్చివేతల పైనే హైడ్రా దృష్టి పెడుతోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ, చెరువుల కబ్జాల నిరోధం, విపత్తు స్పందన.. తదితర లక్ష్యాలతో ఏర్పాటు అయిన హైడ్రా జలవనరుల పరిరక్షణకే పెద్దపీట వేసి ముందుకు వెళ్తోంది. అయితే ఈ విభాగానికి ప్రత్యేక పోలీసుస్టేషన్ మంజూరైన తరువాత మరో అడుగు ముందుకు వేయనుంది. ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రతి విభాగం, ఆయా అధికారుల పైనా విచారణ జరిపి, సంబంధిత శాఖలకు నివేదికలు ఇవ్వడంతో పాటు చర్యలకు సిఫారసు చేయనుంది. దీంతో ప్రస్తుతం ఆయా విభాగాలకు చెందిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

హైదరాబాద్‌తో పాటు నగర శివారుల్లోని కొన్ని కీలక చెరువుల పరిస్థితి ఇది...

● ప్రస్తుతం ఉన్నది (ఎకరాల్లో)
● ఉండాల్సింది (ఎకరాల్లో)
▼ ఆక్రమణలు (శాతాల్లో)

చెరువు	ప్రస్తుతం ఉన్నది (ఎకరాల్లో)	ఉండాల్సింది (ఎకరాల్లో)	ఆక్రమణలు (శాతాల్లో)
కుంట్లూరు	34.5	332.3	90
నల్ల చెరువు	51.3	205.5	90
కొంపల్లి	7.1	59.5	88
ఖాజిగూడ	27.6	229	88
గుర్రం చెరువు	34.1	231.7	85
జిల్లెలగూడ	23.4	160	85
బండ్లగూడ	14.8	86.7	83
ఓల్డ్ అల్వాల్	24.4	133.1	82
ఇంజాపూర్	125.2	624.9	80
పీర్జాదిగూడ	27.9	104.2	73
బాతుల చెరువు	78.3	285.1	72
రామకృష్ణాపురం	54.3	188.7	71
పెద్ద చెరువు	85	275	69
సఫిల్‌గూడ	26.1	76.3	66
దమ్మాయిగూడ	17.2	47.6	64
సరూర్‌నగర్	88.9	199.6	56
చెంగిచెర్ల	38.7	82.7	53
నాగారం	55.5	100	45
నాగోలు	16.3	27.6	41
మీరాలం	365.7	538.6	32
జల్‌పల్లి	151.2	218.6	31
కాప్రా	93.6	127.7	27
ఫాక్స్ సాగర్	381.5	92.2	22
హుస్సేన్‌సాగర్	1,163.8	1,475.2	21

10 వేలకు మిగిలింది 3,900 ఎకరాలే...

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ 'గ్రేటర్'తో పాటు చుట్టుపక్కల ఉన్న 56 చెరువుల పరిస్థితిపై అధ్యయనం చేసింది. 1979–2023 మధ్య 44 ఏళ్లలో అవి ఏ స్థాయిలో కబ్జాలకు గురయ్యాయో తేల్చింది. అప్పట్లో 10416.8 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ జలవనరులు గత ఏడాది నాటికి 3,974.1 ఎకరాలకు పడిపోయాయి. ఇలా మొత్తమ్మీద 61 శాతం మాయమై కేవలం 39 శాతం మిగిలినట్లు ఎన్ఆర్ఎస్‌సీ లెక్కకట్టింది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో హైదరాబాద్ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్ని మార్చాలని కోరుతూ హైడ్రాకు నివేదిక సమర్పించింది.

చెక్కు చెదరని హకీంపేట.. విస్తరించిన చెన్నపురం

రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న డిఫెన్స్ ఏరియా హకీంపేటలోని 18 ఎకరాల చెరువు మాత్రం ఇప్పటికీ అలాగే ఉందని ఎన్ఆర్ఎస్‌సీ సర్వే వెల్లడించింది. అలాగే ఈ సర్వేలో వెలుగులోకి వచ్చిన మరో ఆసక్తికర అంశం చెన్నపురం చెరువుకు సంబంధించింది. సికింద్రాబాద్ చంద్రపురికాలనీలో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం 44 ఏళ్లల్లో పెరిగింది. 1979లో ఇది 16 ఎకరాల్లో విస్తరించి ఉండగా..2023 నాటికి 15 శాతం పెరిగి 18.2 ఎకరాలకు చేరింది. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించిన హైడ్రా..చెరువు విస్తీర్ణం అలా పెరగడానికి కారణాలను విశ్లేషించాలని నిర్ణయించింది.

ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లూ వర్తించవు.. మూడు దశల్లో కార్యాచరణ అమలు




హైడ్రా పరిధిలో ఉన్న ప్రతి చెరువు, కుంట పూర్వాపరాలు అధ్యయనం చేస్తున్నాం. కూల్చివేతలు అనేవి చట్ట ప్రకారం జరుగుతాయి. ఇలాంటి చర్యలు తీసుకునే ముందు ఆద్యంతం పరిశీలిస్తాం. నీటి వనరులు, ప్రభుత్వ స్థలాలు పూడ్చే ట్రాక్టర్లు, టిప్పర్లను కూడా భవిష్యత్తులో సీజ్ చేయనున్నాం. చెరువు, కుంటలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కు స్థలాలకు ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లు వర్తించవు. చెరువులు, కుంటలు, నాలాలు తదితరాల పరిరక్షణ కోసం హైడ్రా మూడు దశల్లో కార్యాచరణ అమలు చేస్తోంది. మొదటి దశలో ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఒక్క చదరపు అడుగు కూడా ఆక్రమణ కాకుండా చూస్తోంది. రెండో దశలో ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో అనుమతి ఉన్నా, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం. మూడో దశలో ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న మాదిరిగా చెరువుల పునరుద్ధరణ చేపడతాం. నగరంలో ఉన్నవి అన్నీ గొలుసుకట్టు చెరువులే. ఒకటి అలుగు పారితే ఆ నీరు నాలాలు, వాగుల ద్వారా మరో దాంట్లోకి వెళ్లాలి. ఆ పరిస్థితిని మళ్లీ తీసుకురావడానికి కృషి చేస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు, లేఔట్లలో ప్రజలు ప్లాట్లు, స్థలాలు ఖరీదు చేయొద్దు. త్వరలో ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెడతాం. ఇప్పటికే ఇలా ఖరీదు చేసి నష్టపోయిన వాళ్లు ఉంటే బిల్డర్‌పై కేసు పెట్టండి.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

కలెక్టర్ పట్టాలిస్తే.. కమిషనర్ కూలుస్తారా?

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు విస్మయం

- అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అసహనం
- ఇందిరమ్మ ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ జీడబ్ల్యూఎంసీ నోటీసులివ్వడంపై ఆక్షేపణ
- వరంగల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పలువురికి నోటీసులు
- ఇదే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌లో అసైన్‌మెంట్ పట్టాలపై విచారణ జరపాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వరంగల్‌లోని దేశాయిపేట ఎంహెచ్ నగర్‌వాసులకు గతంలో కలెక్టర్ స్వయంగా పట్టాలు పంపిణీ చేస్తే తాజాగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ కూల్చివేత నోటీసులు ఇవ్వడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఒక్కటే అయినా అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. పిటిషన్‌లో కలెక్టర్‌ను ప్రతివాదిగా చేర్చకపోవడాన్ని ఆక్షేపిస్తూ ఇంప్లీడ్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. కలెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఇరిగేషన్ ఈఈ తదితరులకు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. చిన్న వడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టారంటూ జీడబ్ల్యూఎంసీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌కు చెందిన సీహెచ్ కవిత సహా 75 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నోటీసులతోపాటు తదుపరి చర్యలను నిలిపివేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. మళ్లీ సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను నిర్ధారించేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు.

మరో పిటిషన్‌లో..

మరోవైపు ఇదే అంశానికి సంబంధించి ఎంహెచ్ నగర్‌కు చెందిన మరో 127 మంది వేసిన మరో పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. గతంలో సర్కార్ ఎంహెచ్ నగర్‌వాసులకు జారీ చేసిన అసైన్‌మెంట్ పట్టాలపై విచారణ జరపాలని.. అప్పటివరకు పిటిషనర్లను అక్కడి నుంచి వెళ్లగొట్టొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్‌కు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

పిటిషనర్ల వాదన ఇదీ..: 'దేశాయిపేట సర్వే నంబర్ 308లో మావన్నీ పట్టా భూములు. బీపీఎల్ కింద ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వ అనుమతితోనే నిర్మాణాలు చేపట్టాం. కానీ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి సర్వే చేయకుండానే చెరువు ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లో మేము ఇళ్లు నిర్మించామని ఆరోపిస్తూ వాటిని కూల్చేస్తామని మాలో కొందరికి నోటీసులిచ్చా రు'అని పిటిషన్లలో పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదిస్తూ '30 నుంచి 60 చదరపు గజాల స్థలంలో పిటిషనర్లు గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. 2007 నుంచి 2023 మధ్య అధికారులు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. ఆయా ఇళ్లకు పిటిషనర్లు విద్యుత్ బిల్లులు, ఆస్తి, నీటిపన్నులు కూడా చెల్లిస్తున్నారు'అని చెప్పారు.

జీడబ్ల్యూఎంసీ వాదన ఇలా..

'వరంగల్‌లోని చెరువులను పరిరక్షించాలంటూ ఇదే కోర్టులో ద్విసభ్య ధర్మాసనం ముందు దాఖలైన ఒక 'పిల్'పెండింగ్‌లో ఉంది. ధర్మాసనం ఆదేశాల మేరకు వరంగల్ నగర పరిధిలోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాం. భద్రకాళి చెరువు బఫర్ జోన్/ఎఫ్‌టీఎల్ పరిధిలోని 250 గుడిసెలను తొలగించామని ధర్మాసనానికి చెప్పాం. కొన్ని ఆక్రమణలను తొలగించాల్సి ఉందని పేర్కొన్నాం. అలాగే చిన్న వడ్డేపల్లి చెరువు పరిధిలో ఉన్న 329 గుడిసెలను తొలగించే ప్రయత్నం చేస్తున్నాం... కొంత సమయం కావాలని ద్విసభ్య ధర్మాసనాన్ని కోరగా సమ్మతించింది. దీంతో తెలంగాణ మున్సిపాలిటీల చట్టం –2019లోని సెక్షన్ 178, 180, 181 కింద ఎంహెచ్ నగర్‌వాసులకు జీడబ్ల్యూఎంసీ నోటీసులు జారీ చేసింది. దీనిపై చట్టప్రకారం కఠిన నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు'అని జీడబ్ల్యూఎంసీ తరఫు న్యాయవాది వాదించారు. కాగా, గుడిసెల తొలగింపు, వారిని అక్కడి నుంచి పంపే అంశంలో జోక్యం చేసుకోవట్లేదని తహసీల్దార్ తరఫు ఏజీపీ తెలిపారు.

చెరువుల ఆక్రమణలు, అన్యాక్రాంత భూములపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

- పాతబస్తీకి చెరువుల కబ్జాల నుంచి విముక్తి కల్పించాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఉన్న చెరువులు ఎన్ని ? వాటిలో ఆక్రమణకు గురైనవి ఎన్ని ? అన్యాక్రాంతమైన భూముల లెక్కపై శ్వేతపత్రం విడుదల చేయాలి'అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో అన్యాక్రాంతమైన భూములు, చెరువుల వివరాలు ప్రకటించాలన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అన్యాక్రాంతమైన భూముల లెక్క ప్రభుత్వం వద్ద ఉందా అని ప్రశ్నించారు. దీనిపైనా శ్వేత పత్రం ప్రకటించాలని చెప్పారు. కొంతమందిని లక్ష్యంగా చేసుకునే హైడ్రా పని చేస్తుందనే అనుమానం కలుగుతోందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం వారం, పదిరోజుల్లోనే 49 ఎకరాలు రికవరీ చేశామని గొప్పగా చెబుతున్నారని, అయితే రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో భూమి అన్యాక్రాంతమైనట్టు, వాటిలో కోట్ల బిల్డింగులు వెలిసినట్టు లెక్కలున్నాయని, ఈ భూములను ఎప్పుడు రికవరీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రాకు చిత్తశుద్ధి, దమ్ము, ధైర్యం ఉంటే సామాన్య ప్రజలపై ప్రతాపం చూపించకుండా పాతబస్తీని చెరువుల కబ్జాల నుంచి విముక్తి చేయాలని సవాల్ విసిరారు. ఇంత హంగామా చేస్తున్న హైడ్రా అధికారులకు సల్కం చెరువులోని ఒవైసీ భూములను కూల్చే దమ్ముందా...ఆ అక్రమ కట్టడాలు హైడ్రా కమిషనర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 'రాష్ట్ర సర్కార్, హైడ్రా ఓల్డ్ సిటీ నుంచి కూల్చివేతలు ప్రారంభించాలి. మీ బుల్డోజర్లకు పాతబస్తీ వెళ్లడానికి డీజిల్ లేదా అని వ్యంగ్యంగా అన్నారు. 'జీహెచ్ఎంసీ పరిధిలోనే దాదాపు 300 చెరువులు కబ్జాకు గురైనట్టు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2022–23 ప్రభుత్వ లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఆక్రమణకు గురైన 134 చెరువులపై ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం వాటిలోని ఎఫ్‌టీఎల్‌లో 8,718 అక్రమ నిర్మాణాలు, బఫర్ జోన్ పరిధిలో 5,343 నిర్మాణాలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ నివేదిక ప్రకారం మొత్తం 13వేల నిర్మాణాలను కూలగొట్టే ధైర్యం ప్రభుత్వానికి ఉందా'అని మహేశ్వర్‌రెడ్డి నిలదీశారు.

మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు

- హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో భావోద్వేగ ప్రసంగం
- భవనాలను ఒకవేళ కూల్చినా కుతుబ్‌మినార్ కంటే ఎత్తైనవి కడతామని వ్యాఖ్య

నాపై కాల్పులు జరపండి.. కాలేజీని మాత్రం కూల్చొద్దు



సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో చెరువులను కబ్జా చేసి కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్న 'హైడ్రా'.. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ కాలేజీని కూడా కూల్చేస్తుందన్న ప్రచారంపై మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. పాతబస్తీలోని ఒవైసీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ విద్యాసంస్థను మాత్రం కూల్చకండి. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు 12 భవనాలు నిర్మించాం. 40 వేల మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యతో మంచి భవిష్యత్ అందిస్తున్నాం. పేద విద్యార్థులకు మా విద్యాసంస్థ ఓ వరం' అని వ్యాఖ్యానించారు. తాము చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని కొందరు వ్యక్తులు.. అసూయతో కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పేదల విద్యాభివృద్ధికి తాము చేస్తున్న కృషిని అడ్డుకోరాదని కోరారు. 'నాతో ఎవరికైనా శత్రుత్వం ఉంటే రండి.. తుపాకీలతో నన్ను కాల్చి చంపేయండి. కత్తులతో పొడవండి. కానీ నేను చేసే మంచి పనిని మాత్రం నాశనం చేయొద్దు' అని అక్బరుద్దీన్ విజ్ఞప్తి చేశారు.

బతిమిలాడుతున్నానంటే..

'నేను బతిమిలాడుతున్నానంటే నాకు శత్రువులతో పోరాడే శక్తి లేక కాదు. నాపై దాడి జరిగింది. నా శరీరమంతా గాయాలు ఉన్నాయి. నేను శత్రువులకు వెన్ను చూపే వ్యక్తిని కాదు. నా విజ్ఞప్తిని బలహీనతగా భావించొద్దు' అని అక్బరుద్దీన్ హెచ్చరించారు. మా విద్యాసంస్థలను ఒకవేళ కూల్చినా కుతుబ్‌మినార్ కంటే ఎత్తైన భవనాలు నిర్మిస్తామని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

11 సంఘాలతో గురుకుల ఉద్యోగుల జేఏసీ

సమస్యలపై ఉమ్మడిగా ఉద్యమించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. సంఘాలన్నీ సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం.. సమస్యల పరిష్కారానికి ఐక్య కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ జేఏసీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన 11 సంఘాలున్నాయి. జేఏసీ ఏర్పాటు అనంతరం జరిగిన సమావేశంలో సభ్యులు పదమూడు అంశాలపై తీర్మానం చేశారు. గురుకులాల్లో అశాస్త్రీయంగా నిర్ణయించిన టైమ్‌టేబుల్ మార్పు, జీవో 317 కేటాయింపుల్లో అవకతవకలు, పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పోస్టింగ్‌లు, ఉద్యోగ విరమణ చేసినవారి బిల్లుల క్లియరెన్స్ తదితర అంశాలపై తీర్మానించిన జేఏసీ.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించింది.

తెలుగు వర్సిటీ కోర్సుల ప్రవేశ గడువు 31

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వివిధ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ దరఖాస్తుల గడువును పొడిగించారు. ఇక్కడ ఏటా పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ స్థాయిలో శిల్ప చిత్రలేఖనం, డిజైన్, సంగీత, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర-పర్యాటకం, భాషా శాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సులను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి గడువు ఆగస్టు 25 వరకు ఉండేది. కానీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ప్రవేశాల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు, కాల పరిమితి, ఫీజు తదితర వివరాల కోసం తెలుగు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల మహార్యాలీ 28న

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, తక్షణమే బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న జిల్లా స్థాయిలో మహార్యాలీ, నిరసన దీక్షలు నిర్వహించనున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, ఝాన్సీ సౌజన్య తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే దశల వారీగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

'హైడ్రా' కూల్చివేతలు పులిమీద స్వారీనే: నారాయణ



సాక్షి, హైదరాబాద్: 'హైడ్రా' పేరుతో అక్రమ కట్టడాల కూల్చివేతలు పులి మీద స్వారీ లాంటిదని, సీఎం రేవంత్‌రెడ్డి భయపడి పులి మీద నుంచి దిగితే ఆ పులి ఆయననే తినేస్తుందని, అలాగే ముందుకెళ్తే ప్రజల మద్దతు లభిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం ఆయన పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలను కూడా కూలుస్తారా? అని ఎంఐఎం నేత ప్రశ్నించడాన్ని నారాయణ తప్పుపట్టారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలకు, కబ్జాదారుల ఫామ్‌హౌస్‌లకు ఈ అంశాన్ని ముడిపెడతారా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బడాబాబుల కట్టడాలను కాపాడుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలను సాకుగా చూపే ప్రయత్నం జరుగుతోందన్నారు. హైడ్రా విషయంలో రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే మధ్యతరగతి, పేదల ఇళ్ల స్థలాల జోలికి వెళ్లకూడదని, వారి స్థలాలను క్రమబద్ధీకరించాలని లేదా వారికి ప్రత్యామ్నాయం చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్య పద్మ మాట్లాడుతూ బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బఫర్‌జోన్‌లోనే అనురాగ్ కాలేజీ కట్టారు: చనగాని



సాక్షి, హైదరాబాద్: నడెం చెరువు బఫర్ జోన్‌లోనే అనురాగ్ కళాశాలల నిర్మాణం జరిగిందని, అప్పట్లో తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ వాటిని నిర్మించారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. చెరువుల ఆక్రమణలను తొలగించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న హైడ్రాకు సహకరించాల్సిన ఆయన.. తప్పు చేసి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో చనగాని విలేకరులతో మాట్లాడుతూ, పల్లా భవనాల నిర్మాణంలోనే కాకుండా విద్యాసంస్థల నిర్వహణలోనూ ఏనాడూ నిబంధనలు పాటించలేదన్నారు. పేద విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆక్రమణలపై 'తోలు' మందం!



కబ్జా అంచున చర్మ పరిశ్రమ భూములు

కార్పొరేషన్ పేరిట భూములున్నా టైటిల్ లేదు.. టైటిల్ ఉంటే భూమి లేదు

రాయదుర్గంలోని టీజీఎల్ఐపీ భూములకు రక్షణ కరువు

మినీ లెదర్ పార్కుల మూతతో అన్యాక్రాంతమవుతున్న స్థలాలు

సాక్షి, హైదరాబాద్: చర్మకారులకు ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ, చర్మ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర చర్మ పరిశ్రమల ప్రోత్సాహక కార్పొరేషన్ (టీజీఎల్ఐపీ) భూములకు రక్షణ లేకుండా పోయింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం సంస్థ పేరిట వందల ఎకరాల భూములు కేటాయించగా వాటికి సంబంధించిన యాజమాన్య పత్రాలేవీ సంస్థ పేరిట లేవు. దీంతో చాలా చోట్ల భూములు నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల అన్యాక్రాంతం అవుతున్నాయి. ఉచితంగా తమ పేరిట బదిలీ చేయాలని టీజీఎల్ఐపీ, నిర్దేశిత మొత్తం చెల్లించాలని రెవెన్యూ శాఖ కోరుతుండటంతో టైటిల్ డీడ్స్‌పై పీటముడి పడింది. తమ పరిధిలో ఉన్న భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని కాపాడుకోలేని పరిస్థితుల్లో సంస్థ ఉన్నతాధికారులు ఉన్నారు. రూ. వేల కోట్ల విలువైన ఈ భూములను కాపాడాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

→ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లిడ్క్యాప్ సంస్థకు 2002 నుంచి 2004 మధ్య 612.06 ఎకరాలు కేటాయించారు. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా తెలంగాణలోని వివిధ జిల్లాల పరిధిలో ఉన్న 343.21 ఎకరాలు టీజీఎల్ఐపీకి సంక్రమించాయి. వాటితోపాటు టీజీఎల్ఐపీ అనుబంధ సంస్థ 'హైదరాబాద్ టానరీ'కి రాయదుర్గ్ ప్రాంతంలో 37 ఎకరాల భూమి ఉంది. ఆ 37 ఎకరాల్లోంచి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఫుట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)కు 15 ఎకరాలు బదిలీ చేశారు. మిగతా 22 ఎకరాల్లో ఓ ప్రైవేటు ఇన్‌ఫ్రా సంస్థకు రెండు ఎకరాలను నామమాత్ర లీజుకు ఇచ్చారు. దుద్దెడలోని మినీ లెదర్ పార్కు భూమిని సిద్దిపేట కలెక్టరేట్ నిర్మాణం కోసం సేకరించారు.

→ టీజీఎల్ఐపీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములకు సంబంధించిన టైటిల్ డీడ్స్ (యాజమాన్య హక్కు పత్రాలు) ఏవీ సంస్థ పేరిట లేవు. సంస్థ రికార్డుల్లో ఉన్న కొన్ని భూములపై క్షేత్రస్థాయిలో టీజీఎల్ఐపీ అధీనంలో లేవు. ఓ ప్రైవేటు ఇన్‌ఫ్రా సంస్థకు లీజుకు ఇచ్చిన రెండు ఎకరాల భూమికి సంబంధించిన వివరాలు కూడా అందుబాటులో లేవు. ప్రస్తుతం టీజీఎల్ఐపీ ప్రధాన కార్యాలయం ఉన్న రాయదుర్గ్‌లో ఎకరం ధర రూ. 50 కోట్లపైనే ఉంది. టీజీఎల్ఐపీ ప్రధాన కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉండగా ఇతర భూములకు కనీసం రక్షణ కంచె కూడా లేదు. ఆర్మూరులో చర్మకారులు చందాలు వేసుకొని రక్షణ కంచె ఏర్పాటు చేసుకోవడం సంస్థ దుస్థితికి అద్దం పడుతోంది.

టైటిల్ డీడ్స్ కోసం ప్రయత్నిస్తున్నాం

టీజీఎల్ఐపీ వద్ద భూములున్నా టైటిల్ డీడ్స్ లేని విషయం వాస్తవమే. యాజమాన్య హక్కుల కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. సంస్థకు కేటాయించిన స్థలాల్లో రుక్మాపూర్, స్టేషన్ ఘన్‌పూర్‌లో మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగు తున్నాయి. మిగతా చోట్ల మినీ లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.
- డి.శ్రీనివాస్ నాయక్, వీసీ అండ్ ఎండీ, టీజీఎల్ఐపీ

టీజీఎల్ఐపీ భూముల దుస్థితి ఇదీ..

→ నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలం జిన్‌కుంట శివారులో సర్వే నంబర్లు 56, 77లోని 25 ఎకరాల్లో 2003లో మినీ లెదర్ పార్కు ఏర్పాటైంది. ఏడాదిలోపే మూతపడి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొని కంప చెట్లతో నిండిపోయింది.

→ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో 40 ఎకరాలను మెగా లెదర్ పార్కు కోసం కేటాయించారు. చర్మకారులు ఆందోళన చేస్తున్నా లెదర్ పార్కు ప్రతిపా దన ఇంకా పట్టాలెక్కలేదు. ఈ భూము లను ప్రస్తుతం స్థానికులు కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

→ మంచిర్యాల జిల్లా మందమర్రిలో మినీ లెదర్ పార్కు మూతపడగా ఆ స్థలంలో కొందరు మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు.

→ ఎల్లారెడ్డిలోని సర్వే నంబర్ 1406లో 2002లో లెదర్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన జరిగినా ఆ తర్వాత పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఆ ప్రదేశంలో మున్సిపాలిటీ చెత్తను డంప్ చేస్తుండగా మరికొంత అన్యాక్రాంతమవుతోంది.

→ జమ్మికుంట మున్సిపాలిటీలో టీజీఎల్ఐపీకి కేటాయించిన 25 ఎకరాల్లో గతంలో మినీ లెదర్ పార్కు ఏర్పాటు చేసినా వినియోగంలో లేక మూతపడింది. నిర్వహణ లేక షెడ్లు శిథిలావస్థకు చేరుకోగా యంత్రాలు తుప్పుపడుతున్నాయి.

టీజీఎల్ఐపీ భూములు ఉన్నదిక్కడే..

ప్రాంతం	జిల్లా	విస్తీర్ణం (ఎకరాల్లో)
దుద్దెడ	సిద్దిపేట	25
దండెంపల్లి	నల్లగొండ	25.06
జిన్‌కుంట	నాగర్‌కర్నూలు	25
జమ్మికుంట	కరీంనగర్	25
స్టేషన్‌ఘన్‌పూర్	జనగామ	25
పోలేపల్లి	మహబూబ్‌నగర్	25
ఆర్మూర్	నిజామాబాద్	28.01
కొమ్మెపల్లి	ఖమ్మం	25
రుక్మాపూర్	కరీంనగర్	40.01
మధుపల్లి	ఖమ్మం	26
మల్లెమడుగు	ఖమ్మం	25.13
మందమర్రి	మంచిర్యాల	24
ఎల్లారెడ్డి	కామారెడ్డి	25
మొత్తం		343.21

అతివకు అండగా..

మీ సమస్యను 8977794588కు వాట్సాప్ చేయండి



ఆడ బిడ్డ.. ఇంటి నుండి బయటికొస్తే అడుగడుగునా వంకరచూపులే. బస్టాపు మొదలు కాలేజీ, కార్యాలయం, కార్ఖానా.. ప్రదేశం ఏదైనా అవకాశం దొరికితే వెకిలి చేష్టలు, వేధింపులు.. డబుల్ మీనింగ్ డైలాగులతో టార్చర్. ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నా..సెల్‌ఫోన్‌కు అసభ్య సందేశాలు, ప్రేమ పేరుతో పలకరింపులు, వద్దని తిరస్కరిస్తే ఫొటోల మార్ఫింగ్‌లతో బ్లాక్‌మెయిలింగ్‌లు. ఇవీ.. పల్లె, పట్టణం, నగరం అనే తేడా లేకుండా నేటి మహిళను వెంటాడుతున్న అతిపెద్ద సమస్యలు. భయం, కుటుంబ పరువు ,ప్రతిష్ఠ, గౌరవం దృష్ట్యా అనేకమంది ఈ నిత్య వేధింపులను భరిస్తున్నారు. షీ టీమ్స్ లేదా పోలీసుల వద్దకు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేస్తున్నవారు కొందరే. అందుకే 'సాక్షి' ఇక మీ నేస్తం అవుతోంది. ఇంటా బయట, చదివే చోట, పని ప్రదేశంలో, ప్రయాణంలో, చివరకు 'నెట్'ఇంట్లో.. ఇలా ఎక్కడ, ఎలాంటి వేధింపులు ఎదురవుతున్నా 8977794588 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలపండి. మీ సమస్యల్ని 'సాక్షి' తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీ శిఖా గోయల్ దృష్టికి తీసుకెళ్తుంది. మూడో కంటికి తెలియకుండా మీ సమస్యకు పరిష్కారం చూపుతుంది. భయం వీడండి..ధైర్యంగా ముందుకు కదలండి. వేధింపుల నుంచి విముక్తి పొందండి.

మీతో సాక్షి

నోట్: పేరు, వివరాలు గోప్యంగా ఉంచాలని కోరితే.. వారి అభిప్రాయాలను 'సాక్షి' గౌరవిస్తుంది

లగేజీ చెకింగ్ తర్వాతే లోనికి..

▶ మొదటి పేజీ తరువాయి

చెందనుంది. వెరసి ఈ స్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ తరహాలో పటిష్టమైన భద్రతతో కూడిన ప్రాంగణంగా మార్చాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దేశంలో ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్‌గా రూపాంతరం చెందిన ఘనతను సాధించుకున్నది భోపాల్ లోని రాణి కమలాపతి రైల్వే స్టేషన్. కానీ, అక్కడ భారీ వ్యయంతో బ్యాగేజీ స్కానింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా.. అది ఇంకా ఉపయోగంలోకి రాలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. కానీ సికింద్రాబాద్ స్టేషన్‌కు అటువంటి పరిస్థితి రాకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

లగేజీ చెకింగ్ తర్వాతే లోనికి

సికింద్రాబాద్ స్టేషన్‌కు ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్ వైపు, పదో నెంబర్ ప్లాట్‌ఫామ్ ఉన్న బోయిగూడ వైపు నుంచి ప్రవేశ మార్గాలున్నాయి. ఆధునికీకరణ తర్వాత కూడా ఈ రెండు కొనసాగుతాయి. ఈ రెండు మార్గాల్లో ఒక్కోవైపు రూ.3 కోట్ల వ్యయంతో భారీ బ్యాగేజీ స్క్రీనింగ్ మెషీన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు కచ్చితంగా తమ లగేజీని ఈ స్క్రీనింగ్‌లో చెకింగ్ పూర్తి చేయించుకునే లోనికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం వారు రైలు బయలుదేరే వేళ కంటే కాస్త ముందుగానే స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ పద్ధతి విమానాశ్రయాల్లోనే ఉంటోంది. విమాన ప్రయాణికులకు లగేజీ చెకింగ్ అనేది నిర్బంధ ప్రక్రియ. అది జరక్కుంటే విమానంలోకి అనుమతి ఉండదు. అదే పద్ధతిని సికింద్రాబాద్ స్టేషన్‌లో అమలు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



రైలు అనౌన్స్‌మెంట్ అయ్యాకే ప్లాట్‌ఫామ్ పైకి

ప్రస్తుతం స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికులు నేరుగా ప్లాట్‌ఫామ్‌లపైకి చేరుకుంటున్నారు. కానీ, ఆధునిక స్టేషన్ అందుబాటులోకి వచ్చాక ఇది కుదరదు. టికెట్ పొందిన తర్వాత ప్రయాణికులు నేరుగా కాంకోర్స్ మీదుగా ప్రయాణికులు వేచి ఉండే హాలులోకి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడే వారు కూర్చోవాలి. లేదా.. షాపింగ్ చేసుకోవచ్చు. వారు వెళ్లాల్సిన రైలు ప్లాట్‌ఫామ్ మీదకు రావటానికి పదిపదిహేను నిమిషాల ముందు అనౌన్స్‌మెంట్ ఇస్తారు. అప్పుడు మాత్రమే ప్రయాణికులను ప్లాట్‌ఫామ్ మీదకు అనుమతిస్తారు.

ఆలస్యంగా వస్తే అంతే..

సరిగ్గా రైలు బయలుదేరే సమయానికి హడావుడిగా ప్లాట్‌ఫామ్ మీదకు పరుగెత్తుకు రావటం స్టేషన్‌లలో నిత్యకృత్యం. కానీ, కొత్త స్టేషన్ భవనం అందుబాటులోకి వచ్చాక.. సికింద్రాబాద్ స్టేషన్‌లో ఇలాంటి వారిని అనుమతించకూడదన్న యోచనలో అధికారులున్నారు. కచ్చితంగా బ్యాగేజీ చెకింగ్ ఉంటున్నందున.. ముందుగానే స్టేషన్‌కు రావాల్సి ఉంటుందన్న నిబంధన విధించనున్నారు. ఆలస్యంగా వచ్చే వారు కూడా లగేజీ చెకింగ్ పూర్తి చేసుకునే ప్లాట్‌ఫామ్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. రైలు ఉంటే ఎక్కుతారు.. లేదంటే వెనుదిరగాల్సిందే.

కునుకు కోసం వచ్చే వారికి ఇక నో ఎంట్రీ

ప్రయాణాలతో ప్రమేయం లేకుండా చాలా మంది చీకటిపడగానే స్టేషన్‌లోకి చేరుకుని ఏ ఖాళీ బెంచీనో చూసుకుని నిద్రకు ఉపక్రమిస్తారు. ఇక అలాంటి వారికి లోనికి అనుమతి ఉండదు. టికెట్ ఉన్న వారిని మాత్రమే.. రైలు వచ్చే వేళకు ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతిస్తారు. లేని వారికి నో ఎంట్రీ. వెరసి ఇక ప్లాట్‌ఫామ్ ప్రాంతాలు అడ్డదిడ్డంగా పడుకునేవారితో కనిపించవన్నమాట.

మిగతావాటి సంగతేంటి..?

ప్రపంచస్థాయి స్టేషన్‌లుగా ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో మూడు స్టేషన్లు మాత్రమే సిద్ధమవుతున్నాయి. ఏపీ పరిధిలో తిరుపతి, నెల్లూరు ఉండగా, తెలంగాణలో ఒక్క సికింద్రాబాద్ మాత్రమే ఉంది. ఇక జోన్ వ్యాప్తంగా మరో 119 స్టేషన్‌లను రూ. 5 వేల కోట్ల వ్యయంతో అమృత్‌భారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తారు. ఇవి ఉన్న భవనాలను మెరుగు పరుస్తారు. సికింద్రాబాద్ తరహాలో మొత్తం భవనాలను తొలగించి కొత్తగా నిర్మించరు. అమృత్‌భారత్ స్టేషన్‌లలో ఈ పద్ధతులు ఉండాలా వద్దా అన్న విషయంలో ఇంకా ఓ నిర్ణయం తీసుకోలేదు. అయితే అమృత్‌భారత్ ప్రోగ్రామ్‌లో భాగంగానే అభివృద్ధి చేస్తున్న నగరంలోని కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలో మాత్రం సికింద్రాబాద్ తరహా విధానాలను అమలు చేయాలని భావిస్తున్నారు.

15 రోజుల్లో నియామకాలు పూర్తి..



సీఎం రేవంత్ ఇంటి వద్ద డీఎస్సీ -2008 అభ్యర్థులు

సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి తరలివచ్చిన డీఎస్సీ - 2008 బాధితులు

చర్యలు తీసుకుంటామని సీఎంవో హామీ

సాక్షి, హైదరాబాద్: వారం రోజుల్లో కేబినెట్ సబ్ కమిటీ నుంచి నివేదిక తీసుకొని 15 రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని సీఎం కార్యాలయం నుంచి హామీ లభించిందని డీఎస్సీ -2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో తీసుకున్న నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డీఎస్సీ-2008 సాధన సమితి నేతృత్వంలో బాధితులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకొని ఆరుగురిని సీఎం నివాసంలోకి అనుమతించారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్‌రెడ్డి వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డీఎస్సీ - 2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ తీర్పు మేరకు మార్చి 14న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఏపీ తరహాలో తమకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. విధివిధానాల ఖరారు బాధ్యతను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించిందని చెప్పారు. అయినా ఇప్పటి వరకు తమకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడి వివరాలను సేకరించారు. సంబంధిత అధికారులతోనూ చర్చలు జరిపి ఉద్యోగాలపై బాధితులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి ఉపాధ్యక్షుడు భాస్కర్, ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చావ్లా, ప్రమీల, ప్రశాంతి, లావుడ్య రవి తదితరులు పాల్గొన్నారు

రైతులు.. వర్సిటీలు.. ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి

తగిన శిక్షణ లేకపోవడంతో యువత ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలతో వర్సిటీ పాలకమండలిని ఏర్పాటు చేశాం. వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను ఎంపిక చేశాం. ఈ ఏడాది 2 వేల మందికి, వచ్చే ఏడాది 20 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నాం. ఇటీవల ఒలింపిక్స్‌లో భారత్‌కు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని నిర్ణయించాం. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్‌కు పెద్ద సంఖ్యలో పతకాలు వచ్చేలా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం'అని రేవంత్ వివరించారు.

100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు రానున్న పది రోజుల్లో వైస్ చాన్స్‌లర్లను నియమించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 'వీసీల నియామకం పూర్తి కాగానే ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను కూడా భర్తీ చేస్తాం. గత ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంది. కానీ కనీస వసతుల్లేక పౌల్ట్రీ షెడ్‌లో కోళ్ల మాదిరిగా వాటిని తయారు చేసింది. కానీ మేము మెరుగైన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నాం. ఒక్కో క్యాంపస్‌ను 20 నుంచి 25 ఎకరాలతో ఏర్పాటు చేస్తాం'అని రేవంత్ తెలిపారు.

మానవవనరుల వృద్ధి కోసమే స్కిల్స్ వర్సిటీ: భట్టి

రాష్ట్రంలో మానవవనరులను మెరుగుపర్చేందుకే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మేధోసంపత్తిని ప్రోత్సహించి దేశానికి ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు. గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం రూ.4 కోట్లు ఖర్చు చేస్తే ఈ ప్రభుత్వం రూ. 5 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించిందని గుర్తుచేశారు. మూసివేతకు చేరువైన 63 ఐటీఐలను తమ ప్రభుత్వం ఏటీసీలుగా అభివృద్ధి చేసిందని భట్టి వివరించారు. అనంతరం రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, హర్కర వేణుగోపాల్

లక్ష్యంపైనే దృష్టిపెట్టండి..

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించి మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులను సీఎం రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు. కొంతకాలం ఇంటి సమస్యలను, ఇతర అంశాలను పక్కనపెట్టి కేవలం సివిల్ సర్వీసుకు ఎంపిక కావాలనే లక్ష్యాన్నే గుర్తుంచుకోవాలని సూచించారు. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు అందించిన రూ.లక్ష ఆర్థిక సాయం పెద్ద మొత్తం కానప్పటికీ ప్రభుత్వం విద్యార్థుల వెంట ఉందనే భావన కలిగించేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ. లక్ష సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కువ మంది సివిల్స్ ఉద్యోగాలు సాధించి రాష్ట్ర పరపతిని పెంచాలని కోరారు.



దృగ్గోచరమవుతున్న ఈ ప్రపంచంలోని అన్ని విషయాలు కేవలం ఒక భ్రాంతి.
అవి చర్చించదగినవీ కావు, కోరుకోదగినవీ కావు.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 27 ఆగస్టు 2024

ఎట్టకేలకు ఒక కదలిక

రథం కదులుతోంది. ఎప్పుడో జరగాల్సిన పనిలో ఇప్పటికైనా అడుగులు ముందుకు పడుతున్నాయి. దేశంలో జనాభా లెక్కల పని ఎట్టకేలకు మరికొద్ది రోజుల్లోనే సెప్టెంబర్‌లో ఆరంభమవుతోంది. ఆ మేరకు ఇటీవల వెలువడ్డ సమాచారం పెద్ద ఊరట. ప్రతి పదేళ్ళకు ఒకసారి జరగాల్సిన ఈ జనగణన యజ్ఞం నిజానికి 2021లోనే జరగాల్సి ఉంది. కోవిడ్ సహా అనేక సాకులతో ప్రభుత్వం సాచివేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చింది. అయితే, భారత్ లాంటి వర్ధమాన దేశానికి జనగణన మినహా ప్రత్యామ్నాయ మార్గాలలో ఆ స్థాయి సమాచారం అందుబాటులో లేదు. ఉన్నా అది అంత నమ్మదగినదీ కాదు. అందుకే జనాభా పరంగా, సామాజిక – ఆర్థికపరంగా దేశ సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరించడానికి కొన్ని దశాబ్దాలుగా జనగణన అత్యంత కీలకమైనది. అలాంటి జనగణన ప్రక్రియ ఇప్పుడు మళ్ళీ పట్టాలెక్కుతోంది. వచ్చే నెల (సెప్టెంబర్)లో ఆరంభమయ్యే ఈ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు ఏణ్ణర్ధ కాలం పడుతుందని ప్రభుత్వం మాట.

జనగణన అనేది పలువురు పొరబడుతున్నట్టు కేవలం గణాంకాల సేకరణ కాదు. అది సుపరిపాలనకు మూలస్తంభం. దేశం ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక సవాళ్ళకు పరిష్కారాలు కనుగొనేందుకు మార్గదర్శి. పట్టణీకరణ, ప్రాథమిక వసతుల అభివృద్ధి మొదలు సాంఘిక సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక వరకు ప్రతి అంశం పైనా సరైన విధాన నిర్ణయాలకు ఈ సమాచారమే కీలకం. నిజానికి, జనాభా లెక్కల సేకరణలో కేంద్ర సర్కార్ చేసిన సుదీర్ఘ జాప్యం చాలాకాలంగా విమర్శలకు గురవుతోంది. ప్రైవేట్‌వారే కాదు... సర్కారీ ఆర్థిక నిపుణులు సైతం విమర్శకుల్లో ఉండడం గమనార్హం. పాత జనాభా లెక్కల ఆధారంగానే ఇప్పటికీ ఆరోగ్యం, ఆర్థిక అంశాలు, చివరకు ద్రవ్యోల్బణం రేటు, ఉపాధి లెక్కల లాంటివన్నీ గణిస్తూ ఉండడం వల్ల కచ్చితత్వం లోపిస్తోంది. డేటా లోపంతో కనీసం 15 కీలక అంశాలపై దుష్ప్రభావం పడింది. అదే ఈ నిపుణులందరి బాధ. పుష్కర కాలం క్రితపు లెక్కలపై ఆధారపడే సరికి అంతా లోపభూయిష్టమైంది. దాదాపు 10 కోట్ల మంది పౌర సరఫరా వ్యవస్థకు వెలుపలే ఆహారభద్రత లేకుండా మిగిలిపోయారు. ఇక, శ్రామికుల సంఖ్య ఆధారంగా రాష్ట్రాలకు కేంద్రం కేటాయించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులపైనా దెబ్బ పడింది. చివరకు నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్ వారి సర్వేల నాణ్యత కూడా దెబ్బతింది.


అంతెందుకు... జనాభాలో చైనాను భారత్ దాటేసి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా అవతరించినట్టు ఐరాస నివేదిక గత ఏడాది ప్రకటించింది. దాన్ని ఖరారు చేయడానికో, కాదనడానికో, ఆ జనాభా లెక్కకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టడానికో కూడా మన వద్ద నిర్దుష్టమైన గణాంకాలు లేని పరిస్థితి. అలాంటి లోపాలన్నీ సరిదిద్దుకోవడానికి ఇప్పుడిది సదవకాశం. అదే సమయంలో జనగణనలో భాగంగా మన జనాభా తాలూకు కులగణన కూడా చేయడం అత్యవసరం. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ కోరుతున్నది అదే. తద్వారా జనసంఖ్యలో ఏ సామాజిక వర్గం వంతు ఎంత, ఏయే వర్గాల స్థితిగతులు ఏమిటి, ఏ వర్గాలు ఎంతగా వెనకబడి ఉన్నాయి తదితర భోగట్టా తేటతెల్లమవుతుంది. కులాలు, ఉపకులాలతో పాటు వర్తమానంలో కనుమరుగైపోతున్న ఆశ్రిత కులాల లెక్కలూ వెలికివస్తాయి. వెనుకబడిన వర్గాలకు చేయూతనిచ్చేలా పాలకులు పాలసీలు చేయడానికీ వీలవుతుంది. ప్రణాళిక, పాలన, చట్టాల రూపకల్పన సహా అనేక ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షకూ, నిర్వహణకూ ఈ సమాచారమంతా ఉపకరిస్తుంది.

తాజా జనగణన రాజకీయంగానూ ప్రధానమే. దేశంలోని అన్ని స్థాయుల చట్టసభలలో నియోజక వర్గాల పునర్విభజన, రిజర్వేషన్‌కు ఈ కొత్త లెక్కలే ఆధారమవుతాయి. అంటే, అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల సంఖ్య మారిపోనుంది. ఈ లెక్కన దక్షిణాదితో పోలిస్తే జనాభా నియంత్రణ అంతగా లేని ఉత్తరాదిలో మరిన్ని చట్టసభా స్థానాలు వస్తాయి. ఫలితంగా అధికార సమీకరణాలూ మారిపోతాయి. ఇంతటి ముఖ్యమైనది కాబట్టే... ఇలాంటి అధికారిక గణాంక వ్యవస్థను ప్రభుత్వ, రాజకీయ జోక్యాలకు వీలైనంత దూరంగా ఉంచడం శ్రేయస్కరం. మారిన కాలానికి అనుగుణంగా కొత్త జనగణన రూపురేఖలూ మారుతున్నాయట. ప్రధానంగా డిజిటల్ పద్ధతిలో, అదీ స్వీయ నమోదు పద్ధతిలో జనగణన సాగనుంది. గతంలో స్త్రీ, పురుషుల వివరాలనే దఖలు పరిస్తే, ఇప్పుడు తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ల వివరాలనూ ప్రత్యేకంగా నమోదు చేయనున్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీలే కాక 'ఇతర వెనుకబడిన వర్గాలు' అంటూ వివరాలు విడిగా నింపనున్నారట.

ఏమైతేనేం, ఇన్నేళ్ళ తరువాతైనా జనాభా లెక్కల ప్రక్రియను మళ్ళీ చేపట్టడం హర్షణీయం. అతి ముఖ్యమైన బృహత్ యజ్ఞాన్ని ఇక నుంచైనా ఎప్పటికప్పుడు నిర్ణీత సమయానికే నిర్వహించడం అత్యవసరం. తద్వారానే కచ్చితమైన డేటా దేశంలో పాలనా యంత్రాంగానికి అందుబాటులోకి వస్తుంది. 2026 మార్చి కల్లా ఈ జనగణన ఫలితాలను సమర్పించేందుకు కేంద్ర శాఖలు ఇప్పటికే నిర్ణీత కాలవ్యవధి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. దీంతో, 2011 నుంచి అప్పటి దాకా... అంటే 15 ఏళ్ళ కాలవ్యవధిలోని సమాచారం చేతిలోకి వస్తుంది. అయితే, ఈసారి జరిగిన జాప్యం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. దేశం ముందుకు సాగడానికి దాని సమూహ స్వరూప స్వభావాలు దానికైనా తెలిసి ఉండడం ముఖ్యం. అలాంటి సమాచార సేకరణ, వినియోగంలో అంతరాయాలు రాకుండా జాగ్రత్తపడాలి. ఊహించని ఆటంకాలు ఎదురైనా ఇబ్బంది పడకుండా ఉండేలా జనాభాపై సమగ్ర సమాచారం అందించే కట్టుదిట్టమైన వ్యవస్థలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి ప్రయత్నాలు జరగడానికి ఇదే తరుణం.

పని ప్రదేశమే ప్రాణాంతకమైతే?

విశ్లేషణ



వి. విజయ సాయి రెడ్డి

ఒకే వారంలో మహిళలపై అత్యాచారం, దాడి, హింసకు సంబంధించిన అనేక కథనాలతో దేశం అట్టుడికిపోయింది. ప్రతి కథనం మునుపటి కథనం కంటే మరింతగా కలవరపెడుతోంది. మహిళలపై హింస నేడు చీకటి సందుల్లోనే కాకుండా పని స్థలాలు, బహిరంగ ప్రదేశాలు, ఆన్‌లైన్‌లో కూడా జరుగుతోంది. ఈ హింసాత్మక చర్యలు ఆకస్మికంగా సంభవిస్తున్నవి కావు. జీవితంలోని ప్రతి అంశంలోనూ స్త్రీలు ఎదుర్కొంటున్న తీవ్రమైన అసమానతలను ఇవి ప్రతిబింబిస్తున్నాయి. ఈ పరిస్థితులు కాగితంపై ఉన్న చట్టాలకూ, ఆచరణలో వాటి అమలుకూ మధ్య కలవరపెడుతున్న అనుసంధాన లేమిని వెల్లడిస్తున్నాయి. ఈ గాథలు చీకట్లోనే మగ్గిపోవడానికి ఎంతమాత్రమూ వీలు లేదు. మార్పు ఇప్పటికే మొదలు కావాల్సింది!

ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్‌లో ఇటీవలి కేసు... మహిళల భద్రత విషయంలో ఉన్న సమస్యల తీవ్రతనూ, అత్యంత సురక్షితంగా భావించే పరిసరాలలో కూడా వారు ఎదుర్కొంటున్న సర్వవ్యాప్త హింసనూ గుర్తు చేస్తోంది.

శిక్షణలో ఉన్న ఒక యువ వైద్యురాలు అనేక గంటలపాటు విధి నిర్వహణను పూర్తి చేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, తగిన భద్రత ఉంటుందని భావించిన ఆసుపత్రి ఆవరణలోనే ఆమెపై లైంగికదాడి జరిపి హత్య చేశారు. ఈ భయానక నేరం ఒక విడి సంఘటన కాదు. మన సమాజంలోని ప్రతి అంశంలోనూ విస్తరిస్తున్న, మహిళలపై హింసకు సంబంధించిన విస్తృతమైన అంటువ్యాధిలో ఇదొక భాగం. ఒకే వారంలో మహిళలపై అత్యాచారం, దాడి, హింసకు సంబంధించిన వార్తలతో దేశం అట్టుడికిపోయింది. ప్రతి కథనం అంతకుమునుపటి కథనం కంటే మరింతగా కలవరపెడుతోంది. ఇవి వార్తలలోని కేవలం పాదసూచికలు కాదు. సగం జనాభా భద్రత విషయంలో విఫలమైన సమాజంపై ఇవి స్పష్టమైన నేరారోపణలు.

మహిళలపై హింస నేడు చీకటి సందుల్లోనే కాకుండా పని స్థలాలు, బహిరంగ ప్రదేశాలు, ఆన్‌లైన్‌లో కూడా జరుగుతోంది. మహిళలపై నేరాలు దారుణంగా పెరుగుతున్నాయని 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్సీఆర్బీ) వార్షిక నివేదిక వెల్లడించింది. ఒక్క 2022లోనే 4,45,256 కేసులు నమోదయ్యాయి. ఇది ప్రతి గంటకు దాదాపు 51 ఎఫ్ఐఆర్‌లకు సమానం. 2020, 2021 సంవత్సరాల నుంచి భయంకరమైన పెరుగుదలను ఈ డేటా వెల్లడిస్తోంది. ప్రతి లక్ష జనాభాకు మహిళలపై నేరాల రేటు 66.4గా ఉంది. అయితే 'క్రైమ్ ఇన్ ఇండియా 2022' నివేదిక ప్రకారం, అలాంటి కేసులలో ఛార్జ్‌షీట్ రేటు 75.8గా నమోదైంది. నమోదైన మొత్తం కేసులలో, 18.7 శాతం వరకు మహిళలపై దౌర్జన్యానికి పాల్పడే ఉద్దేశ్యంతో దాడికి పాల్పడినవే. కాగా 7.1 శాతం అత్యాచారం కేసులుగా నమోదయ్యాయి. ఈ భయంకరమైన గణాంకాలు వాస్తవ ఘటనల్లో అతి చిన్న భాగాన్ని మాత్రమే సూచిస్తున్నాయి. భయం, అవమానం లేదా సామాజిక ఒత్తిడి కారణంగా అసంఖ్యాకమైన కేసులు వెలుగులోకే రావు.

మరింత ఇబ్బందికరమైన విషయం ఏమిటంటే, ఈ హింసాత్మక చర్యలు ఆకస్మికంగా సంభవిస్తున్నవి కావు. జీవితంలోని ప్రతి అంశంలోనూ స్త్రీలు ఎదుర్కొంటున్న తీవ్రమైన అసమానతలను ఇవి ప్రతిబింబిస్తాయి. స్త్రీలు సరుకులుగా కుదించబడినప్పుడు, హింస అనేది రోజువారీ సంఘటనగా మారుతుంది. ఈ హింస భౌతిక దాడికి మాత్రమే పరిమితమైనది కాదు; ఇది ఆర్థికపరమైన, భావోద్వేగపరమైన వేధింపు వరకు విస్తరించింది. ముఖ్యంగా పని స్థలాల్లో అధికార చలన సూత్రాలు తరచూ మహిళలకు వ్యతిరేకంగా ఉంటాయి.

సాధారణంగా లైంగిక వేధింపుల నిరోధక చట్టంగా పిలుస్తున్న,



''పనిస్థలంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం, 2013' వంటి చట్టాలను మహిళల రక్షణ కోసం రూపొందించారు. కానీ వాస్తవికత దానికి భిన్నమైన చిత్రాన్ని చూపుతోంది. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని చట్టం ఆదేశించినప్పటికీ, ఈ కమిటీల నిర్మాణం సహజంగానే లోపభూయిష్టంగా ఉంది.

అదే సంస్థకు చెందిన సీనియర్ ఉద్యోగులతోపాటు ఒక ఎన్జీవో లేదా అలాంటి సంస్థకు చెందిన బయటి సభ్యులతో కూడిన ఈ కమిటీలు, బాధితురాలికి న్యాయం చేయడం కంటే కూడా కంపెనీ ప్రయోజనాలను పరిరక్షించడానికే తరచుగా ప్రాధాన్యత ఇస్తాయి. అధికారిక చలనసూత్రాలు (కమిటీ సభ్యులు కంపెనీలో స్వార్థ ప్రయోజనాలను కలిగి ఉండవచ్చు) నిజమైన విచారణను, జవాబుదారీతనాన్ని నిరుత్సాహపరిచే వాతావరణాన్ని సృష్టిస్తాయి.

అయితే ఈ సవాళ్లు నేడు పని స్థలాలను దాటి విస్తరించాయి. ప్రారంభంలో అవకాశాలు, అనుసంధానం కోసం ఉద్దేశించిన ఇంటర్నెట్, ఇప్పుడు మహిళలకు సంబంధించిన కొత్త యుద్ధభూమిగా మారింది. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2021లో సైబర్ క్రైమ్ సంఘటనల సంఖ్య 2019తో పోలిస్తే 18.4 శాతం పెరిగింది. మహిళలను లక్ష్యంగా చేసుకున్న సంఘటనలు గణనీయంగా 28 శాతానికి పెరిగాయి. 2021లో నమోదైన 52,974 సైబర్ నేరాల్లో 10,730 అంటే 20.2 శాతం మహిళలపై నేరాల కేసులు. వ్యక్తిగత సమాచారం బయటపెట్టడం వంటి వాటి నుండి ప్రతీకారం తీర్చుకునే పోర్న్, ఆన్‌లైన్ వేధింపుల వరకు, పాత రకాల హింసలను కొనసాగించడానికి డిజిటల్ రంగం కొత్త మార్గాలను అందిస్తోంది. ఇంటర్నెట్‌లో అజ్ఞాతంగా ఉండటం అనేది నేరస్థులకు ధైర్యాన్నిస్తుంది. కాగా, కఠినమైన సైబర్ చట్టాలు లేకపోవడం, చట్టపరమైన సహాయం నెమ్మదిగా ఉండటం బాధితులకు హాని చేస్తున్నాయి.

మనం ఇక్కడ నుండి ఎక్కడికి వెళ్తాము? ప్రస్తుత పరిస్థితులు కాగితంపై ఉన్న చట్టాలకూ, ఆచరణలో వాటి అమలుకూ మధ్య కలవరపెడుతున్న అనుసంధాన లేమిని వెల్లడిస్తున్నాయి. లైంగికదాడి కేసులలో 95 శాతం అపరిష్కృతంగా ఉంటున్నాయని 'ఎన్సీఆర్బీ' 2021 నివేదిక నొక్కి చెబుతోంది. ఈ గణాంకాలు స్త్రీల దుఃస్థితి పట్ల వ్యవస్థ అలసత్వంతో పాటు, తరచుగా ఉదాసీనతను కూడా సూచిస్తున్నాయి. న్యాయ విచారణలో జాప్యం, సానుభూతి లేని పరిపాలనా వ్యవస్థ అనేవి బాధితులు ముందుకు రాకుండా వారిని మరింత నిరుత్సాహపరుస్తాయి.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం, దానిని పోలి ఉండే ఇతర చట్టాలు అవసరమైనప్పటికీ, అవి సరిపోవు. హాని సంభవించిన తర్వాత మాత్రమే సమస్యను పరిష్కరిస్తాయి. పైగా పనికి సంబంధించిన దైహిక, లింగ స్వభావాన్ని సవాలు చేయడంలో విఫలమవుతాయి. ఇది మహిళలకు మొదటి దశలోనే హాని చేస్తుంది. కాబట్టి నిష్పాక్షికత, న్యాయబద్ధతను నిర్ధారించడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీ కూర్పు విషయంలో పునః మూల్యాంకనంతో ప్రారంభించి, తక్షణ సంస్కరణలు అవసరం. సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించి, అది కొనసాగేలా చూడడం యజమానుల బాధ్యత. అలా చేయడంలో విఫలమైతే వారిపై కఠినమైన జరిమానాలు విధించాలి.

ఇది చట్టపరమైన వైఫల్యం మాత్రమే కాదు, సామాజిక వైఫల్యం కూడా! సమానత్వం కోసం మాత్రమే కాకుండా ప్రాథమిక గౌరవం కోసం పోరాడుతుండే మహిళలు తరచుగా బాధామయ జీవితాల్లో నిశ్శబ్ద శృంఖలాల పాలవుతుంటారు. ప్రతీకారం, ఉద్యోగ నష్టం, వ్యక్తిత్వ హననాల భయం చాలామందిని నోరు విప్పకుండా చేస్తుంది. ఇది శిక్ష పడుతుందనే భయం లేని సంస్కృతి వృద్ధి చెందడానికి వీలు కలిగిస్తుంది. అధికార శక్తులు దోపిడీకి పాల్పడుతూనే ఉండటం, బాధితులు తరచుగా ఎటువంటి సహాయం లేకుండా మిగిలిపోవడం అనేది ఒక విష వలయం.

చట్టపరమైన రక్షణలు, పెరుగుతున్న అవగాహన పురోగతిని సూచిస్తున్నప్పటికీ, సంఖ్యలు మాత్రం మరో కథను చెబుతున్నాయి. అది ఆచరణలో కంటే సిద్ధాంతంలోనే ఎక్కువగా ఉనికిలో ఉంటున్న చట్టాలతోపాటు, ప్రతి మలుపులోనూ మహిళల విలువను తగ్గించే సామాజిక వ్యవస్థ వైఫల్య గాథ.

ఈ గాథలు చీకట్లోనే మగ్గిపోవడానికి వీలు లేదు. అవి మన శ్రద్ధను, మన ఆగ్రహాన్ని, మరీ ముఖ్యంగా మన చర్యను డిమాండ్ చేస్తున్నాయి. మార్పు ఎప్పుడో మొదలు కావాల్సింది!

వ్యాసకర్త రాజ్యసభ సభ్యులు; వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దౌత్య సమస్య



షేక్ హసీనా మూడు వారాలుగా ఇండియాలో ఉండటం ఢిల్లీకి దౌత్యపరమైన సందిగ్ధ స్థితిని తెచ్చిపెట్టింది. ఆమె సన్నిహిత నేస్తం. కానీ ఆమె ఎంత ఎక్కువ కాలం ఉంటే, అంతగా బంగ్లా నూతన ప్రభుత్వంతో సంబంధాలు ఏర్పరుచుకోవడం ఢిల్లీకి కష్టమవుతుంది; ప్రత్యేకించి ఆమెను అప్పగించమని ఢాకా అడిగే పక్షంలో!

– మైకేల్ కుగెల్‌మాన్, కాలమిస్ట్

సజీవ మరణం



మహిళలు తమ ముఖాన్ని మాత్రమే కాదు, పూర్తి శరీరాన్ని కప్పుకోవాలని శాసిస్తున్న తాలిబన్ నూతన చట్టం, ఆఖరికి ఆమె గొంతును కూడా నిషేధిస్తోంది. ఇది ప్రపంచం కళ్లముందే మహిళలను సజీవంగా పాతిపెట్టడం లాంటిది.

– మాసిహ్ అలీనెజాద్, యాక్టివిస్ట్

ప్రేమే ఔషధం



బాహ్య రూపం దగ్గర మాత్రమే ఆగిపోని మీ వీక్షణను జీసస్ అడుగుతున్నారు. ఇతరుల హృదయం వైపు చూపును సారిస్తూ, వారి పట్ల తీర్పులు ఇవ్వకుండా వారిని స్వాగతించేలా మీ వీక్షణ ఉండాలి. ఎందుకంటే, ప్రేమ మాత్రమే జీవితాన్ని స్పష్టపరచగలదు.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

కలవాల్సిన బిందువులు



నేను ఒకప్పుడు ఆండ్రూ అగాస్సీ బాల్ బాయ్‌ని. ఇవ్వాళ జంటగా టెన్నిస్ ఆడాం. ఆయన వివేకపూరిత సలహా: మన మెదడుకూ, మన హృదయానికీ మధ్య ఉండేదే రెండు బిందువుల మధ్య అత్యంత దూరం. అందుకే హృదయంతో కలవడానికి మెదడును వంచాలి.

– వివేక్ రామస్వామి, అమెరికా నేత

పడిపోతున్న బ్రాండ్



మోదీ అనే బ్రాండ్ క్షీణిస్తోంది. ఒకప్పుడాయనకు కొత్త ఆలోచనలు ఉండేవి. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ్ భారత్. ఆయన మాట్లాడితే జనం వినేవాళ్లు. గుంపులుగా పోగయ్యేవాళ్లు. కూతుళ్లతో సెల్ఫీలు పెట్టమంటే పెట్టారు. బాల్కనీలో తిరంగా జెండాలు ఎగరెయ్యమంటే ఎగరేశారు. ఇప్పుడా 'మాస్టర్ స్ట్రోక్' లేదు. బీజేపీ కంపెనీ పాత బ్రాండ్‌ను పునరుద్ధరించాలి లేదా కొత్త బ్రాండ్ ప్రవేశపెట్టాలి. లేదంటే కంపెనీ పడిపోతుంది.

– హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

ఇన్ బాక్స్

ఏకైక పాలెగత్తె విస్మృత కథ!

విజయనగర సామ్రాజ్య పతనానంతరం రాయలసీమలో పాలెగాళ్లు అధికారం చలాయించారు. వీరిలో ఒక మహిళ (పాలెగత్తె) కూడా ఉంది. ఆమె పేరు వన్నూరమ్మ. మహాపాలిత పట్రా నాయుళ్ల వంశానికి చెందిన ఈమె 14 ఏళ్ల ప్రాయంలో వీర్నేని చిన్న నరసింహనాయుడు (కడప జిల్లా మైదుకూరు నల్లమల అటవీ ప్రాంతంలోని సాకెర్లపాడు కోటకు అధిపతి)ని వివాహం చేసుకుంది. వీరికి సంతానం లేకపోవడంతో తన భర్త అన్నగారైన పెద్ద నరసింహనాయుని కుమారుల్లో ఒకడైన బాల నరసింహనాయుణ్ణి దత్తత తీసుకుంది. 1771 జూలై 7వ తేదీన మట్లి రాజుల మంగన్నతో తిప్పిరెడ్డిపల్లె కోటలో జరిగిన యుద్ధంలో పెద్ద నరసింహనాయుడు మరణించాడు. దీంతో చిన్న నరసింహనాయుడు భార్య వన్నూరమ్మతో కలిసి ప్రొద్దుటూరు కోట, సత్తెమ్మ కోటల్లో ఆశ్రయం పొందాడు. అనారోగ్యం పాలైన చిన్న నరసింహనాయుడు 1780లో కాలం చేశాడు.



వన్నూరమ్మ చిత్రం

ఒంటరైన వన్నూరమ్మ దత్తపుత్రుడు బాల నరసింహ నాయుడు, బావగారి కుమారుడు రెండవ బాల వెంకటాద్రి నాయుడు, కొందరు పెద్దలతో సమాలోచన జరిపి సాకెర్లపాడు కోట, తిప్పిరెడ్డి పల్లె కోట, ముదిరెడ్డి పల్లె కోట, కొమర్ల రచ్చ కోట, అంబవరం కోటలను స్వాధీనపరచుకొని పాలెగత్తె అవతారం ఎత్తి ధొరతనం చూపించింది. క్రీస్తు శకం 1781 నుండి 1796 వరకు పరిపాలన చేసింది. ఈ సమయంలో మట్లి రాజులు, నిజాం నవాబులు, కడప నవాబులు వంటివారికి కంటిలో నలుసుగా తయారయ్యింది. 1782లో సుబేదారైన షేక్ హైదర్‌ని నంద్యాల పేట పరిసరాలలో వన్నూరమ్మ తల నరికి వేసింది. గంజికుంట ప్రాంతంలోని దెబ్బతిన్న అనంతరాజు చెరువును కడప నవాబు దివాన్ అరబ్ అమీన్ ఖాన్ ఉత్తర్వుల ప్రకారం గంజికుంట తాతిరెడ్డి (చెరువు పరిశీలకుడు) బాగు చేయిస్తుండగా... వన్నూరమ్మ వద్దని గట్టిగా వారించింది. చెరువు బాగు చేయించినందున ఈ ప్రాంతం తనదేనని తాతిరెడ్డి ఒకరోజు చెరువులో ప్రవేశిస్తుండగా తన సిబ్బందితో ఆయన తలని నరికించింది.

చివరికి 1796 ఆగస్టు 21వ తేదీ ఆదివారం నాడు ఆమెను కడప నవాబు ఖాదర్ వలీ ఖాన్ బంధించాడు. 6 రోజులపాటు విచారణ చేసి వన్నూరమ్మ రాజద్రోహం చేసిందని ఆమెకు 'కొర్తి' (గుదములో మొనదేలిన సంద్ర చెట్టు కాండం దించి చంపడం) శిక్ష విధించారు. 1796 ఆగస్టు 27వ తేదీ శనివారం శిక్ష అమలయ్యింది. ఈమెపై ఇప్పటికీ జానపదులు పాటలు పాడుతూ ఉండటం విశేషం.

– బొమ్మిశెట్టి రమేష్, మైదుకూరు, కడప జిల్లా । 79893 34330

(వన్నూరమ్మ వర్ధంతి నేడు)

బీసీల వాటా కులగణనతోనే సాధ్యం!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

''ప్రస్తుత సామాజిక ఆర్థిక వ్యవస్థ బలహీనవర్గాలకు వ్యతిరేకంగా మోహరించి ఉన్నదని నేను చెప్పదలచుకున్నాను. అలాంటి స్థితిలో వారిని అంతకన్నా మెరుగైన స్థితిలో ఉన్న వారితో పోటీపడమని అడగటమంటే, అది ఈ వ్యవస్థలో గల లోపం అన్నమాట! ప్రస్తుత వ్యవస్థ ప్రతిభను నేను ప్రశ్నిస్తున్నది అందువల్లనే. అసమాన స్థితిలో గలవారిని పరస్పరం పోటీ పడమని చెప్పటం అన్నింటికన్నా మించిన అన్యాయం. ఈ అన్యాయాన్ని సరిదిద్దటం చాలా అవసరం.''

– ఓబీసీ రిజర్వేషన్లపై మాజీ ప్రధాని వి.పి. సింగ్

బీసీలు మోసపోవటం కొత్తకాదు. బీసీలను మోసం చేయని పార్టీ ఏది అని వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ యా పార్టీలు తమ శక్తి మేరకు బీసీలను మోసపుచ్చుతూనే వస్తున్నాయి. ఇప్పటికీ రాజకీయ పార్టీలు బీసీలను ఓటు వేసే యంత్రాలుగానే చూస్తున్నాయి. స్వాతంత్ర్యం అనంతర భారత్‌లో బీసీల స్థితిగతులేమిటో తెలుసుకోవడానికి కులగణన చేయమని ఎంతగా మొరపెట్టుకున్నా దేశాన్నేలిన పాలకులకు కనీస కనికరం లేదు. దీంతో బీసీల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఆ నిరాశ నిరసనల రూపందాల్చే స్థితికి వచ్చింది. ఆ నిరసనలు మహా ఉద్యమంగా మారవచ్చు.

తెలంగాణ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 'కామారెడ్డి డిక్లరేషన్' ప్రకటిస్తే మళ్ళొక్కసారి మోసపోయి ఓట్లేసి ఆ పార్టీని గెలిపించారు. తాము అధికారంలోకి రాగానే కులగణన చేస్తామనీ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామనీ రాహుల్ గాంధీ చెప్పారు. కానీ ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ నెరవేర్చలేదు. అసెంబ్లీ ఓటర్ జాబితాల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేస్తున్న సన్నాహాలు తెలియజేస్తున్నాయి. ఆధిపత్య వర్గాలవారి ప్రభుత్వ హయాంలో ఇంతకంటే ఇంకో విధంగా పాలనను ఎలా ఊహించగలం? బీసీలు అధికంగా ఉన్నా తెలంగాణ గ్రామాలు ఇప్పటికీ ఆధిపత్య కులాలవారి చేతుల్లోనే ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకివ్వడాన్ని ఆధిపత్య వర్గాలు అస్సలు ఒప్పుకోవు. అదే జరిగితే తెలంగాణ రాజకీయ రంగం రూపురేఖలు మారిపోతాయి. స్థానిక సంస్థల్లో మావాటా మాకివ్వండని నినదించిన బీసీలు... రేపు అసెంబ్లీ స్థానాల్లో కూడా సగానికి



పైగా ఇవ్వండని గర్జిస్తారని ఆధిపత్య రాజకీయాలు చలాయించే పెద్దలకు తెలుసు. అందుకే బీసీలను ఓట్లేసే యంత్రాల దశలోనే ఉంచుతారు తప్ప వారి వాటా వారికి ఎందుకిస్తారు? అందుకే పోరాటం తప్పదు.

కులగణన చేయకుండా, 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలకు పోతే బీసీలు ఒప్పుకోరు. ఓటర్ లిస్టుల జాబితాల ఆధారంగానే బీసీలను గణిస్తే వారి ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు. కాంగ్రెస్ నష్టపోతుంది. అధికారంలో ఉన్న పార్టీయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సింహభాగం కైవసం చేసుకోవటం రివాజు. కానీ కులగణన చేయకుండా ఎన్నికల్లోకి పోతే కాంగ్రెస్‌కు ఊహించని విధంగా స్థానిక సంస్థల ఫలితాలు ఉంటాయి. బీసీలు ఐక్యం కారు అన్న పాతచింతకాయ పచ్చడి ఆలోచనతో ఉన్న ఆధిపత్య వాదులున్నారు. 2 కోట్ల మంది బీసీలు తమ చైతన్యాన్ని ప్రకటించే సందర్భాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో వారు చూడక తప్పదు.

రాష్ట్రంలో ఆధిపత్య రాజకీయ సంస్కృతికి కాలం చెల్లే సమయం దగ్గరకొచ్చింది. రాజకీయ బలం అంతగా లేకపోవటం వల్లనే తమను అణగదొక్కుతున్నారని ప్రతి బీసీ ఎదలో తండ్లాట మొదలయ్యింది. 'ఇంకా ఎంతకాలం చస్తూ బతుకుదాం, బీసీ చైతన్యాన్ని ప్రదర్శించకపోతే భవిష్యత్ బీసీ తరాలకు తీరని నష్టం చేసినవారమవుతామని చర్చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రమంటే 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలదని ఢంకా బజాయించి చెబుతున్నారు. 56 శాతానికి పైగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో సమ వాటా పొందినప్పుడే తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం పరిపూర్ణమవుతుంది. తెలంగాణలో 1952 నుంచి 2023 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీసీల సంఖ్య చూస్తే వారికి ఎంత అన్యాయం జరిగిందో అర్థమవుతుంది. 1952లో 9 మంది, 1957లో 9 మంది, 1962లో 11 మంది, 1967లో 13 మంది, 1972లో 19 మంది, 1978లో 27 మంది, 1983లో 15మంది, 1985లో 14 మంది, 1989లో 14 మంది, 1994లో 20 మంది, 1999లో 23 మంది, 2004లో 18 మంది, 2009లో 23 మంది, 2014లో 20 మంది, 2018లో 23 మంది, 2023లో 19 మంది మాత్రమే బీసీలు గెలుపొందారు.

మండల్ కమిషన్ రిపోర్టును ఆమోదించి 34 ఏళ్ళు గడిచిపోయాయి. కులగణన చేయాలని మండల్ కమిషన్ సిఫారసు చేసింది. బీసీల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి కులగణన అత్యంత ముఖ్యమైనదని మండల్ కమిషన్ పేర్కొన్నప్పటికీ... కేంద్రపాలకులు దీన్ని పట్టించుకోలేదు. సగం దేశం చీకట్లో ఉంటే దేశం వెలిగిపోతుందని చెప్పటం కంటే విషాదకరమైనది మరొకటి లేదు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలంటే బీసీ కులగణన చేయకతప్పదు.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

సమ్యక్ దృష్టి

కురుక్షేత్ర సంగ్రామంలో కర్ణుడి సర్వసేనాధిపత్యంలో రెండవ రోజు పోరులో కర్ణుడి చేతిలో అవమానం పాలై యుద్ధరంగం నుండి నిష్క్రమించి శిబిరంలో దిగులుగా కూర్చున్న ధర్మరాజును కలిసి ధైర్యం చెప్పారు కృష్ణార్జునులు. మళ్ళీ యుద్ధరంగంలోకి వెడుతూ, కర్ణుడిపై పూర్తి విజయం సాధించికాని యుద్ధరంగం విడిచి రానని చెప్పాడు అర్జునుడు. యుద్ధరంగంలోకి అర్జునుడి పునఃప్రవేశంతో కురుక్షేత్ర సంగ్రామంలో అతి ముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతుండగా, తన రథసారథి శల్యుడిని 'ఒకవేళ అర్జునుడి చేతిలో నేను మరణిస్తే ఏమి జరుగుతుంది?' అని అడిగాడు కర్ణుడు. 'కృష్ణార్జునులను ఇరువురినీ ఒక్కసారిగా చుట్టుముట్టే గొప్ప శక్తి కలిగిన బాణాలతో వాళ్ళమీద నేను విరుచుకుపడతాను!' అని సమాధానం చెప్పాడు శల్యుడు. అదే సమయంలో అర్జునుడు కూడా 'ఒకవేళ కర్ణుడి చేతిలో నేను ఓడిపోతే ఏం జరుగుతుంది?' అని కృష్ణుడిని అడిగాడు. ఆ ప్రశ్నకు మందహాసం చేసి 'ఆకాశం నుండి సూర్యుడు ఊడి పడినా, భూమి బద్దలై ముక్కలైనా, మేరు పర్వతం ఒక వైపుకే ఒరిగినా నీవు కర్ణుడి చేతిలో ఓడిపోవడం జరగదు' అని సమాధానం చెప్పాడు కృష్ణుడు.

జ్యోతిర్మయం

ఆ రెండు సమాధానాల మధ్య హస్తిమశకాంతరం ఉంది. వారి చూపులలో 'దృష్టి బేధమే' అందుకు కారణం. భూత భవిష్యత్ వర్తమానాలను చాపలా కలిపి చుట్టేసి చూసి మాట్లాడ గలిగిన సమ్యక్ దృష్టి కృష్ణుడిది. వర్తమానంలో కొన్ని ఘడియలు మాత్రమే ముందుకు చూసి డంబంగా మాట్లాడే సంకుచిత దృష్టి శల్యుడిది. శల్యుడు, కర్ణుడి మరణానంతరం ఏమి చేశాడన్నది ఆంధ్రమహాభారతం, కర్ణపర్వం, తృతీయాశ్వాసంలోని ఈ క్రింది తేటగీతి పద్యంలో చూడవచ్చు.

దీనవృత్తి శల్యుండు నీ సేనజనులు
నట్లు పాంచాలు రుబ్బున నార్వ, సిగ్గు
వదక పాండవమధ్యము సిడము మరలి
మరలి చూచుచు బాఱిరి మనుజనాథ!

పాండవసేనలు జయజయధ్వానాలతో ఉత్సాహంగా ఉండగా, శల్యుడు, మిగతా కౌరవ సేనలు అర్జునుడి రథాన్ని, రథకేతనాన్ని సిగ్గువిడిచి పదేపదే వెనక్కి తిరిగి చూస్తూ పారిపోయారని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పడంపై పద్యం భావం. చూపులో సంకుచితత్వానికి సంకేతమే డంబం అని ఈ సన్నివేశం స్పష్టం చేసింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.6.48 వరకు, తదుపరి నవమి తె.5.11 వరకు, **నక్షత్రం:** రోహిణి రా.8.28 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.12.45 నుండి 2.17 వరకు, తదుపరి రా.1.58 నుండి 3.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.42 వరకు, **అమృతఘడియలు:** సా.5.31 నుండి 7.04 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

సీఎంఆర్‌ఎఫ్ నిధుల గోల్‌మాల్‌పై సీఐడీ విచారణ

నల్లగొండ జిల్లాలో మూడు ఆస్పత్రులపై ఆరోపణలు



మిర్యాలగూడ అర్బన్: వైద్యం చేయకుండానే చేసినట్లు నకిలీ బిల్లులను సృష్టించి సీఎంఆర్‌ఎఫ్ నిధులను కాజేసిన ఘటనపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఈ సంఘటన అప్పట్లో సంచలనం రేపింది. ఈ అంశంపై సీసీఎస్, సీఐడీ పోలీసులు వేర్వేరుగా విచారణ జరిపారు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన అమ్మ హాస్పిటల్, మిర్యాలగూడ పట్టణంలో నవీనా మల్టీస్పెషాలిటీ, మహేశ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల యాజమాన్యాలపై తాజాగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులు పక్కదారి పట్టినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో జరిగిన ఈ కుంభకోణంపై తాజా ప్రభుత్వం సమగ్ర విచారణ కోరింది. దీంతో వైద్యారోగ్యశాఖ.. సీఐడీని రంగంలోకి దింపగా ఆయా ఆస్పత్రుల నుంచి సీఎంఆర్‌ఎఫ్ కోసం సమర్పించిన మెడికల్ బిల్లులను అధికారులు పరిశీలిస్తున్నారు. గతంలోనే సీసీఎస్ పోలీసులు ఆయా ఆస్పత్రులపై కేసులు నమోదు చేయగా.. తాజాగా ఆ కేసులను సీఐడీ అధికారులు పరిశీలించి పూర్తి నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. నిందితుల అరెస్టుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

పాడైన కోడిగుడ్ల సరఫరాపై చర్యలు తీసుకున్నాం: సీతక్క



సాక్షి, హైదరాబాద్: భువనగిరిలోని ముదిరాజ్ వాడ అంగన్‌వాడీ కేంద్రంలో పాడైన కోడిగుడ్లు సరఫరా చేయడంపై తక్షణమే విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. అదేరోజున సెక్టార్ సూపర్ వైజర్, టీచర్, హెల్పర్లతో పాటు కోడిగుడ్ల కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశామన్నారు. సంజాయిషీ కోరడంతో పాటు కాంట్రాక్టు రద్దుపైనా మెమో ఇచ్చామన్నారు. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో బాధ్యులను సస్పెండ్ చేయాలని, పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించామన్నారు. కానీ బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ దీనిపై 'ఎక్స్'లో పోస్టు చేయడం బాధ్యతారాహిత్యమని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా కుమార్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల్లో నిర్వహించనున్న సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 75 లక్షల మంది దళితులను సభ్యులుగా చేర్పించాలని జాతీయ నాయకత్వం నిర్ణయించింది. తాజాగా ఢిల్లీలో జరిగిన జాతీయ ఎస్సీ మోర్చా సభ్యత్వ నమోదు వర్క్‌షాపులో వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జిలను నియమించింది. తెలంగాణకు చెందిన ఎస్.కుమార్‌ను తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్సీమోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్యా నియమించారు. దీంతోపాటు జాతీయ స్థాయిలో సమన్వయ బాధ్యతలను కుమార్‌కు అప్పగించారు.

సభ్యత్వ నమోదును బట్టే పోటీకి అవకాశాలు: కొండేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేపడుతున్నందున.. ఎస్సీ మోర్చా ద్వారా చేసే సభ్యత్వ నమోదును బట్టే వార్డు మెంబర్లు మొదలు జిల్లా పరిషత్ దాకా పోటీకి అవకాశాలు కల్పిస్తామని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ తెలిపారు. సభ్యత్వ నమోదులో చూపే చొరవ, చేసే సభ్యత్వాల సంఖ్యను బట్టి అవసరమైతే జనరల్ సీట్లలోనూ పోటీకి అవకాశాలు కల్పిస్తామన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చేనెల 3న రాష్ట్రంలో పార్టీ పక్షాన మెంబర్‌షిప్ డ్రైవ్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలియజేశారు. సెప్టెంబర్ 4, 5, 6 తేదీల్లో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతి డివిజన్ స్థాయి మొదలు మండలానికి వెయ్యి, జిల్లాకు 10 వేల చొప్పున రాష్ట్రంలో 3 లక్షల 80 వేల సభ్యత్వాలు చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వందకు పైగా సభ్యత్వాలను నమోదు చేయాలని ఎస్సీ మోర్చా సభ్యులను కోరుతున్నామన్నారు.



మేడిపల్లి ఓసీపీలో నీటినిల్వలు

సింగరేణిలోనూ జల విద్యుదుత్పత్తి

రూ.3వేల కోట్ల వ్యయంతో 500 మెగావాట్ల జలవిద్యుత్

- ప్రయోగాత్మకంగా మేడిపల్లి ఓసీపీలో ఏర్పాట్లు చేస్తున్న సింగరేణి
- ఈ నెల 31న పరిశీలించనున్న డిప్యూటీ సీఎం భట్టి



మేడిపల్లి ఓసీపీలో జలవిద్యుత్ ఇలా..

గోదావరిఖని: జలవిద్యుత్ రంగంలోకి సింగరేణి అడుగు పెట్టబోతోంది. రూ.3వేల కోట్ల బడ్జెట్‌తో 500 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్లాంట్ నెలకొల్పుతోంది. దీనికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాలని టాటా కన్సల్టెన్సీకి కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించింది. సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి డీపీఆర్ సింగరేణికి అందజేసినట్టు సమాచారం. శ్రీశైలం ప్రాజెక్టు తరహాలో జలవిద్యుత్ ఉత్పత్తి చేయాలని సింగరేణి నిర్ణయించింది. దీనికోసం రామగుండం డివిజన్‌–1 పరిధిలో మూసివేసిన మేడిపల్లి ఓసీపీని ఎంపిక చేసింది. భారీ పంప్‌ల సాయంతో నీటిని పైకి పంపించి కిందకు వదలడం ద్వారా జలవిద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకుంది.

మేడిపల్లి ఓసీపీలో బొగ్గు నిల్వల వెలికితీత పూర్తయ్యింది. దీంతో మూసివేసిన ఈ క్వారీని జలవిద్యుత్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఇందులో ప్రస్తుతం 0.5 టీఎంసీ నీరు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఉదయం సోలార్ విద్యుత్‌ను వినియోగించి భారీ మోటార్ల సాయంతో క్వారీలోని నీటిని పైకి పంపింగ్ చేస్తారు. రాత్రిపూట అదేనీటిని దిగువకు వదులుతారు. జలప్రవాహంతో భారీ టర్బైన్ల సాయంతో జలవిద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే సోలార్ విద్యుత్‌ను సొంతంగా తయారు చేస్తుండటంతో తక్కువ ఖర్చుతో జలవిద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యాజమాన్యం సిద్ధమైంది. పంప్‌డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్లాంట్ కోసం భారీ మోటార్లు, ఎగువన నీటినిల్వ కోసం ప్రాజెక్టు నిర్మించనున్నారు. సోలార్ విద్యుత్ ద్వారా పంప్‌లను రన్‌చేసి ఎగువన ఉన్న ప్రాజెక్టులోని భారీ మోటార్లతో నీటిని పంపింగ్ చేస్తారు. రాత్రిపూట దిగువకు విడుదల చేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తారు.

ప్రయోగాత్మకంగా ఏర్పాటు



సింగరేణి సంస్థలో జలవిద్యుత్‌కు సన్నాహాలు ప్రారంభించాం. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాల కోసం టాటా కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించాం. ఇప్పటికే అన్ని ఏరియాల్లో పర్యటించి డీపీఆర్ పొందుపర్చారు. ఈ క్రమంలో దీనిపై పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నాం.

– ఎన్.బలరామ్, సింగరేణి సంస్థ సీఎండీ

ప్రత్యేక విభాగం ఏర్పాటు

పంప్‌డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు సింగరేణిలో ఈఅండ్ఎంకు అనుసంధానంగా పీఎస్‌పీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులకే పీఎస్‌పీ బాధ్యతలు అప్పగించింది. ఈ విభాగ ఆధ్వర్యంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈనెల 31న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రామగుండం ఏరియాకు రానున్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి ఓసీపీ ప్రాంతాన్ని పరిశీలిస్తారు.

మూడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి

- తలవెంట్రుకలతో సహా పూర్తిగా ఊడిపోయిన చర్మం
- చిన్నారి పరిస్థితి విషమం..నిలోఫర్ ఆస్పత్రికి తరలింపు
- సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం బేగంపేటలో ఘటన



కుక్కల దాడిలో తీవ్ర గాయాల పాలైన చిన్నారి హన్సిత (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): మూడేళ్ల చిన్నారిపై కుక్కల గుంపు దాడి చేసి..తీవ్రంగా గాయపర్చాయి. చిన్నారి తలను పట్టి ఈడ్చుకెళ్లడంతో చర్మంతో సహా తల వెంట్రుకలు ఊడిపోయాయి. కొనఊపిరితో ఆ పాప.. ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ దారుణమైన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నబోయిన దేవేందర్–లాస్య దంపతులకు మూడేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు హన్సిత పిల్లలతో ఆడుకుంటోంది. ఈ సమయంలో కుక్కల గుంపు హన్సితపై ఏకకాలంలో దాడి చేశాయి. తలను పట్టుకొని కుక్కలు లాక్కెళుతుండగా తల వెంట్రుకలు చర్మంతో సహా పూర్తిగా ఊడిపోయాయి. హన్సిత అరుపులు కేకలను గమనించిన స్థానికులు.. కుక్కలను వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. కానీ కుక్కలు పెద్దలపైకి సైతం దాడికి ఉపక్రమించాయి. దీంతో తేరుకున్న గ్రామస్తులు కర్రలతో వెంబడించడంతో అవి పారిపోయాయి. అప్పటికే హన్సిత తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చిన్నారిని తల్లిదండ్రులు హుటాహుటిన భూంపల్లి పీహెచ్ సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108 ద్వారా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హన్సిత పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు.

యాదాద్రికి గవర్నర్

నేటి నుంచి మూడు రోజులు జిల్లాల్లో జిష్ణుదేవ్ వర్మ పర్యటన



సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, వరంగల్/యాదగిరిగుట్ట: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మూడురోజుల పర్యటనపై రాజ్‌భవన్ సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. యాదాద్రి భువనగిరి, ములుగు, జయశంకర్‌భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జనగాం జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. ముందుగా మంగళవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుటుంబసభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలోని స్వయంభూలను దర్శించుకొని.. ప్రత్యేక పూజలు చేస్తారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో యాదాద్రి ఆలయంలో మంగళవారం ఉదయం బ్రేక్ దర్శన సమయాన్ని 9.30 గంటల నుంచి 10 గంటలకు బదులుగా 10 గంటల నుంచి 10.30 గంటలకు మార్చినట్టు ఈవో వెల్లడించారు.

గవర్నర్ షెడ్యూల్ ఇలా...

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నుంచి 3 రోజులపాటు ఉమ్మడి వరంగల్‌లో పర్యటిస్తారు. పలు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను ఆయన సందర్శిస్తారు.
- యాదాద్రి పర్యటన తర్వాత రోడ్డు మార్గాన ములుగు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని అధికారులతో సమావేశమవుతారు. అనంతరం రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర అవార్డు గ్రహీతలతో సహపంక్తి భోజనం చేసి రామప్ప గుడి, సరస్సు, గణపురంలోని గుళ్లను సందర్శిస్తారు. ఆ తర్వాత లక్నవరం చేరుకొని హరిత హోటల్‌లో రాత్రి బస చేస్తారు.
- ఆ మరుసటి రోజు లక్నవరంలో బయలుదేరి హనుమకొండలోని 'నిట్' చేరుకుంటారు. గురువారం ఉదయం జనగామ జిల్లాతో ఆయన పర్యటన ముగుస్తుంది.

వక్ఫ్ ప్రతిపాదిత సవరణ బిల్లు తిరస్కరణ

తెలంగాణ వక్ఫ్‌బోర్డు పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానం



పాలకమండలి సమావేశంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనితో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు తిరస్కరించింది. సోమవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లో జరిగిన వక్ఫ్‌బోర్డు పాలకమండలి ప్రత్యేక సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాలకమండలి సభ్యులు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును క్లాజువారీగా పరిశీలించారు. ఆపై సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవంగా తిరస్కరించారు. ప్రతిపాదిత బిల్లు నిర్దిష్ట ఆలోచనతో రూపొందించబడిందని, వక్ఫ్ ఆస్తులను క్లెయిమ్ చేయడానికి, కలెక్టర్ల పూర్తి నియంత్రణలోకి తీసుకురావడం ద్వారా సంస్థ స్వయంప్రతిపత్తిని నాశనం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తుందని పాలకమండలి అభిప్రాయపడింది. ఇద్దరు నాన్ ముస్లిం సభ్యులను నామినేట్ చేయడం ద్వారా ముస్లిమేతరుల ఆధిపత్యంగా మారుతుందని, ఈ బిల్లు ఫెడరల్ సూత్రాలకు విరుద్ధమని, ప్రతిపాదితబిల్లు మతం స్వేచ్ఛ, ఆస్తి హక్కులో జోక్యం చేసుకుంటుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డు అధికారాలను నిర్వీర్యం చేయడం, అదే సమయంలో ఆక్రమణదారులకు అధికారం కల్పించేలా అవకాశం కల్పిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. బోర్డు సమావేశంలో సభ్యులు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ హుస్సేనీ, అబుల్ ఫతే సయ్యద్ బందగీ బాదేషా ఖాద్రీ, డాక్టర్ సయ్యద్ నిస్సార్ హుస్సేన్ , మాలిక్ మొహతాసిమ్ ఖాన్, ట్రిబ్రీస్ కార్యదర్శి ఐషా మసరత్ ఖానం, ఎంఏకే.ముఖీద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : అసదుద్దీన్

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించి దేశంలోనే మొట్టమొదటి వక్ఫ్‌బోర్డుగా తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అవతరించిందని బోర్డు సభ్యుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సవరణ బిల్లును తిరస్కరిస్తూ బోర్డు సమావేశం ప్రత్యేక తీర్మానం ఆమోదించడాన్ని స్వాగతిస్తూ ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జూరాలకు మళ్లీ వరద

- ప్రాజెక్టుకు 1.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 23 క్రస్టు గేట్ల ఎత్తివేత... కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- శ్రీశైలం జలాశయానికి 1,32,281 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి మళ్లీ వరద పెరిగింది. ఆదివారం రాత్రి 39వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అర్ధరాత్రి నుంచి పెరుగుతూ వచ్చింది. సోమవారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టుకు 1.20 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో చేరింది. దీంతో 23 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా 90,643 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి నిమిత్తం 31,335 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 496 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు.. ప్రాజెక్టు నుంచి మొత్తంగా 1,24,183 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.855 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 25 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువన ఉన్న జూరాల వైపు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 30.52 టీఎంసీల నీరు ఉంది.

సాగర్‌కు 66,051క్యూసెక్కుల విడుదల

మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 1,32,281 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపడుతూ 37,882 క్యూసెక్కులు, కుడిగట్టులో విద్యుదుత్పత్తికి 28,169 క్యూసెక్కులు.. మొత్తం 66,051క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి వరద ఇలాగే కొనసాగితే నేడో, రేపు శ్రీశైలం గేట్లు ఎత్తేఅవకాశం ఉంటుంది.

రాధ హత్య అమానవీయం

మానవ హక్కుల వేదిక ఆందోళన



జీవన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, కాప్రా ప్రాంతానికి చెందిన దళిత మహిళ, మావోయిస్టు పార్టీ సభ్యురాలు పల్లెపాటి రాధను ఇన్ఫార్మర్ ఆరోపణలతో మావోయిస్టు పార్టీ శ్రేణులు హత్య చేయడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మానవీయత కొరవడిన చర్యగా పేర్కొన్నారు. ఈ మేరకు రాధ హత్యను వారు తీవ్రంగా ఖండించారు. సాధారణ జీవితం గడిపేందుకు నిర్ణయించుకున్న ఆమె పార్టీ నుంచి బయటకు వచ్చేందుకు నిర్ణయించుకుందని, కూతురు తిరిగి వస్తుందన్న సంతోషంతో ఉన్న కుటుంబసభ్యులకు రాధ హత్యోదంతం తీరని విషాదంగా మిగిలిందన్నారు. ఆమె మావోయిస్టు పార్టీకి నష్టం కలిగించి ఉంటే పార్టీ నుండి బహిష్కరించవచ్చునని, కానీ హత్యకు పాల్పడటం అన్యాయమని వారు పేర్కొన్నారు.

మావోయిస్టుల లొంగుబాటు

ఆరుగురు ముఖ్యులు సహా 25 మంది



లొంగిపోయిన మావోయిస్టులతో ఎస్పీ జితేంద్రకుమార్, అధికారులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆరుగురు ముఖ్య నేతలు సహా 25 మంది మావోయిస్టులు సోమవారం లొంగిపోయారు. వీరిలో రూ.8 లక్షల రివార్డున్న ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. ఈ వివరాలను సోమవారం బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన 25 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారని ఎస్పీ పేర్కొన్నారు. వీరిలో ఆరుగురు ముఖ్య నాయకులున్నారని, ఇద్దరు పీఎల్‌జీఏ ఆర్మీ మహిళా మావోయిస్టులపై రూ.8 లక్షల చొప్పున రివార్డు ఉందని వివరించారు. కాగా, వీరికి రూ.25 వేల చొప్పున తక్షణ సాయం అందించి, పునరావాసానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని స్పష్టం చేశారు.

ఇన్‌ఫార్మర్ పేరిట యువకుడి హతం



నీతూ మండావి మృతదేహం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇన్‌ఫార్మర్ పేరిట మావోయిస్టులు మరో యువకుడిని కర్రలతో దారుణంగా కొట్టి తాడుతో చెట్టుకు ఉరి వేసి చంపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి జైగూర్ గ్రామానికి చెందిన నీతూ మండావి(26)ని శనివారం మావోయిస్టులు అపహరించుకుపోయారు. ఆదివారం సమీప అటవీ ప్రాంతంలో ప్రజాకోర్టు నిర్వహించారు. అనంతరం అతన్ని చెట్టుకు ఉరివేసి.. కర్రలతో దారుణంగా కొట్టి చంపారు. మృతదేహాన్ని సోమవారం ఉదయం గ్రామసమీప రహదారి పక్కన పడేశారు. 2021 నుంచి మండావి పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతోనే శిక్ష విధించామని మావోయిస్టు పార్టీ బైరంఘడ్ ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖను వదిలారు.

ఎమ్మెల్యే పల్లా మా భూమిని కబ్జా చేశారు

- కుంట్లూరు మాజీ సర్పంచ్ ఆరోపణ
- తమపై దాడి చేసి భూమినుంచి వెళ్లగొట్టారని పోలీసులకు ఫిర్యాదు



తగాదా పడుతున్న ఇరు వర్గాలు

ఘట్‌కేసర్: అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో సర్వే నంబర్ 769లోని తమ 4 ఎకరాల పట్టా భూమిని కబ్జా చేశారని హయత్‌నగర్ మండలం కుంట్లూరు మాజీ సర్పంచ్ క్లైం ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్, శివారెడ్డి, సాయి సిద్ధార్థ అనే వ్యక్తులు ఆరోపించారు. ఇదే గ్రామంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నీలిమా ఆస్పత్రి సమీపంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అదే సమయంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోదరుడు సతీశ్‌రెడ్డి, ఆయన అనుచరులు కరుణాకర్, రామారావు, ప్రదీప్‌రెడ్డితో పాటు నీలిమా మెడికల్ కళాశాల, ఆస్పత్రి సిబ్బంది అక్కడికి వచ్చి విలేకరుల సమావేశాన్ని అడ్డుకుని ప్రభాకర్‌రెడ్డి, ఆయనతోపాటు ఉన్న వ్యక్తులపై దాడికి దిగారు. దీంతో బాధితులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలోని 796 సర్వే నంబర్‌లో తమకు 4.20 ఎకరాల భూమి ఉందని ప్రభాకర్‌రెడ్డి తదితరులు చెప్పారు. అయితే ఐదారు ఏళ్లుగా తమను అందులోకి రానీయడం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా తమ పట్టా భూమిలో ఉండగా తమపై దాడి చేసి వెళ్లగొట్టారని క్లైం ప్రభాకర్‌రెడ్డి, ఇతర బాధితులు పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చట్టబద్ధంగా కొనుగోలు చేశాం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సర్వే నంబర్ 796లో గాయత్రీ ట్రస్ట్‌కోసం చట్టబద్ధంగానే భూమిని కొనుగోలు చేశామని, ఆ భూమి తమ అధీనంలోనే ఉందని అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ భూముల్లోకి సోమవారం మధ్యాహ్నం క్లైం ప్రభాకర్‌రెడ్డి అక్రమంగా చొరబడి ప్రెస్‌మీట్ నిర్వహించారని, తమ సిబ్బంది కరుణాకర్‌రెడ్డి, సతీశ్‌రెడ్డిపై దాడి చేశారని ఆయన పేర్కొన్నారు.

మినహాయింపు ఉత్తర్వులిచ్చి.. పన్ను నోటీసులా?

ఐటీ శాఖను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తొలుత పన్ను మినహాయింపు ఇచ్చి.. తర్వాత నోటీసులు జారీ చేశారన్న పిటిషనర్ వాదనపై వివరణ ఇవ్వాలని ఆదాయపు పన్ను శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ ఈనెల 28కి వాయిదా వేసింది. ఆదాయపు పన్ను శాఖ మినహాయింపు ఉత్తర్వులు జారీ చేసిన ఐదేళ్ల తర్వాత పన్ను కట్టాలని నోటీసులు ఇవ్వడం.. ఆపై పన్ను మదింపు ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమంటూ తెలంగాణ బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఐటీ శాఖ ఆదేశాలను సవాల్ చేసిన కేసులో 20 శాతం మొత్తాన్ని చెల్లించాలంటూ సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ ఆదేశించడాన్ని పిటిషనర్ న్యాయవాది తప్పుపట్టారు. ఆ విధమైన ఉత్తర్వుల జారీ అధికారం బోర్డుకు లేదన్నారు. పన్ను మినహాయింపు ఉత్తర్వులను ఐటీ శాఖ అధికారులు 2017లో ఇచ్చారని తెలిపారు.

హిమసీమలో ఎన్నికల వేడి



కల్లోల కశ్మీరంలో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు

- కేంద్రపాలిత ప్రాంతంగా మారాక తొలిసారి
- 370 రద్దు తర్వాత ఇదే తొలి బ్యాలెట్ పోరు
- ప్రజల మనోగతాన్ని పట్టివ్వనున్న ఫలితాలు

జమ్మూ కశ్మీర్. దశాబ్దాలుగా ఉగ్ర దాడులకు, కల్లోలానికి పర్యాయపదం. అశాంతితో అట్టుడికిపోతూ వస్తున్న ఆ ప్రాంతంలో ఉగ్ర దాడులు పెద్దగా తగ్గకున్నా కొన్నాళ్లుగా కాస్త ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పదేళ్ల విరామం తర్వాత ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు, నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణతో పాటు కాంగ్రెస్ కీలక నేత గులాం నబీ ఆజాద్ కొత్త పార్టీ స్థాపన వంటి కీలక పరిణామాలెన్నో ఈ పదేళ్లలో చోటుచేసుకున్నాయి. ఈ రాజకీయ పరిణామాలపై, లోయలో శాంతిస్థాపన యత్నాలు తదితరాలపై ప్రజల మనోగతానికి ఈ ఎన్నికల ఫలితాలు అద్దం పట్టే అవకాశముందని భావిస్తున్నారు. దాంతో పీడీపీ, ఎన్సీ వంటి స్థానిక పార్టీలతో పాటు ప్రధాన పక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ కూడా వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. పైగా జమ్మూ కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాక జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ప్రజల తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

పునర్ వ్యవస్థీకరణతో...

దశాబ్దకాలంగా జమ్మూ కశ్మీర్ రాజకీయ ముఖచిత్రం ఊహాతీతంగా మారిపోయింది. 2026 జనగణన దాకా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరపరాదన్న రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని పక్కన పెట్టి 2022లో ఈ ప్రక్రియ చేపట్టారు. అసెంబ్లీ స్థానాలను 87 (లద్దాఖ్‌లోని 4 స్థానాలను మినహాయిస్తే) నుంచి 90కి పెంచారు. మొత్తం సీట్ల సంఖ్య పెద్దగా పెరగకున్నా ముస్లిం ప్రాబల్య కశ్మీర్‌లో సీట్లు 47కు తగ్గి, హిందువులు ఎక్కువగా ఉండే జమ్మూలో 43కు పెరగడం విశేషం. జమ్మూలోని సాంబా, రాజౌరీ, కథువా జిల్లాల్లో రెండేసి సీట్లు పెరిగితే కశ్మీర్‌లో ఒక్క స్థానం (కుప్వారాలో) పెరిగింది. అంతకుముందు కశ్మీర్‌లో 46, జమ్మూలో 37, లద్దాఖ్ ప్రాంతంలో 4 సీట్లుండేవి. 2011 జనాభా లెక్కల ప్రకారం జమ్మూకశ్మీర్ జనాభాలో 43.8 శాతం మంది జమ్మూలో, 56.2 శాతం కశ్మీర్‌లో నివసిస్తున్నారు. కశ్మీర్‌లోని ఉత్తరాది జిల్లాల్లో అత్యంత సున్నిత పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఎన్నికల నిర్వహణ కత్తిమీద సామేనని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలన్నది నిర్ణయాన్ని ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు. ఈ క్షణాల కోసం జమ్మూ కశ్మీర్ ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్నారని చెప్పుకొచ్చారు.

జమ్మూ కశ్మీర్ ఎన్నికల ముఖచిత్రం

మొత్తం అసెంబ్లీ స్థానాలు	90
మొత్తం దశలు:	మూడు
సెప్టెంబర్	18
సెప్టెంబర్	25
అక్టోబర్	1
ఫలితాలు:	అక్టోబర్ 4
2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్:	58.46%
చివరిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగింది:	2014

2014 ఎన్నికల్లో ఏం జరిగింది?

- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. 65.52 శాతం ఓటింగ్ నమోదైంది.
- పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) 28 స్థానాలతో ఏకైక అతి పెద్ద పార్టీగా నిలిచింది.
- రెండో స్థానంలో నిలిచిన బీజేపీకి 25 సీట్లొచ్చాయి.
- నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)కి 15, కాంగ్రెస్‌కు 12 స్థానాలు దక్కాయి.
- స్థానిక చిన్న పార్టీలు, స్వతంత్రులకు 7 సీట్లొచ్చాయి.

ఏ పార్టీకీ మెజారిటీ రాకపోవడంతో చివరికి బీజేపీ మద్దతుతో పీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అలా సంకీర్ణ సర్కారు ఏర్పడింది. కానీ విభేదాల నేపథ్యంలో 2018లో బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో ఆ సర్కారు కుప్పకూలింది. ఆ తర్వాత 2020లో జిల్లా అభివృద్ధి మండళ్లకు, తాజాగా గత మేలో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటువేశారు.

ఈ ఎన్నికలకు ఇంత ప్రాధాన్యం ఎందుకంటే...

జమ్మూ కశ్మీర్‌లో గత పదేళ్లలో అన్నివిధాలుగా సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. అటు రాష్ట్ర హోదా రద్దయి కేంద్రపాలిత ప్రాంతంగా మారడం మొదలుకుని రాజకీయంగా కూడా ఎన్నో పరిణామాలు జరిగాయి. వీటన్నింటిపైనా సగటు జమ్మూ కశ్మీర్ ప్రజల మనోగతానికి వారి ఓటింగ్ సరళి అద్దం పట్టనుంది. అందుకే ఈ ఎన్నికలను జమ్మూ కశ్మీర్ చరిత్రలోనే కీలకమైనవిగా భావిస్తున్నారు.


ఎల్జీదే పెత్తనం

2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటి నుంచీ జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. నాటినుంచీ కీలక అధికారాలన్నీ లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలోనే కేంద్రీకృతమయ్యాయి. అసెంబ్లీ అధికారాలు కుంచించుకుపోయాయి. దాదాపుగా ప్రభుత్వ నిర్ణయాలన్నింటికీ ఎల్జీ ఆమోదముద్ర తప్పనిసరిగా మారింది. పోలీసు వ్యవస్థతో పాటు భూములకు సంబంధించిన అన్ని అంశాలపైనా ఎల్జీదే నిర్ణయాధికారం.

జమ్మూ కశ్మీర్‌లో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా...

మొత్తం అసెంబ్లీ స్థానాలు 87 (నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ముందు)

2008 గెలిచిన సీట్లు		2014 గెలిచిన సీట్లు:	
ఎన్సీ	28	పీడీపీ	28
కాంగ్రెస్	17	ఎన్సీ	15
పీడీపీ	21	బీజేపీ	25
బీజేపీ	11	కాంగ్రెస్	12
ఇతరులు	10	ఇతరులు	7



కాంగ్రెస్, ఎన్సీ పొత్తు



ఈసారి కాంగ్రెస్, ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తు కుదుర్చుకుని రంగంలోకి దిగుతున్నాయి. ఇందులో భాగంగా 51 స్థానాల్లో ఎన్సీ, 32 చోట్ల కాంగ్రెస్ పోటీ చేస్తాయి. సీపీఎం, పాంథర్స్ పార్టీలకు ఒక్కో స్థానం చొప్పున కేటాయించాయి. మిగతా 5 చోట్ల ఎన్సీ, కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీకి దిగుతుండటం విశేషం. మరోవైపు బీజేపీ 16 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. తొలుత 44 మంది పేర్లు ప్రకటించినా వాటిలో పలు పేర్లపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఆ జాబితాను రద్దు చేసింది. ఇక మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీ ఇప్పటిదాకా రెండు విడతల్లో 16 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించింది. గులాం నబీ ఆజాద్ నేతృత్వంలోని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) కూడా 13 మందితో తొలి జాబితా విడుదల చేసింది.

మోదీ సారథ్యంలో కశ్మీర్‌లో బీజేపీ ప్రచారం

స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఈసీకి పంపిన కమలదళం



జమ్మూ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే స్టార్ క్యాంపెయినర్ల జాబితాను బీజేపీ సోమవారం విడుదల చేసింది. ప్రధాని మోదీ సారథ్యంలో చేపట్టే మొదటి విడత ఎన్నికల ప్రచారంలో హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి తదితర 40 మంది కీలక నేతలు పాల్గొననున్నారు. ఈ జాబితాను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యాలయం ఇన్‌చార్జి అరుణ్ సింగ్ ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. నిర్ణీత గడువులోగా సవరించిన మరో జాబితా అందజేస్తే తప్ప, మూడు దశలకు కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితా ఇదే ఉంటుందని ఆయన ఈసీకి వివరించారు. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబర్ 18, 25వ తేదీలతోపాటు నవంబర్ ఒకటో తేదీన మూడు విడతలుగా ఎన్నికలు జరగనుండటం తెలిసిందే.

లద్దాఖ్‌లో మరో ఐదు జిల్లాలు

కేంద్ర హోంశాఖ నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో కొత్తగా మరో ఐదు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర హోంశాఖ ఈ మేరకు సోమవారం ప్రకటించింది. లద్దాఖ్‌లో ఇప్పటికే లేహ్, కార్గిల్ జిల్లాలున్నాయి. తాజా నిర్ణయంతో లద్దాఖ్-జన్‌స్కర్, ద్రాస్, నుబ్రా, షామ్, చాంగ్‌తంగ్ జిల్లాలు నూతనంగా రూపుదాల్చనున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటుకు సూత్రప్రాయ ఆమోదం లభించడంతో ప్రధాన కార్యాలయం, సరిహద్దులు, నిర్మాణాలు వంటి వివిధ అంశాలను అంచనా వేయడానికి ఓ కమిటీని వేయాలని లద్దాఖ్ పరిపాలన విభాగాన్ని హోం శాఖ కోరింది. పోస్టుల సృష్టితోపాటు జిల్లాల ఏర్పాటుకు సంబంధించి ఇతర అంశాలు ఏమైనా ఉంటే మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని తెలిపింది. అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన లద్దాఖ్‌ను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నామని హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు. మొత్తం ఏడు జిల్లాలతో లద్దాఖ్ ప్రజలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు మోదీ ప్రభుత్వానికి గల నిబద్ధత తేటతెల్లమవుతోందని అమిత్ షా తెలిపారు.

ఎట్టకేలకు కొలిక్కి

నేషనల్ కాన్ఫరెన్స్ 51 • కాంగ్రెస్ 32



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకంపై నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. ఎన్సీ 51 స్థానాల్లో, కాంగ్రెస్ 32 చోట్ల పోటీచేయడానికి అంగీకారం కుదిరింది. స్థానిక నాయకత్వంతో జరిగిన సీట్ల సర్దుబాటు చర్చల్లో విబేధాలు రావడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులను రంగంలోకి దింపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సల్మాన్ ఖుర్షీద్, కశ్మీర్ కాంగ్రెస్ ఇంచార్జి భరత్ సోలంకిలు సోమవారం శ్రీనగర్‌కు చేరుకున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాలో వారి నివాసంలో చర్చలు జరిపారు. సుదీర్ఘ సమయం చర్చల తర్వాత ఎవరెన్ని సీట్లలో పోటీచేయాలనేది ఖరారైంది. ఎన్సీ- కాంగ్రెస్ నేతలు ఉమ్మడి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఐదుస్థానాల్లో స్నేహపూర్వక పోటీ ఉంటుందని తెలిపారు. సీపీఎం , పాంథర్స్ పార్టీలకు ఒక్కో సీటును కేటాయించారు.

రిటైరయ్యే ప్రసక్తే లేదు: మాయావతి



లక్నో: క్రియాశీల రాజకీయాల నుంచి రిటైరవ్వడం లేదని బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టం చేశారు. కులవివక్ష మీడియా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోందని సోమవారం మండిపడ్డారు. అంబేడ్కర్‌వాదాన్ని, బహుజనులను బలహీనపర్చే కుట్రను తిప్పికొట్టడానికి, బీఎస్పీ ఆత్మగౌరవ ఉద్యమానికి తుదిశ్వాస దాకా కట్టుబడి ఉంటానన్నారు. ''క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొనే ప్రసక్తే లేదు. నేను లేనపుడు, తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు ఆకాశ్ ఆనంద్‌ను వారసుడిగా ప్రకటించాం. దాంతో కుల మీడియా నేను రిటైరవుతున్నాని దుష్ప్రచారం చేస్తోంది. ప్రజలు ఇది గమనించాలి' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నాందేడ్ ఎంపీ చవాన్ కన్నుమూత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేత



నాందేడ్: మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, నాందేడ్ ఎంపీ వసంత్‌రావు బల్వంతరావు చవాన్ (70) కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసలో సమస్య, బీపీతో బాధపడుతున్న ఆయనను తొలుత స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం బాగా క్షీణించడంతో ఎయిర్ అంబులెన్స్‌లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. నాందేడ్ జిల్లా నాయిగావ్‌లో జన్మించిన వసంత్ చవాన్ గ్రామ పంచాయతీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. సర్పంచ్ నుంచి శాసనమండలి సభ్యుని దాకా ఎదిగారు. తర్వాత నయిగావ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నాందేడ్ నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ పాటిల్ చిఖ్లికర్‌పై విజయం సాధించారు. చవాన్ మరణం పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పేర్కొంది.

విడిపోతే ఊచకోతే

- భారత్‌లోనూ 'బంగ్లా' పునరావృతం
- హిందువులకు యోగి హెచ్చరికలు
- ముస్లిం విద్వేషానికి రుజువు: ఒవైసీ
- 'ప్రధాని'లా ప్రవర్తించొద్దు: అఖిలేశ్



ఆగ్రా: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆగ్రాలో దుర్గాదాస్ రాథోడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, 'విడిపోతే ఊచకోత కోస్తారు' అంటూ హిందువులను ఉద్దేశించి మాట్లాడారు. ''బంగ్లాదేశ్‌లో ఏమవుతోందో చూస్తున్నారుగా! ఆ తప్పిదాలను భారత్‌లో పునరావృతం చేయొద్దు. విడిపోయామంటే ఇక అంతే సంగతులు. మనల్ని ఊచకోత కోస్తారు. కలిసుంటేనే సురక్షితంగా ఉండగలం. అభివృద్ధి చెందగలం'' అన్నారు. అనంతరం ఈ వ్యాఖ్యలను ఎక్స్‌లో కూడా యోగి పోస్ట్ చేశారు. వీటిపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. ముస్లిం విద్వేషంతో యూపీని విడదీస్తున్నదే యోగి అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ''మైనారిటీల ఇళ్లపైకి ఆయన ఇప్పటికే బుల్డోజర్లు నడుపుతున్నారు. ఇప్పుడిలా మరో అడుగు ముందుకేసి విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు. యూపీని మతపరంగా మరింతగా విడదీయజూస్తున్నారు'' అంటూ దుయ్యబట్టారు. సీఎం పదవి చేజారేలా ఉండటంతో అభద్రతా భావంతోనే ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రధాని కావాలని యోగికి ఎంత కోరికగా ఉన్నా మరీ ఇప్పట్నుంచే ఇలా విదేశీ వ్యవహారాల్లో వేలు పెట్టొద్దంటూ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు.

ఆస్పత్రిలో అక్రమాల కేసులో ఘోష్ పేరు

కోల్‌కతా: కర్ వైద్య కళాశాలలో ఆర్థిక అవకతవకల కేసులో మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ పేరును సీబీఐ తాజాగా చేర్చింది. ఔషధాలు, పరికరాల టెండర్లు సొంత వారికి దక్కేలా చేయడం, అనాథ శవాలను, బయోవ్యర్థాలను అమ్ముకోవడం వంటి ఆరోపణలు ఘోష్‌పై ఉన్నాయి. ఆయనపై సీబీఐ సోమవారం రెండోసారి పాలిగ్రఫీ పరీక్షలను నిర్వహించింది. శనివారం పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఈ చర్యకు దిగింది.

ఢిల్లీలో ఫుట్‌పాత్ పైకెక్కిన ట్రక్కు

ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు

న్యూఢిల్లీ: ఈశాన్య ఢిల్లీలోని శాస్త్రి పార్క్ ప్రాంతంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ట్రక్కు ముగ్గురు నిరాశ్రయుల ప్రాణాలు తీసింది. మెట్రో స్టేషన్ సమీపంలోని తర్బూజ్ మార్కెట్ వద్ద తెల్లవారుజామున 4:30 గంటలకు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఐదుగురిపైకి దూసుకెళ్లింది. ముగ్గురు మృతి చెందగా ఇద్దరు గాయాల పాలయ్యారు. వారికి ఆస్పత్రిలోచికిత్స అందిస్తున్నారు. పరారైన ట్రక్కు డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

---

100 క్షిపణులు.. డ్రోన్లు..!



రష్యాలోని స్థావరం నుంచి ఉక్రెయిన్ వైపు దూసుకెళ్తున్న బక్ క్షిపణి

పేలుళ్లతో దద్దరిల్లిన ఉక్రెయిన్

- విద్యుత్, నీటి వనరులే లక్ష్యంగా రష్యా దాడులు
- ఐదుగురు మృత్యువాత, 13 మందికి గాయాలు
- భారీ నష్టం వాటిల్లిందన్న జెలెన్‌స్కీ

కీవ్: రష్యా మరోసారి పేట్రేగిపోయింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకంగా 100 వందకు పైగా వివిధ రకాల క్షిపణులు, మరో 100 షహీద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. 'రష్యా మా కీలకమైన పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దుర్మార్గపూరితంగా దాడులకు తెగబడింది. ఖార్కివ్, కీవ్ మొద లుకొని ఒడెసా, పశ్చిమ ప్రాంతాల వరకు జరిగిన దాడుల్లో భారీగా నష్టం వాటిల్లింది'అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఈ దాడుల్లో కనీసం ఐదుగురు చనిపోగా, 13 మంది పౌరులు గాయప డ్డారని చెప్పారు. తమ భూభాగంపై రష్యా పాల్పడిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, క్రూయిజ్ మిస్సైళ్లు, హైపర్‌సోనిక్ బాలిస్టిక్ కింజాల్ క్షిపణులు మొత్తం 15 రీజియన్లలో..అంటే దాదాపు దేశంలోని సగం ప్రాంతాల్లో బీభత్సం సృష్టించినట్లు ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ ష్మిహాల్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ ప్రభుత్వ రంగ విద్యుత్ గ్రిడ్ ఆపరేటర్.. ఉక్రెనెర్గో.. దెబ్బతిన్న మౌలిక వ్యవస్థను గాడినపెట్టేందుకు అత్యవసర విద్యుత్ కోతలను ప్రకటించింది. ప్రైవేట్ విద్యుత్ సంస్థ డీటీఈకే కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు తమ సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారని తెలిపింది. రాజధానిలోని విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు కీవ్ మేయర్ తెలిపారు. కీవ్‌పైకి దూసు కొచ్చిన 15 క్షిపణులు, మరో 15 డ్రోన్లను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయన్నారు. కాగా, ఉక్రెయిన్ సైనిక-పారిశ్రామిక సముదాల నిర్వహణకు ఎంతో కీలకమైన విద్యుత్ వ్యవస్థలను తమ దీర్ఘశ్రేణి క్షిపణులు, డ్రోన్లు ఛిన్నాభిన్నం చేశాయని, లక్ష్యాలను అవి గురి తప్పకుండా ఛేదించాయని రష్యా ఆర్మీ ప్రకటించింది.

22 డ్రోన్లను కూల్చివేశాం: రష్యా

సరటోవ్, యరోస్లావ్ ప్రాంతాలపైకి ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ఉక్రెయిన్ ప్రయోగించిన 22 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా ఆర్మీ ప్రకటించింది. ఈ ఘటనల్లో పలు నివాస భవనాలు దెబ్బతినగా, నలుగురు గాయపడ్డారని తెలిపింది. కస్క్ రీజియన్‌లో ఉక్రెయిన్ బలగాలు మరింతగా ముందుకు సాగకుండా అడ్డుకున్నట్లు తెలిపింది. అదేవిధంగా, ఉక్రెయిన్ బలగాలు, ఆయుధ సామగ్రి రవాణాకు కేంద్రంగా ఉన్న పాక్రొవ్స్క్‌కు అతి సమీపంలోకి రష్యా బలగాలు చేరుకుంటున్నట్లు సమాచారం.

పాక్‌లో బీఎల్‌ఏ స్వైరవిహారం

- పోలీస్‌స్టేషన్లు, వాహనాలే లక్ష్యంగా దాడులు
- కనీసం 50 మంది కాల్చివేత
- సైన్యం ఏరివేతలో 12 మంది ఉగ్రవాదులు హతం



బీఎల్‌ఏ ఉగ్రవాదులు తగులబెట్టిన ట్రక్కు

కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో మిలిటెంట్ గ్రూప్ బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) రెచ్చిపోయింది. ఆది, సోమ వారాల్లో బీఎల్‌ఏ సాయుధులు పోలీస్ స్టేషన్లు, రైలు మార్గాలు, వాహనాలపై దాడులు జరిపి 50 మందిని చంపేశారు. అనంతరం సైన్యం చేపట్టిన ఏరివేతలో 12 మంది మిలిటెంట్లు హతమయ్యారు. బీఎల్‌ఏ సభ్యులు ఆదివారం రాత్రి బలోచిస్తాన్‌లోని ముసాఖెల్ జిల్లాలోని హైవేను దిగ్బంధించారు. అటుగా వచ్చిన బస్సులు, ట్రక్కులను అడ్డగించి, ప్రయాణికులతోపాటు డ్రైవర్లను కిందికి దించివేశారు. 'గుర్తింపు కార్డులు పరిశీలించాక పంజాబ్, ఖైబర్ పంఖ్తున్వా ప్రావిన్స్‌లకు చెందిన 23 మందిని తుపాకులతో కాల్చి చంపారు. అనంతరం సమీపంలోని కొండ ప్రాంతంలోకి వారంతా పరారయ్యారు. ఉగ్రవాదులు ప్రయాణికుల వాహనాలతో పాటు బొగ్గుతో వెళ్లే ట్రక్కులను కూడా అడ్డగించి డ్రైవర్లను చంపేశారు. పది ట్రక్కులకు నిప్పుపెట్టారు'అని అధికారులు తెలిపారు. ఇదే ప్రావిన్స్‌లోని మరికొన్ని చోట్ల ఉగ్రవాదులు పోలీస్ స్టేషన్లు, భద్రతా బలగాల పోస్టులే లక్ష్యంగా దాడులకు దిగారు. ఈ ఘటనల్లో మరో 10 మంది చనిపోయారు. బలోచిస్తాన్‌లోని ఖలాట్ జిల్లాలో మరో ఘటనలో..ఆరుగురు పోలీసులు సహా మొత్తం 11 మందిని బీఎల్‌ఏ తీవ్రవాదులు చంపారు. మరో ఘటనలో బొలాన్ జిల్లా డొజాన్ ప్రాంతంలోని పాక్- ఇరాన్‌లను కలిపే రైల్వే మార్గంపై వంతెనను పేల్చివేసిన ఉగ్రవాదులు, ఆరుగురిని కాల్చి చంపారు. ఈ ఘటనలకు తమదే బాధ్యతంటూ అనంతరం బీఎల్‌ఏ మీడియాకు పంపిన ఈ మెయిల్‌లో ప్రకటించుకుంది. పారామిలటరీ బలగాల బేస్‌పైనా దాడి చేసినట్లు అందులో చెప్పుకుంది. అయితే, ప్రభుత్వం దీనిని ధ్రువీకరించాల్సి ఉంది. సహజవనరులు పుష్కలంగా ఉన్న బలూచిస్తాన్ పాక్‌లోని అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉండిపోయింది.

రైతు ఉద్యమం కొనసాగి ఉంటే...

భారత్ బంగ్లా అయ్యేది!

కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: బీజేపీ నాయకురాలు, మండీ పార్లమెంట్ సభ్యురాలు కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''ఉద్యమాలతో బంగ్లాదేశ్‌లో ఎంతటి రక్తపాతం, విధ్వంసం జరిగిందో చూశాం. రైతు ఉద్యమాలు ఉధృతంగా కొనసాగి ఉంటే భారత్ కూడా బంగ్లాదేశ్‌లా మారిపోయేది. ఉద్యమాల మాటున ఇక్కడా అంతటి అరాచకత్వం రాజ్యమేలేది. ఇక్కడి కొందరు స్వార్థపరులతో చేతులు కలిపిన బయటివ్యక్తులు మనల్ని నాశనం చేయాలని చూశారు. అదృష్టవశాత్తు మోదీ సర్కార్ కఠినమైన చర్యలు తీసుకోవడంతో పరిస్థితి అదుపులోనే ఉంది. లేకుంటే రైతు ఉద్యమాల కాలంలో ఎన్నోచోట్ల శవాలు వేలాడదీసి కనిపించేవి. వాళ్ల కుట్రలు ఫలించి దేశం కుక్కలపాలైనా సదరు విదేశీ శక్తులకు పట్టదు. అందుకే మూడు సాగు చట్టాలను కేంద్రం ఉపసంహరించుకున్నా ఇప్పటికీ రైతు ఉద్యమాలు ఆగడం లేదు. దీని వెనుక విదేశీ శక్తులు, కొందరు దేశీయ స్వార్థపరుల ప్రయోజనాలు దాగున్నాయి'' అని కంగన వ్యాఖ్యానించారు. ఈ మేరకు వీడియోను 'ఎక్స్'లో పెట్టారు.

మండిపడ్డ రైతు సంఘాలు

కంగన వ్యాఖ్యలను అఖిలభారత కిసాన్ సభ(ఏఐకేఎస్) తీవ్రంగా తప్పుబట్టింది. ''సాగురంగాన్ని భ్రష్టు పట్టించాలని చూస్తున్న బడా విదేశీ, స్వదేశీ బాసుల మనసులోని మాటనే ఆమె బయటపెట్టారు. దీనిపై మోదీ క్షమాపణ చెప్పాలి'' అని డిమాండ్ చేసింది. కంగన మాటలు క్షమార్హం కాదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశ రైతులను కించపరిచే ఈ వ్యాఖ్యలు బీజేపీ రైతువ్యతిరేక ధోరణికి అద్దంపడుతున్నాయన్నారు. దాంతో కంగనవి వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తమకు సంబంధం లేదని బీజేపీ పేర్కొంది. సున్నితమైన అంశాలపై మాట్లాడకూడదని ఆమెను ఆదేశించినట్టు చెప్పింది.



ఏర్పాటు చేసిన 8 నెలలకే...

కుప్పకూలిన శివాజీ విగ్రహం

ఈదురుగాలుల వల్లే: సీఎం షిండే • నాణ్యతా లోపమన్న ప్రతిపక్షాలు

ముంబై: మహారాష్ట్రలో తీరప్రాంత జిల్లా సింధుదుర్గ్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం 8 నెలలకే కుప్పకూలింది. 35 అడుగుల ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబర్ 4న నేవీ డే సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాల్వాన్‌లోని రాజ్‌కోట్‌లో ఆవిష్కరించారు. అది సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. ప్రధాని అట్టహాసంగా ఆవిష్కరించిన విగ్రహం ఏడాదైనా కాకుండానే కుప్పకూలడానికి నాణ్యతా లోపమే కారణమని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. విగ్రహావిష్కరణకు మోదీని పిలవడంపై పెట్టిన శ్రద్ధను దాని తయారీలో రాష్ట్ర ప్రభుత్వం చూపలేదని ఎన్సీపీ (ఎస్పీ) రాష్ట్ర చీఫ్ జయంత్ పాటిల్ ఆరోపించారు. కమీషన్లు తీసుకుని కాంట్రాక్టులు అప్పగించడమే ప్రభుత్వానికి తెలుసని విమర్శించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మాత్రం భారీ ఈదురు గాలుల వల్లే విగ్రహం కూలిపోయిందని చెప్పడం విశేషం. అక్కడ గంటకు ఏకంగా 45 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నట్టు ఆయన చెప్పుకొచ్చారు. వెంటనే కొత్త విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది నేవీ కావడం విశేషం. అందులో వాడిన ఇనుము అప్పుడే తుప్పుపట్టి పోయిందని మంత్రి రవీంద్ర చవాన్ తెలిపారు. విగ్రహ నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్సీబీఏ పేరిట సిబల్ నకిలీ తీర్మానం

వెంటనే క్షమాపణలు చెప్పాలని అగర్వాల్ డిమాండ్

న్యూఢిల్లీ: కోల్‌కతా వైద్యురాలి హత్యాచారోదంతంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తీరును సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) మాజీ అధ్యక్షుడు ఆదిశ్ అగర్వాల్ సోమవారం తీవ్రంగా తప్పుబట్టారు. ''అంత పెద్ద దారుణాన్ని కేవలం వ్యవస్థాగతమైన లోపంగా పేర్కొంటూ ఎస్సీబీఏ పేరిట నకిలీ తీర్మానాన్ని సిబల్ ప్రచారంలో పెట్టారు. నిజానికి ఎస్సీబీఏ అలాంటి తీర్మానమేదీ చేయలేదు'' అన్నారు. ఘటన తాలూకు తీవ్రతను తక్కువ చేసి చూపించేందుకు, సుప్రీంకోర్టు విచారణను ప్రభావితం చేసేందుకే ఇలా చేశారని ఆరోపించారు. ''ఈ కేసులో సిబల్ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్నారు. కనుక ఇలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉండాల్సింది పోయి ఎస్సీబీఏ అధ్యక్ష హోదాను దుర్వినియోగం చేశారు. ఎస్సీబీఏ ప్రతిష్టకు భంగం కలిగించారు. నకిలీ తీర్మానాన్ని వెనక్కు తీసుకుని క్షమాపణలు చెప్పకుంటే సిబల్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి ఎస్సీబీఏ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తాం'' అని హెచ్చరించారు.



లిడ్‌క్యాప్ స్థలంలో...
రాయదుర్గం పరిధిలోని లిడ్‌క్యాప్ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. లిడ్‌క్యాప్ అధికారులు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. -8లో



వైమానిక యోగా..
ప్రస్తుతం యోగాలో కొత్త ట్రెండ్ నడుస్తోంది. అదే ఏరియల్ యోగా. దీన్నే రోప్ యోగా అని కూడా అంటారు. గాల్లో వేలాడుతూ యోగాసనాలు చేయడమే ఏరియల్ యోగా స్పెషాల్టీ. - సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం గాలులు వీచే అవకాశం ఉంది.

ఆస్పత్రికి బయలుదేరి అనంత లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో తండ్రి కళ్ల ముందే కూతురి దుర్మరణం


ప్రసన్న(ఫైల్)

పంజగుట్ట: తండ్రికి ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రిలో చూపించేందుకు తోడుగా వచ్చిన కూతురు..రోడ్డు ప్రమాదంలో తండ్రి కళ్ల ముందే దుర్మరణం పాలైన హృదయ విదారక సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చెంగిచెర్లకు చెందిన మేడా శంకర్‌రావు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో సోమవారం సోమాజిగూడలోని ఏషియన్ గ్యాస్ట్రో ఆసుపత్రిలో ఎండోస్కోపీ చేయించుకునేందుకు శంకర్‌రావు తన కూతురు ప్రసన్న(25)ను తీసుకుని బైక్‌పై బయలుదేరాడు. ఉదయం 7:45 ప్రాంతంలో గ్రీన్‌ల్యాండ్స్ కూడలి వద్దకు చేరుకోగా వీరి బైకును వెనకనుండి అతివేగంగా వచ్చిన టెంపో ఢీకొట్టింది. దీంతో శంకర్‌రావు, ప్రసన్న ఇద్దరూ కిందపడిపోయారు. శంకర్‌రావుకు హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయట పడగా..ప్రసన్న కిందపడగానే తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందింది. కళ్ల ముందే కూతురు మృతిచెందడంతో శంకర్‌రావు కన్నీరుమున్నీరుగా విలపించాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ప్రమాదానికి కారణమైన మహబూబ్‌నగర్ జిల్లా, కొల్లాపూర్‌కు చెందిన టెంపో డ్రైవర్ సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

'భవన్'ల విద్యుత్ బకాయిలు రూ.2.28 కోట్లు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లో ప్రభుత్వం అత్యంత అట్టహాసంగా అన్ని హంగులతో ఆదివాసీ, గిరిజన, దళిత ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మించిన మూడు భవన్‌ల కరెంటు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 2021 నుంచి కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో సదరు 'భవన్'లు భారీగా విద్యుత్ బిల్లులు బకాయి పడ్డాయి. సేవాలాల్ బంజారా భవన్ కరెంటు బకాయిలు రూ.76,51,978 కాగా, కొమరం భీం ఆదివాసీ భవన్ బకాయిలు కూడా రూ.75 లక్షలకు చేరుకుంది. ఇక బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ కరెంటు బిల్లులు 2022 అక్టోబర్ నుంచి చెల్లించడం లేదు. దీంతో ఈ బిల్డింగ్‌కు సంబంధించిన కరెంటు బకాయిలు రూ.64,63,039 పేరుకుపోయాయి. బిల్లులు చెల్లించాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధికారులు పలుమార్లు సంబంధిత అధికారులకు గుర్తు చేశారు. అయినా సరే రెండేళ్లుగా బిల్లుల చెల్లింపునకు సంబంధిత డిపార్ట్‌మెంట్లు ముందుకురావడం లేదు. ఫలితంగా ప్రతినెలా బకాయిలు చాంతాడంతా పెరుగుతూ సదరు విద్యుత్‌శాఖకు 'భవన్'లు గుదిబండగా మారాయి.

సెల్‌ఫోన్ చార్జర్ కోసం.. మహిళ దారుణ హత్య


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి విచక్షణ కోల్పోయాడు. రూ.200 విలువ చేసే సెల్‌ఫోన్ చార్జర్ కోసం మహిళతో గొడవపడి ఆమెను దారుణంగా హత్య చేశాడు. 48 గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి సోమవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. గాగిల్లాపూర్ తాండాకు చెందిన జరుపుల శాంతి (45) భర్త చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. వరంగల్ జిల్లాకు చెందిన రావుల కమల్‌కుమార్..శాంతి ఇంటి పక్కనే ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతను స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 21న కమల్‌కుమార్ తన గదిలో సెల్‌ఫోన్ చార్జర్ కనిపించకపోవడంతో శాంతి తీసుకుందని అనుమానించి ఆమెతో గొడవ పడ్డాడు. తిరిగి 23న రాత్రి మద్యం సేవించి వచ్చిన కమల్‌కుమార్ చార్జర్ విషయంపై మరోసారి గొడవకు దిగాడు. మాటా మాటా పెరిగి ఆమెను తోసేశాడు. బండలపై పడిపోయిన ఆమె తలకు గాయం కావడంతో పెద్దగా కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వస్తారేమోనని భయపడి..శాంతి ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం నేరుగా అక్కడి నుంచి తన సొంత గ్రామానికి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో కమల్‌కుమార్ హత్య చేశాడని నిర్ధారించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా..నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ సిఐ సతీష్, డి.ఐ ఎస్.సతీష్, ఎస్సైలు శంకర్, రంజిత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


దన్విక


అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్ వద్ద..


నిహిర




రవీంద్రభారతిలో ..

గోవిందుడు అందరి వాడేలే..

చిన్న కృష్ణుల అల్లరి..గోపికమ్మల సందడి మధ్య సోమవారం నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్ని వైభవంగా జరుపుకొన్నారు. విద్యాసంస్థల్లో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు, గేటెడ్ కమ్యూనిటీలు, కృష్ణ మందిరాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు అలరించాయి. ఇక అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్, బంజారాహిల్స్‌లోని జగన్నాథ మందిరంలో భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు. – సాక్షి, సిటీబ్యూరో

రోడ్లు చెరువులేల?

నిర్మాణ లోపాలు.. నిర్వహణ లేమి


- నగరంలో వానొస్తే ప్రజలకు తప్పని తిప్పలు

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మూడు సెంటీ మీటర్ల వాన కురిసినా రోడ్లు మునుగుతున్నాయి. చెరువులు వెలుస్తున్నాయి. కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరుతోంది. బస్తీలు మునుగుతున్నాయి. ప్రధాన రహదారులు సైతం సరస్సులుగా కనిపిస్తున్నాయి. అందుకు కారణం ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలే తప్ప శాశ్వత పరిష్కార పనులు పూర్తికాకపోవడం. రోడ్ల నిర్మాణాల్లోనూ ఇంజినీరింగ్ నిబంధనలు పాటించకపోవడం, నిర్వహణ లేమి ముంపు సమస్యలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. రెండు పుష్కరాల క్రితం 2000 సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు నగరం మునిగిన నేపథ్యంలో వర్ష సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన కిర్లోస్కర్ కమిటీ, ఓయెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ వంటి సంస్థల నివేదికల్ని యంత్రాంగం అమలు చేయలేదు. ఫలితంగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.
– సాక్షి, సిటీబ్యూరో

లేన్ల వారీగా..

సింగిల్ లేన్	6655 కి.మీ.
డబుల్ లేన్	1709 కి.మీ.
త్రీలేన్	123 కి.మీ.
ఫోర్ లేన్	526 కి.మీ


అమీర్‌పేటలో వర్షం వస్తే ఇంతే..(ఫైల్)



గ్రేటర్ పరిధిలో రోడ్ల నిర్మాణాల్లో డిజైనింగ్ లోపాలు, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) నిబంధనలు పాటించకపోవడమే. రీకార్పెటింగ్ పేరిట పొరలు పొరలుగా బీటీని పరుస్తూ పోవడం, కేంబర్ (మధ్యభాగం నుంచి రోడ్డు పక్కలకు వాలుగా ఉండటం) గురించి పట్టించుకోక పోవడం, వివిధ విభాగాలు ఇష్టానుసారంగా తవ్వడం కూడా రోడ్లు చెరువులుగా మారడానికి కారణమని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు..బహుళ అంతస్తుల భవనాల నుంచి వెలువడే వ్యర్థ జలాలు పోయే మార్గం లేక రోడ్లపైనే ప్రవహించడం కూడా కారణమే. కొత్త భవనాలకు అనుమతులిచ్చే ముందే వాటర్‌బోర్డు, టౌన్‌ప్లానింగ్ విభాగాల సమన్వయంతో జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా వ్యర్థజలాల తరలింపు పరిష్కారాలకూ వీలవుతుందంటున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 9 వేల కిలోమీటర్లకు పైగా రోడ్లున్నప్పటికీ, డిజైన్లు, నిర్మాణాల్లో లోపాలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారుల కంటే కాలనీల అంతర్గత రోడ్ల ఎత్తు పెరిగిపోవడంతో కాలనీల నుంచి వచ్చే వాన నీటితో ప్రధాన మార్గాలు జలాశయాలను తలపిస్తున్నాయి.

నిర్వహణ లేమి..

నిర్వహణ లేమి కూడా రోడ్లు చెరువులవుతుండటానికి మరో కారణం. పంజగుట్ట మోడల్‌హౌస్ వద్ద ముంపు సమస్య పరిష్కారానికి దాదాపు ఐదేళ్ల క్రితం వరదనీరు వెళ్లేలా పెద్ద చాంబర్లతో బాక్స్‌డ్రెయిన్ పనులు చేశారు. కొంతకాలం వరకు సమస్య తగ్గింది. నిర్వహణ లేమితో ఇసుకతో సహ పలువ్యర్థాలు పేరుకుపోయి అవి పనిచేయకుండా పోయాయి. పరిస్థితి షరామామూలుగా మారింది. మిగతా ప్రాంతాల్లోనూ దాదాపుగా ఇవే పరిస్థితులు. కల్వర్టులు, నాలాల్లోనూ ఇదే పరిస్థితి. పాడైన పరుపులతో సహ సమస్త వ్యర్థాలూ నాలాల్లోనే వేస్తుండటంతో వాన నీరు పోయే దారి లేక రోడ్లపై చేరుతోంది. ఇక కల్వర్టులు దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ మూసుకుపోయాయి.

నివేదికలు బుట్టదాఖలు

కిర్లోస్కర్, ఓయెంట్స్ అనంతరం జేఎన్‌టీయూ నిపుణులతోనూ నివేదికలు తయారు చేయించారు. రోడ్ల డివైడర్ల కింద వరద కాలువలు నిర్మించాలని జేఎన్‌టీయూ నిపుణులు సూచించారు. కానీ నిధులు లేక పనులు చేయలేదు. తర్వాత జేఎన్‌టీయూ నిపుణులతోనే అత్యవసరంగా కొన్ని ప్రాంతాలకు తాత్కాలిక నివేదికలు చేయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇంకుడుగుంతలు, ఇంజెక్షన్ బోర్లు వంటివి ఉండాలని వారు సిఫార్సు చేశారు. వాటినీ పూర్తిగా అమలు చేయలేదు. ఇంజెక్షన్ బోర్లు నిర్మించిన ప్రాంతాల్లోనూ నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. తాజాగా రోడ్ల కింద ట్యాంకుల నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు.వాటివల్ల ప్రయోజనముండదని నిపుణులు చెబుతున్నారు. వర్షం ఎప్పుడు ఎంత తీవ్రతతో వస్తుందో తెలియదు. రెండు నిమిషాల్లోనే ట్యాంకు నిండితే ఏం చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

ప్లానింగ్ అవసరం..



నగరంలో రోడ్లు ఐఆర్‌సీ ప్రమాణాల మేరకు లేవు. కష్టమైనా నిపుణుల కమిటీల మాస్టర్ ప్లాన్లకు అనుగుణంగా పనులు చేయాలి. తాజా పరిస్థితులకనుగుణంగా డీపీఆర్ రూపొందించాలి. ప్రతి రోడ్డుకూ యుటిలిటీ సర్వీసెస్‌కు తగినంత స్థలం ఉండాలి. కనీసం కొత్తగా విస్తరిస్తున్న కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గ్రీన్‌ఫీల్డ్ వంటి ప్రాంతాల్లోనైనా తగిన ప్లానింగ్‌తో పనులు చేస్తే భవిష్యత్‌లో సమస్యలుండవు. రోడ్ల నిర్మాణాల్లో కేంబర్ పట్టించుకోవడం లేదు. ఉదాహరణకు 60 అడుగుల రోడ్డులో అంచుల కంటే మధ్య భాగంలో రోడ్డు 18 సెంటీమీటర్ల ఎత్తులో ఉండాలి. కానీ నగరంలో అది లేదు.
– రుమాండ్ల శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (రిటైర్డు)

పనులకు పలు సవాళ్లు..



పనులు చేసేందుకు ఆస్తుల సేకరణ, ట్రాఫిక్ మళ్లింపుల వంటివి అధికారులకు సవాళ్లుగా మారాయి. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లేమి, ఇష్టానుసారం రోడ్ల తవ్వకాల వల్ల సమస్యలు పెరుగుతున్నాయి. లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద పరిస్థితి గతంలో ఇప్పటి మాదిరిగా తీవ్రంగా లేదు. అక్కడున్న డ్రెయిన్ ద్వారా వరద నీరు హుస్సేన్‌సాగర్‌లో కలిసేది. వాటర్, డ్రైనేజీ, టెలికాం, విద్యుత్ అవసరాల కోసం ఇష్టానుసారం తవ్వడంతో పాడైంది. అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, కేసీపీ జంక్షన్ తదితర ప్రాంతాల్లోనూ అదే దుస్థితి. ఉన్న కల్వర్టుల్ని మూశారు. రోడ్ల నిర్మాణానికి ముందే ప్రతిమార్గంలోనూ భవిష్యత్ వాహనరద్దీని అంచనా వేసి అందుకనుగుణంగా తగిన క్రస్ట్ (మందం)తో నిర్మించాలి. కానీ, నగరంలో అన్ని ప్రాంతాల్లో ఒకేవిధంగా నిర్మించారు. దాంతో త్వరగా దెబ్బతింటున్నాయి.
– రమావత్ ధన్‌సింగ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు



'మధురానగర్' ఎందుకలా?



- అనేక వివాదాలకు కేంద్ర బిందువైన ఠాణా
- ప్రక్షాళన చేయాలని సిటీ కొత్వాల్ నిర్ణయం
- బండ్లగూడ స్టేషన్ సిబ్బందిపై వేటు

సాక్షి, సిటీబ్యూరో: 'మధురానగర్, బోరబండ పోలీసుస్టేషన్ల సిబ్బంది, అధికారులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై విచారణ చేస్తున్నాం. మధురానగర్ పోలీస్ స్టేషన్ ఎందుకు అలా అవుతోంది? వరుసగా వివాదాల్లోకి ఎందుకు వస్తోంది? ఈ విషయం ఆలోచించాల్సిన అవసరం ఉంది' అని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం టీజీ సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'స్పా సెంటర్ నుంచి డబ్బు వసూలు చేసిన మధురానగర్ పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?' అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ పై విధంగా స్పందించారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నామన్న కొత్వాల్ గతంలో పంజగుట్ట ఠాణాలో పని చేస్తున్నవారిని మూకుమ్మడిగా ఒకేసారి బదిలీ చేసినట్లుగానే ఇప్పుడు మధురానగర్ ఠాణాలోని వారినీ చేస్తామని, అందుకు కసరత్తు జరుగుతోందన్నారు. మరోపక్క ఓ పాన్ డబ్బా నుంచి మామూళ్లు వసూలు చేసిన ఆరోపణలు రావడంతో బండ్లగూడ సిబ్బందిపై విచారణ చేపట్టామని, నిరూపణ కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా కొందరిలో మార్పు రావట్లేదని ఈ నేపథ్యంలోనే మెమోలు, సస్పెన్షన్లు కాకుండా పూర్తిగా ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలిస్తున్నామని కొత్వాల్ వివరించారు. నగరంలోని మసాజ్ సెంటర్లలో అశ్లీలానికి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు ఉండకూడదన్నారు. వీటిని పరిశీలించడానికి వరుస తనిఖీలు చేస్తున్నామని, కొన్నింటిపై చర్యలు తీసుకున్నామన్నారు.

గంజాయి కూడా వ్యసనమే..

నగరంలో డ్రగ్స్ వినియోగం అంత ప్రమాదకరంగా లేదన్న కొత్వాల్... గంజాయి మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తరించినట్లు సమాచారం ఉందన్నారు. అక్కడ కాలేజీల్లో యువతీ యువకులు దీనిని వినియోగిస్తున్నట్లు తెలిసిందన్నారు. చాలా మంది యువత గంజాయి అనేక సహజ సిద్ధమైన ఉత్పత్తి కావడంతో దీన్ని వినియోగిస్తే ప్రమాదం లేదని భావిస్తున్నారన్న ఆయన ఇది కూడా వ్యవసనమేనని, ఇతర సింథటిక్ డ్రగ్స్‌కు బానిస కావడానికి గంజాయి వినియోగం తొలి మెట్టుని చెప్పారు. మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 87126 61601 నెంబర్‌లో తెలపాలని సీపీ చెప్పారు.

కొలతలు తారుమారు!

- మరోసారి సర్వే నిర్వహించేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు
- కొంతమంది బిడ్డర్లకు ఎక్కువ భూమి దక్కిందని అంచనా
- రీ సర్వే పూర్తయ్యే వరకు రిజిస్ట్రేషన్ల నిలిపివేత

కోకాపేట్, బుద్వేల్‌లో వేలం వేసిన భూముల కొలతల్లో తేడాలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ భూముల లెక్కలు తారుమారయ్యాయి. కోకాపేట్‌లోని నియోపోలిస్, బుద్వేల్‌లలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించిన వందల ఎకరాల భూముల కొలతల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తేడాల వల్ల కొందరు బిడ్డర్లు కొనుగోలు చేసిన స్థలాలు, ప్లాట్‌ల కంటే ఎక్కువ విస్తీర్ణంలోనే భూమి దక్కి ఉండొచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు మరోసారి కోకాపేట్, బుద్వేల్‌లో హెచ్‌ఎండీఏ విక్రయించిన భూములను రీ సర్వే చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు ఎల్రక్టానిక్ టోటల్ సిస్టమ్ (ఈటీఎస్) ద్వారా సర్వే చేసేందుకు చర్యలు చేపట్టారు.కోకాపేట్‌లో రెండు దశలుగా హెచ్‌ఎండీఏ లే అవుట్‌లను వేసి ఈ–బిడ్డింగ్ నిర్వహించింది. అలాగే బుద్వేల్‌లో హెచ్‌ఎండీఏకు ఉన్న సుమారు 100 ఎకరాల భూములను కూడా ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించారు. దీంతో ప్రభుత్వానికి అప్పట్లో రూ.వేల కోట్ల ఆదాయం లభించింది. ఒకరిద్దరు బిడ్డర్లు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం వల్ల ఆ ప్లాట్‌ల బిడ్డింగ్‌ను రద్దు చేశారు. కానీ మొత్తంగా కొనుగోలు చేసిన రియల్టర్లు, బిల్డర్లు చాలావరకు సకాలంలోనే చెల్లించారు. ఈ రెండు ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ విక్రయించిన భూముల కొలతల్లో తేడాలు ఉన్నట్లు ఇటీవల స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గుర్తించింది. ఈ మేరకు హెచ్‌ఎండీఏకు సమాచారం అందజేసింది. దీంతో అప్రమత్తమైన అధికారులు రిజిస్ట్రేషన్‌లను నిలిపివేసి బిడ్డింగ్‌లో విక్రయించిన భూములను మరోసారి సర్వే చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

కోకాపేట్ హాట్ కేక్...

హైదరాబాద్ మహానగరానికి పడమటి వైపున ఆకాశహర్మ్యాలతో అలరారే కోకాపేట్‌లో భూమి హాట్‌కేక్‌గా మారింది. ఇక్కడ నియోపోలిస్‌లో పేరుతో హెచ్ఎండీఏ లే అవుట్‌లను అభివృద్ధి చేసింది. 2021లో మొదట 64 ఎకరాలను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించారు. రెండో దశలో గతేడాది మొత్తం 14 ప్లాట్‌ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 45.33 ఎకరాల భూమిని విక్రయించారు. హైరైజ్ భవనాలను నిర్మించేందుకు అనుమతులివ్వడంతో వ్యాపారసంస్థలు పోటీపడి కొనుగోలు చేశాయి. ఎకరం కనీసం ధర రూ.35 కోట్లుగా నిర్ణయించగా అత్యధికంగా రూ.100.75 కోట్ల వరకు అమ్ముడైంది. బుద్వేల్‌లో 100.01 ఎకరాల భూమిని ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా గత సంవత్సరం ఆగస్టు నెలలో విక్రయించారు. ఎకరం గరిష్టంగా రూ.41.25 కోట్ల చొప్పున అమ్ముడైంది. బుద్వేల్‌లో సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించారు. ఈ రెండు ప్రాంతాల్లో అప్పట్లో భూములను విక్రయించిన సమయంలో ప్లాట్‌లకు కచ్చితమైన కొలతలను నిర్ధారించకపోవడం వల్ల కొందరు బిడ్డర్లు తాము బిడ్డింగ్ చేసిన భూమి కంటే ఎక్కువే దక్కించుకున్నట్లు గుర్తించారు.

సరిహద్దుల గుర్తింపులో లోపం...

ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి శంషాబాద్‌కు వెళ్లే మార్గంలో ఉన్న బుద్వేల్ భూములు కొండలు, గుట్టలను ఆనుకొని ఉన్నాయి. దీంతో అప్పట్లో సరిహద్దులను కూడా కచ్చితంగా గుర్తించలేకపోయినట్లు అంచనా. ప్రస్తుతం ఎల్రక్టానిక్ టోటల్ సిస్టమ్‌తో సర్వే చేయడంతో పాటు క్షేత్రస్థాయిలోనూ సమగ్రమైన సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు.

డిస్కంలో ప్రక్షాళన షురూ!

- ఇప్పటికే ఎస్‌ఈలకు స్థాన చలనం..
- ఒకటి రెండు రోజుల్లో డీఈలు, ఏడీఈలు, ఏఈలు సైతం..

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంతర్గత ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎస్ఈలకు స్థాన చలనం కల్పించిన డిస్కం..రెండు మూడు రోజుల్లో ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్న డీఈ, ఏడీఈ, ఏఈలను కూ డా బదిలీ చేయాలని నిర్ణయించింది. రెండున్నరేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిని మరో చోటికి బదిలీ చేయాలని భావిస్తుంది. అక్రమాలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఈ బదిలీల ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించింది.

ఒత్తిళ్లకు తలొగ్గకుండా....

ప్రభుత్వంలో ఎక్కడా లేని విధంగా డిస్కంలో ఫోకల్, నాన్ ఫోకల్ అంటూ ప్రత్యేక పోస్టులను సృష్టించారు. హైదరాబాద్ సౌత్, సెంట్రల్, హబ్సిగూడ సర్కిళ్లను నాన్‌ఫోకల్ ప్రాంతాలుగా, గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఎక్కు వగా ఉండే సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, మేడ్చల్, సరూర్‌నగర్, సంగారెడ్డి సర్కిళ్లను ఫోకల్ ప్రాంతాలుగా విభజించారు. ఈ ఫోకల్ పోస్టుల్లో పోస్టింగ్ కోసం పోటీపడుతుంటారు. రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలతో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి, కీలక పోస్టులను చేజిక్కించుకునేవారు. ప్రస్తుత యాజమాన్యం ఈ విధానానికి చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇప్పటి వరకు ఆపరేషన్స్ ఫోకల్ పోస్టుల్లో పని చేసిన వారిని ఇకపై నాన్ ఫోకల్ పోస్టుల కు మార్చి బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు కూడా చెక్ పెట్టే యోచనలో కూడా ఉన్నట్లు తెలిసింది.

- మూడు రోజుల క్రితం గ్రేటర్ పరిధిలోని పది సర్కిళ్ల ఎస్ఈలకు స్థాన చలనం కల్పించింది. పనితీరు ఆధారంగా పోస్టులను కట్టబెట్టింది. రెండు మూడు రోజుల్లో డీఈలు, ఏడీఈలు, ఏఈల బదిలీల ఉత్తర్వులు కూడా వెలువడే అవకాశం లేకపోలేదు. ఆపరేషన్స్ విభాగంలో 50 శాతం మందికి, ఓఅండ్ఎం విభాగంలో 30 శాతం మందికి స్థాన చలనం తప్పదని తెలుస్తోంది.

ఘనంగా విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం





మూసాపేట : భజరంగ్ దళ్ ప్రాంత సహా సంయోజిక్ జీవన్ ఆధ్వర్యంలో సోమవారం మూసాపేటలో శ్రీ కృష్ణ జన్మాష్టమి, విశ్వ హిందూ పరిషత్ 60వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉట్టి కొట్టారు. హిందూమతం మానవుడి జీవన శైలి అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడుకోవాలని, పరులకు సేవ చేయాలని సూచించారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ లో జరుగుతున్న దాడులు మన దేశంలోనూ జరగవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు. యువత చైతన్యం కావాలని, మనమంతా ఒక్కటిగా ఉంటే ఎప్పుడు ఎలాంటి సంఘటనలు జరిగినా ఎదుర్కోవచ్చునన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకుడు శశిధర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

నలుగురిపై వీధికుక్క దాడి







మల్లాపూర్: ఇంటి ముందు నిలుచున్న నలుగురిపై వీధి కుక్క దాడి చేసిన సంఘటన మల్లాపూర్ గ్రీన్‌హీల్స్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... మల్లాపూర్ గ్రీన్‌హీల్స్ కాలనీ చెందిన ఎండీ అక్బర్ (46), ఆయేషా బేగం (07), పహాత్ (04) తైమూర్ (02) సోమవారం ఉదయం తమ ఇంటి గేటు ముందు నిలబడి ఉన్నారు. ఒక్కసారిగా వీధికుక్క దూసుకొచ్చి వారిపైకి ఎగబడి కరిచింది. దీంతో వారు వెంటనే మల్లాపూర్ సూర్యనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి టీకా వేయించుకున్నారు. గ్రీన్ హీల్స్ కాలనీలో కుక్కలబెడద ఉందని ఇదివరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని ఎండీ అక్బర్ ఆవేదన వ్యక్తం చేశారు.

లిడ్‌క్యాప్ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- అడ్డుకున్న నిర్మాణదారులు
- అధికారులతో వాగ్వాదం



లిడ్‌క్యాప్ స్థలంలో నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

రాయదుర్గం: రాయదుర్గం పరిధిలోని లిడ్‌క్యాప్ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు అక్రమమని పేర్కొంటూ లిడ్‌క్యాప్ అధికారులు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య వాటిని కూల్చివేశారు. నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్న తరుణంలో ఈ కూల్చివేతలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా అధికారులకు నిర్మాణదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నిర్మాణదారులు కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. లిడ్‌క్యాప్ స్థలంలో నిర్మాణాలు చేశారని అధికారులు స్పష్టం చేస్తుండగా నిర్మాణదారులు మాత్రం తాము కొనుగోలు చేసిన స్థలంలోనే నిర్మాణాలు చేపట్టామని పేర్కొంటున్నారు. సర్వేనెంబర్ 1 నుంచి 39 వరకు ఉన్న స్థలాన్ని ప్రభుత్వం లిడ్‌క్యాప్‌కు కేటాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం 1973లో ఇండియన్ కంపెనీస్ యాక్ట్ 1956 ప్రకారం లిడ్‌క్యాప్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు చేపడితే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేశారు: బఖ్రత్‌అలీఖాన్



లిడ్‌క్యాప్ అధికారులు, ప్రభుత్వం తమకు ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా తమ ఇంటిని కూల్చివేశారని నిర్మాణదారు బఖ్రత్ అలీఖాన్ ఆరోపించాడు. తాము హైదరాబాద్ ట్యానరీస్ సంస్థ నుంచి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టామని, సదరు ఇంటిపై పన్నులు కడుతున్నామని, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు కూడా ఉన్నట్లు తెలిపాడు. సమయం ఇవ్వకుండా అక్రమ నిర్మాణం పేరుతో కూల్చివేతలు చేపట్టడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యూనిటీ మాల్‌కు 5.16 ఎకరాల స్థలం అందజేత

కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు యూనిటీ మాల్ ఏర్పాటుకు రాయదుర్గంలోని టీజీటీపీసీ స్థలాన్ని అధికారులు సోమవారం సదరు సంస్థకు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక్కో రాష్ట్రానికి ఒక యూనిటీ మాల్‌ను కేటాయించింది. ఈ మాల్‌లో రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన ఉత్పత్తులను ఒకే చోట సాధారణ ప్రజలకు అందించేందుకు ఈ మాల్‌లను ఏర్పాటు చేయనున్నారు. మాల్ ఏర్పాటుతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుండడంతో సదరు స్థలాన్ని కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే లిడ్‌క్యాప్‌కు చెందిన 5 ఎకరాల 16 గుంటల స్థలాన్ని యూనిటీమాల్‌కు అందజేశారు. టీజీఎల్‌ఐపీసీఎల్‌కు చెందిన స్టాఫ్ క్వార్టర్స్‌ను కూల్చివేసి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని యూనిట్‌మాల్ నిర్మాణదారులకు అప్పగించినట్లు లిడ్‌క్యాప్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పేరిట సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతతో యూనిటీమాల్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

బలవన్మరణాలు

క్షణికావేశంలో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో ఒకే రోజు నలుగురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పుల బాధ తాళలేక మీర్‌పేట్‌లో ఒకరు, నాగోల్ పరిధిలో మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడి మృతిని జీర్ణించుకోలేక ఓ యువకుడు, వ్యక్తిగత కారణాలతో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు..వివరాల్లోకి వెళితే...

వ్యక్తిగత కారణాలతో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్..



పవన్‌కుమార్ (ఫైల్)

మల్కాజిగిరి: వ్యక్తిగత కారణాలతో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్(34) మౌలాలిలోని 7 ఆర్పీఎఫ్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 23 నుంచి అతను కనిపించకపోవడంతో తోటి సిబ్బంది గాలింపు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం అడ్మిని స్ట్రేషన్ బిల్డింగ్ వద్ద అతడి మృతదేహాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు అతను గొంతుకు వైర్‌తో బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సిద్దర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో అసిస్టెంట్ ప్రొఫెసర్..

నాగోలు: ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ, రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న రాయపూడి శివప్రసాద్(35) నార్లపల్లిలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. గత కొన్నాళ్లుగా అతను మద్యానికి బానిసయ్యాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శివప్రసాద్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.దీనిని గుర్తించిన అతడి భార్య అతడిని కిందకు దించి 108కు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కుమారుడు పుట్టి చనిపోయాడని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: కొడుకు పుట్టి చనిపోవడంతో మనస్తాపానికి లోనైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడి నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన ఆంజనేయులు (26) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి దేవరకొండకు ప్రాంతానికి చెందిన సరితతో వివాహం జరిగింది. వారం రోజుల క్రితం వారికి కుమారుడు పుట్టి చనిపోయాడు. అప్పటినుంచి ఆంజనేయులు బాధపడుతూనే ఉన్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు అతడికి చనిపోయిన కొడుకు తిరిగి రాడని నచ్చజెప్పడంతో బెడ్ రూమ్‌లోకి వెళ్లిన అతను ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిప్పంటించుకుని తపాలా శాఖ ఉద్యోగి..



సురేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని తపాలా శాఖ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ లింగగిరికి చెందిన శీలం కాంతయ్య కుమారుడు శీలం సురేశ్(37) అబిడ్స్‌లోని తపాలా శాఖలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య స్వరూప, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాపిల్లలతో కలిసి మీర్‌పేట జిల్లెలగూడలోని లలితానగర్‌లో నివాసముంటున్నాడు. కొంత కాలంగా చేసిన అప్పులు తీర్చలేక సురేశ్ ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం భార్య, పిల్లలు ఇంట్లో ఉండగానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకుని, ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు రావడాన్ని గమనించిన భార్య స్వరూప వెంటనే సమీప బంధువు ప్రసాదరావుకు ఫోన్ చేయగా, అతను వచ్చేసరికి పెద్దఎత్తున మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో 100కు డయల్ చేశారు. సమాచారం అందుకున్న మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఫైర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయగా, అప్పటికే సురేశ్ పూర్తిగా కాలిపోయి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హైడ్రా సర్వరోగ నివారిణి కాదు

- కూల్చివేతల్లో చిత్తశుద్ధిని చాటుకోవాలి
- వ్యక్తిగత కక్షతో కూల్చివేతలు సరికాదు
- చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లోఅనుమతులిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి
- కూల్చివేతల పేరుతో పేదల జోలికొస్తే..ఊరుకోబోం
- ప్రభుత్వానికి గ్రేటర్ జిల్లాల బీజేపీ అధ్యక్షుల హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: 'ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవి భూములు, అసైన్డ్, భూదాన్ భూములను పరిరక్షించాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి రాజీలేదు. ఉద్దేశపూర్వకంగా కూల్చివేతలను సహించబోం. ఒక చోట కూల్చివేతలు చేపట్టి..మరో చోట వదిలేయడం సరికాదు. వరుస పెట్టి అన్నీ ఆక్రమణలు తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపు విషయంలో హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఆక్రమణ తొలగింపు పేరుతో ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకుని నిర్మించుకున్న పేదల ఇళ్ల జోలికొస్తే మాత్రం ఊరుకోబోం. కూల్చివేతకు ముందు వాటికి అనుమతులు ఇచ్చిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి. అ తర్వాతే ఆయా భవనాల జోలికి రావాలి' అని బీజేపీ గ్రేటర్ జిల్లాల అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి (మేడ్చల్ అర్బన్), బి.నర్సింహారెడ్డి(రంగారెడ్డి రూరల్), విక్రంరెడ్డి(మేడ్చల్ రూరల్) అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని బీజేపీ కేంద్రకార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైడ్రా సర్వరోగ నివారిణి కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆక్రమణల తొలగింపు విషయంలో హడావుడి చేసింది. ఎన్‌కన్వెన్షన్, ఐయ్యప్ప సొసైటీని కూల్చింది. కూల్చివేతలు సెలక్ట్‌గా ఉండటం కరెక్ట్ కాదు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలి. అన్నింటినీ కూలిచ్చేయాల్సిందే. దానికి అందరి మద్దతు ఉంటుంది. ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే.. బీజేపీ చూస్తూ ఊరుకోదు.

చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటారా?

జిల్లాలో చాలా చెరువులు కనుమరుగయ్యాయి. మీర్‌పేట్, జిల్లెలగూడ, పహడిషరీఫ్, బార్కాస్, మీరాలం చెరువులు కబ్జాకు గురయ్యాయి. అన్ని చెరువుల సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేస్తాం. నిజాయితీగా వాటిని తొలగించాలి. ఏ కబ్జా వెనుక ఎవరు ఉన్నారు? 111 జీఓ పరిధిలోని ఏ ఫాంహౌస్ ఎవరిది? తదితర వివరాలు అందజేస్తాం. వాటిని కూడా కూల్చివేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలి. కేవలం పేదలను టార్గెట్ చేయొద్దు. అక్రమ నిర్మాణాలను కూల్చే ముందు చెరువుల్లో వాటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ఆయా అధికారులపై చర్యలు తీసుకోవాలి. పేదలు కట్టుకున్న ఇళ్ల జోలికి వెళ్లొద్దు. ఒక వేళ వెళితే..నష్టపోయిన వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో స్పష్టం చేయాలి. మూసీని పూర్తిగా కబ్జా చేశారు. నార్సింగి మూసీ పరివాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిర్మాణాలు వెలుస్తున్నా..అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫిరంగి నాలాకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమయ్యాయి. కాల్వపై ఉన్న కట్టడాలు కూల్చివేయాలి. ఆక్రమణ దారుల చేతుల్లో నుంచి ఆయా భూములను విడిపించాలి.

–బొక్క నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

మరొకరికి తీవ్రగాయాలు



రమ్య మృతదేహం, తీవ్రంగా గాయపడిన కౌశిక్

కీసర: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం ఉదయం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి ఆర్‌ఎల్‌నగర్ సమీపంలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగారంలో బైక్ మెకానిక్‌గా పని చేసే కౌశిక్(22) నేరేడ్‌మెట్ దినకరనగర్‌కు చెందిన రమ్య(20) స్నేహితులు. సోమవారం ఉదయం వారిరువురు నాగారం నుంచి బైక్‌పై రాంపల్లికి వెళుతుండగా ఆర్‌ఎల్‌నగర్ సమీపంలో వెనక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో బైక్ వెనక కూర్చున్న రమ్య కింద పడిపోగా అదే సమయంలో అటుగా వెళుతున్న బస్సు వెనక చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కౌశిక్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రమ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రెండు కుక్కలు సజీవదహనం

కాప్రా: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన ఏఎస్‌రావు నగర్ డివిజన్, జైజవాన్ కాలనీ దేవీనగర్‌లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు కుక్కలు సజీవ దహనమయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవీనగర్‌కు చెందిన మాధురి కుమారుడితో కలిసి తన ఇంట్లో మొదటి అంతస్తులో నివాసం ఉంటోంది. రైల్వే ఉద్యోగిగా పని చేస్తున్న ఆమె భర్త ఇటీవల మృతి చెందడంతో మాధురికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చింది. అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకున్న ఆమె ఇంటికి తాళం వేసి సోమవారం ఉదయం దైవదర్శనం నిమిత్తం గుడికి వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చేలోగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ మంటల్లో రెండు కుక్కలు కూడా సజీవ దహనమయ్యాయి. ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులు, ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ఘటనాస్థలిని సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ముకుందా..ముకుందా..కృష్ణా..!

అంబరాన్నంటిన కృష్ణాష్టమి వేడుకలు



ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బంజారాహిల్స్‌లో గోల్డెన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు

శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో అలరించారు. బంజారా హిల్స్ రోడ్ నెం. 12లోని హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ గోల్డెన్ టెంపుల్‌లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో భక్తులు బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలకు వారికి స్వామి వారికి ఝులాన్ సేవ, శ్రీ రాధా గోవిందులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అభిషేకాలు, అనంతరం 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం, హారతి, మహా మంగళహారతి కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చప్పన్ భోగ్‌లో భాగంగా 56 రకాల నైవేద్యాలను సమర్పించారు. బంజారాహిల్స్‌లోని జగన్నాథ టెంపుల్‌తో పాటు ఇస్కాన్ టెంపుల్‌కు పెద్దఎత్తున భక్తులు రావడంతో ఆలయానికి దారితీసే మార్గాలన్నీ ట్రాఫిక్ జామ్ అయ్యాయి. పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వాహనాలు ముందుకు కదిలేలా చర్యలు చేపట్టారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని మురళీకృష్ణ ఆలయంలో స్వామివారికి అభిషేకం, హారతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాటు చేశారు.

– జూబ్లీహిల్స్/బంజారాహిల్స్











బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో కిటకిటలాడిన భక్తులు























శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ చిన్నారులు



కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో చిన్నారులు.













ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: ప్రైవేటు రంగంలో వెనుకబడిన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. అన్నింటా వెనుకబడి దయనీయల జీవితాన్ని వెళ్లదీస్తున్న బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తూ చర్యలు చేపట్టాలని విన్నవించారు. సోమవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రైవేటు రంగంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.స్వయంగా ప్రధానమంత్రి బీసీ అయి ఉండి కూడా బీసీలకు ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ దశలవారీగా ప్రైవేటుపరం అవుతున్న తరుణంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీ మంత్రులు, రాజ్యసభ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు సాధిస్తేనే విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేసే విధంగా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని విన్నవించారు.

శ్రీవారికి మల్లెలతో సహస్రనామార్చన

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవ వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ నెల 23న ప్రారంభమైన శ్రీవారి పవిత్రోత్సవాలు 26వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముగింపు రోజు సోమవారం మల్లె పూలతో స్వామివారికి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ తదితర వేడుకలు జరిగాయి. మల్లెలతో సహస్రనామార్చన వేడుక తిలకించేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

పంజగుట్ట: అనుమానాస్పదస్థితిలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నాచారం, మల్లాపూర్‌కు చెందిన వెంకటేష్ ఆటోడ్రైవర్ సోమవారం తెల్లవారుజామున ఆటో కిరాయిల కోసం వేచిచూస్తూ నిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఆటోలోనే విశ్రాంతి తీసుకున్నాడు. కొద్దిసేపటికి ఆటో వెనక సీటు నుంచి కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న తోటి ఆటోడ్రైవర్లు స్థానిక పోలీసులు, 108కి ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు, 108 సిబ్బంది వెంకటేష్‌ను పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అతనికి గుండెపోటు వచ్చి మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిశువిహార్‌లో బాలిక మృతి

వెంగళరావునగర్: శిశువిహార్‌లో ఆశ్రయం పొందుతున్న బాలిక మృతి చెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... 2018లో జన్మించి ఒక పాపను ఆమె తల్లిదండ్రులు ఆలనాపాలనా చూసుకోలేక మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంగణంలోని శిశువిహార్‌కు అప్పగించారు. అప్పటికే ఆ పాపకు మానసిక, శారీరక పరిస్థితి సరిగ్గా లేనందున ప్రతిరోజు వైద్యం చేయిస్తూ మందులు వాడుతున్నారు. ఈనెల 24వ తేదీన ఆ పాప (దేవసేన) పూర్తిగా నీరసించి పోయింది. దీంతో శిశువిహార్ సీడీపీఓ సంతోషిబాయి హుటాహుటిన నీలోఫర్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అయితే ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ 25వ తేదీ రాత్రి మృతి చెందింది. శిశువిహార్ సీడీపీఓ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహమత్‌నగర్‌లో చోరీ

వెంగళరావునగర్: ఇంట్లో లాకర్‌లో ఉన్న బంగారం, నగదు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సరూర్‌నగర్‌లో నివాసం ఉండే దీపాదేవి ఈనెల 21న రహమత్‌నగర్‌లో జరిగిన ఆమె తండ్రి జ్ఞాపకార్థ కూటమి (డెత్ సెరిమనీ)కి వెళ్లి 23వ తేదీన ఇంటికి వచ్చింది. అయితే ఇంట్లో లాకర్‌లో ఉండాల్సిన రూ.45 నగదు, బంగారు, వెండి వస్తువులు కనిపించలేదు. దీపాదేవి ఇంట్లో ఆమె తల్లి ఉంటుండగా, ఆమెకు తెలియకుండా ప్లంబర్ పనులు చేయడానికి వచ్చిన ఆరీఫ్, సంతోష్‌లు దొంగిలించి ఉంటారని దీపాదేవి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి విద్యుదాఘాతం

పంజగుట్ట: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకోవడంతో గాయాలపాలైన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మతిస్థిమితం లేని సుమారు (30) సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీ పక్కనే ఉన్న ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై సుమారు 60 శాతం మేర కాలిపోయాడు. వెంటనే స్థానికులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వగా అతన్ని 108 సాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. షాక్ తగిలిన వ్యక్తి కనీసం తన పేరు కూడా చెప్పలేకపోతున్నాడని, మహారాష్ట్రకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రికి కాస్త రిలీఫ్..!



కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: ప్రతినిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీగా ఉండే రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కాసింత విరామం దొరకడంతో సోమవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా వాకింగ్‌కు వచ్చిన తోటి వాకర్లతో కలివిడిగా మాట్లాడుతూ అందరి యోగక్షేమాలు తెలుసుకుంటూ వాకింగ్ చేశారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

రహమత్‌నగర్ (బోరబండ): సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పిలుపునిచ్చారు. డివిజన్‌లోని భరత్‌నగర్ బస్తీ యువజన కమిటీ సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏమీలేదని, తాను యువకునిగా ఉన్నప్పుడే విద్యార్థి సంఘాల్లో కీలకంగా పాల్గొనడం జరిగిందన్నారు. యువకులు చెడు వ్యసనాల జోలికి పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

శాంతిభద్రతల మధ్య ఉత్సవాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

శ్రీనగర్‌కాలనీ: రానున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అలజడులు లేకుండా శాంతి భద్రతల మధ్య నిర్వహించుకోవాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. ఎర్రగడ్డ నూర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంటపాల నిర్వహణతో పాటుగా ఊరేగింపులకు కూడా తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. మంటపాల వద్ద రాత్రివేళల్లో తప్పనిసరిగా కాపలా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు పెట్టవద్దని, ఊరేగింపుల్లో డీజేలు ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. మంటపాల వద్ద ఫైర్ సేఫ్టీ, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పోలీసు అధికారులు కృష్ణ, మోహనుద్దీన్, సత్యనారాయణ, వివిధ పార్టీలు, గణేష్ మంటపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ వస్తున్న క్రమంలో.. రోడ్డుపైకి మయూరం..!



బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వస్తుందనగా ఓ నెమలి రోడ్డుపైకి వచ్చి పోలీసులను అయోమయానికి గురిచేసింది. సోమవారం సాయంత్రం 6.25 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2 కేబీఆర్ పార్కు మీదుగా తన కాన్వాయ్‌లో వెళ్తున్నారు. అదే సమయంలో నెమలి ఒక్కసారిగా ఫుట్‌పాత్‌పై నుంచి రోడ్డు మీదకు దూకింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నెమలిని ఓ పక్కన హడావుడి చేయకుండా జాగ్రత్తగా నిలిపివేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లిన తరువాత ఒక్కసారిగా నెమలి రోడ్డు నడిమధ్యలోకి రాగా పోలీసులు జాగ్రత్తగా దానిని పార్కులోకి పంపారు. మొత్తానికి ఐదు నిమిషాల పాటు సీఎం కాన్వాయ్ రూట్‌లో ఈ నెమలి హల్‌చల్ చేసి పోలీసులను కలవరానికి గురిచేసింది.

నిర్లక్ష్యానికి 'నిలువెత్తు' సాక్ష్యం



ఫిలించాంబర్ ఆవరణలో దర్శక, నిర్మాతల విగ్రహాలను చుట్టుముట్టిన మురుగు

అధికారుల నిర్లక్ష్యానికి 'నిలువెత్తు' సాక్ష్యంగా కనిపిస్తున్న ఈ దృశ్యం ఫిలించాంబర్ ఆవరణలోని దర్శక, నిర్మాతలు దాసరి నారాయణరావు, రామానాయుడు విగ్రహాల చుట్టూ కనిపించింది. మూడు రోజులుగా ఈ మురుగు చేరింది. విగ్రహాలే కదా నిగ్రహంగా ఉంటాయి ఎవరు ఫిర్యాదు చేస్తారులే అని అనుకున్నారో ఏమో సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం మానేశారు. అయితే ఈ మురుగుతో పరిసర ప్రాంతాలు ముక్కుపుటాలదిరే కంపుతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, బంజారాహిల్స్

గేమర్స్ గిల్డ్ గేమింగ్ కేఫ్ ప్రారంభం



గేమింగ్ కేఫ్‌ను ప్రారంభిస్తున్న బిలాల్ ఆజం తదితరులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో గేమర్స్ గిల్డ్ తన మూడో అతిపెద్ద గేమింగ్ కేఫ్ ప్రారంభించింది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లో ఏర్పాటైన ఈ గేమింగ్ కేఫ్‌ను వ్యవస్థాపకుడు బిలాల్ ఆజం, కేఫ్ భాగస్వాములు వినితా సురానా, రంగన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గేమింగ్ కేఫ్ వివరాలను వెల్లడించారు. బంజారాహిల్స్ నడిబొడ్డున ఉన్న ఈ ఫ్లాగ్‌షిప్ కేఫ్ అన్ని రకాల గేమర్లకు మంచి అనుభూతులను అందించేలా దీనిని రూపొందించినట్లు చెప్పారు. రేసింగ్ అభిమానుల కోసం అత్యాధునిక రేసింగ్ సిమ్యులేటర్‌లతో వీట్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే స్పోర్ట్స్, ఎఫ్1, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర గేమ్‌లను ఆస్వాదించడానికి కేరాఫ్‌గా ఈ కేఫ్ నిలవనున్నదన్నారు. గేమర్లకు ఉత్సాహభరిత వాతావరణంతో పాటు వారి రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

తొలి మేయర్ కృష్ణస్వామి ముదిరాజ్‌కు నివాళి



కృష్ణస్వామిముదిరాజ్‌కు నివాళులు అర్పిస్తున్న ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం నేతలు

బంజారాహిల్స్: హైదరాబాద్ నగర తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతి వేడుకలను సోమవారం ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం యువత అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రాకేష్ ముదిరాజ్, రాజశేఖర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లైబ్రరీ కూడలిలో పీజేఆర్ విగ్రహం వద్ద జరిగిన ఈ వేడుకల్లో కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నగర మేయర్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు సింగారి రాజకుమార్, తీడేటి నర్సింగరావు, బిక్షపతి ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

రమణీయం.. ఆలోకయే శ్రీబాలకృష్ణం



గన్‌ఫౌండ్రీ: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలోకయే శ్రీబాలకృష్ణం పేరిట నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నృత్య కిన్నెర 40వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత మద్దాలి ఉషాగాయత్రి నృత్య దర్శకత్వంలో ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీత కళలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పూర్వ సలహాదారుడు కేవీ.రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.



ఇక సర్కార్ స్థలాలకు రక్షణ!

ఆధునిక సాంకేతికతో ల్యాండ్ బ్యాంక్ యాప్ పునరుద్ధరణ

- పార్శిల్ వారిగా భూముల వివరాలు
- ఆక్రమణకు గురికాకుండా కంచె, బోర్డులు
- ఆన్‌లైన్ ద్వారా ఫొటో మానిటరింగ్
- హైదరాబాద్ జిల్లాలో పకడ్బందీగా చర్యలు



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గజం స్థలం తులం బంగారం కంటే రెండింతలు అధికమే.. ఇక్కడ సర్కారు స్థలాలు సైతం ఎక్కువే.. ఖాళీగా కనిపిస్తే కబ్జాలకు గురికావడం సర్వసాధారణమైంది. రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వం స్థలాలను గుర్తించి ల్యాండ్ బ్యాంక్‌లో చేర్చి రక్షణ చర్యలు చేపట్టినా.. ఫలితం లేకుండా పోతోంది. దీంతో పూర్తిస్థాయి పర్యవేక్షణ కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సర్కారు స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మహానగరంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అప్పటి ప్రభుత్వానికి సవాల్‌గా మారడంతో ఆధునిక సాంకేతికతో కూడిన ప్రత్యేక ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ రూపొందించి ప్రక్రియను సులభతరం చేసి శెభాష్ అనిపించుకుంటున్న రాజస్థాన్ బిట్స్ పిలానీ ఐఐటీ, సివిల్స్ టాపర్ అయిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తాజాగా సర్కారు స్థలాలపై పూర్తి రక్షణ కోసం చర్యలు చేపట్టారు. పాత ల్యాండ్ బ్యాంక్ యాప్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సహకారంతో సరికొత్త ఆధునిక సాంకేతికతో పునరుద్ధరించారు.

సరిగ్గా ఆరేళ్ల క్రితం..

వాస్తవంగా సరిగ్గా ఆరేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రభుత్వ స్థలాల కోసం ప్రత్యేకంగా ల్యాండ్ బ్యాంక్ యాప్ రూపకల్పన చేసి స్థలాలకు కంచె, బోర్డుల ఏర్పాటు, ఆన్‌లైన్ మానిటరింగ్, ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో భద్రపర్చడం వంటి చర్యలు చేపట్టారు. వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించి ప్రతిరోజు భూములపై పర్యవేక్షణతో పాటు పక్షం రోజులకు ఒకసారి తనిఖీ చేసి తగిన సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్, భూ పరిరక్షణ అధికారులకు అందించే విధంగా కసరత్తు చేశారు. యోగితా రాణా బదిలీ తర్వాత క్షేత్రస్థాయిలో అమలు మున్నాళ్ల ముచ్చటగానే తయారైంది. ఆ తర్వాత ల్యాండ్ బ్యాంక్ యాప్ అమలు మూలనపడింది. తాజాగా ల్యాండ్ బ్యాంక్ యాప్‌ను పునరుద్ధరించి భూముల వివరాల అప్‌డెట్ ప్రక్రియతో పాటు రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఇదీ పరిస్థితి..

- హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో సుమారు 16 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 1075 ల్యాండ్ పార్శిల్స్ ఉన్నట్లు రెవెన్యూ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- అందులో 890 ల్యాండ్ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉంది.
- మిగతా పార్శిల్స్‌లో సుమారు 11,45,334.95 చదరుపు గజాల విసీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది.
- సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 11,93,595.12 చదరపు గజాల విస్తీర్ణ గల ఖాళీ స్థలంతోపాటు 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.



బ్రోస్, అపోలో మెడ్ స్కిల్స్ మధ్య ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ కన్సల్టెంట్(బ్రోస్), అపోలో మెడ్‌స్కిల్స్ చేతులు కలిపాయి. ఈ మేరకు రెండు సంస్థల ప్రతినిధులు ఎంఓయూలను మార్చుకున్నారు. హెల్త్‌కేర్ నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ ఒప్పందం ఉపయోగకరంగా ఉంటుందని ఆయా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. జాయింట్ అకడమిక్ రీసెర్చ్, వర్క్‌షాప్‌లు, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణులు లాభపడతారని అభిప్రాయపడ్డారు. ఆరోగ్య సంరక్షణ నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో మెడ్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ముఖ్యమైన విద్యా భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుందని ఆ సంస్థ సీఈఓ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 17 ఏళ్ల అనుభవం కలిగిన బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ కన్సల్టెంట్ విద్య, శిక్షణ, ప్లేస్‌మెంట్స్ రంగాల్లో సమర్థవంతంగా 34 శాఖలను భారత్‌లో, 11 శాఖలను విదేశాల్లో నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

నగరంలో నేడు..

- బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో బెంగాళ్ హ్యాండ్లూమ్ ఆర్ట్ సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో జరుగుతుంది. ఈ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్‌కు లక్డీకాపూల్‌లోని రవీంద్రభారతిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.
- లేట్ నైట్ స్టాండప్ కామెడీ షో రాత్రి 11 గంటల నుంచి గచ్చిబౌలి వినాయక్ నగర్‌లోని ది కామెడీ థియేటర్ హైదరాబాద్‌లో జరుగుతుంది.
- గణేష్ ఉత్సవాలు ఏర్పాట్లపై ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పనివేళలు శాస్త్రీయంగా ఉండాలి



- టీఎస్ యూటీఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయం
- గురుకుల పాఠశాలల టైమ్‌టేబుల్‌పై ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలని, ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా పనిచేసేలా నిర్ణయించాలని ఇండియన్ సైకియాట్రిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల డిమాండ్ చేశారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి, పౌష్టికాహార లోపం, శారీరక వ్యాయామ లోపం, మానసిక రుగ్మతలకు దారితీసి ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గురుకులాల పని వేళలు–విద్యార్థులపై ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు కె.జంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మానసిక నిపుణులు, బాలల హక్కుల కార్యకర్తలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయిస్తూ జీవో విడుదల చేసిందని, ఇది శాస్త్రీయంగా లేదని, విద్యార్థులపై ఒత్తిడి పెంచేలా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుగుణంగా పనివేళలను సవరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, డీటీఎఫ్ అధ్యక్షుడు సోమయ్య, గురుకుల ఉపాధ్యాయ సంఘం నాయకులు మామిడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో జులూస్ అర్బయిన్ ర్యాలీ



డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా సోమవారం జులూస్ అర్బయిన్ ర్యాలీ నిర్వహించారు. దారుషిఫా నుంచి ప్రారంభమైన ఈ జులూస్ అర్బయిన్ ర్యాలీ డబీర్‌పురా బీబీకా అలావా వరకు కొనసాగింది. ఈ అర్బయిన్ ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాతం నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలతో పాటు మౌలానా సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫరీ ఖిబ్లా అక్బారీ, మీర్ హైదర్ అలీ జాఫరీ, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, అడిషనల్ డీసీపీ మహ్మద్ జహంగీర్, మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీంతో పాటు జీహెచ్ఎంసీ, జలమండలి తదితర అధికారులు పాల్గొన్నారు.

హైడ్రా పనితీరు భేష్

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్: చెరువుల పరిరక్షణ కోసం దూకుడుగా హైడ్రా చేపడుతున్న పనితీరు బాగుందని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కితాబునిచ్చారు. హైడ్రా పనితీరులో ఉన్న కొన్ని లోపాలను సవరించుకుంటే ఇంకా బాగుంటుందన్నారు. హైడ్రాకు మద్దతుగా నిలుస్తామన్నారు. పట్టణంలోని తొండుపల్లిలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులను ఆయన స్థానిక నేతలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా హైడ్రా కూల్చివేతలను కొనసాగిస్తోందన్నారు. జన్వాడలో మాజీ మంత్రి కేటీఆర్ బినామీకి చెందిన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో లేదన్నది వాస్తమే అయినా అది గండిపేటకు ప్రవహించే పాయపై ఉందన్నారు. అంతేగాకుండా జీవో 111 నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణం జరిగిందన్నారు. నీటి ప్రవాహం వచ్చే దారిలో కట్టిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం తప్పేమీకాదన్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఫ్లైఓవర్ గురించి వివరిస్తున్న స్థానికులు

చెరువులు, కుంటల పరిరక్షణతో పాటు హైడ్రాను దేవాలయ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా వినియోగిస్తే బాగుంటుందన్నారు. హైడ్రాలో బాధితులు, నిందితులను సరిగా గుర్తించి సరైన దిశగా న్యాయం చేయాలన్నారు. తొండుపల్లి ఫ్లైఓవర్ నత్తనడకన సాగుతున్న తీరుపై స్థానిక కౌన్సిలర్లు పారెపల్లి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, కొండ ప్రవీణ్‌గౌడ్ ఈ సందర్భంగా వివరించి పనులు త్వరగా పూర్తి చేయించాలని వినతి పత్రం అందజేశారు.

ఘనంగా కృష్ణస్వామి జయంతి వేడుకలు



కొర్వి కృష్ణ స్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: పార్టీలు, ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండా ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొర్వి కృష్ణస్వామి జయంతిని పురస్కరించుకుని కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జూబ్లీ బస్‌స్టేషన్ సమీపంలోని కొర్వి కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాసనమండలి ఉప సభాపతి, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ నారాయణన్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షుడు పిట్ల నాగేశ్ తదితరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కొర్వి కృష్ణస్వామి సేవా కార్యక్రమాలు స్ఫూర్తిగా జాతి అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో చొప్పరి వంకర్ ముదిరాజ్, భూపతి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సామల హేమ, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, మద్దెల యాదగిరి, నీరుడు అశోక్, గడీల యాదగిరి, సత్యం, భాస్కర్, సొక్కం శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ యాదవ్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్

బాస్కెట్‌బాల్ చాంపియన్లుగా హైదరాబాద్, మేడ్చల్

- రన్నరప్‌గా వికారాబాద్
- ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అండర్–16 (యూత్) బాస్కెట్‌బాల్ టోర్నీలో బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు, బాలికల విభాగంలో మేడ్చల్ మల్కాజిగిరి జట్లు చాంపియన్లుగా నిలిచాయి. బాల, బాలికల విభాగాల్లో వికారాబాద్ జట్లు రన్నరప్ స్థానాలను దక్కించుకోగా, మూడోస్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బాలుర విభాగం, బాలికల్లో రంగారెడ్డి జట్లు నిలిచాయి.

హోరాహోరీగా ఫైనల్స్

బాలుర, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఉత్కంఠ భరితంగా సాగిన బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57–53 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై విజయం సాధించింది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జట్టు 58–56 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మూడోస్థానం మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 50–40 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, బాలికల మూడోస్థానం మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 35–7 పాయింట్ల తేడాతో హైదరాబాద్ జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

ట్రోఫీలు అందజేసిన మున్సిపల్ చైర్మన్, డీఎస్పీ

టోర్నీలో విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సీఐ అప్పయ్య, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్మన్ ఐజాక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మ కుర్నుద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, కౌన్సిలర్లు రామ్, సాదతుల్లా హుస్సేనితో పాటు మీర్ అర్షద్‌అలీ, ఇలియాజ్, ఖాలెద్‌అలీ, ఖలీల్, సుబాన్‌జీ, ముకర్రం పాల్గొన్నారు.

నగరంలో తొలిసారి దక్షిణ భారత అజాన్ పోటీలు



- బాలానగర్ మజీదులో సెప్టెంబర్ 13న నిర్వహణ
- మౌజన్ల ప్రాధాన్యం, పవిత్ర స్థానాన్ని తెలియజేయడమే పోటీల ముఖ్యఉద్దేశం
- ఎం.ఎస్.రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ డైరెక్టర్ జహీరుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో: ఎం.ఎస్.రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో తొలిసారి సౌత్ ఇండియా అజాన్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎం.ఎస్.రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ డైరెక్టర్ జహీరుద్దీన్, ఆఫాఖ్ ఫారూఖీ వెల్లడించారు. మీడియా ప్లస్ ఆడిటోరియంలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అజాన్ పోటీల వివరాలను వారు సోమవారం తెలియజేశారు. మహ్మద్ నజీరుద్దీన్ అజాన్ పోటీలు సెప్టెంబర్ 13న ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు బాలానగర్‌లోని బెంగళూరు హైవే పక్కన ఉన్న మస్జిదె హసన్‌లో జరుగుతాయన్నారు. పోటీల్లో తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి మౌజన్లు పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు తమ అజాన్ వీడియోను ఫోన్: 6302845202 వాట్సాప్ నంబరుకు ఆగస్టు 6వ తేదీలోగా పంపాలని కోరారు. పూర్తి అజాన్ వీడియోను పంపాల్సి ఉంటుందన్నారు. వీడియోతో పాటు పేరు, ఊరు, ఫోన్ నంబర్ వివరాలు, ఆధార్ కార్డు పంపాల్సి ఉంటుంది. ఈ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. జూనియర్ గ్రూపులో 5 నుంచి 15ఏళ్లలోపువారు, సీనియర్ గ్రూపులో 16ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపువారు అర్హులు. రెండు గ్రూపుల్లోనూ విజేతలుగా నిలిచిన వారికి రూ.50 వేల పారితోషికం ఉంటుందని నజీరుద్దీన్ తెలిపారు. దీంతో పాటు బంగారు పతకం అందిస్తామని చెప్పారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేల చొప్పున, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు సిల్వర్, కాంస్యం పతకాలను అందిస్తారు. జూనియర్, సీనియర్ల విభాగాల నుంచి 25–25 మంది మౌజన్లను ఎంపిక చేస్తామని చెప్పారు. సెమీ ఫైనల్లో ద్వారా 13మంది పోటీదారులను ఎంపిక చేసి ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

నిమ్స్‌లో భద్రత మరింత పటిష్టం

- ఆస్పత్రి పరిసరాలను తనిఖీ చేసిన పంజగుట్ట పోలీసులు
- మరో 490 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో రోగులు, వైద్య సిబ్బందికి మరింత భద్రత కల్పించే దిశగా యాజమాన్యం అడుగులు వేస్తోంది. నగర పోలీసుల సహకారంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే పనిలో పడింది. ఇప్పటికే నిమ్స్ సెక్యూరిటీ గార్డులకు పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే.. సెక్యూరిటీ వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేసే క్రమంలోనే గార్డులకు అధికారాలు కల్పించింది. ఈ క్రమంలోనే ఆస్పత్రి ప్రాంగణంలో భద్రత పెంచేందుకు దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగానే పంజగుట్ట పోలీసులు సోమవారం ఆస్పత్రి ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు కనిపించకుండా పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నెల 23న మధ్యాహ్నం నుంచి రోగి లింగమ్మ అటెండర్ అదృశ్యమైన సంగతి తెలిసిందే.. నాలుగు రోజుల తర్వాత ఆ వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. అదేవిధంగా ఆస్పత్రిలో పలువురు రోగుల వద్ద చోరీలు జరిగిన సందర్భాలు లేకపోలేదు. వైద్యుల వాహనాలు సైతం మాయమైన ఉదంతాలు ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో నిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ హేమంత్ సహకారంతో పోలీసులు నిమ్స్ సెక్యూరిటీ విభాగం పనితీరుతో పాటు వివిధ శాఖల వ్యవహార సరళిపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, స్పెషాలిటీ బ్లాక్‌లతో పాటు పేషెంట్ అటెండర్ షెల్టర్లను అవుట్ పేషెంట్ భవనంతో పాటు మిలీనియం బ్లాక్‌లను పరిశీలించి ఆయా ప్రాంతాల్లోని భద్రత వ్యవస్థపై అధ్యాయనం చేశారు. పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టే క్రమంలో ఆస్పత్రి లోపల, బయట కలిపి మరో 490 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయానికి పోలీసులు వచ్చారు. వాస్తవానికి ఆస్పత్రిలో ఇప్పటికే 1,143 సీసీ కెమెరాలను అమర్చారు. అందులో భాగంగా ఆస్పత్రి ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో 48 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ అందులో కేవలం 20 సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు డైరెక్టర్ బీరప్పకు పోలీసులు నివేదికను సమర్పించారు. ఈ తనిఖీల్లో పంజగుట్ట ఎస్ఐ శోభన్, నిమ్స్ పోలీసు పికెట్ పోలీసు సిబ్బంది దామోదర్, ఫణీంద్ర తదితరులు ఉన్నారు.



నిమ్స్ స్పెషాలిటీ బ్లాక్ పరిసరాలను తనిఖీ చేస్తున్న పంజగుట్ట పోలీసులు

క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఎల్బీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యం దక్కినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు 33 జిల్లా కేంద్రాల్లో క్రీడాదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం క్రీడా దినోత్సవ వాల్‌పోస్టర్, టీ షర్టులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, స్పోర్ట్స్ ఎండీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్ వైబ్స్

వైమానిక యోగా!

వేలాడుతూ ఆసనాలు

నగరంలో ఏరియల్ యోగాకు క్రేజ్

తక్కువ కాలంలో ఎక్కువ ప్రయోజనాలు

శారీరక, మానసిక సమస్యలకు చక్కని పరిష్కారం

ఒత్తిడి, డిప్రెషన్ దూరం చేసే ఆయుధం..

బరువు తగ్గడం, జీర్ణక్రియ మెరుగుపరచడంలో ముఖ్యభూమిక

బిజీ లైఫ్ స్టైల్లో తీవ్ర ఒత్తిడి, కోపం, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలతో భాగ్యనగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యోగా, ధ్యానం వల్ల మనసుకు ఎంతో ప్రశాంతత చేకూరుతుంది. ఇవన్నీ పూర్వకాలం నుంచి తరతరాలుగా ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు నగరంలో వయసుతో సంబంధం లేకుండా యోగా చేస్తున్నారు. అయితే ప్రస్తుతం యోగాలో కూడా కొత్త ట్రెండ్ నడుస్తోంది. అదే ఏరియల్ యోగా.. దీన్నే రోప్ యోగా అని కూడా అంటారు. సాధారణంగా కింద కూర్చుని యోగాసనాలు వేయడం కామన్.. కానీ గాల్లో వేలాడుతూ వివిధ యోగాసనాలు చేయడమే ఏరియల్ యోగా స్పెషల్ అన్నమాట. గాల్లో యోగాసనాలు ఎలా వేస్తారనే కదా మీ అనుమానం. దీని గురించిన మరిన్ని విశేషాలు తెలుసుకుందాం..

- సాక్షి, సిటీబ్యూరో

ఒత్తిడిని తగ్గించే ఆయుధం..

ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలతో బాధపడుతుంటే.. ఏరియల్ యోగా చాలా ఉత్తమమైన వ్యాయామం అని చెప్పొచ్చు. మానసిక స్థితిని మెరుగుపరచడంతో పాటు ప్రవర్తనలో కూడా మంచి మార్పులు తీసుకొస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. గాల్లో తల్లకిందులుగా వేలాడుతూ.. ధ్యానం చేస్తుంటే మంచి ఆలోచనలపై దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఏరియల్ యోగాతో మెదడులో రక్త ప్రసరణ పెరిగి మానసిక ఆరోగ్యం మన సొంతమయ్యేలా చేస్తుంది.

వెన్నునొప్పి హుష్‌కాకి..

వెన్నెముకపై ఎలాంటి ఒత్తిడీ పడకుండా వెన్నెముక, దాని సంబంధిత సమస్యలను నయం చేయడంలో ఏరియల్ యోగా ఎంతో ప్రభావం చూపుతుంది. వస్త్రంలో పడుకుని వెనక్కి అలా వంగి కాసేపు ఆసనం వేస్తే వెన్నెముక సమస్యలు ఇట్టే తొలగిపోతాయి. ఏరియల్ యోగాతో శరీర తీరుతో పాటు వెన్నెముకను సరిచేసుకోవచ్చు. నడుము నొప్పి కూడా తగ్గుతుంది.

బరువు తగ్గిపోతుంది..

ఏరియల్ యోగా బరువు తగ్గించడంలో కూడా ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. 50 నిమిషాల పాటు ఏరియల్ యోగా చేస్తే దాదాపు 320 కేలరీలు బర్న్ చేయగలదు. శరీర కొవ్వును బర్న్ చేసేటప్పుడు ఇది టోన్డ్, లీన్ కండరాలను పొందడానికి సహాయం చేస్తుంది. సమర్థవంతమైన ఫలితాల కోసం వారానికి ఒకసారి దీన్ని ప్రాక్టీస్ చేయవచ్చు.



నిపుణుల పర్యవేక్షణలో ..

యోగా చేసేటప్పుడు నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే చేయాలి. సొంతంగా చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముందు ఎవరైనా గురువు దగ్గర నేర్చుకుని ఆ తర్వాతే అభ్యాసం చేయాలి. కొన్ని యోగాసనాలు చేస్తే పర్వాలేదు. అన్ని ఆసనాలు అందరూ చేయకూడదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవాలి. క్రమం తప్పకుండా క్రమపద్ధతిలో చేయాలి.

– శ్రీకాంత్ నీరటి, యోగా ట్రైనర్

యోగాతో ఎన్నో ప్రయోజనాలు



యోగా చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అయితే పతంజలి సూచించిన అష్టాంగ మార్గాల్లోని యమ, నియమను పాటిస్తూ యోగాసనాలు వేయాలి. అప్పుడే మానసిక, శారీరక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరతాయి. స్థితప్రజ్ఞత సాధించేందుకు యోగా అత్యున్నత మార్గం.

– నెరికార్ లివాంకర్, యోగా ట్రైనర్, రామకృష్ణ మఠం

కాన్ఫిడెన్స్ పెరుగుతుంది..



ఏరియల్ యోగా లేదా యాంటీ గ్రావిటీ యోగా ద్వారా శరీరం చాలా బలంగా తయారవుతుంది. అలాగే మనపై మనకు కాన్ఫిడెన్స్‌తోపాటు జ్ఞాపక శక్తి, రక్త ప్రసరణ పెరుగుతుంది. మైండ్ రిలాక్సేషన్ అవుతుంది. కాకపోతే సాధారణ యోగాలో కొంతకాలం అనుభవం ఉన్న వారు మాత్రమే దీనిని చేయాలి. ముఖ్యంగా గురువుల సమక్షంలో చేస్తే మంచిది. – కొండకళ్ల దత్తాత్రేయ రావు, అద్వైత యోగా సెంటర్



ఏరియల్ యోగాలో చీర పరిమాణంలో ఉన్న ఒక వస్త్రాన్ని పైనుంచి ఊయల మాదిరిగా వేలాడదీస్తారు. ఆ వస్త్రాన్ని శరీరం చుట్టూ చుట్టుకోవాలి. ఇక, వస్త్రాన్ని శరీరానికి చుట్టుకున్న తర్వాత వివిధ యోగాసనాలు వేస్తుంటారు. దీని వల్ల శరీరంలో రక్త ప్రసరణ పెరగడంతో పాటు శరీరానికి ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. అనేక ఆరోగ్య సమస్యలకూ పరిష్కారంగా నిలుస్తోంది.

జీర్ణక్రియకు తోడ్పాటు..

ఏరియల్ యోగాతో జీర్ణక్రియ ఎంతో మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మలబద్ధకం, ఉబ్బరం, కడుపు నొప్పి, అజీర్తి వంటి జీర్ణ సమస్యలను నివారించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. శరీరాన్ని సాగతీయడంతో పొత్తికడుపు ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది. పేగు సంబంధ సమస్యలు దరి చేరకుండా చూస్తుంది. కడుపు నొప్పి లేదా గ్యాస్ ఉంటే ఏరియల్ యోగాతో తగ్గించుకోవచ్చు.



ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది..

ఏరియల్ యోగా శరీర కండరాలు సాగేలా చేస్తుంది. గాల్లో ఉంటారు కాబట్టి.. శరీరాన్ని మరింత స్ట్రెచ్ చేసేందుకు వీలు కలుగుతుంది. కొద్ది రోజులకు శరీరం మరింత ఫ్లెక్సిబుల్‌గా మారుతుంది. ఇలా చేయడం వల్ల కండరాలు కూడా బలంగా తయారవుతాయి. వెన్నెముక, భుజం శక్తివంతంగా తయారయ్యేందుకు దోహదపడుతుంది.



కాస్ట్‌లీ.. మదుర్ కతీ..

బెంగాల్ హస్త కళాకారుల నైపుణ్యం

రూ.20 వేలు పలుకుతున్న చాప

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా మన ఇళ్లల్లో వాడే మ్యాట్ (చాప).. ఖరీదు ఎంత ఉంటుంది..? మహా అయితే రెండొందలు.. మరీ క్వాలిటీ ఉన్నదైతే నాలుగొందలు ఉంటుంది. కానీ ఈ చాపను చూశారా..? దీని ధర తెలిస్తే షాక్ అయ్యి నోరెళ్లబెడతారు.. ఎందుకుంటే.. దీని ధర ఏకంగా రూ.20 వేలు. అంత ఖరీదు పెట్టి కొనేంత అందులో ఏముంది? అంతగా ప్రత్యేకత ఏంటి అనుకుంటున్నారా? ఇది అట్లాంటి ఇట్లాంటి చాప కాదండోయ్.. బెంగాల్‌లో ప్రత్యేకంగా తయారయ్యే మదుర్‌కతీ అనే చాప. అక్కడి మిడ్నాపూర్ జిల్లాలో మాత్రమే తయారవుతుంది. అది కూడా ఎంతో నైపుణ్యం ఉన్న కొందరు హస్త కళాకారులు మాత్రమే రూపొందిస్తారు. అక్కడ తయారైతే మరి మాకెందుకు చెబుతున్నారనే కదా మీ డౌటనుమానం. ఇప్పుడు ఈ చాపలను మన హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చారు. నారాయణగూడలోని వైఎంసీఏలో 'స్వయం బర్ నారీ' పేరుతో హస్త కళల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇవాళ్టితో ఈ ఎగ్జిబిషన్ ముగియనుంది. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన అనేక మంది కళాకారులు ఇక్కడికి చేరుకున్నారు. అందమైన చేనేత, కాటన్ చీరలు, పెయింటింగ్స్, హ్యాండ్‌బ్యాగ్స్, అందమైన గొడుగులు ఇక్కడ అందుబాటులో ఉంచారు.

మార్కెట్లోకి క్యూనెడ్ ఏఐ టీవీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ గృహోపకరాణల ఉత్పత్తి బ్రాండ్. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ సరికొత్త 65 అంగుళాల క్యూనెడ్ ఏఐ టీవీని నగర మార్కెట్‌లోకి విడుదల చేసింది. కూకట్‌పల్లిలోని లులు కనెక్ట్ మాల్‌లో దీని విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఇది పూర్తిగా అత్యాధునిక ఫీచర్లను కలిగి ఉందని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)సామర్థ్యంతో అసాధారణ వీక్షణానుభవాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా ఎల్‌జీ ప్రతినిధులు తెలిపారు.





ఆల్బమ్స్, ట్రాక్స్ లాంచ్‌కు ముందు పార్టీల హోరు

దేశ, విదేశీ బ్యాండ్స్, సింగర్స్ ఈవెంట్స్ జోరు

విజయానికి ముందు.. వీనుల విందు అనే ఆలోచన నేపథ్యంలో రూపుదిద్దుకున్న లిజనింగ్ పార్టీస్ నగరంలో సందడి చేస్తున్నాయి. సంగీతాభిమానుల కోసం సంగీత సృష్టికర్తలు నిర్వహిస్తున్న ఈ ఈవెంట్స్.. సరికొత్త ట్రెండ్‌గా భాగ్యనగరంలో స్థిరపడుతుండడం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై మరింత సమాచారం..

-సాక్షి, సిటీబ్యూరో

లిజన్.. ది ట్యూన్..

సిటీలో సౌండ్ పెంచుకున్న లిజనింగ్ పార్టీస్



ఈనెల 30న ఇండియన్ ర్యాపర్ కింగ్ లిజనింగ్ ఈవెంట్

అభిమాన గాయకుడు/రాక్ బ్యాండ్స్ రూపొందించే ట్రాక్స్, సింగిల్స్, ఆల్బమ్స్ గురించి మ్యూజిక్ లవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. గతంలో ముందుగా ఒక తేదీని ప్రకటించి తమ కొత్త ట్యూన్స్‌ని విడుదల చేసేవారు సంగీతజ్ఞులు. అయితే సినిమాల విడుదలకు ముందు ఎలా అయితే టీజర్లు, ఆడియో లాంచ్‌లు చేస్తారో.. ప్రస్తుతం కొత్తగా.. అదే తరహాలో ఆడియో రిలీజ్‌కు ముందు ఈ లిజనింగ్ పార్టీస్‌ని నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ ట్రెండ్..

ఈ లిజనింగ్ పార్టీస్ అంతర్జాతీయంగా ఇప్పటికే ఒక సంప్రదాయంగా స్థిరపడ్డాయి. అయితే నగరానికి మాత్రం ఇంకా కొత్తే. సినిమా ఆడియో లాంచ్ గురించి, తమ కొత్త బుక్ గురించి పుస్తక రచయితలు నిర్వహించే బుక్ రీడింగ్ సెషన్స్ సుపరిచితమే.. అలాంటి సిటీకి ఇప్పుడు ఈ లిజనింగ్ పార్టీలు వీనుల విందు చేస్తున్నాయి. గత కొంత కాలంగా దేశ విదేశీ డీజేలు, గాయకులు, బ్యాండ్స్ నగరానికి వచ్చి పార్టీలను నిర్వహిస్తున్నాయి. వీటికి మ్యూజిక్ లవర్స్ నుంచి ఆదరణ బాగుండడంతో ఈ ట్రెండ్ మరింత ఊపందుకోనుంది.

ఫ్యాన్స్‌కి కిక్.. విజయానికి ట్రిక్..

కొత్త పాట లేదా ఆల్బమ్ విడుదల ప్రచార ప్రణాళికలో ఆల్బమ్ లిజనింగ్ పార్టీ కూడా ఒక భాగంగా మారింది. వ్యక్తిగతంగా లేదా వర్చువల్‌గా కూడా ఈ వినే పార్టీల్ని ప్లాన్ చేస్తున్నారు. అభిమానులు తమతో, తమ సంగీతంతో కనెక్ట్ అవ్వడం వీటి ముఖ్యోద్దేశం. ఆల్బమ్ విడుదల తేదీని సెట్ చేసిన తర్వాత, ఈ తరహా ప్రీ లాంచ్ పార్టీని ప్లాన్ చేస్తున్నారు. తద్వారా సంగీతాన్ని అధికారికంగా విడుదల చేయడానికి ముందే అభిమానులకు వినడానికి అవకాశం కల్పిస్తున్నారు. తమ సంగీతాన్ని ప్రదర్శించడానికి రానున్న ఆల్బమ్‌కి హైప్‌ని పెంచడానికి ఒక అద్భుతమైన వేదికగా మారింది. కొత్త పాట లేదా ఆల్బమ్ కోసం లాంచ్ పార్టీ ఈవెంట్ చేయడం వల్ల కొంత పెట్టుబడి ఖర్చులను లాంచ్‌కు ముందే తిరిగి పొందడానికీ వీలవుతోంది.

కింగ్.. లిజనింగ్..

భారతీయ ర్యాపర్‌గా సంగీతాభిమానులకు కింగ్‌గా/కింగ్ రోకోగా.. చిరపరిచితుడైన ఢిల్లీ వాసి అర్పన్ కుమార్ చండేల్ నగరంలో ఈ నెల 30న లిజనింగ్ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇండియన్ ర్యాప్ మ్యూజిక్‌ని శాసిస్తున్న కింగ్‌కి నగర యువతలోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. త్వరలో రానున్న మోనోపాలి మూవ్స్ అనే ఆల్బమ్ కోసం దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో లిజనింగ్ పార్టీ టూర్‌ని కింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని గచ్చిబౌలిలోని ఎయిర్ లైవ్ పబ్‌లో పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ నగరంలో పలు లిజనింగ్ పార్టీస్ జరిగినప్పటికీ.. అగ్రగామి మ్యూజిక్ సెలబ్రిటీ నిర్వహిస్తున్న తొలి పార్టీ కావడంతో మ్యూజిక్ సర్కిల్‌లో ఆసక్తి నెలకొంది.





'మేడ్ ఇన్ హైదరాబాద్' రూపకర్తకు..

డాక్టర్ ఆఫ్ లిటరేచర్

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక వ్యాపారవేత్తలకు స్ఫూర్తిని అందించే మేడ్ ఇన్ హైదరాబాద్, త్వరలో రానున్న 30 పవర్ ఉమెన్ ఆఫ్ హైదరాబాద్ పుస్తకాల రూపకర్త, జాగిల్ ప్రీ పెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాజ్ పి నారాయణమ్‌కు పంజాబ్‌కు చెందిన చిత్కారా యూనివర్సిటీ నుంచి లిటరేచర్‌లో గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, విప్లవాత్మక ఫిన్‌టెక్ విధానాలకు సంబంధించి అందించిన సేవలను దృష్టిలో పెట్టుకుని ఆయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవం అందించారని, ఈ ఏడాది సంస్థ అనితర సాధ్య విజయాలను సొంతం చేసుకోవడంలో ఆయన కీలకపాత్ర పోషించారని వివరించారు.

లామకాన్‌లో బ్యాటిల్ విత్ ఇన్..

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు షార్ట్ ఫిలిమ్ బ్యాటిల్ విత్ ఇన్ చిత్రాన్ని మంగళవారం ప్రదర్శిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని లామకాన్ కల్చరల్ సెంటర్‌లో రాత్రి 7.30కి ఈ చిత్ర ప్రదర్శన ప్రారంభమవుతుంది. సత్యయుగం నుంచి కలియుగం దాకా మంచి చెడులు, కాలానుగుణంగా మార్పు చెందిన వైనం, ప్రస్తుత కలియుగంలో ఒకే వ్యక్తిలో మానవత్వం, దానవత్వం రెండూ కొలువుదీరుతున్న పరిస్థితి, సత్వ, రజో, తమో గుణాల మధ్య అంతరంగంలో జరుగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాల ఆధారంగా ఈ ఫిల్మ్ రూపొందిందని రూపకర్తలు అంటున్నారు.



మహిళలే యజమానులు

రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న మహిళా డెయిరీ

వాటాదారులుగా 61 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు

2013లో ఇందిరా డెయిరీకి శంకుస్థాపన చేసిన మల్లు భట్టివిక్రమార్క

ఇప్పుడు డిప్యూటీ సీఎం కావడంతో మళ్లీ దృష్టి.. పనులు వేగవంతం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మహిళలే యజమానులుగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఇందిరా డెయిరీ ఏర్పాటు కాబోతుంది. ఈ డెయిరీ నిర్వహణకు ప్రభుత్వం రూ.80 కోట్లు వెచ్చించనుంది. 61వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ డెయిరీలో వాటాదారులుగా ఉన్నారు. డెయిరీకి సంబంధించి ప్రక్రియ చకచకా సాగుతుండగా.. త్వరలోనే నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. పదకొండేళ్ల క్రితమే ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు నాటి మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క శ్రీకారం చుట్టారు. 2013లో 9.24 ఎకరాల స్థలంలో శంకుస్థాపన చేయగా..ఆ తర్వాత బీఆర్ఎస్ హయాంలో పనులు ముందుకు సాగలేదు. అప్పుడే ఈ డెయిరీకి రూ.80 కోట్లు నిధులు అవసరం ఉంటుందని అంచనా వేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 4,133 మంది మహిళల నుంచి రూ.36 లక్షల వాటాధనం సేకరించి డిపాజిట్ చేశారు. అదే ఏడాది అక్టోబర్ 20 నుంచి 24 వరకు స్వయం సహాయక సంఘాల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క గుజరాత్‌లోని అమూల్, ఆనంద్ డెయిరీలను సందర్శించారు. ఆ తర్వాత మధిరలో ఇందిరా పాడి పరిశ్రమల సహకార సంఘం లిమిటెడ్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు.

మళ్లీ దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం

ఇటీవల బోనకల్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు పౌరసన్మానం ఏర్పాటు చేయగా, ఆయన ఇందిరా డెయిరీ విషయం ప్రస్తావించారు. దీంతో మధిర నియోజకవర్గంలో 61 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఉండగా, వీరందరినీ వాటాదారులుగా చేర్చి పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంతోపాటు లాభాలు వారికే పంచేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహిళల నుంచి వాటాధనం

2013 ఏడాదిలో 4,133 మంది నుంచి రూ.36 లక్షలు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ప్రస్తుతం మొత్తం 61వేల మందిని వాటాదారులుగా చేర్చుకొని రూ.2,100 చొప్పున వసూలు చేశారు. ఒక్కో మహిళకు 70 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలు విలువైన గేదెలు అందిస్తారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు పాడి గేదెలు అందించి, పాలను ఇందిరా డెయిరీ సేకరిస్తుంది.



బోనకల్‌లో ఇందిరా డెయిరీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఐదు మండలాల్లో పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతోంది. ఇప్పటికే బోనకల్ మండలం రావినూతలలో 30 గుంటల భూమి పరిశీలించారు. అక్కడ బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఇందిరా డెయిరీ ఏర్పాటుతో మహిళలకు స్వయం ఉపాధి, ఆదాయం లభించనుండగా.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, ఆపై అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.

ఐదు పాల శీతలీకరణ కేంద్రాలు

స్వయం ఉపాధికి దోహదం



మా సమాఖ్యలోని సభ్యులంతా ఇందిరా డెయిరీలో వాటాదారులుగా చేరాం. డెయిరీ ఏర్పాటు కాగానే గేదెలు కొనుగోలు చేసి పాలు సరఫరా చేస్తాం. ప్రభుత్వం 70శాతం సబ్సిడీపై రూ.2 లక్షల రుణం ఇస్తామని చెప్పింది. తద్వారా స్వయం ఉపాధికి మార్గం ఏర్పడుతుంది.

- మందా రేఖ, స్నేహాంజలి మండల సమాఖ్య అధ్యక్షురాలు, బోనకల్

ఆర్థికాభివృద్ధి సులువు



ఇందిరా డెయిరీ ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి సులువవుతుంది. మా వద్దే డెయిరీ ఏర్పాటుతో ఉపయోగంగా ఉంటుంది. రావినూతలలో పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల చాలామందికి ఉపాధి లభిస్తుంది.

- తెల్లాకుల రజని, ఇందిరా డెయిరీ సభ్యురాలు

ఈవీఎంలు ఇక్కడ.. తాళాలు ఎక్కడ?

నెల్లిమర్ల గోదాం వద్ద తనిఖీల్లో హైడ్రామా.. ఈవీఎంల ట్రంక్‌బాక్స్ తాళం కోసం గంటల తరబడి నిరీక్షణ

- బృందంతో కలసి గోదాం వద్ద కలెక్టర్ పడిగాపులు
- ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంటకు మాక్ పోలింగ్.. అర్ధరాత్రి దాకా కొనసాగిన ప్రక్రియ
- బ్యాటరీ చార్జింగ్ స్టేటస్‌పై అనుమానాలను నివృత్తి చేయకుండా కొత్త బ్యాటరీ వినియోగం
- పార్టీల గుర్తులు కాకుండా ఇష్టానుసారంగా గుర్తుల లోడింగ్
- నేడు కూడా కొనసాగనున్న ప్రక్రియ



నెల్లిమర్లలోని ఈవీఎం గోదాం బయట తాళం కోసం వేచిచూస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా సందేహాలు వెల్లువెత్తుతుండగా వాటిని నివృత్తి చేసి పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల యంత్రాంగం మరిన్ని అనుమానాలకు తావిచ్చేలా వ్యవహరిస్తోంది. తాజాగా విజయనగరం జిల్లా నెలిమర్లలోని ఈవీఎంల గోదాం వద్ద జరిగిన హైడ్రామానే దీనికి నిదర్శనం. ఈవీఎంలు భద్రపరిచిన గది తాళాన్ని తెరిచిన అధికారులు.. ఈవీఎంలున్న ట్రంక్ పెట్టె తాళం చెవి మాత్రం దొరకలేదని తాపీగా చెప్పడంతో దాదాపు రెండు మూడు గంటల పాటు గందరగోళం నెలకొంది. అన్నిచోట్లా గాలించి ఎట్టకేలకు తాళం చెవి తెచ్చేవరకు ఈవీఎంల గోదాం వద్ద కలెక్టర్ తన బృందంతో కలసి పడిగాపులు కాయక తప్పలేదు. సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల బ్యాటరీ స్టేటస్, ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు - వీవీ ప్యాట్లలో ఓట్ల స్లిప్పులను లెక్కించి సరిపోల్చాలని కోరుతూ విజయనగరం లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే. గజపతినగరం నియోజకవర్గంలో మే 13వ తేదీన దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ పోలింగ్ జరిగిందని, దాదాపు 81.06 శాతం ఓటింగ్ నమోదైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈవీఎంలకు, వీవీ ప్యాట్లకు బ్యాటరీ కనీసం 50 శాతమైనా వినియోగమై ఉంటుందన్నారు. అయితే దాదాపు 21 రోజుల తర్వాత జూన్ 4వ తేదీన కౌంటింగ్ కోసం వాటిని తెరిచినప్పుడు బ్యాటరీ స్టేటస్ (పవర్) 99 శాతం చూపించడం తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అందువల్ల గజపతినగరం అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలం పెదకాద పోలింగ్ స్టేషన్ నంబరు 20లో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల బ్యాటరీ స్టేటస్ 99 శాతం ఎందుకు ఉందో వెరిఫికేషన్ చేయాలని కోరారు.

తలుపులు తెరిచారు.. తాళం చెవి మరిచారు

పోలింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను, వీవీ ప్యాట్లను నెల్లిమర్లలోని గోదాంలో భద్రపరిచారు. నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టరు ప్రతి నెలా వాటిని కచ్చితంగా తనిఖీ చేయాలి. బొత్స అప్పల నర్సయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు సోమవారం వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని రెండు రోజుల క్రితమే అధికారులకు తెలుసు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల కల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ఎన్నికల కమిషన్ నియమించిన బెల్ ఇంజనీర్ల బృందం గోదాం వద్దకు చేరుకుంది. అయితే ఈవీఎంలు భద్రపరిచిన గది తాళాన్ని తెరిచిన అధికారులు ఈవీఎంలున్న ట్రంక్ పెట్టె తాళం చెవి మాత్రం మరచిపోయినట్లు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. వాస్తవానికి ఆ తాళాలు కలెక్టరేట్‌లోని ఎన్నికల సెల్ వద్ద ఉండాలి. అయితే మధ్యాహ్నం కావస్తున్నా తాళం చెవి రాకపోవడంతో పగలగొట్టేందుకు అధికారులు సిద్ధం కాగా ఫిర్యాదుదారుల తరఫున హాజరైన బెల్లాన వంశీ అభ్యంతరం చెప్పారు. చివరకు మధ్యాహ్నం ఒంటి గంటకు ఎట్టకేలకు తాళాలు పట్టుకొచ్చి బాక్స్‌లను తెరిచారు.

మాక్ పోలింగ్‌లోనూ చిత్ర విన్యాసాలు..

ఫిర్యాదుదారులు పరిశీలించాలని కోరిన పెదకాద పీఎస్ నంబరు 20కి సంబంధించిన ఈవీఎంను బయటకు తీసి బ్యాటరీని సీజ్ చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఆ బ్యాటరీకి బదులు కొత్త బ్యాటరీతో ఈవీఎం మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయితే పార్టీల గుర్తులు గాకుండా తమకు నచ్చిన గుర్తులు లోడ్ చేసి మాక్ పోలింగ్ ప్రారంభించారు. వీవీ ప్యాట్లను కూడా పెట్టలేదు. సుమారు 1,400 ఓట్లున్న పీఎస్‌కు సంబంధించిన ఈవీఎంను కొత్త బ్యాటరీతో మాక్ పోలింగ్ నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్ధరాత్రి దాకా ఈ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ రోజు ఏవిధంగా ప్రక్రియ సాగిందో అదే రీతిలో నిర్వహిస్తేనే పవర్ ఎంత వినియోగమైందో తెలుస్తుందని, అలాకాకుండా మొక్కుబడిగా మాక్ పోలింగ్ నిర్వహించడం వల్ల ఉపయోగం లేదని బొత్స అప్పల నర్సయ్య, బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఈవీఎం, వీవీ ప్యాట్లకు వినియోగించిన బ్యాటరీ స్టేటస్ కౌంటింగ్ నాటికి ఇంకా 99 శాతం ఎలా ఉందనే విషయాన్ని తేల్చాలని డిమాండ్ చేశారు. మాక్ పోలింగ్ కోసం వాడిన బ్యాటరీ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు అధికారికంగా నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

నేడు కూడా తనిఖీ కొనసాగింపు...

విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం కోమటిపల్లి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని గుంపాం పోలింగ్‌స్టేషన్ల తాలూకు ఈవీఎంలను, వీవీ ప్యాట్లను తనిఖీ చేయాలన్న బెల్లాన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు మంగళవారం ఆ ప్రక్రియ కొనసాగనుంది.

అందరికీ న్యాయం చేస్తాం: సీఎం



మాలమహానాడు నేతలతో మాట్లాడుతున్న సీఎం. చిత్రంలో వివేక్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కమిటీని నియమించి.. ఆ నివేదిక ఆధారంగా అందరికీ న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సచివాలయంలో సోమవారం ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, మట్టా రాగమయి, వంశీకృష్ణ, నాగరాజుల ఆధ్వర్యంలో మాలమహానాడు నేతలు చెన్నయ్య తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వర్గీకరణపై కమిటీ నియమిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.

నాడు ఫ్రీ అని.. నేడు డబ్బులు వసూలు చేస్తారా?

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి... సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగానే అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. 'ఒకవైపు రుణమాఫీ కాక, రైతుబంధు రాక, విషజ్వరాలతో సామాన్యప్రజలు ఆసుపత్రుల పాలయి ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కలెక్టర్ల నుంచి పంచాయతీ కార్యదర్శుల వరకు ఒత్తిడి చేసి మరీ ప్రజల నుంచి ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయిస్తోంది. ఫీజులు చెల్లించకపోతే లేఅవుట్లు రద్దుచేస్తామని ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ప్రజల రక్తాన్ని పీల్చడమే ధ్యేయంగా ఉన్న ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ అంటేనే దోపిడీ అన్న మీరే ఇప్పుడు ప్రజలను ఎందుకు దోపిడీ చేస్తున్నారో సమాధానం చెప్పాలి. ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని మీ మంత్రి ఏకంగా కోర్టుకు వెళ్లారు. ఎన్నికలకు ముందు ఉచితంగా అని చెప్పి, ఇప్పుడు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇచ్చిన హామీ ప్రకారం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుంది' అని ఆ లేఖలో హరీశ్ స్పష్టం చేశారు.

ఈజిప్టు–హైదరాబాద్‌కు సాంస్కృతిక సారూప్యం

ఆ దేశ వాణిజ్య దౌత్యవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ



సాక్షి, హైదరాబాద్: ఔషధ ఎగుమతుల్లో ప్రపంచంలోని అనేక దేశాలతో తెలంగాణ పోటీ పడే స్థాయిలో దూసుకుపోతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్రం నుంచి మొత్తం ఎగుమతులు రూ.1,16,182 కోట్లు కాగా ఇందులో రూ.36,893 కోట్లు ఫార్మా ఎగుమతులేనని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అత్యాధునిక వైద్య సంస్థలతో హెల్త్ టూరిజం కూడా విస్తరిస్తోందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడు వారాల శిక్షణ ముగించుకున్న ఈజిప్టు 'వాణిజ్య దౌత్యవేత్తల' బృందంతో సోమవారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. ఈజిప్టు, హైదరాబాద్‌కు సాంస్కృతిక పరంగా అనేక సారూప్యాలు ఉన్నాయని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు ప్రస్తావించారు. రాష్ట్రంలోని 67 వేల మంది స్వయం సహాయక బృందాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. మహిళల కోసం ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 119 ప్రత్యేక పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఐటీ, కృత్రిమ మేధ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా వృద్ధి చెందుతోందని మంత్రి వెల్లడించారు. ఇటీవలే ఏఐ సిటీని 200 ఎకరాల్లో ఏర్పాటు చేసే పనులు ప్రారంభించినట్టు తెలిపారు. సెమీ కండక్టర్ల తయారీకి రాష్ట్రం చిరునామాగా మారబోతోందని వెల్లడించారు. ఈజిప్టుతో వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు తమ ప్రభుత్వం ఆసక్తితో ఉందని అన్నారు. సమావేశంలో ఎంసీహెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ గోయెల్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

నాడు ఆహ్లాదం..నేడు ఆహారం

- నమీబియాలో వన్యప్రాణులను వధిస్తున్న అక్కడి ప్రభుత్వం
- శతాబ్దంలోనే భయంకర కరువుతో అల్లాడుతున్న ప్రజలు
- నేషనల్ పార్కుల్లోనూ వన్య ప్రాణులకు మేత, నీరుకు గడ్డు పరిస్థితులు
- దీనిని అరికట్టేందుకు ఉద్యానవనాల్లో జీవుల సంఖ్యను తగ్గించే ప్రణాళిక
- వాటిని చంపడం ద్వారా పేదల కడుపు నింపే ప్రయత్నం



సాక్షి, అమరావతి: నమీబియాలో కరువు విజృంభిస్తోంది. గడిచిన శతాబ్దంలో ఎన్నడూ లేనంతగా దుర్భిక్షం తాండవిస్తోంది. ఇది మనుషుల నుంచి వన్య ప్రాణులకు వరకు కబళిస్తోంది. నైరుతి ఆఫ్రికాలోని నమీబియా..వన్యప్రాణులతో కూడిన ఉద్యానవనాలు, సఫారీలకు పెట్టింది పేరు. ఒకప్పుడు స్వేచ్ఛగా విహరిస్తూ పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచిన వన్యప్రాణులు ఇప్పుడు కరువు కారణంగా మనుషులకు ఆహారంగా మారుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో మేత, నీళ్ల లభించక వన్య ప్రాణులు విలవిల్లాడుతున్నాయి. దీనిని అరికట్టేందుకు అధిక వన్యప్రాణి జనాభా కలిగిన ఉద్యానవనాల్లోని జీవులను అక్కడి ప్రభుత్వం వధిస్తోంది. వాటిని చంపడం ద్వారా ఉద్యానవనాల్లో మేత, నీళ్ల సమస్యలను తగ్గించి పేద ప్రజలకు ఆహారంగా వినియోగిస్తున్నట్లు ప్రకటించింది.

సంఖ్యను తగ్గిస్తూ..జంతువులను వధిస్తూ

నమీబియాలో ఏటా వచ్చే కరువు ఈసారి మరింత తీవ్రంగా మారింది. గతంలో కరువు ముప్పు నుంచి ఉద్యానవనాలను తప్పించేందుకు జంతువులను ప్రభుత్వం వేలం వేసేది. వచ్చిన సొమ్ముతో ఉద్యానవనాలను నిర్వహించేది. కానీ, ఇప్పుడు పరిస్థితి చేయిదాటిపోవడంతో ఏనుగులు, హిప్పోలు, జీబ్రాలతో సహా అనేక జంతువులు వధించేలా నమీబియా లైవ్లీహుడ్ వల్నెరబిలిటీ అసెస్‌మెంట్ అండ్ ఎనాలిసిస్ రిపోర్ట్‌ను అక్కడి ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో 83 ఏనుగులు, 30 హిప్పోలు, 100 ఎలాండ్స్, 300 జీబ్రాలతో సహా సుమారు 700కు పైగా జంతువులను వధించడానికి చర్యలు తీసుకుంది. జంతువుల సంఖ్య అధికంగా ఉన్న నేషనల్ పార్కులలో మేత, నీరు సరిపోవడం లేదు. మేత కరువును, నీటి లభ్యతను నివారించడంలో ఈ వన్యప్రాణుల సంఖ్యను తగ్గించే విధానం తమకు సహాయపడుతుందని నమీబియా ప్రభుత్వం భావిస్తోంది.

హెచ్చరికలు..ఆంక్షలు

నమీబియాలో దుర్భిక్షంతో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింది. దేశంలో మే నెలలో అత్యవసర పరిస్థితిని విధించారు. 30 లక్షల మంది జనాభాలో దాదాపు సగం మంది ప్రజలు తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఆహారం దొరక్క ఏనుగులు, ఇతర వన్యప్రాణులు మనుషులపై దాడులు చేసే పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలోనే వన్య ప్రాణులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. రాత్రిపూట ఆయా ప్రదేశాల్లో తిరగడం, నదుల్లో ఈత కొట్టడం, స్నానాలు చేయడం, పశువులను విచ్చలవిడిగా వదిలిపెట్టడం చేయవద్దని హెచ్చరికలు జారీ చేస్తోంది. నమీబ్ నౌక్లఫ్ట్ పార్క్, మంగెట్టి నేషనల్ పార్క్, బ్వాబ్వాటా నేషనల్ పార్క్, ముడుమో నేషనల్ పార్క్, న్కాసా రూపారా నేషనల్ పార్కుల్లోని వన్యప్రాణులను తీసుకువచ్చి వధించి..పేదలకు ఆహారంగా అందిస్తోంది.

తుపాకీ మిస్‌ఫైర్ వల్లే డాక్టర్ రమేష్‌బాబు మృతి

- ఎన్నారై శ్రీధర్‌రెడ్డి కోర్సపాటి వెల్లడి
- పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్న అమెరికా పోలీసులు
- ఇంకా కుటుంబ సభ్యులకు అందని పార్థివ దేహం



రమేష్‌బాబు (ఫైల్)

నాయుడుపేట టౌన్: అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా పేరుగాంచిన తిరుపతి జిల్లా మేనకూరుకు చెందిన డాక్టర్ రమేష్‌బాబు పేరంశెట్టి (64) టస్కలూనాలోని ఆయన ఇంటి వద్ద ప్రమాదవశాత్తు తుపాకి మిస్‌ఫైర్ అవడం వల్లే మృతి చెందినట్లు ఎన్నారై శ్రీధర్‌రెడ్డి కోర్సపాటి సోమవారం రాత్రి ఫోన్ ద్వారా వెల్లడించారు. రమేష్‌బాబు శుక్రవారం సాయంత్రం వీకెండ్‌కు గన్ ప్రాక్టీస్ కోసం వెళ్లేందుకు ఇంటివద్ద తుపాకీని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలి, తూటా ఆయన శరీరంలోకి దూసుకుపోవడంతో మరణించినట్లు తెలిపారు. ఆయన్ని దుండగులు కాల్చారని, అనుమానాస్పద మృతి అంటూ వచ్చిన వార్తలు అవాస్తవాలు అని చెప్పారు. అమెరికా టస్కలూసా ప్రాంత పోలీసులు ఇంటి వద్దకు వచ్చి రమేష్‌బాబు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం వరకు పోలీసులు ఆయన పార్థివ దేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించలేదన్నారు. మంగళవారం లేదా బుధవారం మృతదేహాన్ని అమెరికాలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు చూచేందుకు పోలీసులు అనుమతిచ్చే అవకాశం ఉందన్నారు. అమెరికా పౌరసత్వం కలిగి. ప్రతి ఒక్కరితో ఎంతో సన్నిహితంగా మెలిగే రమేష్‌బాబు అకాల మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయులు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నారని చెప్పారు. రమేష్‌బాబు మృతితో తిరుపతిలో ఉన్న ఆయన తల్లి, సోదరుడు మాజీ ఎంపీటీసీ పేరంశెట్టి సురేష్, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. సోదరుడిని చివరిసారి చూసేందుకు కూడా తాము అమెరికాకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని సురేష్ చెప్పారు.

పీఎస్‌కు తరలిస్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతి

- లాకప్ డెత్ అని బాధితుల ఆరోపణ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని చెబుతున్న పోలీసులు



హాజీ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో సోమవారం కలకలం రేపింది. వివరాలిలా.. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ సమీపంలో నిలిపిన ఓ కంటైనర్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తున్నారని 100 డయల్‌కు సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికి వెళ్లిన పోలీసులు ఓ ఆటోతో సహా గోవింద్, నరేష్, హాజీ(43) అనే ముగ్గురు వ్యక్తులను స్టేషన్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో హాజీకి గుండెనొప్పి వచ్చింది. దీంతో వెంటనే యంజాల్ సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ హాజీ మృతి చెందాడని పోలీసులు చెబుతున్నారు. కానీ పీఎస్‌కు తరలించిన తర్వాతే హాజీ మృతిచెందాడని అతని బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పట్టుకున్న ముగ్గురిలో నరేష్ తుర్కయంజాల్‌కు చెందిన వ్యక్తి కాగా, గోవింద్, హాజీ సంతోష్‌నగర్ వాసులని పోలీసులు తెలిపారు. హాజీ నెల రోజుల క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఇతనిపై ఆదిబట్ల పీఎస్‌లో ఎలాంటి కేసులు లేవని సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

4 వేల లావాదేవీలు.. రూ.20.8 కోట్ల ఆదాయం

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతున్నాయి. ఈ లావాదేవీల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి రోజుకు సగటున రూ.20.8 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ పదేళ్లలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులకు సంబంధించి మొత్తం 1,46,18,601 లావాదేవీలు జరగ్గా, వీటిద్వారా రూ.76,201.17 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన 2014–15 సంవత్సరంలో 8,27,374 లావాదేవీల ద్వారా రూ.2,746 కోట్ల ఆదాయం రాగా, ఇటీవల ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో 18,41,324 లావాదేవీల ద్వారా రూ.14,588.06 కోట్ల ఆదాయం వచ్చిందని రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ పదేళ్లలో అత్యధికంగా 2021–22లో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ ఏడాదిలో 20 లక్షల కంటే ఎక్కువ లావాదేవీలు జరగడం గమనార్హం. కాగా, మన పొరుగున ఉన్న రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రిజిస్ట్రేషన్ల వృద్ధి కొంచం తక్కువగానే కనిపిస్తోంది.

తెలంగాణలో టాప్ 30 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలివే..

రిజిస్ట్రేషన్ల విషయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల నుంచే సింహభాగం లావాదేవీలు జరుగుతాయి. ఆదాయం కూడా ఎక్కువగా ఇక్కడి నుంచే వస్తుందని గణాంకాలు చెపుతున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 30 చోట్ల ఎక్కువగా లావాదేవీలు జరుగుతుంటాయి. ఈ జాబితాలో రంగారెడ్డి (ఆర్‌వో), గండిపేట, పటాన్‌చెరు (ఆర్‌వో), కుత్బుల్లాపూర్, బంజారాహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పల్, మేడ్చల్ (ఆర్‌వో), కూకట్‌పల్లి, వరంగల్ (ఆర్‌వో), మహేశ్వరం, బాలానగర్, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, ఎస్ఆర్‌నగర్, చంపాపేట, ఆజంపుర, గోల్కొండ, నారపల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురం, చిక్కడపల్లి, కాప్రా, వల్లభ్‌నగర్, కీసర, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖమ్మం (ఆర్‌వో), చేవెళ్ల ఉన్నాయని వార్షిక నివేదిక వెల్లడించింది.

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే 2023-24 సంవత్సరంలో తెలంగాణలో జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీల వివరాలు..

రాష్ట్రం	స్టాంపుడ్యూటీ	లావాదేవీల సంఖ్య	ఆదాయం	వృద్ధిరేటు
తెలంగాణ	7.5	18.40	14,588	2.08
ఆంధ్రప్రదేశ్	7.5	21.91	9,547	18.29
కర్ణాటక	6.6	24.67	20,287	13.51
తమిళనాడు	11	34.23	17,548	1.46
మహారాష్ట్ర	8	24.21	51,210	38.54
కేరళ	10	8.86	5,219	-7.82

(స్టాంపుడ్యూటీ శాతాల్లో, లావాదేవీల సంఖ్య లక్షల్లో, ఆదాయం రూ.కోట్లలో)

2014-15 సంవత్సరం నుంచి 2023-24 వరకు రాష్ట్రంలో జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు, ఆదాయం వివరాలు..

సంవత్సరం	లావాదేవీల సంఖ్య	ఆదాయం (రూ.కోట్లలో)
2014-15	8,27,374	2,746.00
2015-16	10,62,108	3,786.00
2016-17	10,63,263	4,249.00
2017-18	11,50,415	5,177.00
2018-19	15,32,980	6,612.75
2019-20	16,58,815	7,061.03
2020-21	14,96,737	5,260.20
2021-22	20,38,295	12,429.19
2022-23	19,47,290	14,291.04
2023-24	18,41,324	14,588.06

నగదు 'బదిలీ'!

అన్ని నియోజకవర్గాల్లో కీలక పోస్టులన్నీ బేరం పెట్టిన కూటమి నేతలు

ఎమ్మెల్యేల సిఫారసుతో ఉద్యోగులకు జీరో సర్వీసు బదిలీలు

చెప్పినంత ఇస్తేనే సిఫారసు లేఖలు.. లేకపోతే ఇబ్బందులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి 'సాక్షి' ఈపేపర్‌లో
'హెల్త్' పేజీ
'సాక్షి' ఈ పేపర్‌లో ప్రతిరోజూ
ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ





కవితారెడ్డి అకాడమీలో ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులు

డాక్టరమ్మ శిక్షణ చక్ దే...

చక్‌దే ఇండియాలో మహిళా హాకీ జట్టును తీర్చిదిద్దుతాడు షారుక్ ఖాన్. నిజామాబాద్‌లో ఫుట్‌బాల్‌లో బాలికలను మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు డాక్టర్ కవితారెడ్డి. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఇక్కడి నుంచి సెలెక్ట్ అవుతున్న బాలికలు ఇంటర్నేషనల్ స్థాయిలో తెలంగాణ పేరును నిలబెట్టేలా చేయడమే లక్ష్యం అంటున్నారామె. కవితారెడ్డి ఈ క్రీడా శిక్షణ ఎందుకు ప్రారంభించారో తెలిపే కథనం.



డాక్టర్ శీలం కవితా రెడ్డి

'సహాయం చేసే వ్యక్తులు మన జీవితాల్లో ఉంటే సహాయం చేయడం మనక్కూడా అలవడుతుంది' అంటారు డాక్టర్ శీలం కవితా రెడ్డి. నిజామాబాద్‌లో గైనకాలజిస్ట్‌గా పేరొందిన ఈ డాక్టర్ తన సేవా కార్యక్రమాలతో కూడా అంతే గౌరవాన్ని పొందుతున్నారు. 'మా తాతగారిది నల్లగొండ. పేదవాళ్లకు ఆయన సహాయం చేయడం, వాళ్లకు ఫీజులు కట్టి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదివించడం నేను బాల్యం నుంచి గమనించేదాన్ని. సాయం చేయడంలో సంతృప్తి నాకు అర్థమైంది. నేను డాక్టర్‌గా స్థిరపడ్డాక 'డాక్టర్ కవితా రెడ్డి ఫౌండేషన్' స్థాపించి స్త్రీల, బాలికల ఆరోగ్యం కోసం పని చేయాలని నిశ్చయించుకున్నాను. పేద మహిళల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం అవసరం అనే భావనతో ఈ పని మొదలుపెట్టాను' అన్నారామె.

ఫుట్‌బాల్ మేచ్ చూసి...

'నిజామాబాద్ పట్టణంలో ఒకసారి బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరుగుతుంటే నన్ను అతిథిగా ఆహ్వానించారు. అక్కడ పాల్గొన్న అమ్మాయిల క్రీడానైపుణ్యం చూసి ఆశ్చర్యపోయాను. ఎంతటి పేదరికంలో ఉన్నా సరైన పోషణ, డ్రస్, షూస్ లేకపోయినా వారు గ్రౌండ్‌లో చిరుతల్లా పరిగెడుతూ ఆడారు. అలాంటి పిల్లలకు సరైన శిక్షణ ఇస్తే మరింతగా దూసుకుపోతారని భావించి 2019లో డాక్టర్ కవితారెడ్డి ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను. నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతం బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేసి ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాను. పట్టణంలో ఉన్న బాలికలు రోజూ వచ్చి ఉచిత శిక్షణ పొందితే బయటి ఊళ్ల అమ్మాయిలు హాస్టల్‌లో ఉంటూ శిక్షణ పొందుతున్నారు' అని తెలిపారామె.

అదే ప్రత్యేకం...

కవితారెడ్డి తన అకాడెమీని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా రిజిస్టర్ చేశారు. తెలంగాణలో మొత్తం 8 ఫుట్‌బాల్ క్లబ్బులు ఉండగా మహిళా కార్యదర్శి ఉన్న క్లబ్ మాత్రం ఇదొక్కటే కావడం గమనార్హం. ప్రస్తుతం డాక్టర్ కవితారెడ్డి ఫుట్‌బాల్ అకాడమీలోని 41 మంది బాలికలు కోచ్ గొట్టిపాటి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. గతంలో నాగరాజు శిక్షణలోనే అంతర్జాతీయ క్రీడాకారిణి సౌమ్య తయారైంది. శిక్షణ పొందుతున్న బాలికల్లో వివిధ జిల్లాలకు చెందిన ఇంటర్, డిగ్రీ చదువుతున్న గ్రామీణ ప్రాంతాల వారున్నారు. వీరందరికీ కవితారెడ్డి తన సొంత ఖర్చుతోనే వసతి, ఆహారం, డ్రెస్సులు, వైద్య సౌకర్యం కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో టోర్నమెంట్లకు వెళ్లాల్సి వస్తే అవసరమైన సామగ్రి, ప్రయాణ ఖర్చులన్నీ డాక్టరమ్మే భరిస్తున్నారు. ఈ అకాడమీ నుంచి ఇప్పటివరకు 9 మంది బాలికలు పశ్చిమబెంగాల్, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల్లో నేషనల్స్ ఆడారు. మరో ఐదుగురు ఇతర రాష్ట్రాల క్లబ్‌లకు ఆడారు. ఖేలో ఇండియా కార్యక్రమం కింద అండర్–13, అండర్–15లో 14మంది ఆడారు. ఇక తెలంగాణ ఉమెన్స్ లీగ్‌కు 22 మంది ఈ అకాడమీ బాలికలు ఆడనున్నారు. మిషన్ 2027లో భారత జట్టుకు ఎంపికై అంతర్జాతీయ పోటీలకు వెళ్లేలా బాలికలు శిక్షణ పొందుతున్నారు. మరోవైపు బాక్సింగ్ క్రీడాకారులకు సైతం ఇప్పటివరకు అవసరమైనప్పుడల్లా కిట్లు కొనిస్తున్నారు.

హెల్త్ కార్డులు

డాక్టర్ కవితారెడ్డి తన హెల్త్ ఫౌండేషన్ ద్వారా 2017 నుంచి పేద గర్భిణులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తూ వస్తున్నారు. నాలుగు వేల మందికి హెల్త్ కార్డులు ఇచ్చారు. ఈ కార్డ్ ఉన్నవారికి తన ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు అనీమియా వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. సేవాకార్యక్రమాల విషయంలో తనను భర్త రవీందర్‌రెడ్డి, కుమారుడు డాక్టర్ పరీక్షిత్ సాయినాథ్‌రెడ్డి అన్నిరకాలుగా ప్రోత్సహిస్తున్నారని కవితారెడ్డి చెబుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి,
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

డాక్టర్లకు రక్షణ కిక్ దే...

కోల్‌కతా ఘటన దేశంలో భారీ నిరసన లేవదీసినా పరిస్థితిలో మార్పు ఎలా అనే విషయమై ఏ స్పష్టతా లేదు. ఈలోపు 'మన వరకు మనం ఏం చేద్దాం' అనే ఆలోచనతో కేరళలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రి తన మహిళా ఉద్యోగులందరికీ తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ నేర్పించే పని పెట్టుకుంది. అందుకు 50 లక్షల రూపాయలు విడుదల చేసింది. అలాగే స్పెషల్ ప్రొటెక్షన్ కిట్‌ను తలా ఒకటి ఇవ్వనుంది. వీళ్లు తమ ఆస్పత్రి మహిళలకే కాక రాష్ట్రంలోని 50 వేల మహిళలకు వివిధ దశలలో కరాటే నేర్పనున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

ఆత్మరక్షణ విద్యలు తెలిస్తే ఆత్మవిశ్వాసమే వేరు. కనీసం దాడిని ఎదుర్కొనాలన్న ఆలోచనైనా వస్తుంది. ఆత్మరక్షణ విద్యలు తెలియనప్పుడు భయం, ఆందోళన మనసును మొద్దుబార్చి శరీరాన్ని చలన రహితం చేస్తాయి. దాడి చేసే వ్యక్తికి ఇలాంటి స్థితి మరింత చొరవ కలిగిస్తుంది. అందుకే ఆపడం తెలియాలి. ఎదుర్కొనడం తెలియాలి. అది శాస్త్రీయంగా తెలిస్తే మంచిది.

కిక్ అండ్ పంచ్

కోల్‌కతాలోని ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ మీద ఘోరమైన లైంగిక దాడి, హత్య జరిగాక 24 గంటలు విధి నిర్వహణలో ఉండాల్సిన మహిళా వైద్య సిబ్బంది రక్షణ పై అనేక ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఎవరికి వారు దీనికై ఆలోచనలు చేస్తుండగా కొచ్చిలోని ప్రసిద్ధ కార్పొరేట్ ఆస్పత్రి వి.పి.ఎస్.లేక్‌షోర్ తన మహిళా సిబ్బందికి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలని నిశ్చయించుకుంది. ఇందుకుగానూ 50 లక్షలు వెంటనే విడుదల చేయడమే కాకుండా మహిళా ఉద్యోగులు ఈ శిక్షణలో పాల్గొనడం తప్పనిసరి చేసింది. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పడమే కాకుండా దాడి సమయాల్లో ఎలా కాపాడుకోవాలో నిపుణుల చేత శిక్షణ ఇప్పిస్తారు. అంతేకాదు ప్రతి మహిళా ఉద్యోగికి పెప్పర్ స్ప్రే, ఇతర ప్రతిఘటన పరికరాలు ఉన్న ఒక కిట్‌ను ఉచితంగా ఇస్తారు.

సమాజం కోసం...

వి.పి.ఎస్. ఆస్పత్రి వారు తమ మహిళా సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు సమాజంలోని బయటి ఉద్యోగినులైన మహిళలు మొత్తం 50 వేల మందికి ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని నిశ్చయించుకున్నారు. ప్రభుత్వ సంస్థలతో కలిసి తమ ఖర్చుతో మహిళలకు ఈ విద్యలు నేర్పనున్నారు. అంతేకాదు, వివిధ కాలేజీలకు, పాఠశాలలకు వెళ్లి 'సెక్స్ ఎడ్యుకేషన్'పై అవగాహన కల్పిస్తారు. శారీరక, మానసిక స్థితులను హానికారక దిశలోకి జారిపోకుండా ఎలా చూసుకోవాలో సూచిస్తారు. పోలీసులతో కలిసి అవగాహన తరగతులు ఏర్పాటు చేసి ప్రమాదం చుట్టుముట్టినప్పుడు తగిన యాప్స్ ద్వారా తక్షణ సహాయం ఎలా పొందవచ్చో శిక్షణ ఇస్తారు. ఏ నంబర్‌కు డయల్ చేయాలో, ఏ యాప్ ద్వారా సందేశం పంపాలో నేర్పుతారు.

ఈ భారం తప్పదా?

అయితే కొందరు మహిళా ఆలోచనాపరులు ఈ ప్రయత్నాన్ని మెచ్చుకుంటూనే ఇలాంటి చర్యల వల్ల స్త్రీలపై తమను తాము కాపాడుకునే భారం పడుతుందని తెలియ చేస్తున్నారు. సమాజం ఎలా ఉన్నా తామే అప్రమత్తంగా ఉండాలనే భారాన్ని వీరెందుకు మోయాలి... అని ప్రశ్నిస్తున్నారు. స్త్రీలకు గౌరవం, సురక్ష ఇచ్చే సమాజం ఉంటే వీరు కిట్‌లతో తిరగాల్సిన పని లేదంటున్నారు.

బ్యూటిప్

ఇంట్లోనే... లిప్ బామ్..

సౌందర్య సాధనంగా వాడుకోదగిన వస్తువులను ఎంపిక చేసుకొని, ఇంట్లోనే వాటిని తయారు చేసుకొని చర్మానికి సరైన పోషణ లభించేలా చేయవచ్చు.



లిప్ బామ్

రెండు టీ స్పూన్ల మైనం, టీ స్పూన్ కోక్ పౌడర్, రెండు టీ స్పూన్లు బాదం నూనె, 5–6 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ తీసుకోవాలి. ముందుగా మైనాన్ని కరిగించాలి. దీంట్లో కోక్ పౌడర్ వేసి బాగా కలపాలి. కోక్ పౌడర్ బాగా కలిసిపోయాక బాదం నూనె, ఎసెన్షియల్ ఆయిల్ వేసి కలపాలి. దీన్ని ఒక చిన్న బాటిల్‌లో భద్రపరుచుకొని రోజుకు రెండు మూడుసార్లు పెదవులకు రాసుకోవాలి. ఈ బామ్ పెదవుల పగుళ్ల సమస్యను నివారిస్తుంది.

- ఆ రైతు క్షేత్రం దట్టమైన ఆహారపు అడవి
- పదేళ్లుగా పాలేకర్ పద్ధతిలో గడ్డి మందు సహా, 100% రసాయనాల్లేని సాగు
- 20 ఎకరాల్లో లక్ష్మణ ఫలం నుంచి అవకాడో వరకు పండ్లు, కూరగాయల సాగు
- పంటలతో పాటు గొర్రెలు, నాటుకోళ్లు, చేపల పెంపకంతో నిరంతరాదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న మాజీ ప్రభుత్వాధికారి అంజిరెడ్డి సేద్యం

ఏడాది పొడవునా ఆదాయం!



లక్ష్మణ ఫలంతో రైతు అంజిరెడ్డి

ఏదుళ్ల అంజిరెడ్డి 2013లో హైదరాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన తర్వాత నేలతల్లికి ప్రణమిల్లి ప్రకృతి వ్యవసాయదారుడిగా మారారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో అన్ని సంపదల్లో కెల్లా ఆరోగ్య సంపద గొప్పదని భావించి కార్యాచరణకు ఉపక్రమించారు. నల్లగొండ సమీపంలోని చర్లపల్లి వద్ద తన 20 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని దట్టమైన ఆహారపు అడవిగా మార్చారు. తొలుత కుటుంబ అవసరాల కోసం పురుగు మందుల అవశేషాలు లేని పండ్లు, కూరగాయలు సాగు చేయనారంభించి.. వ్యవసాయాన్ని క్రమంగా 20 ఎకరాలకు విస్తరించారు.

మామిడి నుంచి అవకాడో వరకు 11 రకాల పండ్లతో పాటు 10 రకాల పంటలను సాగు చేస్తున్నారు. శ్రీగంధం, ఎర్రచందనం, చింత, రావి, వెదురు, సరుగుడు, మహాగని మొక్కల్ని నాటారు. బహురూపి దేశీవరిని సాగు చేస్తున్నారు. గత పదేళ్లుగా భూసారం సమృద్ధిగా వృద్ధి చెందటం ఆ వ్యవసాయ క్షేత్రంలో కనిపిస్తుంది. ఆరోగ్యంగా పెరుగుతూ పచ్చగా ఉన్న తోటలో అనేక చోట్ల పుట్టలు కనిపిస్తాయి.



పాషన్ ఫ్రూట్



గొర్రెల ఫారం



కోళ్ల ఫారం



చెర్రీ, బత్తాయి

పంటలతో పాటే గొర్రెలు, కోళ్లు..

ఏ చెట్టు కింద మట్టిని తీసినా వానపాములు ఉంటాయి. పండ్లు, కూరగాయల సాగే కాకుండా 500కు పైగా గొర్రెలతో ఆధునాతన ఫామ్‌ను అంజిరెడ్డి గత రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. గొర్రెల మేత కోసం ఆరోగ్యవంతమైన గడ్డిని పెంచుతున్నారు. తోటలో నాటు కోళ్లను పెంచి గుడ్లను అమ్ముతున్నారు. సీమ కోళ్లు, బాతులు ఉన్నాయి. ఈ సమీకృత వ్యవసాయ క్షేత్రంలోని చిన్న కొలనులో కొర్రమీను చేపలనూ పెంచుతున్నారు. డ్రిప్ ద్వారా ద్రవ జీవామృతాన్ని చెట్లు, మొక్కలకు అందిస్తున్నారు. భూమిని దున్నకుండా అవసరం ఉన్న చోటనే పరిమితంగా దున్ని కూరగాయలను సాగు చేస్తుండటం విశేషం. క్రిమికీటకాల నివారణకు వేప నూనెను స్ప్రే చేస్తున్నారు.

నేరుగా అమ్మకాలు

తన సమీకృత వ్యవసాయ క్షేత్రం దగ్గర, నల్లగొండలోని తన నివాసం వద్ద పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లను ప్రజలకు నేరుగా విక్రయిస్తూ ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు అంజిరెడ్డి. కలుపు మందు సహా ఏ రసాయనాలు వాడకుండా సాగు చేస్తున్నందున దిగుబడుల నాణ్యతను గుర్తించిన నల్గొండ నగర ప్రజలు వచ్చి కొనుక్కెళ్తున్నారు. కూరగాయలు ఏ రకం అయినా కిలో రూ.80 చొప్పున అమ్ముతున్నారు. కేజీ రూ.420 లెక్కన గొర్రెలను విక్రయిస్తున్నారు. నాటు కోడి గుడ్డు రూ.15, జామ కాయలు కిలో రూ.60, సపోట కిలో రూ.40, నిమ్మ వేసవిలో కిలో రూ.100, వానాకాలంలో కిలో రూ.50, బత్తాయి కిలో రూ.80, మామిడి రూ.100 – 150, కూర అరటి డజన్ రూ.70, అరటి పండ్లు డజన్ రూ.80, నెయ్యి కిలో రూ. 1,200, పాలు లీ. రూ.80 చొప్పున విక్రయిస్తూ అంజిరెడ్డి రోజూ ఆదాయం పొందుతున్నారు. మొత్తంగా 20 ఎకరాలలో ఖాళీ స్థలం లేకుండా బహుళ పంటలను సాగు చేస్తూ.. జీవాలు, కోళ్లను పెంచుతుండటంతో అంజిరెడ్డి క్షేత్రం ఏడాది పొడవునా దిగుబడులనిచ్చే అక్షయపాత్రగా మారింది.



యాపిల్



– కుంభం వెంకటేశ్వర్లు గౌడ్,
సాక్షి, నల్లగొండ రూరల్
ఫొటోలు: కంది భజరంగ్ ప్రసాద్,
స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రతి రైతూ కుటుంబం కోసమైనా రసాయనాల్లేకుండా పండించాలి

భూసారాన్ని కాపాడుకుంటే మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకున్నట్లే. క్యాన్సర్, గుండెపోటు, బీపీ, షుగర్ వంటి అనేక రకాల వ్యాధులు రావడానికి రసాయనాలతో పండించిన ఆహారమే కారణం అని గ్రహించాను. రసాయనిక అవశేషాల్లేని ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని మా కుటుంబంతో పాటు ప్రజలకూ అందించటం కోసమే రైతుగా మారాను. ప్రతి రైతూ మిశ్రమ పంటలను తన కుటుంబ అవసరాల కోసమైనా రసాయనాలు లేకుండా సాగు చేసుకోవాలి. విద్యార్థులకు ఇటువంటి వ్యవసాయ క్షేత్రాలు చూపిస్తే వారిలో ప్రకృతి సేద్యంపై, ఆరోగ్యదాయకమైన ఆహారంపై అవగాహన పెరుగుతుంది. రైతు కుటుంబ నేపథ్యం ఉన్న వారు భవిష్యత్తులో వ్యవసాయాన్ని వృత్తిగా చేపడతారన్న ఆశతో క్షేత్ర పరిశీలనకు వచ్చిన విద్యార్థులకు వ్యవసాయం గురించి వివరిస్తున్నా.

– ఏదుళ్ల అంజిరెడ్డి
(99482 55544),
ప్రకృతి వ్యవసాయదారుడు, నల్గొండ

సేంద్రియ సాగు, ప్రాసెసింగ్‌పై 3 రోజుల శిక్షణ

ప్రకృతి/ సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు పంట దిగుబడులకు విలువ జోడింపు ద్వారా అధికాదాయం పొందటం వంటి అంశాలపై గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నాబార్డు సహకారంతో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. డ్రోన్ల వాడే పద్ధతులు, యంత్రపరికరాలతో సులువుగా వ్యవసాయ పనులు చేసుకోవటంపై కూడా శిక్షణ ఇస్తారు. ఏపీలోని 30 మంది రైతులకే ఈ అవకాశం. వసతి, భోజన సదుపాయం ఉంది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666/ 90739 73999కు ఫోన్ చేసి తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సాగుబడి

మఖ కార్తె: ఆగస్టు 30 వరకు
పుబ్బ కార్తె: 31 నుంచి

వాతావరణ మార్పుల్ని ధీటుగా తట్టుకునే అధిక పోషకాలతో కూడిన 109 కొత్త వంగడాలను ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల విడుదల చేశారు. వీటిల్లోని 5 వంగడాలతో అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్)కు సంబంధం ఉంది. ఇక్రిశాట్‌లో పెరిగిన తల్లి మొక్కల (పేరెంట్ లైన్స్)ను తీసుకొని వివిధ యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు కొత్త వంగడాలను రూపొందించాయి. ఈ ఐదింటిలో మూడు కంది, జొన్న, సజ్జ వంగడాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు అనువైనవి. ఈ వంగడాల రూపకల్పనలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు డా॥ ప్రకాశ్, డా॥ గుప్తా, డా॥ ఇఫ్రేన్ ప్రధాన పాత్ర పోషించారని ఇక్రిశాట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పసుపులేటి జనీల 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఇంతకీ.. ఇప్పుడు విడుదలైన కొత్త విత్తనాలు రైతులకు ఎప్పటికి అందుతాయి? అని ప్రశ్నిస్తే.. ఆశ్చర్యకరమైన సమాధానం వచ్చింది. కొన్ని పంటల్లో 5 నుంచి 15 ఏళ్లు పడుతోందన్నారు. విత్తన వ్యవస్థలపై శ్రద్ధ కొరవడినందున కొత్త వంగడాలు గ్రామీణ రైతులకు సత్వరమే చేరటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు త్వరగా చేరినప్పుడే కొత్త వంగడాల ప్రయోజనం!



5 తెగుళ్లను తట్టుకునే సజ్జ హైబ్రిడ్

సజ్జ పూసా 1801: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు అనువైన హైబ్రిడ్ ఇది. ఇక్రిశాట్‌తో కలసి న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ రూపొందించింది. సజ్జల కోసమే కాకుండా, పశుగ్రాసం కోసం కూడా సాగు చేయతగినది. 5 తెగుళ్లను తట్టుకోగలుగుతుంది. అగ్గి తెగులును, వెర్రి తెగులును పూర్తిగా.. తుప్పు తెగులు, స్మట్, ఆర్గాట్ తెగుళ్లను కొంతమేరకు తట్టుకుంటుంది. ఈ రకం సజ్జల్లో ఇనుము (70 పిపిఎం), జింక్ (57 పిపిఎం) ఎక్కువ. హెక్టారుకు 33 క్వింటాళ్ల సజ్జలు, ఎండు చొప్ప హెక్టారుకు 175 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఇది ప్రకృతి సేద్యానికీ అనువుగా ఉంటుందని డా. జనీల తెలిపారు.

కోతకొచ్చినా పచ్చగా ఉండే జొన్న

జొన్న ఎస్‌పిహెచ్ 1943: తెలంగాణకు అనువైన(ఏపీకి కాదు) హైబ్రిడ్ ఇది. యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ధర్వాడ్(కర్ణాటక) ఇక్రిశాట్‌తో కలసి అభివృద్ధి చేసింది. హెక్టారుకు 39 క్వింటాళ్ల జొన్నల దిగుబడినిచ్చే ఈ రకం ఖరీఫ్‌లో వర్షాధార సాగుకు అనుకూలం. గడ్డి దిగుబడి హెక్టారుకు 116 క్వింటాళ్లు. కోత దశలోనూ గడ్డి ఆకుపచ్చగానే ఉండటం (స్టే గ్రీన్) దీని ప్రత్యేకత. గింజ బూజును కొంత వరకు తట్టుకుంటుంది. తక్కువ నత్రజని ఎరువుతోనే 9% అధిక దిగుబడినిస్తుంది. ప్రకృతి సేద్యానికీ అనువైనదని డా. జనీల తెలిపారు.

5 నెలల కంది సూటి రకం



కంది ఎన్ఎఎఎం–88: ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వర్షాధారం/నీటిపారుదల కింద ఖరీఫ్‌కు అనువైన సూటి రకం. ఇక్రిశాట్‌తో కలసి కర్ణాటక రాయచూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఈ రకాన్ని అభివృద్ధి చేసింది. 142 రోజుల (స్వల్పకాలిక) పంట. హెక్టారుకు 15 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఎండు తెగులును కొంతమేరకు తట్టుకుంటుంది.

పాలకులు శ్రద్ధ చూపాలి!



శాస్త్రవేత్తలు దీర్ఘకాలం పరిశోధనలు చేసి ఓ కొత్త వంగడాన్ని రూపొందిస్తారు. కానీ, విడుదలైన తర్వాత కూడా కొత్త విత్తనం రైతులకు సత్వరం అందటం లేదు. వేరుశనగ, శనగ వంటి పంటల్లో 15–18 ఏళ్లు పడుతోంది. వెరైటీల రిలీజ్‌తో పని అయిపోయినట్లు కాదు. ఫార్మల్, ఇన్‌ఫార్మల్ సీడ్ సిస్టమ్స్‌ను ప్రోత్సహించటంపై పాలకులు దృష్టిని కేంద్రీకరించటం అవసరం. అప్పుడే రైతులు, వినియోగదారులకు కొత్త వంగడాల ప్రయోజనాలందుతాయి.

– డా. పసుపులేటి జనీల,
క్లస్టర్ లీడర్ – క్రాప్ బ్రీడింగ్, ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ), ఇక్రిశాట్





దేశవాళీ క్రికెట్‌లో ప్రోత్సాహకాలు... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'కు ప్రైజ్‌మనీ

ముంబై: దేశవాళీ క్రికెట్‌లో ఆటగాళ్ల ప్రదర్శనకు మరింత ప్రోత్సాహం అందించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త నిర్ణయాన్ని తీసుకుంది. ఇకపై విజయ్ హజారే వన్డే టోర్నీ, ముస్తాక్ అలీ టి20 ట్రోఫీలలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచే ఆటగాళ్లకు ప్రైజ్‌మనీ కూడా ఇవ్వనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ రెండు టోర్నీలలో నాకౌట్ మ్యాచ్‌లలో మాత్రమే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'ను ప్రకటించేవారు. వీరికి కూడా మొమెంటో ఇస్తుండగా ప్రైజ్‌మనీ మాత్రం లేదు. లీగ్ దశ మ్యాచ్‌లలోనైతే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'ను ప్రకటించే సంప్రదాయం లేదు. ఇకపై దీనిలో మార్పు రానుంది. మరోవైపు మహిళల క్రికెట్‌కు సంబంధించిన అన్ని టోర్నీల్లోనూ, జూనియర్ క్రికెట్ టోర్నమెంట్‌లకు కూడా తాజా 'ప్రైజ్‌మనీ' నిర్ణయం వర్తిస్తుందని షా వెల్లడించారు. మంచి ప్రదర్శనకు తగిన గుర్తింపు ఇచ్చే వాతావరణాన్ని తాము నెలకొల్పుతున్నామని... బోర్డు అపెక్స్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు.

అక్టోబర్ 6న భారత్, పాక్ పోరు

మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల ● యూఏఈలో అక్టోబర్ 3 నుంచి 20 వరకు టోర్నీ

దుబాయ్: బంగ్లాదేశ్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు తరలి వెళ్లిన మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సోమవారం విడుదల చేసింది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు జరిగే ఈ టోర్నీని యూఏఈలోని రెండు వేదికల్లో (షార్జా, దుబాయ్) నిర్వహిస్తారు. రెండు మ్యాచ్‌లు ఉంటే... భారత కాలమానం ప్రకారం తొలి మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి... రెండో మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి జరుగుతాయి. టాప్-10 దేశాలు పోటీపడుతున్న ఈ టోర్నీలో మొత్తం 23 మ్యాచ్‌లున్నాయి. బంగ్లాదేశ్, స్కాట్లాండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో టోర్నీ మొదలవుతుంది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో... అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడుతుంది. అనంతరం అక్టోబర్ 9న శ్రీలంకతో, అక్టోబర్ 13న ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది. భారత్ సెమీఫైనల్ చేరుకుంటే అక్టోబర్ 17న దుబాయ్‌లో జరిగే తొలి సెమీఫైనల్లో ఆడుతుంది. అక్టోబర్ 20న దుబాయ్‌లో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. ఆస్ట్రేలియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. సెమీఫైనల్స్, ఫైనల్‌కు 'రిజర్వ్ డే' కేటాయించారు. మొత్తం 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంక... గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ జట్లున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1 వరకు 10 ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరుగుతాయి.



మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
అక్టోబర్ 3	బంగ్లాదేశ్ x స్కాట్లాండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 3	పాకిస్తాన్ x శ్రీలంక	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 4	దక్షిణాఫ్రికా x వెస్టిండీస్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 4	భారత్ x న్యూజిలాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 5	బంగ్లాదేశ్ x ఇంగ్లండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 5	ఆస్ట్రేలియా x శ్రీలంక	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 6	భారత్ x పాకిస్తాన్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 6	వెస్టిండీస్ x స్కాట్లాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 7	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 8	ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 9	దక్షిణాఫ్రికా x స్కాట్లాండ్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 9	భారత్ x శ్రీలంక	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 10	బంగ్లాదేశ్ x వెస్టిండీస్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 11	ఆస్ట్రేలియా x పాకిస్తాన్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 12	న్యూజిలాండ్ x శ్రీలంక	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 12	బంగ్లాదేశ్ x దక్షిణాఫ్రికా	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 13	ఇంగ్లండ్ x స్కాట్లాండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 13	భారత్ x ఆస్ట్రేలియా	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 14	పాకిస్తాన్ x న్యూజిలాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 15	ఇంగ్లండ్ x వెస్టిండీస్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 17	తొలి సెమీఫైనల్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 18	రెండో సెమీఫైనల్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 20	ఫైనల్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి

మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు



భారత్‌కు షాక్

'షూటౌట్'లో బంగ్లాదేశ్ చేతిలో ఓటమి

కఠ్మాండు: దక్షిణాసియా అండర్-20 పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు కథ ముగిసింది. బంగ్లాదేశ్ జట్టుతో సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత జట్టు 'షూటౌట్'లో 3-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో భారత ఆటగాళ్లు థాంగ్లాసున్ గాంగ్తె కొట్టిన తొలి షాట్‌ను... ఆకాశ్ టిర్కీ కొట్టిన ఐదో షాట్‌ను బంగ్లాదేశ్ గోల్‌కీపర్ మొహమ్మద్ ఆసిఫ్ నిలువరించాడు. భారత్ తరఫున ముగ్గురు ఆటగాళ్లు పరమ్‌వీర్, గౌయారీ, మన్‌జోత్ పర్మార్ 'షూటౌట్'లో సఫలమయ్యారు. బంగ్లాదేశ్ తరఫున 'షూటౌట్'లో మొహమ్మద్ పియాస్ అహ్మద్ నోవా, మోయినుల్ ఇస్లాం మొయిన్, షకీల్ ఆహాద్ టోపు, అష్రాఫుల్ హక్ విజయవంతమయ్యారు. ఫలితం తేలిపోవడంతో బంగ్లాదేశ్ ఐదో షాట్‌ను తీసుకోలేదు. అంతకుముందు ఆట 36వ నిమిషంలో అసాదుల్ ఇస్లాం గోల్‌తో బంగ్లాదేశ్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 74వ నిమిషంలో కెప్టెన్ రికీ మీటి గోల్‌తో భారత్ స్కోరును సమం చేసింది.

లెజెండ్స్ లీగ్ క్రికెట్‌లో ధావన్



ముంబై: అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్న భారత జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ వచ్చే నెలలో జరిగే లెజెండ్స్ లీగ్ క్రికెట్‌లో ఆడనున్నాడు. అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు గుడ్‌బై చెబితేనే భారత క్రికెటర్లు వేర్వేరు లీగ్‌లలో పాల్గొనేందుకు అర్హులవుతారు. 'నా శరీరం క్రికెట్ ఆడేందుకు అనువుగానే ఉంది. క్రికెట్ నుంచి నన్ను ఎవరూ వేరు చేయలేరు. మాజీ క్రికెటర్లతో కలిసి నా అభిమానులను అలరిస్తాను. కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తాను' అని 38 ఏళ్ల ధావన్ వ్యాఖ్యానించాడు. ధావన్ భారత్ తరఫున 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టి20 మ్యాచ్‌లు ఆడి ఓవరాల్‌గా 12,286 పరుగులు సాధించాడు.

ప్రపంచ చాంప్ డింగ్ లిరెన్‌తో ప్రజ్ఞానంద గేమ్ 'డ్రా'



సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ వరుసగా ఆరో 'డ్రా' నమోదు చేసుకున్నారు. ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను నల్ల పావులతో ఆడిన ప్రజ్ఞానంద 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. మాక్సిమి లాచెర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను గుకేశ్ 72 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్, ప్రజ్ఞానంద ఖాతాలో మూడు పాయింట్ల చొప్పున ఉన్నాయి. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా గుకేశ్ ఐదో స్థానంలో, ప్రజ్ఞానంద ఏడో స్థానంలో ఉన్నారు.

వెస్టిండీస్‌దే టి20 సిరీస్

తరూబా (ట్రినిడాడ్): దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో విండీస్ 30 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. ముందుగా వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. షై హోప్ (22 బంతుల్లో 41; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (22 బంతుల్లో 35; 1 ఫోర్, 3 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (18 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), అలిక్ అతనాజ్ (21 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం దక్షిణాఫ్రికా 19.4 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటైంది. హెన్‌డ్రిక్స్ (18 బంతుల్లో 44; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 28; 1 ఫోర్, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. బౌలింగ్‌లో రాణించిన రొమారియో షెఫర్డ్ (3/15) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. చివరి టి20 బుధవారం ఇదే మైదానంలో జరుగుతుంది.

షకీబ్‌పై ఐసీసీ చర్యలు

జరిమానా, డీ మెరిట్ పాయింట్



దుబాయ్: మైదానంలో తన ప్రవర్తనతో తరచూ వివాదాల్లో ఉండే బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ మరోసారి అలాంటి క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రదర్శించాడు. ఫలితంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అతనిపై చర్య తీసుకుంది. పాకిస్తాన్‌తో రావల్పిండిలో ముగిసిన తొలి టెస్టులో అతను మొహమ్మద్ రిజ్వాన్‌కు బౌలింగ్ చేసేందుకు రనప్ తీసుకొని క్రీజ్ వరకు రాగా... రిజ్వాన్ అప్పటికి సిద్ధంగా లేడు. అతను బంగ్లా కీపర్ లిటన్ దాస్ వైపు తిరిగి ఏదో మాట్లాడుతున్నాడు. దాంతో అసహనానికి గురైన షకీబ్ చేతిలో ఉన్న బంతిని కోపంగా రిజ్వాన్ వైపు విసిరాడు. అది రిజ్వాన్ తల మీదుగా వెళ్లింది. దీనిపై వెంటనే స్పందించిన అంపైర్ కెటిల్‌బారో కూడా షకీబ్‌ను ప్రశ్నించాడు. మ్యాచ్ అనంతరం అంపైర్ నివేదికపై రిఫరీ చర్య తీసుకున్నారు. ప్రమాదకరంగా బ్యాటర్ వైపు బంతిని విసిరిన షకీబ్ మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను శిక్షగా విధించారు.

జ్వెరెవ్ శుభారంభం



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ జ్వెరెవ్ 6-2, 6-7 (5/7), 6-3, 6-2తో మాక్సిమిలన్ మార్టెరర్ (జర్మనీ)పై గెలుపొందాడు. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ 21 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు 2020 చాంపియన్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. 13వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) గంటా 50 నిమిషాల్లో 6-4, 6-2, 6-2తో థీమ్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) కష్టపడి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో కిన్‌వెన్ జెంగ్ 4-6, 6-4, 6-2తో అనిసిమోవా (అమెరికా)పై గెలిచింది. 12వ సీడ్ దరియా కసత్‌కినా (రష్యా), 24వ సీడ్ డొనా వెకిచ్ (క్రొయేషియా), 27వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) కూడా తొలి రౌండ్‌లో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. మరోవైపు తొమ్మిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) గాయం కారణంగా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. యఫాన్ వాంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో సాకరి తొలి సెట్‌ను 2-6తో కోల్పోయింది. ఈ దశలో గాయం కారణంగా సాకరి మ్యాచ్ నుంచి తప్పుకుంది.

సినిమా

మనం ఒకటిగా పోరాడాలి!



● మహేశ్ బాబు

'నీకు ఒక కథ చెప్పే సమయం వచ్చింది.. నీలాగే ఉండే చిట్టి సింహాల కథ' అంటూ మొదలవుతుంది 'ముఫాసా: ద లయన్ కింగ్' సినిమా తెలుగు ట్రైలర్. 2019లో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'లయన్ కింగ్' సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ద లయన్‌కింగ్' రానుంది. ఆస్కార్ అవార్డు విజేత బారీ జెంకిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్, పాస్టెల్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 20న ఇంగ్లీష్, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమాలో హీరోగా కనిపించే ముఫాసాకు హీరో మహేశ్‌బాబు తెలుగు వాయిస్ ఓవర్ ఇచ్చారు. తాజాగా ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ని సోషల్ మీడియాలో షేర్ చేశారు మహేశ్‌బాబు. 'అప్పుడప్పుడు ఈ చల్లగాలి నా ఇంటి నుంచి వచ్చే జ్ఞాపకాలన్నీ గుర్తుచేస్తున్నట్లు అనిపిస్తుంది', 'అంతలోనే మాయం అవుతుంది', 'మనం ఒక్కటిగా పోరాడాలి' అంటూ మహేశ్ బాబు వాయిస్‌తో చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. అలాగే 'బయటి వాడు ఎప్పుడూ పగవాడే.. దూరం పెట్టాలి. తాకేనే మనకు కాబోయే రాజు' వంటి డైలాగులు కూడా ట్రైలర్‌లో వినిపిస్తాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలోని పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ వాయిస్ ఓవర్లు ఇచ్చారు.

గోల్డెన్ స్పారో



● ప్రియాంకా అరుల్

నటుడు, దర్శక-నిర్మాత ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తాజా తమిళ చిత్రం 'నిలువుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్'. ఈ రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేష్ మీనన్, రమ్య రంగనాథన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. కాగా ఈ చిత్రంలో హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్, ఈ చిత్ర సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అతిథి పాత్రల్లో నటించారు. ఈ సినిమా నుంచి 'గోల్డెన్ స్పారో' అనే పాట లిరికల్ వీడియోను ఈ నెల 30న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ పాటలోనే ప్రియాంక, జీవీ ప్రకాష్ అతిథులుగా కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. 'నిలువుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం.

మళ్లీ పెళ్లి చేసుకోవడం కష్టమే!

\- ఆమిర్ ఖాన్



''ప్రస్తుతం నా వయసు 59 ఏళ్లు. ఈ ఏజ్‌లో మళ్లీ పెళ్లి చేసుకోవడమంటే కష్టమే. ఎందుకంటే ఇప్పుడు నాకంటూ ఎన్నో బాధ్యతలు ఉన్నాయి'' అన్నారు హీరో ఆమిర్ ఖాన్. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్‌గా పేరు తెచ్చుకున్న ఆమిర్ ఖాన్ తాజాగా నటి రియా చక్రవర్తి నిర్వహిస్తున్న ఓ టీవీ షోలో పాల్గొన్నారు. వివాహ బంధం సక్సెస్ కావాలంటే ఏం చేయాలి? అనే ప్రశ్నకు ఆమిర్ ఖాన్ బదులిస్తూ..''ఒక బంధం సక్సెస్ లేదా ఫెయిల్యూర్ అనేది ఇద్దరు వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. వివాహ బంధం విషయంలో నేను రెండుసార్లు ఫెయిల్ అయ్యాను. అందుకే పెళ్లి విషయంలో నా సూచనలు తీసుకోకపోవడం మంచిది. నన్ను నేను మరింత బెటర్‌గా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. అలాగని నాకు ఒంటరిగా జీవించడం ఇష్టం ఉండదు. నాకంటూ ఒక భాగస్వామి ఉండాలని కోరుకుంటా. నా మాజీ సతీమణులు రీనా దత్తా, కిరణ్ రావులతో ఇప్పటికీ నాకెంతో మంచి అనుబంధం ఉంది. నా దృష్టిలో మేమంతా ఒకే కుటుంబం'' అన్నారు. 'మీకు మళ్లీ పెళ్లి చేసుకునే ఆలోచన ఉందా?' అనే ప్రశ్నకు ఆమిర్ ఖాన్ స్పందిస్తూ.. ''ప్రస్తుతం నా వయసు 59 ఏళ్లు. ఈ ఏజ్‌లో మళ్లీ పెళ్లి చేసుకోవడమంటే కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు నాకంటూ ఎన్నో బాధ్యతలు ఉన్నాయి. నా కుటుంబం, పిల్లలు, తోబుట్టువులు.. ఇలా చాలా మందితో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉంటున్నాను. అందుకు చాలా సంతోషంగా ఉంది'' అని ఆమిర్‌ఖాన్ తెలిపారు. కాగా ఆమిర్ ఖాన్-రీనా దత్తా 2002లో, ఆమిర్-కిరణ్‌రావు 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.


మధ్య తరగతి తల్లి కథ



● రచిత, కమల్ కామరాజు

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపొందుతోన్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి వి.శ్రీనివాస్(సిప్పీ) దర్శకత్వం వహిస్తున్నారు. ముత్యాల మూవీ మేకర్స్‌పై ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న తొలి చిత్రమిది. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. రచిత మహాలక్ష్మి, సాత్విక్, సాహిత్య, దేవీప్రసాద్, 'శుభలేఖ' సుధాకర్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస్ మాట్లాడుతూ- ''ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది. ఆమె మనోవేదన, సంఘర్షణను ఈ సినిమాలో ఆవిష్కరిస్తున్నాం'' అని చెప్పారు. ''తల్లి మనసుకు అద్దంపట్టే సినిమా ఇది'' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ''మా చిత్రం 30 శాతం షూటింగ్ పూర్తయింది. ఎడిటింగ్ పనులు కూడా జరుగుతున్నాయి'' అని అనంత కిశోర్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కోటి, కెమెరా: ఎన్. సుధాకర్ రెడ్డి.

పవర్‌ఫుల్ తిన్నడు



● అవ్రామ్

మంచు కుటుంబం నుంచి మూడో తరమైన అవ్రామ్ భక్త (మంచు విష్ణు తనయుడు) బాల నటుడిగా పరిచయమవుతున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శివ భక్తుడు కన్నప్పగా మంచు విష్ణు నటిస్తున్నారు. ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతి ముకుందన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. కాగా ప్రతీ సోమవారం 'కన్నప్ప' నుంచి ఒక్కో పాత్రను రివీల్ చేస్తున్నారు మేకర్స్. అందులో భాగంగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని అవ్రామ్ భక్త లుక్‌ని విడుదల చేశారు మోహన్ బాబు. ఈ పోస్టర్‌లో కాళీ మాత విగ్రహం ముందు పవర్ ఫుల్‌గా కనిపిస్తున్నాడు అవ్రామ్. 'కన్నప్ప'లో తిన్నడు బాల్యానికి సంబంధించిన పాత్రలో అవ్రామ్ కనిపించబోతున్నాడు. ఈ సినిమా డిసెంబరులో రిలీజ్ కానుంది.

స్పెషల్ ఏజెంట్స్



● ఫరియా, శ్రీ సింహా, సత్య

శ్రీ సింహా హీరోగా సత్య, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రల్లో రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'మత్తు వదలరా'. 2019లో రిలీజైన ఈ సినిమా హిట్‌గా నిలిచింది. కాగా శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా 'మత్తు వదలరా' సీక్వెల్‌గా రూపొందిన 'మత్తు వదలరా 2' చిత్రాన్ని సెప్టెంబరు 13న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ద్వితీయ భాగంలోనూ శ్రీ సింహాయే హీరోగా నటిస్తుండగా, రితేష్ రానా దర్శకుడు. చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మిస్తున్నారు. ''మత్తు వదలరా' లో డెలివరీ ఏజెంట్ బాబుగా శ్రీ సింహా, యేసుగా సత్య కనిపించారు. అయితే సీక్వెల్‌లో వీరు స్పెషల్ ఏజెంట్స్‌గా కనిపిస్తారు'' అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు కాలభైరవ సంగీతం అందిస్తున్నారు.

కామెడీ.. థ్రిల్



● ధృవ, ప్రజ్ఞా నయన్

ధృవవాయు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రజ్ఞా నయన్ హీరోయిన్. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 13న రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రెస్‌మీట్‌లో ధృవ వాయు మాట్లాడుతూ-''మా 'కళింగ' సినిమా కాన్సెప్ట్‌తో ఇప్పటివరకు తెలుగులో ఏ చిత్రం రాలేదు. ఇది రెగ్యులర్ మూవీ కాదు. ఎమోషన్స్, లవ్, కామెడీ, హారర్, థ్రిల్.. ఇలా అన్నీ అంశాలున్నాయి. అయితే ఈ అంశాలను మేం కావాలని పెట్టలేదు. కథ ప్రకారమే కుదిరాయి''అన్నారు. ''ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు ఓ మంచి అనుభూతితో బయటకు వస్తారు'' అని నిర్మాతలు దీప్తి, పృథ్వీ తెలిపారు.

ప్రేమ సందేశం



● ఎస్తేర్, శ్యామ్, హాన్విక

శ్యామ్ షెల్వన్, హాన్విక, రితిక, గ్రీష్మ, ఎస్తేర్ ప్రధాన పాత్రల్లో 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ' సినిమా షురూ అయింది. కిరణ్ దర్శకత్వంలో ఎంఎంఆర్ ఆర్ట్ క్రియేషన్స్‌పై మంద మల్లికార్జున రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి జీఎల్ ఫణికాంత్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత క్లాప్ కొట్టారు. కిరణ్ మాట్లాడుతూ-''ఈ చిత్రంలో మంచి ప్రేమకథతో పాటు చక్కని సందేశం కూడా ఉంటుంది. యువతతో పాటు కుటుంబ సమేతంగా చూసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''సెప్టెంబర్ ఒకటి నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం'' అని మంద మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: గాజుల శివ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మోహన్ కృష్ణ.

మాస్ మసాలా!



● జాకీ ష్రాఫ్

జాకీ ష్రాఫ్, సన్నీలియోన్, ప్రియమణి, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'క్యూ జీ: కొటేషన్ గ్యాంగ్'. ఎస్వీఆర్ శ్రీను సమర్పణలో వివేక్ కుమార్ కన్నన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ హక్కులను రుషికేశ్వర్ ఫిలింస్ అధినేత ఎం.వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'క్యూ జీ: కొటేషన్ గ్యాంగ్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి టి.ప్రసన్నకుమార్, దామోదర్ ప్రసాద్, శివనాగు గెస్ట్‌లుగా వచ్చారు. ఎం.వేణుగోపాల్ మాట్లాడుతూ-''ఇది ఒక మంచి మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులందరికీ మా సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''మా సినిమా విజయం సాధిస్తుంది'' అని ఎస్వీఆర్ శ్రీను తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
27-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
612	187
81,698	25,011

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,760	▽	119
డోజోన్స్	41,273	▲	97
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,328	▲	40
డాక్స్ (శుక్రవారం ముగింపు)	18,617	▽	16
షాంఘై	2,856	▲	1
నికాయ్	38,110	▽	254

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	72,042
బంగారం (99.5 స్వచ్ఛత)	71,754
వెండి (కేజీ)	86,191

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.42	84.44
£	బ్రిటన్ పౌండ్	[illegible]	109.53	112.14
€	యూరో	[illegible]	92.67	95.07
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	57.63	58.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.95	57.90
S$	సింగపూర్ డాలర్	[illegible]	62.19	66.57
SAR	సౌదీ రియాల్	[illegible]	21.49	23.03
UAE	యూఏఈ దిర్హామ్	[illegible]	21.97	23.73
¥	చైనా యువాన్	[illegible]	10.91	12.73

ఎకానమీ పటిష్టతే ఆర్‌బీఐ లక్ష్యం

- గవర్నర్ శక్తికాంతదాస్ ఉద్ఘాటన
- యూపీఐ ద్వారా విదేశాల నుంచి నగదు బదిలీ సౌలభ్యత విస్తృతి
- ఆర్‌బీఐ @ 90 గ్లోబల్ కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి ప్రసంగం



బెంగళూరు: దేశ ఆర్థిక రంగాన్ని పటిష్ఠంగా, చురుగ్గా, కస్టమర్‌కు స్నేహ పూర్వకమైనదిగా మార్చడానికి రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిరంతరం పనిచేస్తుందని గవర్నర్ శక్తికాంతదాస్ సోమవారం స్పష్టం చేశారు. ఇందుకు తగిన విధాన పరమైన చర్యలను తీసుకుంటుందని ఉద్ఘాటించారు. ఆర్‌బీఐ @ 90 గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై గవర్నర్ ప్రసంగిస్తూ, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్‌ఐ), సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీకి (సీబీడీసీ) సంబంధించి సెంట్రల్ బ్యాంక్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రస్తావించారు. విదేశాల నుంచి యూపీఐ ద్వారా నగదు బదిలీ సేవలను విస్తృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. గవర్నర్ చేసిన ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే...

- క్రాస్‌-బోర్డర్ రెమిటెన్స్‌లకు (విదేశాల నుంచి స్వదేశానికి డబ్బు పంపడానికి సంబంధించి) ప్రత్యామ్నాయంగా చౌకైన, వేగవంతమైన ఇన్‌స్ట్రుమెంట్‌గా యూపీఐ వ్యవస్థ పురోగమించనుంది. ప్రత్యేకించి తక్కువ విలువ కలిగిన వ్యక్తిగత రెమిటెన్స్‌ల విషయంలో విప్లవాత్మకమైన మార్పులకు యూపీఐ వ్యవస్థ నాంది పలకనుంది. జూలైలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ప్రకారం, సేవా ఎగుమతుల తర్వాత విదేశాల నుంచి వచ్చే నిధుల విషయంలో రెమిటెన్సులు రెండో స్థానాన్ని ఆక్రమించాయి. 2024 క్యాలెండర్ ఇయర్‌లో ఇవి 3.7 శాతం వృద్ధితో 124 బిలియన్ డాలర్లకు, 2025లో 4 శాతం వృద్ధితో 129 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది.
- రిజర్వ్ బ్యాంక్ గణనీయమైన ఆశావాదంతో ఆర్‌బీఐ @ 100 వైపు ప్రయాణం సాగిస్తోంది.
- అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల, డీపీఐ (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) థీమ్ విషయానికి వస్తే, గత దశాబ్ద కాలంలో సాంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలో అపూర్వమైన సాంకేతిక పరివర్తన చోటుచేసుకుంది.
- లావాదేవీల వ్యయాలను తగ్గించడం, ఆర్థిక సదుపాయాల అందుబాటు, ఇంటరాపరబిలిటీ విషయంలో పోటీ, ప్రైవేట్ మూలధనాన్ని ఆకర్షించడం, అందరికీ ఆర్థిక సేవల వంటి కీలక చర్యలను డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా ప్రోత్సహిస్తుంది.

యూరప్ మార్కెట్లో ఇంటర్‌గ్లోబ్ విస్తరణ

ప్యారిస్, బార్సెలోనాలో లగ్జరీ హోటల్స్

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ప్రధాన వాటాదారైన ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ యూరప్ మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించింది. మైరో బ్రాండ్ కింద ప్యారిస్, బార్సెలోనాలో ఎంట్రీ లెవెల్ లగ్జరీ లైఫ్‌స్టైల్ హోటళ్లను ప్రారంభించింది.



యూరప్‌లో మరిన్ని ప్రాపర్టీలను జోడించనున్నట్లు సంస్థ సీఈవో నీనా గుప్తా తెలిపారు. గత నెల ప్యారిస్‌లో 123 గదుల లె గ్రాండ్ హోటల్ కైరేని, ఈ నెల బార్సెలోనాలో 92 గదుల బోర్నెటా హోటల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. వచ్చే ఏడాది లండన్, వియెన్నాలో కూడా హోటల్స్‌ను నెలకొల్పుతామన్నారు.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశల జోష్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలతో ఐటీ, మెటల్, కన్జూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ 612 పాయింట్లు పెరిగి 81,698 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 187 పాయింట్లు పెరిగి 25 వేల స్థాయిపైన 25,011 వద్ద నిలిచింది. యూఎస్ ద్రవ్యోల్బణం, నిరుద్యోగ క్లెయిమ్స్ తగ్గడంతో పాలసీ సర్దుబాట్లకు సమయం ఆసన్నమైందంటూ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలతో ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్ల సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

- అమెరికా నుంచి అధిక ఆదాయాలను ఆర్జించే ఐటీ కంపెనీల షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ 3.50%, టెక్ మహీంద్రా 2.50%, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 2%, విప్రో 1.50%, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి.
- యూఎస్ డాలర్ బలహీనత, ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలు మెటల్ షేర్లకు ర్యాలీకి తోడ్పడ్డాయి. నాల్కో, సెయిల్, హిందాల్కో హిందుస్తాన్ కాపర్ షేర్లు 5–4%, ఎన్‌ఎండీసీ, వేదాంత, హిందుస్తాన్ జింక్ షేర్లు 3%, జిందాల్ స్టీల్ 2.50%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 2%, టాటా స్టీల్ ఒకశాతం పెరిగాయి.



- కన్‌స్ట్రక్షన్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రోడక్ట్స్ షేరు లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.900)తో పోలిస్తే 43% ప్రీమియంతో రూ.1,291 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 46% ఎగసి రూ.1,316 గరిష్టాన్ని తాకింది. చివరికి 33% పెరిగి రూ.1,196 వద్ద నిలిచింది.
- వరుసగా రెండో రోజూ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ పవర్, ఆర్‌కామ్ షేర్లు 5% పతనమై లోయర్ సర్క్యూట్ తాకాయి. రిలయన్స్ ఇన్ఫ్రా 3% పడింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధులు దుర్వినియోగం వల్ల అనిల్ తో సహా 24 సంస్థలు, వ్యక్తులకు జరిమానాతో పాటు ఐదేళ్లపాటు సెక్యూరిటీల మార్కెట్ల నుంచి సెబీ నిషేధం విధించడం తెలిసిందే.

కారు.. మేకోవర్ జోరు

ఖర్చెంతైనా సై!

కార్తీక్..
హైదరాబాద్‌లో యువ వ్యాపారవేత్త. కొత్తగా లగ్జరీ కారు కొన్నాడు. ఇందులో పెద్ద విశేషం ఏముంది అంటారా? కారు కోసం రూ. 1.5 కోట్లు ఖర్చుపెడితే.. అందులో తన అభిరుచికి తగ్గట్టుగా రకరకాల హంగులను జోడించడం కోసం సదరు కార్ల కంపెనీకి రూ. 50 లక్షలు చెల్లించాడు! కార్ల కస్టమైజేషన్ క్రేజ్‌కు ఇది జస్ట్ చిన్న ఉదాహరణ మాత్రమే...

దేశంలో యువ తరంగం ఇప్పుడు లగ్జరీ కారును కొనుగోలు చేయాలన్న తమ కలను సాకారం చేసుకోవడంతోనే సరిపెట్టడం లేదు. తమకు నచ్చినట్టుగా దాన్ని ముస్తాబు చేయడం కోసం లక్షల్లో ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడటం లేదు. కోరుకున్నట్లుగా కారును కస్టమైజ్ చేసుకోవడానికి సై అంటున్నారు. దీంతో కార్ల కంపెనీలు కూడా ఎలా కావాలంటే అలా.. ఏది కావాలంటే అది నేరుగా ప్లాంట్లలోనే మార్పుచేర్పులు చేసి కస్టమర్ల చెంతకు చేరుస్తున్నాయి. తాజాగా ఆడి ఇండియా భువనేశ్వర్‌లో ఒక కారు కొనుగోలుదారు కోసం 'ఆర్‌ఎస్ క్యూ8'లో 17 రకాల మార్పులు చేసి మరీ అందించడం విశేషం. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ప్రత్యేకమైన పెయింట్ షేడ్. 'జావా గ్రీన్'గా పిలిచే ఈ పెయింట్ వర్క్ ఒక్కదానికే కస్టమర్ ఏకంగా రూ. 12.29 లక్షలు వెచ్చించడం మేకోవర్ మేనియాకు నిదర్శనం. ఇక కోయంబత్తూరుకు చెందిన మరో యువ కార్ లవర్... ఆడి ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'ఆర్‌ఎస్ ఈ–ట్రాన్ జీటీ'ని ఎంతో ముచ్చటపడి కొనుక్కున్నాడు. దీనికి కార్బన్ ఫైబర్ రూఫ్, మ్యాట్రిక్స్ డిజైన్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్ (లైట్ బీమ్ ఫర్ఫెక్ట్‌గా పడేందుకు ఒక్కో హెడ్‌ల్యాంప్‌లో 10 లక్షల మైక్రో మిర్రర్లు ఉంటాయి), ఆల్–కాంటారా టెక్స్‌టైల్‌తో కూడిన స్టీరింగ్ వీల్ వంటి పలు రకాల హంగులను జోడించేందుకు పెట్టిన ఖర్చు రూ. 36 లక్షలు. ముంబైలో మెర్సిడెజ్ బెంజ్ జీ400డీ / ఏఎంజీ జీ63 మోడళ్లకు చెందిన మూడు కార్లను 30కి పైగా కస్టమైజేషన్లతో విక్రయించింది. ఈ మార్పుల కోసం కొనుగోలుదారులు జస్ట్ రూ.1.5 కోట్లు ధారపోశారట!

యువ కస్టమర్ల హల్ చల్

అరుదైన పెయింట్ వర్క్ దగ్గర నుంచి ప్రత్యేకంగా చేతితో మలిచిన లెదర్ ఇంటీరియర్స్.

నచ్చిన పరికరాలు, న్యూమరాలజీ, జ్యోతిష నమ్మకాలకు అనుగుణంగా స్పెషల్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇలా ప్రతిదీ సరికొత్త లగ్జరీయే. 'జీ–వ్యాగన్స్‌లో 70%, మేబ్యాక్ మోడళ్లలో 74% కస్టమర్లు **కోరుకున్న మార్పులతోనే అమ్ముడవుతున్నాయి.** రంగులు, మెటీరియల్, **ఫ్యాన్సీ నంబర్లు ఇలా తమ అభిరుచులకు** అదనంగా చెల్లించేందుకు మా **కొనుగోలుదారులు ఎప్పుడూ** సిద్ధమే' అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా **డీ సంతోష్ అయ్యర్ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.** ఈ డిమాండ్‌కు తోడు ఇప్పుడు దేశంలో లగ్జరీ కార్ల మార్కెట్ యువరక్తంతో పరవళ్లు తొక్కుతోంది. మెర్సిడెస్ బెంజ్ భారతీయ కస్టమర్ల సగటు వయస్సు 38 ఏళ్లే. ప్రపంచవ్యాప్తంగా మనోళ్లే ఈ కంపెనీకి యువ కొనుగోలుదారులు కావడం మరో విశేషం. 'కస్టమర్లు ప్రత్యేకతకు పెద్దపీట వేస్తున్నారు. తమ కార్లను వ్యక్తిత్వ చిహ్నంగా భావిస్తున్నారు' అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ చెబుతున్నారు. ఆడి భారతీయ కస్టమర్లు తమ కార్లలో హంగుల కోసం రూ. 70 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఇక మెర్సిడెస్ బెంజ్ విషయానికొస్తే, మేబ్యాక్, ఏఎంజీ వంటి టాప్–ఎండ్ మోడళ్ల కస్టమర్లు కారు ధరలో 20% కస్టమైజేషన్‌కు వెచ్చిస్తున్నారు. బీఎండబ్ల్యూ కస్టమర్లు రూ. 50 లక్షల వరకూ ఖర్చు పెట్టేందుకు రెడీగా ఉన్నారు. ఈ మోడల్స్‌లో చాలా కార్ల ప్రారంభ ధర రూ. 1.5 కోట్లు పైనే.

- లగ్జరీ కార్లలో హంగులకు లక్షల్లో ఖర్చు..
- భారతీయ యువతరం నయా ట్రెండ్..
- అరుదైన పెయింట్ నుంచి అదిరిపోయే ఇంటీరియర్ల వరకు..
- కొత్తదనం కోసం పరితపిస్తున్న కస్టమర్లు
- చిన్న నగరాల్లోనూ కస్టమైజేషన్ క్రేజ్



చిన్న నగరాల్లోనూ ట్రెండింగ్...

ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి బడా నగరాలే కాదు.. ఇప్పుడు కేరళ, తమిళనాడు, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోని చిన్న నగరాల కస్టమర్లు సైతం కస్టమైజేషన్ కోసం క్యూ కడుతున్నారు. కొచ్చిలోని ఓ మెర్సిడెస్ బెంజ్ కస్టమర్ 3 'ఏఎంజీ ఏ45ఎస్' కార్లను ప్రత్యేక 'గ్రీన్ హెల్ మ్యాగ్నో' పెయింట్ షేడ్‌తో కొన్నారు. ఒక్కో కారు ధరలో దీనికైన ఖర్చు 20% కావడం విశేషం. దేశీ లగ్జరీ కార్ల మార్కెట్లో 3 జర్మనీ దిగ్గజాల వాటా 85%. 2023లో ఇవి రికార్డు స్థాయిలో 47,000 వాహనాలను విక్రయించాయి. క్రితం ఏడాదితో పోలిస్తే 21 శాతం వృద్ధి నమోదైంది. ఇక దేశీ దిగ్గజం టాటా గ్రూపునకు చెందిన జాగ్వార్ ల్యాండ్‌రోవర్, వోల్వో కార్స్ కూడా కస్టమైజేషన్ ఆప్షన్లను అందిస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇళ్ల ధరలు 12 శాతం అప్
మెడ్‌ప్లస్ హెల్త్ నుంచి వార్‌బర్గ్ పింకస్ నిష్క్రమణ

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ డీఎంఈలో 997 సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషాలిటీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య, దంత వైద్య కళాశాలల్లోని వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషాలిటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 997.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ రెసిడెంట్(క్లినికల్)–425, సీనియర్ రెసిడెంట్(నాన్ క్లినికల్)–479, సూపర్ స్పెషాలిటీ–93.
- **స్పెషాలిటీలు:** జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, అనెస్థీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆఫ్తాల్మాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్/రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, డెంటిస్ట్రీ/డెంటల్ సర్జరీ, రేడియోథెరపీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ/సీవీటీ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, నియోనాటాలజీ.
- **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్) ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 44 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.70,000 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** పీజీ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఏడాది పనిచేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.08.2024.
- **వెబ్‌సైట్:** https://dme.ap.nic.in

జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిజం కోర్సుల్లో 2024–25 సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు–అర్హతలు

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం(పీజీడీజే):** కోర్సు వ్యవధి 12 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలి.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలి.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలి.
- **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సీజే):** కోర్సు వ్యవధి మూడు నెలలు. కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలి.
- ఈ కోర్సుల్ని రెగ్యులర్‌గానూ, దూర విద్యవిధానంలోనూ పూర్తిచేయొచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు. ఇంగ్లిష్ లేదా తెలుగును బోధనా మాధ్యమంగా ఎంపికచేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి.

ముఖ్య సమాచారం

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందటానికి చివరి తేది:** 2024, సెప్టెంబర్ 2.
- **అడ్మిషన్లు పొందటానికి చివరి తేది:** 2024, సెప్టెంబర్ 6.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apcj.in

మాంగ్ కొలువు.. ఇలా సులువు!

అంతర్జాతీయంగా దిగ్గజ సంస్థలు.. మెటా, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌లను సంక్షిప్తంగా మాంగ్(ఎంఏఏఎన్‌జీ)గా పేర్కొంటారు. మాంగ్ సంస్థల్లో కొలువులపై ఉద్యోగార్థుల్లో ఎంత క్రేజ్ ఉందో.. అంతే స్థాయిలో ఎంపిక ప్రక్రియ సంక్లిష్టంగా, సుదీర్ఘంగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు బీటెక్ చివరి సంవత్సరం నుంచే మాంగ్ కంపెనీల నియామక విధానంపై అవగాహన పెంచుకొని.. సాధన చేస్తే కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. మెటా, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌లో ఎంపిక ప్రక్రియ, కోరుకునే స్కిల్స్ తదితర వివరాలు..

- మెటా, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌కు ఎంఏఏఎన్‌జీ(మాంగ్) గా గుర్తింపు
- ఈ కంపెనీల ఎంపిక ప్రక్రియలో పలు దశలు
- కోర్, కోడింగ్, డెసిషన్ మేకింగ్ నైపుణ్యాలే కీలకం
- ఆకర్షణీయ వేతనాలతో ఆఫర్లు



ఐఐటీల నుంచి స్థానిక కాలేజీల విద్యార్థుల వరకూ.. మీ కలల కంపెనీ ఏదని అడిగితే.. చాలా మంది మెటా, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ పేర్లే చెబుతారు. కారణం.. ఈ కంపెనీలు అందించే వేతనాలు, కెరీర్ అవకాశాలు!! ఈ సంస్థలు ఆఫ్‌-క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కోసం తమ అధికారిక వెబ్‌సైట్స్, కెరీర్ డెవలప్‌మెంట్ సెల్స్ ద్వారా ఉద్యోగ ప్రకటనలు ఇస్తున్నాయి. దీని ఆధారంగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచే ఎంపిక ప్రక్రియ మొదలవుతుంది. మాంగ్ కంపెనీలు మూడు నుంచి ఆరు లేదా ఏడు రౌండ్లలో మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి నియామకాలు ఖరారు చేస్తాయి.

సీవీ స్క్రీనింగ్

మాంగ్ సంస్థల్లో ముందుగా సీవీ స్క్రీనింగ్‌తో ఎంపిక ప్రక్రియ మొదలవుతుంది. నోటిఫికేషన్లకు అనుగుణంగా వచ్చిన రెజ్యూమే/సీవీలను పరిశీలించి.. అందులో అభ్యర్థులు పేర్కొన్న విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. సదరు కొలువుకు ఎలా సరితూగుతారో తెలియజేయమని సూచిస్తారు. ఈ దశను విజయవంతంగా పూర్తి చేస్తే.. తదుపరి దశలో టెక్నికల్ రౌండ్ ఉంటుంది.

టెక్నికల్ టెస్ట్

టెక్నికల్ రౌండ్‌లో భాగంగా నిర్వహించే పరీక్ష టెక్నికల్ టెస్ట్. ఈ టెక్ టెస్ట్‌లో ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, కోడింగ్, డేటా స్ట్రక్చర్స్, డిజైన్ ఇంజనీరింగ్‌కు సంబంధించి అభ్యర్థుల నైపుణ్యాలను పరీక్షిస్తారు. నిర్దిష్టంగా ఏదైనా ఒక సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి ప్రోగ్రామింగ్ లేదా కోడింగ్ రాయమని సూచిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

- టెక్నికల్ రౌండ్‌లో టెక్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తదుపరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఈ ఇంటర్వ్యూను పలు సంస్థలు రెండు దశలుగా నిర్వహిస్తున్నాయి. అవి.. టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ. టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలో మరోమారు టెక్నికల్ నైపుణ్యాల (ప్రోగ్రామింగ్, కోడింగ్ తదితర)ను, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు.
- టెక్నికల్ ఇంటర్వ్యూ రౌండ్‌లో సత్తా చూపితే తర్వాత హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. సంస్థ విధి విధానాల గురించి వారికున్న అవగాహన, వ్యక్తిగత శక్తి సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ప్రధానంగా అభ్యర్థుల క్రియేటివిటీ, భవిష్యత్ లక్ష్యాలు, అనుభవం వంటి వాటిపై హెచ్‌ఆర్ ప్రతినిధులు ప్రశ్నలు అడుగుతారు. వీటికి సంతృప్తికరంగా సమాధానాలు ఇస్తే.. కొలువు ఖరారైనట్లే!

మెటా.. రిటెన్, ఓరల్ టెస్టులు

- నేటి మేటి కంపెనీగా పేరున్న మెటా(ఫేస్‌బుక్)లో ఎంపిక ప్రక్రియ నాలుగు నుంచి ఆరు వారాల పాటు సుదీర్ఘంగా కొనసాగుతుంది. సంస్థ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో ముందుగా టెలిఫోన్ సంభాషణ చేస్తారు. ఇందులో అభ్యర్థుల లక్ష్యాలు, అభిరుచులు, మెటాలో ఉద్యోగం పట్ల వాస్తవ ఆసక్తిని తెలుసుకుంటారు. ఆ తర్వాత టెలిఫోనిక్ లేదా వీడియో విధానంలో రెండు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటిలో అర్హత సాధిస్తే సంస్థ కార్యాలయంలో మరో మూడు లేదా నాలుగు రౌండ్లలో రిటెన్, ఓరల్ టెస్ట్‌లు ఉంటాయి. రిటెన్ టెస్ట్‌లో భాగంగా కోడింగ్‌కు సంబంధించి రెండు లేదా మూడు ప్రశ్నలు ఇచ్చి.. వాటిని పరిష్కరించమని అడుగుతారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి మౌఖిక పరీక్షలు (ఇంటర్వ్యూ రౌండ్స్) నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూలు టెలిఫోనిక్ లేదా వీడియో కాల్స్ రూపంలో ఉంటాయి. ఒక్కో రౌండ్ ఇంటర్వ్యూ దాదాపు 45 నిమిషాలపాటు కొనసాగుతుంది. మెటా సంస్థ మూడు రకాల ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. అవి.. కోడింగ్ ఇంటర్వ్యూ, డిజైన్ ఇంటర్వ్యూ, బిహేవియరల్ ఇంటర్వ్యూ. వీటినీ విజయవంతంగా పూర్తి చేస్తే కొలువు ఖరారైనట్లే!

అమెజాన్.. ఆన్‌లైన్ కోడింగ్ టెస్ట్

- అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ–కామర్స్ సంస్థ అమెజాన్‌లో ఉద్యోగం కోసం అభ్యర్థులకు అయిదు నుంచి ఆరు రౌండ్లలో ఇంటర్వ్యూలు, రాత పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా అభ్యర్థుల రెజ్యూమేను పరిశీలిస్తారు. ఇందులో పేర్కొన్న వివరాల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు సరితూగుతారని భావిస్తే.. సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధుల నుంచి ఎంపిక ప్రక్రియకు పిలుపు వస్తుంది. తొలుత రిటెన్/ఆన్‌లైన్ కోడింగ్ రౌండ్స్‌లో టెక్నికల్, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించేలా రాత పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఆప్టిట్యూడ్, టెక్నికల్, ప్రోగ్రామింగ్‌కు సంబంధించి ప్రశ్నలు అడుగుతారు.
- రాత పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఆన్‌లైన్ కోడింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- రిటెన్/ఆన్‌లైన్ కోడింగ్ టెస్ట్ రౌండ్లలో అర్హత పొందిన వారికి టెలిఫోనిక్ ఇంటర్వ్యూలు ఉంటాయి. తొలి టెలిఫోనిక్ ఇంటర్వ్యూలో అభ్యర్థుల రెజ్యూమే, అకడమిక్‌గా చేసిన ప్రాజెక్ట్‌ల వివరాలు తెలుసుకుంటారు. టెలిఫోనిక్ ఇంటర్వ్యూ తర్వాత సంస్థ కార్యాలయంలో ప్రత్యక్ష ఇంటర్వ్యూలకు(ఆన్–సైట్ ఇంటర్వ్యూ) పిలుస్తారు. మొదటి ఇంటర్వ్యూ అభ్యర్థుల్లోని అల్గారిథమ్ నైపుణ్యాలను తెలుసుకునేలా ఉంటుంది. ఆ తర్వాత రౌండ్‌లోనూ ఇవే నైపుణ్యాలను పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. మొదటి దశతో పోల్చితే రెండో దశలో ప్రశ్నల క్లిష్టత స్థాయి ఎక్కువగా ఉంటుంది. అనంతరం హెచ్‌ఆర్/హైరింగ్ మేనేజర్ రౌండ్స్ పేరిట ఇంటర్వ్యూ జరుగుతుంది. ఈ ఇంటర్వ్యూని పూర్తిగా టెక్నికల్ రౌండ్‌గా పేర్కొనొచ్చు. ఇందులో డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్, కొన్ని క్లిష్టమైన పజిల్స్ సాధనకు సంబంధించిన సమస్యలు అడుగుతారు. ఇందులో విజయం సాధించిన వారు, చివరగా బార్ రైజర్ రౌండ్ పేరుతో మరో ప్రక్రియలోనూ ప్రతిభ చూపాల్సి ఉంటుంది. బార్ రైజర్ రౌండ్‌లో సంస్థ దీర్ఘ కాలిక నియామక ప్రణాళికలకు అనుగుణంగా సదరు అభ్యర్థి సరితూగుతారో లేదో కంపెనీ నిపుణులు పరిశీలిస్తారు.
- అభ్యర్థులు తొలి దశ నుంచి ప్రదర్శించిన ప్రతిభను అన్ని కోణాల్లో పరిశీలించి కొలువుకు ఎంపిక చేస్తారు.

యాపిల్.. రెండు దశల్లో టెక్నికల్ రౌండ్

- యాపిల్ సంస్థలో తొలుత రెజ్యూమేలను స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత టెలిఫోనిక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో సంతృప్తికరంగా సమాధానాలిస్తే.. సంస్థ కార్యాలయంలో మూడు లేదా నాలుగు రౌండ్లలో ఇంటర్వ్యూలు ఉంటాయి.
- సంస్థ కార్యాలయంలో టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్లు జరుగుతాయి. టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు రెండు దశల్లో ఉంటాయి. వీటిలో ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై పట్టును పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. వీటిలో విజయం సాధిస్తే హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూలో.. టెక్నికల్, పర్సనల్, అకడమిక్ ప్రొఫైల్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. కొన్ని సందర్భాల్లో గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి. ఈ మొత్తం ప్రక్రియలో విజయం సాధిస్తే కొలువు ఖాయం అయినట్లే!

గూగుల్.. అంకిత భావానికి పెద్దపీట

గూగుల్‌లో అకడమిక్ నైపుణ్యాలతోపాటు అభ్యర్థి అంకిత భావం, విధి నిర్వహణ పరంగా అప్‌డేట్ అవ్వాలనే తపనకు నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఈ సంస్థలో దరఖాస్తు నుంచి ఆఫర్ వరకూ.. దాదాపు ఆరు వారాల పాటు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. రెజ్యూమె ఆధారంగా ఉద్యోగానికి సరితూగుతారనుకునే అభ్యర్థులకు తొలుత కోడింగ్ క్విజ్, ప్రోగ్రామింగ్ స్కిల్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ అసెస్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఇంటర్వ్యూల ప్రక్రియ మొదలవుతుంది. సంస్థలో ఇంటర్వ్యూలు ఒకే రోజు మూడు, నాలుగు రౌండ్లలో ఉంటాయి. ఈ ఇంటర్వ్యూలను స్ట్రక్చర్డ్ ఇంటర్వ్యూయింగ్, ఓపెన్ ఎండెడ్ కొశ్చన్స్‌గా పిలుస్తున్నారు. స్ట్రక్చర్డ్ ఇంటర్వ్యూల్లో టెక్నికల్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. ఓపెన్ ఎండెడ్ కొశ్చన్స్ విధానంలో అభ్యర్థులు ఒక సమస్యను ఎలా పరిష్కరిస్తారో తెలుసుకునే విధంగా ప్రశ్నలు అడుగుతారు. వీటిలో విజయం సాధిస్తే గూగుల్‌లో కొలువు సొంతమవుతుంది.

నెట్‌ఫ్లిక్స్‌లో ఇలా

నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ముందుగా టెలిఫోనిక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు సదరు ఉద్యోగానికి సరితూగే తత్వాన్ని, అకడమిక్స్‌ను విధి నిర్వహణలో అన్వయించగలిగే నైపుణ్యాన్ని తెలుసుకుంటారు. తర్వాత దశలో టెలిఫోనిక్ లేదా ముఖాముఖి ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ దశలో ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలో.. టెక్నికల్ అసెస్‌మెంట్ టెస్ట్‌లకు కూడా హాజరవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న జాబ్ రోల్ ఆధారంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. ఈ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా హెచ్‌ఆర్ ప్రతినిధులు అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని, పని సంస్కృతికి సరితూగే వైఖరిని పరిశీలించి.. సంబంధిత విభాగానికి సిఫార్సు చేస్తారు. సదరు విభాగాధిపతుల నిర్ణయం మేరకు ఆఫర్ ఖరారవుతుంది.

బిగ్.. హంబగ్!

క్యాంపస్ నియామకాల్లో ట్రెండ్ మారిందంటున్న నిపుణులు

పెద్ద కంపెనీల కోసం ఆరాట పడక్కర్లే | వాటితో మిడిల్ రేంజ్ కంపెనీల పోటీ.. | ఆ సంస్థల్లోనే వేతనాలు అధికం | వృత్తిలో దూసుకెళ్లే చాన్స్ అక్కడే | ఎక్స్‌ఫెనో అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాలేజీలో క్యాంపస్ నియామకాలున్నాయా? ఏయే కంపెనీలు వస్తాయి? వార్షిక ప్యాకేజీలు ఎలా ఉంటాయి? ఇంజనీరింగ్‌లో చేరే ప్రతీ విద్యార్థి ముందుగా వాకబు చేసే అంశాలివి. పెద్ద కంపెనీలు క్యాంపస్ నియామకాలు చేపడతాయంటే ఆ కాలేజీకి ఎగబడతారు. కానీ ఐటీ కంపెనీల వల్ల ఇప్పుడు ట్రెండ్ మారిందంటున్నారు నిపుణులు. పెద్ద పెద్ద ఐటీ కంపెనీల కన్నా... చిన్న మధ్య తరహా ఐటీ కంపెనీలే ఎక్కువ వేతనాలు ఇస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే నైపుణ్యం ఉన్న వారికి పెద్ద సంస్థల కన్నా భారీగా జీతాలు చెల్లిస్తున్నాయి. కోవిడ్ తర్వాత ఈ మార్పు స్పష్టంగా కన్పిస్తోందని స్పెషలిస్ట్ స్టాఫింగ్ కంపెనీ 'ఎక్స్‌ఫెనో' అధ్యయనంలో వెల్లడైంది.



దూసుకెళ్లే అవకాశాలు

దేశంలో ఐటీ సేవలు అందించే ఆరు కంపెనీల్లో దాదాపు 20 వేల మంది వేతనాలను పరిశీలించింది. వీళ్లంతా ఇంజనీరింగ్ పూర్తి చేసి, కొత్తగా ఐటీ ఉద్యోగాల్లో చేరినవాళ్ళే. వీళ్ళల్లో 74 శాతం మందికి ఏడాదికి రూ. 2.5 నుంచి రూ. 5 లక్షల వేతనం ఇస్తున్నారు. 12 శాతం మందికి రూ. 5.75 నుంచి రూ. 7 లక్షల వార్షిక వేతనం ఇస్తున్నారు. కేవలం 7 శాతం మంది మాత్రమే రూ. 7.5 లక్షల కన్నా ఎక్కువ వేతనం పొందుతున్నారు

- మధ్యస్థంగా ఉండే 10 ఐటీ సర్వీస్ కంపెనీల్లో 5 వేల మంది వేతనాలపై అధ్యయనం చేశారు. 57 శాతం మందికి రూ. 2.5–5 లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తున్నారు. 30 శాతం మందికి రూ.5.75 లక్షల ప్రారంభ వేతనం ఇస్తున్నాయి. 7 శాతం మందికి పెద్ద సంస్థలకన్నా ఎక్కువ వేతనం చెల్లిస్తున్నాయి.
- ఆరు పెద్ద కంపెనీల్లో రెండేళ్ల తర్వాతే పదోన్నతులు లభిస్తున్నాయి. వేతనంలో హైక్ నిమిత్తం మధ్యస్థ కంపెనీలు ప్రతీ ఆరు నెలలకూ వృత్తి నైపుణ్య అంచనా వేస్తున్నాయి. 58 శాతం ఫ్రెషర్స్‌కు స్కిల్‌ను బట్టి ప్రమోషన్లు ఇచ్చారు.

కోతకు చాన్స్ తక్కువే

గడచిన ఐదేళ్లుగా టైర్-1 ఐటీ కంపెనీలు భారీగా ఉద్యోగులను తగ్గించుకున్నాయి. ఆరు కంపెనీల్లో 15 శాతం మేర కోత పెట్టాయి. హై స్కిల్ ఉండి, మధ్యస్థ వేతనం ఉన్న వాళ్ళనే కొనసాగించేందుకు ఇష్టపడుతున్నాయి. ఫ్రెషర్స్ విషయంలో పరిస్థితి దయనీయంగా ఉంటోంది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయంగా వచ్చే పరిస్థితులను పెద్ద కంపెనీలు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. చిన్న, మధ్యస్థ ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల, స్కిల్స్ ఉంటే అంత తొందరగా తీసేసే అవకాశం ఉండదు. కాబట్టి వేగంగా ప్రమాదం ముంచుకొస్తుందన్న భయం ఉండదని ఉద్యోగులు భావిస్తున్నారు. పెద్ద కంపెనీల ఉద్యోగుల్లో అనుక్షణం భయం వెంటాడుతోంది.

ట్రెండ్‌ను కాలేజీలూ పట్టుకోవాలి

ప్రతీ ఇంజనీరింగ్ కాలేజీలో కూడా క్యాంపస్ నియామకాలకు సంబంధించిన విభాగం ఉంటుంది. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నాయి. అయితే, పెద్ద కంపెనీల మనోభావాలనే ఈ శిక్షణలో భాగస్వామ్యం చేస్తున్నాయి. దీంతో పాటు చిన్న, మధ్యస్థ ఐటీ సంస్థల అవసరాలు, అవి ఆఫర్ చేస్తున్న జాబ్ మార్కెట్‌పైనా అవగాహన కల్పించాలని హైదరాబాద్‌లోని ఓ మల్టీ నేషనల్ కంపెనీ సీనియర్ కన్సల్టెంట్ విశేష్ తెలిపారు. క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్‌లో ఫ్రెషర్స్‌కు పెద్ద కంపెనీలకన్నా, చిన్న కంపెనీలే అత్యధిక వేతనాలు ఇస్తున్నాయి. ఈ దిశగా శిక్షణ ఇస్తే విద్యార్థుల ఉపాధి అవకాశాల్లో మార్పులుండే వీలుంది.

వేతనాల్లో పెద్ద వాటితో పోటీ..

ఉద్యోగి నిర్వహించే పాత్ర, అతని అనుభవాన్ని బట్టి కంపెనీల్లో వేతనాలుంటున్నాయి. ఈ విషయంలో పెద్ద కంపెనీలతో చిన్న కంపెనీలు ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇది ఈ మధ్య కన్పిస్తున్న కొత్త ట్రెండ్.

రోహన్ సిల్వెస్టర్ (టాలెంట్ స్ట్రాటజీ అడ్వైజర్, ఇన్‌డీడ్ ఇండియా)

నిలబడేందుకు పోరాటం

చిన్న, మధ్యస్థ కంపెనీలు తమ ఉనికిని నిలబెట్టుకునేందుకు ఓ రకంగా పోరాటం చేస్తున్నాయి. మార్కెట్లో నిలబడాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ కారణంగా నైపుణ్యం ఉన్న ఫ్రెషర్స్‌కు పెద్ద కంపెనీల కన్నా 30 నుంచి 50 శాతం వేతనాలు ఎక్కువ ఇచ్చి చేర్చుకుంటున్నాయి. పదేళ్ళ నికర వృద్ధిలో ఇవి కూడా అత్యుత్తమ ప్రమాణాలకు చేరుకోవడం ఇక్కడ గమనించాల్సిన అంశం.

నీలమ్‌కౌర్ (ఐటీ ప్రొఫెషనల్, ముంబై)

చిక్కులు తెస్తున్న ఆర్థికాంశాలు

ఆర్థిక మాంద్యం పెద్ద కంపెనీ ఉద్యోగుల స్థితిగతులను మారుస్తోంది. ఈ ప్రభావం చిన్న, మధ్యస్థ కంపెనీల్లో తక్కువగా ఉంటోంది. కొన్ని అంతర్జాతీయ కంపెనీలు కూడా ఐటీ సేవల్లో ఈ సంస్థలకే ప్రాధాన్యమిచ్చే ధోరణి కన్పిస్తోంది. కాబట్టి స్కిల్స్ ఉన్న వాళ్ళకు చిన్న కంపెనీల్లోనూ ఢోకా ఉండదు.

ఎంఎస్ ప్రసాద్ (టైర్-1 కంపెనీలో వర్క్‌ఫోర్స్ హెడ్)

క్లుప్తంగా...

యాదాద్రిలో నేటి నుంచి కణ్ణన్ తిరునక్షత్ర వేడుకలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు కణ్ణన్ తిరు నక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజుల పాటు తిరునక్షత్ర వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. తిరు నక్షత్ర వేడుకల్లో భాగంగా 29న సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో శిఖ్యోత్సవం (ఉట్లు కొట్టుట) నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి శ్రీస్వామివారి ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం జరిపించనున్నట్లు తెలిపారు. మంగళవారం నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేసినట్టు వెల్లడించారు.

ఏనుగుల గుంపు దాడి.. రైతు కూలీ దుర్మరణం



కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం వన్నాం గ్రామంలో సోమవారం ఏనుగుల గుంపు దాడిలో వాన శివున్నాయుడు(69) అనే రైతు కూలీ ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివున్నాయుడు గ్రామ సమీపంలో అరటి తోటలో కూలి పనులకు వెళ్లాడు. పని ముగించుకుని పక్కనే ఉన్న వాగులో స్నానం చేసి ఇంటికి వస్తుండగా అరటి తోట నుంచి ఏనుగుల గుంపు దాడి చేసింది. కాళ్లతో తొక్కేయడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ నీలకంఠం, అటవీశాఖ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జోరు వానలోనూ పరుగు



బీచ్‌రోడ్డు: ప్రతిష్టాత్మకమైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం ఆర్కేబీచ్‌లో ఉత్సాహంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే అభ్యర్థులు బీచ్‌కు చేరుకుని వర్షాన్ని లెక్క చేయకుండా పరుగు పోటీలో పాల్గొన్నారు. తొలుత ర్యాలీ పోర్టు స్టేడియంలో నిర్వహించాలనుకున్నారు. ఆదివారం రాత్రి భారీ వర్షం పడటంతో ట్రాక్ అంతా తడిసిపోయింది. దీంతో బురదగా ఉండి, జారుతుందనే ఉద్దేశంతో కలెక్టర్ హరేందీర ప్రసాద్ సూచనతో అధికారులు ర్యాలీని ఆర్కేబీచ్‌కు మార్చారు. అభ్యర్థులు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ర్యాలీ మొత్తాన్ని అధికారులు కెమెరాలో నిక్షిప్తం చేశారు.

హైదరాబాద్‌లో 'డేట్ డ్రగ్'

- 8.5 కేజీల ఎంఫెటమైన్ స్వాధీనం.. ముగ్గురిని అరెస్ట్ చేసిన హెచ్–న్యూ, బోయిన్‌పల్లి పోలీసులు
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి





స్వాధీనం చేసుకున్న ఎంఫెటమైన్



కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన రియాక్టర్

సాక్షి, హైదరాబాద్ : డేట్ డ్రగ్ ఎంఫెటమైన్ (8.5 కేజీలు) భారీస్థాయిలో పట్టుబడింది. దీనిని రేప్ డ్రగ్ అని కూడా అంటారు. డేటింగ్ పేరుతో యువతులను తీసుకెళ్లి వారికి తెలియకుండా వారు తాగే నీరు, కూల్‌డ్రింక్స్‌లో కలిపి ఇచ్చేసి అప స్మారక స్థితిలోకి చేరాక అఘాయిత్యాలకు పాల్పడటానికి కొందరు ఈ డ్రగ్‌ను వినియోగిస్తారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.8.5 కోట్లు ఉంటుందని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీసీపీలు సాధన రష్మి పెరుమాళ్, వైవీఎస్.సుధీంద్రలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో హైదరాబాద్ సీపీ ఆ వివరాలు వెల్లడించారు. బౌరంపేటకు చెందిన గోసుకొండ అంజిరెడ్డి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో చంద్రారెడ్డి గార్డెన్స్ పేరుతో ఫంక్షన్‌హాల్, స్విమ్మింగ్ పూల్ నిర్వహించేవాడు. సాయికుమార్‌గౌడ్, రాకేశ్ కొన్నాళ్ల క్రితం ఫార్మా కంపెనీల్లో పనిచేశారు. వీరికి కెమికల్ ప్రాసెసింగ్‌పై పట్టు ఉంది. వీరితో కలిసి అల్ప్రాజోలం తయారు చేయాలని అంజిరెడ్డి పథకం వేశాడు. కొత్తపల్లికి చెందిన ప్రభాకర్‌గౌడ్ సహకారంతో అదే గ్రామంలో ఓ కోళ్ల ఫారం అద్దెకు తీసుకున్నారు. అందులో ఓ గదిలో డ్రగ్స్ ప్రాసెసింగ్‌కు అవసరమైన రియాక్టర్ ఏర్పాటు చేశారు. అంజిరెడ్డి బాలానగర్ నుంచి ముడి సరుకులు ఖరీదు చేసి ఇచ్చేవాడు. వీటిని వినియోగించి సాయి, రాకేశ్‌లు అల్ప్రాజోలం, ఎంఫిటమైన్ తయారు చేసేవారు. డిప్రెషన్ వంటి రుగ్మతలకు వైద్యుల చీటీ ఆధారంగా విక్రయించే ఔషధాలను తయారు చేయడానికి ఈ రెండింటినీ వాడతారు. వీటిని దుర్వినియోగం చేస్తూ మాదకద్రవ్యాలుగా వీరు విక్రయించడం మొదలు పెట్టారు.

టీజీ ఏఎన్‌బీకి ఫిర్యాదుతో....

ల్యాబ్‌లో మిగిలిన రసాయన వ్యర్థాలను కొత్తపల్లి శివార్లలో పడేసేవారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్కడ వస్తున్న వాసనలతో స్థానికులు దీనిపై టీజీ ఏఎన్‌బీకి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు జూన్ 18న దాడి చేసి అంజిరెడ్డి తదితరులను అరెస్టు చేసి 2.6 కేజీల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. ఇదే ల్యాబ్‌లో అంజిరెడ్డి ఎంఫిటమైన్ తయారు చేయించాడు. అరెస్టు కావడానికి పదిరోజుల ముందు తన అనుచరుడైన కుంచల నాగరాజును పిలిచాడు. తన వద్ద ఉన్న 8.5 కేజీల ఎంఫిటమైన్‌ను అప్పగించి భద్రపరచాలన్నాడు. అంజిరెడ్డి అరెస్టు కావడం.. జైలుకు వెళ్లి రెండు నెలలు దాటినా అతడు బయటకు రాకపోవడంతో నాగరాజు ఆ సరుకును ముందు గ్రామం నుంచి నగరానికి చేరుద్దామని, ఆపై ఖరీదు చేయడానికి ఆసక్తి చూపిన వారికి విక్రయిద్దామని భావించాడు. దీనికోసం వినోద్‌కుమార్‌గౌడ్, శ్రీశైలంలను సంప్రదించాడు. ఈ ముగ్గురూ కలిసి వాహనంలో ఎంఫిటమైన్ పెట్టుకొని బయలుదేరారు. దీనిపై హెచ్–న్యూకు సమాచారం అందింది.

బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద కాపుకాసి...

ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, డానియేల్, బోయిన్‌పల్లి ఇన్ స్పెక్టర్ బి.లక్ష్మీనారాయణరెడ్డి బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద కాపుకాశారు. అటుగా వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఎంఫిటమైన్ దొరికింది. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి డ్రగ్‌తో పాటు వాహనం స్వాధీనం చేసుకున్నారు. 'అత్యంత తీవ్ర ప్రభావం చూపే ఈ డ్రగ్‌ను ముక్కు ద్వారా పీల్చడం, నీరు/కూల్‌డ్రింక్స్‌లో కలిపి తాగడం, నీళ్లల్లో కలిపి ఇంజెక్షన్‌లా చేసుకోవడం ద్వారా సేవిస్తుంటారు. అనేక మందికి తెలియకుండానే దీనిని కూల్‌డ్రింక్‌లో కలిపి ఇచ్చి వారినీ బానిసలుగా మారు స్తారు. ఈ నేపథ్యంలోనే అపరిచితులు, డ్రగ్స్ అలవాటు ఉన్నవారు ఇచ్చే పార్టీలకు యువత వెళ్లకూడదు. ఈ కేసులో అంజిరెడ్డి కూడా నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం జైల్లో ఉన్న అతడిని పీటీ వారెంట్‌పై అరెస్టు చేస్తాం' అని కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

టైరుతో ఈత.. కావడి మోత




జంపన్నవాగుతో గిరిజనుల కష్టాలు



ఏటూరునాగారం: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటాలంటే ఆ గ్రామస్తులకు ట్రాక్టర్ టైరే గత్యంతరం. విద్యార్థులు హాస్టళ్లకు వెళ్లాలంటే అడవి బాటలో పుస్తకాల మోతకు కావడే శరణ్యం. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామానికి రోడ్డు మార్గంలేక స్థానికులు దినదినగండంగా గడుపుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జంపన్నవాగు ఉప్పొంగడంతో ఎలిశెట్టిపల్లి, కొత్తూరు గ్రామాలనుంచి బన్నాజీబంధం గ్రామానికి రాకపోకలు తెగిపోయాయి. వాగు ఉధృతి పెరగడంతో అవసరాలను తీర్చుకునేందుకు గ్రామస్తులు ట్రాక్టర్ టైర్ ఆసరాగా ప్రవాహం దాటుతున్నారు. మరోవైపు పండుగ కోసం అడవి మార్గంలో ఇంటికి వచ్చిన చిన్నారులు.. తిరిగి హాస్టల్‌కు పై గ్రామాల నుంచి మండల కేంద్రానికి నడకదారిలో చేరుకున్నారు. పుస్తకాలు, బట్టలను కావడిలో భుజాలపై మోసుకుంటూ రావలసి వచ్చింది.

టుడేస్ గ్రాఫిక్

వివిధ దేశాల్లో సగటు పెళ్లి వయసు (టాప్ -10)



సారూ.. కొడుకులు బువ్వ పెడుతలేరు



నర్సవ్వతో మాట్లాడుతున్న అధికారులు

తిమ్మాపూర్(మానకొండూర్): ఆస్తులు తీసుకుని తల్లిని గెంటేసిన నలుగురు కొడుకుల నిర్వాకంపై ఆ తల్లి చివరకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అలుగునూరుకి చెందిన వేముల నర్సవ్వకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లు. వీరిలో ఓ కుమారుడు, ఓ కూతురు మరణించారు. భర్త చనిపోయినప్పటి నుంచి నర్సవ్వ కొడుకుల వద్దనే ఉంటూ జీవనం సాగిస్తోంది. ఒక్కో కుమారుడి వద్ద 15 రోజులపాటు ఉంటోంది. పెద్ద కొడుకు లక్ష్మణ్, చిన్న కొడుకు రవి వద్ద మూడు నెలలపాటు ఉండగా, మరో కొడుకు ఆమెను తీసుకెళ్లడానికి నిరాకరించారు. విషయం తెలిసినప్పటికీ మిగిలిన ఇద్దరూ స్పందించకపోవడంతో ఆదివారం సాయంత్రం ఎల్‌ఎండీ పోలీసుల వద్దకు వెళ్లి గోడువెళ్లబోసుకుని కూతురు ఇంటికి వెళ్లింది. ఎస్సై చేరాలు స్పందించి ఆమె కొడుకులతో మాట్లాడారు. మహిళా శిశు వికలాంగుల వృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో రఫీయొద్దీన్ వివరాలు తెలుసుకుని ఆమె కుమారులను పిలిపించి న్యాయం చేయాలని ఎస్సైకి సూచించారు.

ఏఐని వాడుకుంటాం

ప్రయోగాలు విజయవంతమైతే అటానమస్

- వాహనాలను రోడ్లపైకి తెచ్చే అంశం పరిశీలిస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ఐఐటీహెచ్‌లో డ్రైవర్ రహిత వాహనంలో ప్రయాణించిన మంత్రి



ఐఐటీహెచ్‌లో డ్రైవర్ రహిత వాహనంలో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డైరెక్టర్ బీఎస్.మూర్తి.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వ శాఖల్లో మెరుగైన సేవలందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), హైదరాబాద్ ఐఐటీలో అభివృద్ధి చేస్తున్న సాంకేతికతను వాడుకునే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇప్పటికే డ్రోన్ల ద్వారా పంటలకు మందులు పిచికారీ చేసే విధానాన్ని వ్యవసాయశాఖ వినియోగిస్తోందని, అలాగే రవాణా, హెల్త్ కేర్ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటున్నామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో పరిశోధన విభాగం టీహాన్ అభివృద్ధి చేస్తున్న డ్రైవర్ రహిత (అటానమస్ నావిగేషన్) వాహనాన్ని పరిశీలించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి ఈ వాహనంలో ప్రయాణించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమెరికా, యూకే, యూరప్ దేశాల్లో మాదిరిగా మన దేశంలోని రోడ్లు, ట్రాఫిక్ తీరుకు అనుగుణంగా పనిచేసే డ్రైవర్ రహిత వాహన టెక్నాలజీని హైదరాబాద్ ఐఐటీ అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ వాహనాలను రోడ్లపైకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఈ పరిశోధనకు సహకరిస్తున్న జపాన్‌కు చెందిన సుజుకీ కంపెనీ ప్రతినిధులను, పరిశోధన విభాగం విద్యార్థులు, ప్రొఫెసర్లను మంత్రి అభినందించారు.

ఐఐటీని ఇక్కడకు తీసుకొచ్చింది వైఎస్సే

దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థల్లో ఒకటైన ఈ హైదరాబాద్ ఐఐటీని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి సంగారెడ్డి జిల్లా కందిలో స్థాపించారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేశారు. స్కిల్స్ యూనివర్సిటీలో ఒక డైరెక్టర్‌గా ఉండాలని మంత్రి హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తిని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీహాన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

హైదరాబాద్ డాక్టర్ రఘురామ్‌కు అరుదైన గౌరవం

- అంతర్జాతీయ శస్త్రచికిత్స సమాఖ్య ఫెలోషిప్ అందుకున్న వైద్యుడు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన కిమ్స్–ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజెస్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిళ్లరిశెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఫెలోషిప్ అందుకున్నారు. అంతర్జాతీయ శస్త్రచికిత్స సమాఖ్య (ఐఎస్ఎస్) గౌరవ ఫెలోషిప్‌ను స్వీకరించి అరుదైన గౌరవాన్ని పొందారు. మలేసియా పశ్చిమ భాగంలోని నెగ్రి సెంబిలన్‌కు చెందిన రాచ కుటుంబ సభ్యుడు హిజ్ రాయల్ హైనెస్ తువంకు ముఖ్రిజ్ ఈ ఫెలోషిప్‌ను అందించినట్లు డాక్టర్ రఘురామ్ వెల్లడించారు. ఈ గౌరవాన్ని పొందిన అతి పిన్నవయస్కుడు, ఏకైక శస్త్రచికిత్స నిపుణుడు రఘురామ్. కౌలాలంపూర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 50వ గోల్డెన్ జూబ్లీ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ సర్జరీ ప్రారంభ వేడుకలో ఈ ఫెలోషిప్‌ను అందుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ప్రారంభమైన ఈ సదస్సు ఈ నెల 29 వరకు జరుగుతుందని, 30 దేశాలకు చెందిన 1,500 మందికిపైగా శస్త్రచికిత్స నిపుణులు ఇందులో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. పద్మశ్రీ, డాక్టర్ బీసీ రాయ్ వంటి పురస్కారాలను అందుకున్న డాక్టర్ రఘురామ్ గత 25 ఏళ్లలో అనేక ప్రతిష్టాత్మక గౌరవ ఫెలోషిప్‌లను స్వీకరించారు. దేశంలో బ్రెస్ట్ కేన్సర్ వైద్య రంగంలో ఆయన విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారు. ఆయన ప్రపంచంలోనే మొదటి బ్రెస్ట్ హెల్త్ మొబైల్ ఫోన్ యాప్‌ను ఇంగ్లిషు సహా 11 భారతీయ భాషలలో అభివృద్ధి చేశారు.

అద్దెకు బీఎస్‌ఎన్‌ఎల్ ఆస్తులు



పెద్దపల్లి రూరల్: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) ఆస్తులను అద్దెకు ఇవ్వాలని ఆ శాఖాధికారులు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరిఖని, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని భవనాలను ఇదే ప్రాతిపదికన అప్పగించనున్నారు. టెలికాం రంగంలో నెలకొన్న పోటీతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య తగ్గిపోతోంది. దీంతో కార్యాలయంలో సిబ్బంది కూడా తగ్గిపోయారు. ఈ కారణంగా బీఎస్ఎన్ఎల్ భవనాలను ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఎల్ఐసీలాంటి సంస్థలకు లీజ్‌కు ఇవ్వనున్నట్లు పెద్దపల్లి ఎస్‌డీఈ మహేందర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ భవనంతోపాటు సమీపంలోని చందపల్లి, తుర్కలమద్దికుంటలో గల భవనాలను సైతం నిబంధనలకనుగుణంగా లీజుకు ఇస్తామని వివరించారు.

బెయిల్ వస్తే ఓకే.. రాకుంటే ఎలా?

కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు సుప్రీంలో విచారణ
న్యాయవాదులతో కేటీఆర్, హరీశ్ భేటీ
దాదాపు రెండు గంటల పాటు చర్చలు



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ విషయంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ దాదాపు 150 రోజులకు పైగా తీహార్ జైలులో ఉన్న ఆమె బెయి లు పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కవిత బెయిల్ విషయంలో కౌంటర్లు దాఖలు చేసేందుకు ఆలస్యమెందుకంటూ ఈనెల 12న సుప్రీంకోర్టు ఈడీని ప్రశ్నించింది. దీనితో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోర్టును ఈడీ అడగ్గా.. విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది. మంగళవారం కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగనున్న నేప థ్యంలో.. కేటీఆర్, హరీశ్ తదితరులు సోమవారం ఢిల్లీలో న్యాయవాదులతో భేటీ అయ్యారు. 2 గంటల పాటు సుప్రీం కోర్టులో వాదించబోయే అంశాలపై చర్చించారు. కాగా, కోర్టు నిర్ణయం అనంతరం సాయంత్రం ఎమ్మెల్యేల అనర్హత అంశంపై మరోమారు న్యాయబృందంతో చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

బెయిల్‌పై ఆశాభావంతో..: కవిత 154 రోజుల నుంచి తీహార్ జైలులోనే ఉన్నారు. మంగళవారం సుప్రీంకోర్టులో ఆమె బెయిల్ పిటిషన్‌పై వాదనల నేపథ్యంలో ఢిల్లీకి చేరుకున్న కేటీఆర్, హరీశ్‌లు న్యాయవాది మోహిత్‌రావు బృందంతో సుదీర్ఘమైన చర్చలు జరిపారు. 'బెయిల్ వస్తే ఓకే.. ఒకవేళ బెయిల్ రాని పక్షంలో తదుపరి కార్యాచరణ ఏమిటి? న్యాయ పోరాటం ఎలా చేయాలి'అనే అంశాలపై చర్చించారు. బెయిల్‌పై కౌంటర్ దాఖలు విషయంలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారంటూ ఈడీని సుప్రీంకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో ఈ సారి కవితకు బెయిల్ వస్తుందని ఆమె కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు.

మహిళగా కవితకు మినహాయింపు ఇవ్వండి

పీఎంఎల్ఏ సెక్షన్–45లోని కఠిన నిబంధనల నుంచి మహిళగా ఎమ్మెల్సీ కవితకు మినహాయింపు ఇవ్వాలని ఆమె తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టును కోరారు. ఇప్పటికే కవిత హైబీపీతో బాధ పడుతున్నారు. పదికేజీలకు పైగా బరువు తగ్గారు. మరోపక్క జ్వరంతో బాధపడుతూనే ఉన్నారు. వీటన్నింటికంటే ఆమె దీర్ఘకాలికంగా ఉన్న గైనిక్ సమస్యల వల్ల మరింత ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని న్యాయబృందం సుప్రీం కోర్టుకు నివేదించనుంది. పీఎంఎల్ఏ సెక్షన్–45లోని కఠిన నిబంధనల నుంచి కవితకు మినహాయింపు ఇచ్చి బెయిల్ మంజూరు చేయాలని సర్వోన్నత న్యాయస్థానానికి విన్నవించేందుకు ఆమె తరఫు న్యాయవాదులు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా కవితకు ఉన్న అనారోగ్య సమస్యలపై ఢిల్లీ ఎయిమ్స్ ఇచ్చిన రిపోర్టులను ఈడీ అధికారులు న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టనున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని న్యాయస్థానం బెయిలు మంజూరు చేస్తుందా లేక వాయిదా వేస్తుందా అన్న అంశంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్ హెల్త్
మంగళవారం ॥ 27-8-2024



ఇటీవల అధిక బరువు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సమస్యగా మారింది. ముఖ్యంగా మహిళల్లో బరువు పెరుగుతున్న వారి సంఖ్య గణనీయంగా ఉందని జాతీయ కుటుంబ సర్వే వెల్లడించింది. తెలంగాణలో బరువు ఎక్కువగా ఉన్న మహిళల సంఖ్య 28.6 శాతం నుంచి 30.1 శాతానికి, ఏపీలో 33.2 నుంచి 36.3 శాతానికి ఎగబాకిందని ఆ సర్వేలో పేర్కొంది. ఊబకాయం తెచ్చే అనర్థాలూ, బరువు తగ్గడానికి కొన్ని మార్గాలను తెలుసుకుందాం...

బాగా బొద్దుగా... రోగాలకు ముద్దుగా...

ఓ వ్యక్తి తాను ఉండాల్సిన బరువు కంటే అధిక బరువు ఉండటాన్ని స్థూలకాయం / ఊబకాయం ఇంగ్లిష్‌లో ఒబేసిటీగా చెబుతారు. ఒబేసిటీ అన్నది కేవలం లావుగా కనిపించడమో కాదనీ, ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారణమన్నది డాక్టర్ల మాట. వారు ఎందుకలా చెబుతున్నారో చూద్దాం...

ఒబేసిటీకి ప్రధాన కారణాలు

➡ **జన్యుపరమైనవి :** వంశపారంపర్యంగా తల్లిదండ్రుల్లో ఊబకాయం ఉన్నప్పుడు కుటుంబాల్లో అది పిల్లల్లోనూ కనిపిస్తుంటుంది. ఈ తరహా ఒబేసిటీని తగ్గించడం అంత తేలిగ్గా సాధ్యపడదు. ప్రయత్నపూర్వకంగా కొంత తగ్గి, చురుగ్గా తమరోజువారీ కార్యక్రమాలు తేలిగ్గా జరుపుకుంటే వారు ఆరోగ్యంగా ఉన్నట్టే.

➡ **వయసు :** యువకులుగా ఉన్నప్పుడు సన్నగా ఉన్నా మధ్య వయస్కులయ్యేనాటికి బరువు పెరగడం కొందరిలో కనిపిస్తుంది. ఈ పరిణామం స్త్రీపురుషులిద్దరిలోనూ ఉన్నా మహిళల్లో కాస్త ఎక్కువ. ప్రత్యేకంగా మెనోపాజ్ దశ దాటిన మహిళల్లో ఇది ఇంకాస్త ఎక్కువ.

➡ **ఆహార అలవాట్లు :** ఆధునిక జీవనశైలిలో భాగంగా కొవ్వులు (శాచురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్‌ఫ్యాట్స్) ఎక్కువగా ఉండే ఆహారం, తీపి పదార్థాలు తీసుకోవడంతో పాటు పాశ్చాత్య జీవనశైలిని అనుసరిస్తూ పిజ్జా, బర్గర్, ఫాస్ట్‌ఫుడ్ వంటి వాటిని ఎక్కువగా తీసుకుంటూ ఉండటం, వేళకు తినకపోవడం, రాత్రి డ్యూటీలు చేస్తూ వేళగాని వేళల్లో ఆహారం తీసుకొని, పగలు పడుకోవడం వంటి కారణాలతో బరువు పెరగడం.

➡ **శరీర కదలికలు తగ్గడం :** ఇటీవలి కూర్చొని చేసే వృత్తులు పెరగడం వల్ల బరువు పెరగడం ఎక్కువైంది. ఈ ఆధునిక వృత్తుల్లో ఒంటి కదలికలకు ఏమాత్రం లేకపోవడంతో శరీరారికి తగిన శ్రమ లేక క్యాలరీలు దహనం కాకుండా కొవ్వుల రూపంలో అవి పేరుకుపోవడం.

➡ **కొన్ని జబ్బులు (మెడికల్ రీజన్స్) :** హైపోథైరాయిడిజమ్, కుషింగ్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు, అలాగే తీవ్రమైన ఒత్తిడి (స్ట్రెస్)తో కూడా బరువు పెరగడం.

➡ **కొన్ని రకాల మందులతో :** వైద్య కారణాలతో స్టెరాయిడ్స్‌తో కూడిన మందులు వాడటం, అలాగే డిప్రెషన్ ఉన్నవారు వాడే యాంటీడిప్రెసెంట్స్, మూర్ఛవ్యాధిగ్రస్తులు వాడే యాంటీ ఎపిలెప్టిక్ మందులతోనూ ఒళ్లు వచ్చే ప్రమాదం.

ఒబేసిటీ కేవలం కాస్మటిక్ సమస్య కాదు... అది అనారోగ్యాలకు కారణం?

డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు, కీళ్ల నొప్పులు, నిద్రలో ఊపిరి సరిగా అందకుండా చేసి గురకకు దారితీసే స్లీప్ ఆప్నియా, డిప్రెషన్, పిత్తాశయంలో రాళ్లు, హెర్నియా మొదలైన సమస్యలకు స్థూలకాయం ప్రధాన కారణం. సన్నగా ఉన్న మహిళలతో పోల్చి చూస్తే లావుగా ఉన్న మహిళలలో ప్రసవం కష్టమవుతుంది. అబార్షన్లు అయ్యే అవకాశమూ ఎక్కువే. స్థూలకాయం కొన్ని రకాల క్యాన్సర్లకు కూడా దారితీస్తుంది. ఇలా దాదాపు 65 రకాల వ్యాధులకు ఒబెసిటీయే మూల కారణం. ఆరోగ్యకరమైన స్థూలకాయం లేనివారితో పోలిస్తే స్థూలకాయుల్లో ఆయుఃప్రమాణం 5 నుంచి 20 ఏళ్ల తగ్గే అవకాశం ఉంది.

స్థూలకాయం ఉందా లేదా అని తెలుసుకోవడం ఎలా?

ఒక వ్యక్తి ఎత్తుకు తగినంత బరువు ఉండాలి. అతడు తన ఎత్తుకు తగిన బరువు ఉన్నాడా లేదా అనే విషయం తెలుసుకోడానికి 'బాడీ మాస్ ఇండెక్స్' (బీఎమ్ఐ)ను ప్రమాణంగా తీసుకుంటారు. ఎవరైనా తమంతట తామే తెలుసుకోవచ్చు. అందుకు చేయాల్సిందల్లా మొదట తమ బరువును కిలోగ్రాముల్లో తెలుసుకోవాలి. ఆ తర్వాత స్కేలు / టేప్ సాయంతో ఎత్తును మీటర్లలో కొలుచుకోవాలి. అటు తర్వాత తమ బరువును తమ ఎత్తు స్క్వేర్‌తో భాగించాలి. ఉదాహరణకు ఓ వ్యక్తి 90 కిలోల బరువు ఉన్నాడనుకుందాం. అతడి ఎత్తు 1.7 మీటర్లు అనుకుందాం. అప్పుడు అతడి బీఎమ్ఐ 90 / 1.7 ఇంటూ 1.7 = 31.14 అనే విలువ వస్తుంది. తమ ఈ విలువను బీఎమ్ఐ ఛార్ట్‌లో చూసుకుని తామ స్థూలకాయం (ఒబేసిటీ) ఏ మేరకు ఉందో తెలుసుకోవచ్చు. డాక్టర్లు కూడా దీన్నే అనుసరిస్తుంటారు.

బరువు పెరగకుండా నియంత్రించుకునే మార్గాలు...

● అధిక బరువు (బీఎమ్ఐ 23 – 24.99) ఉన్నవారు, స్వల్ప స్థూలకాయం (బీఎమ్ఐ 25 – 29.99) ఉన్నవారు రోజూ క్రమం తప్పకుండా కనీసం 30 నిమిషాల పాటు వేగంగా నడక (బ్రిస్క్ వాకింగ్) వంటి వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి ● ఆహారంలో కొవ్వు పాళ్లు తగ్గించుకోవడం సమతులాహారం తీసుకోవడం అంటే కొవ్వులు ఎక్కువగా ఉండే మాంసాహారం కంటే తాజా ఆకుకూరలు, కాయగూరలతో కూడిన ఆహారాలు తీసుకోవడం. ఒకవేళ మాంసాహారం తినాలనుకుంటే వేటమాంసం (రెడ్ మీట్) కంటే చేపలు, చికెన్ వంటి కొవ్వులు తక్కువగా ఉండే వైట్ మీట్ తినాలి ● క్రమం తప్పకుండా ఒకే వేళకు తినడంతో పాటు తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తీసుకోవాలి ● రాత్రి కంటినిండా నిద్రపోవాలి. ఒకవేళ మెలకువతో ఉన్నా ఏమీ తినకూడదు ● చిరుతిండ్లూ, కూల్‌డ్రింక్స్, ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.

బీఎమ్ఐ తెలుసుకోడానికి ఈ పట్టికలోని విలువలను ప్రమాణంగా తీసుకోవాలి...

స్థూలకాయ స్థాయి	భారతీయుల బీఎమ్ఐ	విదేశీయుల బీఎమ్ఐ
సాధారణ బరువు	18.50 - 22.99	18.50 - 24.99
అధిక బరువు	23.00 - 24.99	25.00 - 29.99
స్వల్ప స్థూలకాయం	25.00 - 29.99	30.00 - 34.99
అధిక స్థూలకాయం	30 - ఆపైన	35.00 - 39.99
వ్యాధిగ్రస్త స్థూలకాయం	40.00 -49.99	
సూపర్ స్థూలకాయం	50.00 - 59.99	
సూపర్ సూపర్ స్థూలకాయం	60.00 - ఆపైన	

పైన వచ్చిన విలువ ప్రకారం 90 కిలోల బరువున్న ఆ వ్యక్తి 31.14 విలువతో అధిక స్థూలకాయం కేటగిరీలో ఉన్నాడు. అలా బరువు పెరుగుతున్న కొద్దీ స్థూలకాయం ప్రమాణికతల ప్రకారం అతడు వ్యాధిగ్రస్థ స్థూలకాయంలో ఉన్నాడా లేక సూపర్ స్థూలకాయంలో ఉన్నాడా అన్నది తెలుస్తుంది.



డా॥ శ్రీ నాగవాణి
కన్సల్టెంట్
రీహాబిలిటేషన్ & లైఫ్ స్టైల్

కొలెస్ట్రాల్ పూర్తిగా హానికరమేనా?

శరీరంలో కాలేయం ఉత్పత్తి చేసే ఒకలాంటి కొవ్వుని కొలెస్ట్రాల్ అంటారు. మన శరీర ప్రతి కణంలో కొలెస్ట్రాల్ ఉంటుంది. కొలెస్ట్రాల్ అనగానే అదేదో ఆరోగ్యానికి చాలా హానికరమనీ, చెడు చేస్తుందనే అభిప్రాయం పెరిగింది. కానీ జీవక్రియలకు పరిమిత మోతాదులో కొలెస్ట్రాల్ చాలా అవసరమే కాకుండా ఉండాల్సిన మోతాదులో ఉంటే మంచి చేస్తుంది కూడా.

ఏ కొలెస్ట్రాల్‌తో డేంజర్?

కొలెస్ట్రాల్‌లో మంచి, చెడు రెండూ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ పాళ్లు ఉండాల్సిన పరిమితిలో ఉండి, శరీరానికి అవసరమైన మంచి కొలెస్ట్రాల్ కూడా ఉండాల్సిన పాళ్లలో ఉండాలి. మంచి కొలెస్ట్రాల్‌ను 'హై డెన్సిటీ లైపోప్రొటీన్' (హెచ్‌డీఎల్) అంటారు. చెడు కొలెస్ట్రాల్‌ను 'లో డెన్సిటీ లైపోప్రొటీన్' (ఎల్‌డీఎల్) అంటారు. అందుకే ఎల్‌డీఎల్‌ను ''చెడు కొలెస్ట్రాల్'' (బ్యాడ్ కొలెస్ట్రాల్) అంటారు. అదే హెచ్‌డీఎల్ రక్తనాళాల్లోకి కొవ్వు చేరకుండా చేస్తుంది. అందుకే దీన్ని ''మంచి కొలెస్ట్రాల్'' (గుడ్ కొలెస్ట్రాల్) అని అంటారు. మన శరీరంలో ఎప్పుడు హెచ్‌డీఎల్ ఎక్కువగా ఉండి ఎల్‌డీఎల్ తక్కువగా ఉండేలా మంచిది. ఈ ఎల్‌డీఎల్ ఉండాల్సిన మోతాదు కంటే మించితే అది రక్తనాళాల్లో చేరి రక్తప్రవాహాన్ని అడ్డుకుని గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్‌కు దారితీసే అవకాశం ఉంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌ను ఉండాల్సిన పరిమితికి మించకుండా చూసుకోవాలని జాగ్రత్త చెబుతారు.



మోతాదు కనుగొనడం ఎలా?

మన శరీరంలో కొలెస్ట్రాల్ మోతాదులను రక్త పరీక్ష ద్వారా కనుక్కోవచ్చు. పన్నెండు గంటలపాటు ఏమీ తినకుండా ఈ టెస్ట్ చేయించుకోవాలి. ఈ పరీక్షలో ఎల్‌డీఎల్ (లో డెన్సిటీ లైపో ప్రొటీన్ లెవల్), హెచ్‌డీఎల్ (హై డెన్సిటీ లైపో ప్రొటీన్ లెవెల్) తెలుస్తాయి. ఎల్‌డీఎల్ ఎక్కువగా ఉంటే ధమనుల్లో కొవ్వు చేరి హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉంది.

మంచి కొలెస్ట్రాల్ కోసం...

కొలెస్ట్రాల్ ఉండే గుడ్డు వంటి ఆహార పదార్థాలు తీసుకుంటూ ఉండాలి. అయితే వాటిని పరిమితంగా తీసుకోవాలి. అందరికీ అందుబాటులో ఉండే గుడ్డులోని తెల్లసొనలో మంచి కొలెస్ట్రాల్ ఉంటుంది. పచ్చ సొనలో చెడు కొలెస్ట్రాల్ ఉంటుంది.

సరైన వ్యాయామం లేకపోవడం, ఫ్యామిలీ హిస్టరీ, కొవ్వు పదార్థాలు ఎక్కువ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగే ప్రమాదం ఉంది. అందుకే గతంలో ఎలాంటి లక్షణాలూ లేనివారు కూడా 40 ఏళ్ల పైబడ్డాక ప్రతి ఐదేళ్లకోమారు పరీక్ష చేయించుకోవాలి. అదే రిస్క్‌ఫ్యాక్టర్స్ ఉన్నవారైతే డాక్టర్ సలహా మేరకు ప్రతి ఏడాదీ, లేదా డాక్టర్ సూచించిన ప్రకారం కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి.

హెల్త్ బిట్స్

ఆర్థ్రైటిస్... ఆహార నియమాలు!



కేవలం జీవనశైలి ప్రక్రియల్లో ఒకటైన ఆహార నియమాలతోనే ఆర్థ్రైటిస్‌ను తగ్గించడం సాధ్యం కాదు, ఏ ఆహారంతోనైనా అరిగిపోయిన కార్టిలేజ్‌ను తిరిగి పొందడం అసాధ్యం. అయితే ఆహార నియమాలతో ఒంటి బరువు పెరగకుండా నియంత్రించడం అలాగే ఊబకాయం తగ్గించడం ద్వారా కీళ్లపైన ఎక్కువ బరువు పడకుండా కాపాడుకోవచ్చు.

ఇక ఆర్థ్రైటిస్ రాకముందే పాలతో పాటు తగినంత క్యాల్షియమ్ ఉండే ఆహారాల వల్ల చాలా కాలం పాటు ఆర్థ్రైటిస్ రాకుండా నివారించుకోవచ్చు. ఆహార నియమాలు పాటించడం ద్వారా చాలావరకు ఆర్థ్రైటిస్ నివారణ సాధ్యమే. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలి అంటే కీళ్లపై బరువు గానీ, ఇతర దుష్ప్రభావాలు గానీ పడకుండా చేసే సైక్లింగ్, ఈత లాంటి వ్యాయామాలతోనూ మొదట్లో ఆర్థ్రైటిస్ నివారణ సాధ్యం. ఒకవేళ అప్పటికే ఆర్థ్రైటిస్ వచ్చి ఉంటే ఆరోగ్యకరమైన జీవనశైలితో దాని దుష్ప్రభావాలను చాలావరకు తగ్గించుకోవచ్చు. ఎందుకంటే దేహభాగాల్లో తగినన్ని కదలికలు ఉంటేనే కార్టిలేజ్‌కు ఆహారం అందడం, దాంతో కార్టిలేజ్‌తో పాటు కీళ్లు ఆరోగ్యంగా ఉండటం జరుగుతుంది. ఇక్కడ వ్యాయామాల విషయంలో ఒక్కమాట గుర్తుపెట్టుకోవాలి. అదేమిటంటే... దేహభాగాలు లేదా కాళ్లూచేతుల కదలికలు కీళ్లు అరిగిపోయేంత తీవ్రంగా ఉండకూడదు. కేవలం కార్టిలేజ్‌కు ఆహారం అందుతూ అది ఆరోగ్యంగా ఉండేంతగానే దేహానికి వ్యాయామం ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే... కదలికలు మరీ తక్కువగా ఉండటం, మరీ ఎక్కువగా ఉండటం... ఇవి రెండూ కీళ్లకు చేటు తెస్తాయని గుర్తించాలి.

మందు లవర్స్! లివర్ జాగ్రత్త!



గతంలో మద్యం తాగడం తప్పు అన్న భావనతో చాలామంది దానికి దూరంగా ఉండేవారు. కానీ ఇటీవల కాలంలో తాగడం ఓ ఫ్యాషన్ అనే ధోరణి పెరుగుతుండటంతో పాటు... ఆల్కహాల్ అంటే మూడు నాలుగు దశాబ్దాల కిందట ఉన్న అపరాధభావన క్రమంగా కనుమరుగైపోతుండటంతో యువత ఎలాంటి జంకు గొంకు లేకుండా మద్యానికి అలవాటు పడుతున్నారు. దాంతో ఇటీవల యువతలో ఫ్యాటీలివర్, లివర్ ఇన్‌ఫ్లమేషన్, స్కార్డ్ లివర్, లివర్ సిర్రోసిస్ లాంటి 'ఆల్కహాలిక్ సంబంధిత కాలేయ వ్యాధులు' (ఆల్కహాలిక్ లివర్ డిసీజెస్) పెరుగుతున్నాయి. మద్యం ఎన్నిరకాలుగా కాలేయాన్ని దెబ్బతీస్తుందో, ఎన్ని వ్యాధులు కలగజేస్తుందో తెలుసుకుందాం...

కాలేయం అత్యంత కీలకమైన అవయవం. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు బయట నుంచి జీర్ణవ్యవస్థ ద్వారా ఏ పదార్థం దేహంలోకి ప్రవేశించినా అందులోని విషాలను విరిచివేసి, వాటిని బయటకు ప్రయత్నిస్తుంది. ఆల్కహాల్ కూడా ఒకరకంగా విషమే. అందుకే దాని దుష్ప్రభావం పడకుండా కాపాడటానికి ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో దీర్ఘకాలంగా మద్యం తాగే అలవాటున్న వ్యక్తుల్లో క్రమంగా పలు మార్పులకు లోనవుతుంది. దాంతో ఫ్యాటీలివర్, లివర్ ఇన్‌ఫ్లమేషన్, సిర్రోసిస్, కాలేయంపైన ఓ గాటులాంటిది పడే స్కారింగ్ వంటి దుష్ప్రభావాల కారణంగా క్రమంగా లివర్ ఫెయిల్యూర్‌కు దారితీస్తుంది. ఇలా కాలేయాన్ని దెబ్బతీసి, ప్రాణాపాయం వైపునకు వెళ్లేలా చేసే వ్యాధులివి...

ఫ్యాటీలివర్ : శక్తిగా మారి, దేహ అవసరాలు పూర్తయ్యాక అదే చక్కెర కాలేయంలో కొవ్వు రూపంలో పేరుకుపోతుంది. ఆల్కహాల్ అలవాటున్నవారిలో ఇది చాలా వేగంగా జరుగుతూ కాలేయ కణాలు కొవ్వు పేరుకున్నట్లుగా మారిపోతాయి. ఈ కండిషన్‌ను ఫ్యాటీలివర్ అంటారు. ఫ్యాటీలివర్‌లో మూడు దశలుంటాయి.

● **మొదటి దశ :** ఈ దశలో కాలేయ కణాల మధ్య కొద్దిగా కొవ్వు పేరుకుంటుంది. ఇది ప్రాథమిక సమస్య.

● **రెండో దశ:** ఈ దశను నాష్ (ఎన్ఏఎస్‌హెచ్) అంటారు. ఇందులో కాలేయం కొద్దిగా గాయపడటంతో పాటు కొన్ని కాలేయ కణాలు నశిస్తాయి. కొన్నిసార్లు ఇన్‌ఫ్లమేషన్‌కు కూడా గురికావచ్చు. అంతేకాదు కాలేయం గాయపడటం వల్ల... ఓ మచ్చగా అంటే... స్కార్‌లాగా ఏర్పడవచ్చు.

● **మూడో దశ :** ఈ దశలో సిర్రోసిస్ వస్తుంది. అంటే కాలేయం పూర్తిగా తన స్వరూపాన్ని కోల్పోవడమేగాక దాన్ని ఆకృతి కూడా మారిపోతుంది. కణాలు పూర్తిగా దెబ్బతింటాయి. ఈ దశలో కాలేయ మార్పిడి తప్ప మరో వైద్యమేమీ పనిచేయదు.

ఫ్యాటీలివర్ లక్షణాలు : ● మొదట్లో లక్షణాలు పెద్దగా కనిపించవు. అయితే సాధారణంగా ఇతర సమస్యలకోసం అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకున్నవారిలో ఇది బయటపడుతుంటుంది ● కొందరికి కుడివైపు పొట్ట పైభాగంలో (రిబ్‌కేజ్ కింద) పొడుస్తున్నట్లుగా నొప్పి వస్తుంటుంది. కాలేయం క్రమంగా పెరుగుతుండటం వల్ల ఈ నొప్పి వస్తుంది.

ఫ్యాటీలివర్ వల్ల పరిణామాలు : ● ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చాక తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అది కాలేయం పూర్తిగా దెబ్బతినిపోయే సిర్రోసిస్ లేదా లివర్ క్యాన్సర్ వంటి పరిణామాలకు దారితీయవచ్చు ● ఫ్యాటీ లివర్ దశల్లో మొదటిదశ నుంచి క్రమంగా రెండో దశ అయిన నాష్ (ఎన్ఏఎస్‌హెచ్)కూ, అక్కడి నుంచే క్రమంగా మూడో దశ అయిన సిర్రోసిస్‌కు దారి తీస్తుందని భావించడానికే వీల్లేదు. కొన్నిసార్లు నేరుగా మూడో దశ అయిన సిర్రోసిస్‌కు దారితీయవచ్చు. అందుకే ఫ్యాటీలివర్ తొలిదశలో ఇది కనిపించినప్పుడే జాగ్రత్తపడాలి.

ఫ్యాటీ లివర్‌కు చికిత్స : ● ఆల్కహాల్‌తోనే ఫ్యాటీలివర్ వచ్చిందని తేలితే... లేదా ఇది వచ్చిన వారిలో ఆల్కహాల్ తీసుకునే అలవాట్లు ఉన్నట్లయితే వెంటనే ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. పిండి పదార్థాలు, కొవ్వులు ఎక్కువగా తీసుకునే అలవాటు ఉంటే ఆహారంలో మార్పులు, వ్యాయామం వంటి మార్గాలను డాక్టర్లు సూచిస్తారు ● చాలా కొద్దిమందిలో మందులు, శస్త్రచికిత్స అవసరం కావచ్చు.

లివర్ స్కార్ : ఆల్కహాల్ అలవాటు మితిమీరిన కొందరిలో కాలేయం వాపు రావచ్చు. దాన్ని లివర్ ఎన్‌లార్జ్‌మెంట్‌గా చెబుతారు. వీళ్లలో ఆ గాయం తీవ్రమై కాలేయం మీద మచ్చ (స్కార్)లా ఏర్పడవచ్చు. ఇది చాలా ప్రమాదం తెచ్చిపెట్టే అంశం కాబట్టి జాగ్రత్తపడాలి.

లివర్ సిర్రోసిస్ : హెపటైటిస్–ఏ, హెపటైటిస్–బి, హెపటైటిస్–సి, హెపటైటిస్–డి, హెపటైటిస్–ఇ వంటి కొన్ని కాలేయ ఇన్ఫెక్షన్లు ముదరడంతో లివర్ సిర్రోసిస్ రావచ్చు. అలాగే ఆల్కహాల్ అలవాటు కారణంగా కాలేయం ఆకృతి, దానికి ఉండే సహజ స్వాభావికమైన రంగు దెబ్బతిని, అది జిగురుజిగురుగా మారవచ్చు. ఆ కండిషన్‌నే సిర్రోసిస్ అంటారు. డయాబెటిస్, స్థూలకాయం ఉన్నవారికి ఆల్కహాల్ తీసుకునే అలవాటుంటే సిర్రోసిస్ ముప్పు మరింత ఎక్కువ. హెపటైటిస్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నవారికి మద్యం అలవాటు ఉంటే అది కాలేయ క్యాన్సర్‌కు దారి తీయవచ్చు. ఇలాంటివారికి ప్రమాదం మరింత ఎక్కువ.

నిర్ధారణ పరీక్షలు: ● అల్ట్రాసౌండ్ అబ్డామిన్ స్కానింగ్‌తో చాలా వరకు ఫ్యాటీలివర్ డిసీజ్ తెలుస్తుంది ● ఫ్యాటీలివర్ మొదలుకొని మిగతా అన్ని కాలేయ సమస్యలకు లివర్ ఫంక్షన్ పరీక్ష (ఎల్ఎఫ్‌టీ) అవసరం. దాంతో ఏవైనా ఎంజైములు స్రవించడం వల్ల కాలేయం దెబ్బతిన్నదా అన్న విషయం తెలుస్తుంది ● డయాబెటిస్, కొలెస్ట్రాల్ స్థాయులు, ట్రైగ్లిజరైడ్ స్థాయులు ఏమైనా పెరిగాయా అన్నది కూడా పరిశీలించాలి ● కొందరిలో లివర్ బయాప్సీ (అంటే సూది ద్వారా కాలేయానికి సంబంధించిన చిన్న ముక్కను సేకరించి) చేయించాల్సిన అవసరం ఉంటుంది.

ఫ్యాటీలివర్ దశలోనే జీవనశైలి మార్పులో జాగ్రత్తపడటం చాలా మేలు. అయితే... పరిస్థితి లివర్ సిర్రోసిస్ దశకు చేరాక కాలేయ మార్పిడి మినహా మరే చికిత్స కూడా సాధ్యం కాదు. అందుకే ఫ్యాటీలివర్ దశలో ఉన్న సమయంలోనే ఆల్కహాల్ అలవాటు పూర్తిగా మానేయడం మంచిది.

రోజంతా చురుగ్గా ఉండాలంటే?

కొందరు ఉదయం నిద్ర లేవగానే చురుగ్గా ఫీలయినా, క్రమంగా సత్తువ లాగేసినట్టుగా అయి మధ్యాహ్నం తర్వాత కాస్త మందకొడిగా ఉన్నట్లు ఫీలవుతుంటారు. అలా కాకుండా లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్ర పోయే వరకు రోజంతా చురుగ్గా ఉండాలంటే ఈ కింద సూచనలు పాటిస్తే మంచి ఫలితం ఉంటుంది. కేవలం చురుకుదనానికే కాదు... పూర్తి ఆరోగ్యంగా ఉండటానికీ ఇవి దోహదపడతాయి.



›› ఆహారంలో వేపుళ్లకు బదులుగా ఉడికించిన పదార్థాలే ఉండేలా చూసుకోవాలి. కూరగాయలూ, ఆకుకూరలతో ఆహారాన్ని తీసుకునేటప్పుడు అన్నంలో కూరలూ ఎక్కువగా కలుపుకోవాలి ›› ఆహారంలో గ్రెయిన్స్, చిరుధాన్యాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మాంసాహారం ఇష్టంగా తీసుకునేవారు... దానితో పాటు ఆకుకూరలు, కాయగూరలు కూడా అంతే మోతాదులో తింటూ ఉండాలి. అయితే వీలైనంతవరకు మాంసాహారం పరిమితంగా తీసుకోవడం మంచిది ›› రుచి కోసం వెన్న, నెయ్యి వంటి శాచురేటెడ్ ఫ్యాట్స్ పూర్తిగా తగ్గించాలి. వంటలో వాడే నూనెలకు బదులు ఆలివ్ ఆయిల్ వాడటం ఆరోగ్యానికి మంచిది. శాచ్యురేటెడ్ కొవ్వులకు బదులు ఆరోగ్యకరమైన ఆలివ్ ఆయిల్ వాడటం వల్ల రోజువారీ కార్యకలాపాల్లో చురుకుదనం పెరుగుతుంది ›› ఫ్రూట్ జ్యూస్ తీసుకోడానికి బదులు తాజా పళ్లను తినండి ›› రోజులో ఎక్కువ సార్లు నీళ్లు తాగడం మంచిది. కొందరు బయటకు వెళ్లే ముందర టాయిలెట్ సౌకర్యం లేని ప్రదేశాలకు వెళ్లాల్సివస్తే తగినన్ని నీళ్లు తాగరు. ఇది మంచిది కాదు ›› ఇల్లయినా, ఆఫీసులోనైనా కాఫీ, టీ లను చాలా పరిమితంగా తీసుకోవాలి. ఒకటికి రెండుసార్లు కాఫీ, టీ తాగక తప్పనప్పుడు వాటికి బదులు గ్రీన్ టీ, లెమన్ టీ వంటివి తీసుకోవడం మంచిది ›› సిగరెట్ స్మోకింగ్ పూర్తిగా మానేయాలి. సిగరెట్ వంటి అలవాటుతో మొదట్లో చురుగ్గా ఉన్నట్లు అనిపించినా, ఊపిరితిత్తులు ఆక్సిజన్ తీసుకునే సామర్థ్యాన్ని పొగ క్రమంగా తగ్గించివేయడం వల్ల చురుకుదనం పూర్తిగా తగ్గుతుంది. తీసుకున్న మర్నాడు చురుకుదనాన్ని హరించివేసే మద్యం అలవాటుకు కూడా పూర్తిగా దూరంగా ఉండాలి.

అసిడిటీ నివారించాలంటే ఈ జాగ్రత్తలు బెటర్



బాగా మసాలాలతోనూ, కారంతో కూడిన ఆహారాలు అసిడిటీని ప్రేరేపిస్తాయి. అంతేకాదు టీ, కాఫీలు లెక్కకుమించి తాగుతున్నా కూడా అసిడిటీ రావచ్చు. ఇలా అసిడిటీని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండటం, అలాగే దాన్ని నివారించే పదార్థాలను తీసుకోవడం మేలు. అలాంటి ఆహారాలేమిటో చూద్దాం.

తీసుకోకూడనివి	తీసుకోవాల్సినవి
స్ట్రాంగ్ కాఫీలు	కాస్త వీక్‌గా ఉండే హెర్బల్ టీ (అవి కడుపులో యాసిడ్ పాళ్లను పెంచకూడదు)
చాక్‌లెట్లు కూల్ డ్రింక్‌లు ఆల్కహాల్	తాజా పండ్లు పరిశుభ్రమైన మంచినీళ్లు నాన్ ఆల్కహాలిక్ తాజా పండ్ల రసాలు
మసాలాలతో కూడిన ఆహారం	అన్నం, ఉడికించిన మొక్కజొన్న గింజలు
పుల్లటి సిట్రస్ పండ్లు టొమాటో కొవ్వుతో ఉండే ఆహారాలు వేటమాంసం (రెడ్‌మీట్)	పియర్‌పండ్లు, అరటిపండ్లు, ఆపిల్స్, పుచ్చపండు ఉడికించిన ఆలూ, బ్రోకలీ, క్యాబేజీ, క్యారట్, గ్రీన్ పీస్ కొవ్వు తక్కువగా ఉండే ఆహారాలు కొవ్వు తక్కువగా ఉండే చేపలు, కోడి మాంసం

ఒకేసారి ఎక్కువగా తినేయడం సరికాదు. కొద్దికొద్దిమోతాదుల్లో ఎక్కువసార్లు తినాలి. రాత్రి ఆలస్యంగా భోజనం చేయకూడదు. నిద్రకు ఉపక్రమించడానికి 2–3 గంటల ముందే తినాలి.

బిజినెస్ రీల్

అమెజాన్ పే యూపీఐ @ 10 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్ పేమెంట్స్ సంస్థ అమెజాన్ పే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవల్లో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అమెజాన్ పే యూపీఐ కస్టమర్ల సంఖ్య 10 కోట్ల మైలురాయిని దాటింది. అమెజాన్ భారత్‌లో 2019 నుంచి యూపీఐ సేవలను మొదలు పెట్టింది. 18–24 ఏళ్ల వయసున్న కస్టమర్లు అమెజాన్ పే యూపీఐ సర్వీసుల విస్తరణకు తోడ్పడుతున్నారని కంపెనీ సోమవారం తెలిపింది. ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ 2007లో అమెజాన్ పే పేరుతో ఆన్‌లైన్ పేమెంట్స్ ప్రాసెసింగ్ సేవలను ప్రారంభించింది.

గోద్రెజ్ ఇంటెరియో కొత్త స్టోర్లు

ఈ ఏడాది 104 ఏర్పాటుకు రెడీ

న్యూఢిల్లీ: గృహ, ఆఫీస్ ఫర్నీచర్ కంపెనీ గోద్రెజ్ ఇంటెరియో దేశవ్యాప్తంగా 104 కొత్త స్టోర్లను ఏర్పాటు చేయనుంది. తద్వారా రిటైల్ విభాగంలో 2024–25లో 2 లక్షల చదరపు అడుగులమేర జత చేసుకోనున్నట్లు తెలియజేసింది. గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌లోని గోద్రెజ్ అండ్ బాయ్స్ కంపెనీకి చెందిన ఫర్నీచర్ విభాగం ప్రస్తుతం 900 స్టోర్లను నిర్వహిస్తోంది. 600 పట్టణాలలో ఇవి విస్తరించి ఉన్నాయి. కొత్త స్టోర్లను ఉత్తరాదిలో 34, పశ్చిమాన 24, దక్షిణాదిన 19, తూర్పు భారతంలో 27 చొప్పున నెలకొల్పనున్నట్లు పేర్కొంది.

హౌజ్ఈజీ నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: పాత ఇళ్ల క్రయవిక్రయాల్లో ఉన్న మార్కెట్‌ప్లేస్ హౌజ్ఈజీ తాజాగా 7 మిలియన్ డాలర్ల నిధులను సిరీస్–ఏ ఫండింగ్ రౌండ్‌లో అందుకుంది. ఈక్విటీ, డెట్ రూపంలో చిరాటే వెంచర్స్, అల్టేరియా క్యాపిటల్, యాంట్లర్ ఈ మొత్తాన్ని సమకూర్చాయి. 2023లో హౌజ్ఈజీ సీడ్ ఫండ్ సమీకరించింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోని కొత్త ప్రాంతాలలో సంస్థ వృద్ధికి, బ్రాండ్ ఉనికిని బలోపేతం చేయడానికి, ఉద్యోగుల పెంపు, సేవలను మెరుగుపరచడానికి ఈ నిధులను ఉపయోగించనున్నట్లు కంపెనీ తెలిపింది. 100 శాతం భద్రతతో హౌజ్ఈజీ ప్లాట్‌ఫామ్‌పై 15 రోజులలోపు గృహాలను కొనుగోలు లేదా విక్రయించడానికి కస్టమర్లకు వీలు కల్పిస్తూ ఈ ప్రక్రియను పూర్తిగా రీ–ఇంజినీరింగ్ చేశామని కంపెనీ కో–ఫౌండర్ తరుణ్ సైనాని తెలిపారు. 1,000కిపైగా కస్టమర్లకు చేరువ అయ్యామని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

27-8-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,731.95	4.24
HINDALCO	712.2	3.96
NTPC	414.9	3.22
ONGC	328.35	2.96
BAJAJFINSV	1,683.25	2.64

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	6,780.00	-1.18
HEROMOTOCO	5,344.85	-0.74
ADANIPORTS	1,481.00	-0.69
GRASIM	2,731.05	-0.64
EICHERMOT	4,869.20	-0.59

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,171
ఎన్ఎస్ఈ	1,11,305
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,03,218
ఎఫ్ఐఐ	+ 483
డీఐఐ	+ 1,870

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	77.42	$ 74.83
బ్రెంట్	80.38	$ 78.15

లాభాల్లోకి అకుమ్స్ డ్రగ్స్

క్యూ1లో రూ. 60 కోట్లు

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 60 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందుకు అమ్మకాల్లో వృద్ధి సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 182 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 978 కోట్ల నుంచి రూ. 1,026 కోట్లకు పుంజుకుంది. జమ్ములో రెండు తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే ప్రణాళికలకు బోర్డు ఆమోద ముద్ర వేసినట్లు కంపెనీ పేర్కొంది. ఇందుకు రూ. 265 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. విభిన్న న్యూట్రాస్యూటికల్, ఫార్మాస్యూటికల్ ప్రొడక్టులకు సంబంధించిన మల్టీడోసేజీలను ఇక్కడ రూపొందించనున్నట్లు తెలియజేసింది. ఇంజక్టబుల్ యూనిట్ ప్రారంభం, జమ్ములో విస్తరణ.. తయారీ సామర్థ్యాల పెంపు వ్యూహాలలో కీలక పురోగతిగా కంపెనీ ఎండీ సందీప్ జైన్ పేర్కొన్నారు. దేశీయంగా ఫార్మా దిగ్గజాలకు కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ(సీడీఎంవో)లో ప్రధాన సంస్థగా కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది.



ఫలితాల నేపథ్యంలో అకుమ్స్ డ్రగ్స్ షేరు బీఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 894 వద్ద ముగిసింది.

ఫోన్‌పే.. టర్న్‌అరౌండ్

2023-24లో రూ.197 కోట్ల నికర లాభం

న్యూఢిల్లీ: గ్లోబల్ రిటైల్ రంగ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ డిజిటల్ సంస్థ ఫోన్‌పే గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. ఉద్యోగులకు షేర్ల కేటాయింపు(ఇసాప్) వ్యయాలను మినహాయిస్తే రూ. 197 కోట్ల నికర లాభం ఆర్జించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అంతక్రితం ఏడాది(2022–23) రూ. 738 కోట్ల నష్టం నమోదైంది. ఇక మొత్తం ఆదాయం సైతం 74 శాతం జంప్‌చేసి రూ. 5,064 కోట్లను తాకింది. 2022–23లో కేవలం రూ. 2,914 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఇసాప్ వ్యయాలను మినహాయించి పేమెంట్ బిజినెస్ రూ. 710 కోట్ల స్టాండెలోన్ నికర లాభం ఆర్జించింది. 2022–23లో రూ. 194 కోట్ల నష్టం నమోదైంది. గ్రూప్.. ఫైనాన్షియల్ సర్వీసుల(బీమా, రుణాలు, వెల్త్)లోకి విస్తరించడంతోపాటు.. హైపర్‌లోకల్ ఈకామర్స్, ఇండస్ యాప్ స్టోర్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే.



మెడ్‌ప్లస్ హెల్త్ నుంచి వార్‌బర్గ్ పింకస్ నిష్క్రమణ

రూ. 836 కోట్లకు 11.35 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ నుంచి ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ నిష్క్రమించింది. కంపెనీలో ఉన్న 11.35 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల్లో రూ. 836 కోట్లకు విక్రయించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ మారిషస్ విభాగమైన లావెండర్ రోజ్ ఇన్వెస్ట్‌మెంట్, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌లో మొత్తం 1.35 కోట్ల షేర్లను విక్రయించింది. ఒక్కో షేరును సగటున రూ. 616.48 రేటుకి విక్రయించింది. సింగపూర్ ప్రభుత్వం, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యుచువల్ ఫండ్ 62.45 లక్షల షేర్లను (5.2 శాతం వాటా) రూ. 616–616.20 రేటుకి కొనుగోలు చేశాయి.

సోమవారం ఎన్ఎస్ఈలో మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ షేరు 0.55 శాతం పెరిగి రూ. 638.50 వద్ద క్లోజయ్యింది.



జూన్ త్రైమాసికంలో వృద్ధి 7.1 శాతం

ఎస్‌బీఐ ఎకనమిస్ట్ అంచనా



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ జూన్ త్రైమాసికంలో 7.1 శాతం పురోగమిస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎకనమిస్టులు అంచనావేశారు. ఆగస్టు 30వ తేదీన గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలను వెలువరించనున్న నేపథ్యంలో ఎస్‌బీఐ ఎకనమిస్టులు తాజా అంచనాలను వెల్లడించారు. 2023 ఇదే కాలంలో జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. జూన్ త్రైమాసికం ఆర్థిక కార్యకలాపాల్లో గత ఏడాదితో పోల్చితే నెమ్మదించడానికి ప్రధానంగా సాధారణ ఎన్నికల కారణమని పేర్కొంటూ ఈ కాలంలో తయారీ రంగం, ప్రభుత్వ వ్యయాల్లో వేగం లేదని పేర్కొంది. ద్రవ్యోల్బణం కట్టడి నేపథ్యంలో ద్రవ్య విధానాల్లో కొంత సరళీకరణ చోటుచేసుకునే అవకాశం ఉందని ఈ మేరకు వెలువడిన ఒక నివేదికలో పేర్కొన్నారు. 41 ప్రధాన ఇండికేటర్ల ఆధారంగా తాజా అంచనాలకు వచ్చినట్లు వివరించారు.

2024-25లో 7.5 శాతం వృద్ధి..

కాగా, 2024–25లో 7.5 శాతం వృద్ధి సాధ్యమని ఎస్‌బీఐ ఎకనమిస్టులు అంచనా వేయడం గమనార్హం. ఆర్‌బీఐ అంచనా 7.2 శాతంకన్నా ఇది అధికం కావడం విశేషం. నైరుతి రుతుపవనాలు జూలై ఆరంభం నుండి పుంజుకోవడం సానుకూల పరిణామమని నివేదిక పేర్కొంది. గత సంవత్సరం ఆగస్టు 25 నాటికి ఎల్‌పీఏ (దీర్ఘకాల సగటు వర్షపాతం) ఐదు శాతంకన్నా తక్కువగా ఉంటే ఈ ఏడాది ఇదే కాలంలో ఐదు శాతం అధికంగా ఉండడం మంచి పరిణామమని వివరించింది.

ఇక్రా అంచనాలను మించి...

కాగా, ప్రభుత్వ మూలధన వ్యయాలు, పట్టణ వినియోగదారుల డిమాండ్ తగ్గుదల కారణంగా భారతదేశ ఆర్థిక (జీడీపీ) వృద్ధి ఏప్రిల్–జూన్ త్రైమాసికాల్లో ఆరు త్రైమాసిక కనిష్ట స్థాయి.. 6 శాతంగా ఉంటుందని ఇక్రా అంచనావేసింది. అయితే ఈ అంచనాలకు మించి తాజాగా 1.1 శాతం ఎస్‌బీఐ ఎకనమిస్టులు అంచనావేస్తుండడం గమనార్హం. 2023–24 క్యూ1లో భారత్ ఎకానమీ వృద్ధి రేటు 8.2 శాతం. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎకానమీ పురోగతి 6.8 శాతంగా ఉంటుందని ఇక్రా పేర్కొంది. గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.



ఇళ్ల ధరలు 12 శాతం అప్

- ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఏకంగా 30 శాతం అధికం
- హైదరాబాద్‌లో 7 శాతం వృద్ధి
- ఏప్రిల్–జూన్ క్వార్టర్‌పై నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా హైదరాబాద్ సహా ఎనిమిది ప్రధాన నగరాల్లో ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఇళ్ల ధరలు సగటున 12 శాతం పెరిగాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో అత్యధికంగా 30 శాతం ఎగిశాయి. రియల్టర్ల సమాఖ్య క్రెడాయ్, ప్రాపర్టీ కన్సల్టెంట్ కోలియర్స్, డేటా అనలిటిక్స్ సంస్థ లైజాస్ ఫోరాస్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం వార్షిక ప్రాతిపదికన జూన్ త్రైమాసికంలో ఎనిమిది ప్రధాన నగరాలకు గాను ఏడు నగరాల్లో ఇళ్ల ధరలు పెరిగాయి. 'గత కొద్ది త్రైమాసికాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో బుల్ రన్ కొనసాగుతోంది. టాప్ 8 నగరాల్లో నమోదవుతున్న లావాదేవీల పరిమాణం, హౌసింగ్‌పై సానుకూల సెంటిమెంట్ దీన్ని ధృవీకరిస్తోంది. డిమాండ్‌కి మాత్రమే పరిమితం కాకుండా ప్రాధాన్య అసెట్ క్లాస్‌గా ప్రజలు రియల్ ఎస్టేట్ వైపు మళ్లుతుండటమనేది హౌసింగ్ ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది' అని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. రేట్లు పెరిగినప్పటికీ పలు నగరాల్లో అమ్మకాలు కూడా పెరిగినట్లు లైజాస్ ఫోరాస్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ కపూర్ వివరించారు. గత కొద్ది త్రైమాసికాలుగా హౌసింగ్‌కు డిమాండ్ మెరుగ్గా ఉంటోందని కోలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాగ్నిక్ పేర్కొన్నారు. అదే సమయంలో వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటం, ఇటీవల బడ్జెట్‌లో సానుకూల ప్రతిపాదనలు చేయడం మొదలైనవి హౌసింగ్ మార్కెట్‌కి ఊతమిచ్చినట్లు వివరించారు.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- → హైదరాబాద్‌లో హౌసింగ్ ధరలు 7 శాతం పెరిగాయి. చ.అ.కు రేటు రూ. 10,530 నుంచి రూ. 11,290కి చేరింది.
- → బెంగళూరులో 28 శాతం వృద్ధితో ధరలు రూ. 8,688 నుంచి రూ. 11,161కి చేరాయి.
- → చెన్నైలో పెద్దగా మార్పులు లేకుండా చ.అ. రేటు రూ. 7,690 స్థాయిలోనే ఉంది.
- → ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో అత్యధికంగా 30 శాతం పెరిగి రూ. 8,652 నుంచి రూ. 11,279కి చేరింది.
- → ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ఇళ్ల ధరలు చ.అ.కి 6 శాతం పెరిగి రూ. 19,111 నుంచి రూ. 20,275కి చేరాయి.
- → కోల్‌కతాలో 7 శాతం వృద్ధి చెంది రూ. 7,315 నుంచి రూ. 7,745కి చేరాయి.
- → పుణెలో రెసిడెన్షియల్ ప్రాపర్టీల రేట్లు 13% పెరిగి రూ. 9,656కి చేరాయి.
- → అహ్మదాబాద్‌లో ఇళ్ల ధరలు 13% వృద్ధితో రూ. 6,507 నుంచి రూ. 7,335కి పెరిగాయి.

● భారత్-సింగపూర్ ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టం



ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న, భవిష్యత్‌లో పురోగమించనున్న రంగాలలో సహకారాన్ని మరింత పెంపొందించుకోడానికి కట్టుబడి ఉన్నట్లు భారతదేశం, సింగపూర్‌లు ప్రకటించాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ప్రస్తుతం సింగపూర్‌లో పర్యటిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలు మరింత పురోగతికి ఇండియా–సింగపూర్ మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ (ఐఎస్ఎంఆర్) సమావేశంలో గుర్తించబడిన ఆరు అంశాల అమలుపై ఈ పర్యటన దృష్టిసారించింది. సింగపూర్‌లో ఆ దేశ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నంతో కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, ఎస్. జైశంకర్, , పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ తదితరులను సమావేశమైనప్పటి చిత్రమిది.

టెక్ పరివర్తనకు భారత్ సారథ్యం వహించాలి

ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టెక్నాలజీ పరివర్తనకు భారత్ సారథ్యం వహించాలని ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ తెలిపారు. దేశీయంగా ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పన విషయంలో ప్రైవేట్ రంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. వాణిజ్య అసమతౌల్యతలను సరి చేయడం, వ్యాపారాల నిర్వహణకు అనువైన పరిస్థితులు కల్పించడంలాంటివి ప్రభుత్వ బాధ్యతని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. టెస్లా సహా అంతర్జాతీయ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం స్వాగతించతగ్గదని ఆయన పేర్కొన్నారు. భారత్ అన్ని రకాల పెట్టుబడులను ఆకర్షించడం కీలకమని, అంతర్జాతీయ దిగ్గజాలు వస్తే దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ అభివృద్ధి చెందడానికి తోడ్పడగలదని అగర్వాల్ చెప్పారు. భారత్ అవసరాలకు తగ్గట్లుగా సొంత క్లౌడ్‌పై సొంత ఏఐని రూపొందిస్తున్నామన్నారు. ఏఐ రాక వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు అనవసరమైనవని అగర్వాల్ తోసిపుచ్చారు. కంప్యూటర్లు వస్తే ఉద్యోగాలకు ముప్పు అని గతంలోనూ భయపడ్డారని కానీ ఐటీ బూమ్‌తో దేశీయంగా భారీగా ఉద్యోగాల కల్పన జరిగిందని అగర్వాల్ చెప్పారు. ఏఐ కూడా అలాంటి సాధనమేనని, ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగపడగలదని వివరించారు.

డ్రోన్ ప్లాట్‌ఫాం ఆవిష్కరించిన రామ్‌ఇన్ఫో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'కిసాన్ డ్రోన్స్' పేరిట డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్ ప్లాట్‌ఫాంను ప్రారంభించినట్లు టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ రామ్‌ఇన్ఫో వెల్లడించింది. వచ్చే రెండేళ్లలో దీని కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలో 100 పైచిలుకు స్టోర్స్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ ఎండీ ఎల్ శ్రీనాథ్ వివరించారు. వ్యవసాయ క్షేత్రాలకు ఉపయోగపడే వివిధ రకాల డ్రోన్లు, సర్వీసులు వీటిలో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సాగు రంగానికి అధునాతన టెక్నాలజీతో సాధికారత కల్పించే దిశగా ఈ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించినట్లు శ్రీనాథ్ చెప్పారు. రైతులకు డ్రోన్లు, సపోర్ట్ సర్వీసులను అందుబాటులోకి తేవడం ద్వారా ఉత్పాదకత పెంపుతో పాటు గ్రామీణ భారతంలో కొత్త తరహా ఎంట్రప్రెన్యూర్‌షిప్‌నకు కూడా తోడ్పాటు అందించినట్లవుతుందని వివరించారు. డ్రోన్ సర్వీస్ సెంటర్లను డ్రోన్ ఆపరేటర్లతో అనుసంధానించడం ద్వారా వచ్చే 12–18 నెలల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో వెయ్యి మందిని ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దే ప్రణాళికలు ఉన్నట్లు శ్రీనాథ్ చెప్పారు.

బ్యాంక్ వివరాలివ్వకుంటే జీఎస్‌టీఆర్-1 ఫైలింగ్‌కు నో

సెప్టెంబర్ నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: చెల్లుబాటయ్యే బ్యాంకు ఖాతా వివరాలను జీఎస్‌టీ అధికారులకు సమర్పించని జీఎస్‌టీ చెల్లింపుదారులు ఇకపై జీఎస్‌టీఆర్–1ను దాఖలు చేయడానికి కుదరదు. సెప్టెంబర్ 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) ఒక అడ్వైజరీలో వెల్లడించింది. పన్ను చెల్లింపుదార్లు సత్వరం జీఎస్‌టీ పోర్టల్‌ను సందర్శించి తమ రిజిస్ట్రేషన్ వివరాల్లో బ్యాంకు ఖాతాకు సంబంధించిన సమాచారాన్ని కూడా జోడించాలని సూచించింది. జీఎస్‌టీ రూల్ 10ఎ ప్రకారం పన్ను చెల్లింపుదారులు, రిజిస్ట్రేషన్ మంజూరైన తేదీ నుంచి 30 రోజుల్లోగా తమ బ్యాంకు అకౌంటు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది జూలైలో సమావేశమైన జీఎస్‌టీ మండలి వస్తు, సేవల పన్నుల విధానమైన జీఎస్‌టీని పటిష్టం చేసే దిశగా రూల్ 10ఎలో ఈ మేరకు సవరణలు చేసింది.

మెడిఅసిస్ట్ చేతికి పారమౌంట్ హెల్త్

రూ. 400 కోట్ల డీల్



న్యూఢిల్లీ: బీమా సంస్థలకు థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేషన్ సర్వీసులు అందించే మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్ తాజాగా పారమౌంట్ హెల్త్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ టీపీఏని కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 400 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. ముంబై కేంద్రంగా పనిచేసే పారమౌంట్ హెల్త్ కొనుగోలు కోసం ఫెయిర్‌ఫ్యాక్స్ ఏషియా, నయన్ షా కుటుంబంతో తమ అనుబంధ సంస్థ మెడి అసిస్ట్ ఇన్సూరెన్స్ టీపీఏ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. పారమౌంట్ టీపీఏ కొనుగోలుతో గ్రూప్ సెగ్మెంట్‌లో మెడి అసిస్ట్ టీపీఏ వాటా 36.6 శాతానికి పెరుగుతుంది. నిర్వహణలోని ప్రీమియంలను బట్టి చూస్తే హెల్త్ ఇన్సూరెన్స్ పరిశ్రమలో వాటా 23.6 శాతానికి చేరుతుంది. పారమౌంట్ టీపీఏ 30 బీమా సంస్థలు, 3,000 పైచిలుకు గ్రూప్ కస్టమర్లు, రిటైల్ పాలసీదారులతో కలిసి పని చేస్తోంది. మార్కెట్‌లో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడగలదని మెడి అసిస్ట్ సీఈవో సతీష్ గిడుగు తెలిపారు. రెండు దిగ్గజ టీపీఏలు జట్టు కట్టడమనేది 2047 నాటికి అందరికీ బీమాను అందజేయాలన్న లక్ష్య సాకారానికి దోహదపడగలదని పారమౌంట్ టీపీఏ ఎండీ నయన్ షా పేర్కొన్నారు.

బజార్ స్టైల్ @ రూ. 370-389

- ● ఆగస్ట్ 30న ఐపీవో షురూ
- ● రూ. 835 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: వేల్యూ ఫ్యాషన్ రిటైలర్.. బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 30న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 3న ముగియనున్న ఇష్యూకి కంపెనీ రూ. 370–389 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 148 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.76 కోట్ల(రూ. 687 కోట్ల విలువ) షేర్లను ప్రమోటర్‌సహా ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 835 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఇష్యూలో రేఖా జున్‌జున్‌వాలా, ఇంటెన్సివ్ సాఫ్ట్‌షేర్ ప్రయివేట్ తదితరాలు వాటాలను ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 146 కోట్లను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 38 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా పశ్చిమ బెంగాల్, ఒడిషాలలో వేల్యూ రిటైల్ మార్కెట్ విభాగంలో పట్టు కలిగి ఉంది. అస్సామ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, త్రిపుర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలలోనూ విస్తరణపై దృష్టి పెట్టింది. గతేడాది(2023–24) మొత్తం ఆదాయం రూ. 973 కోట్లకు చేరగా.. రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది.



ఆఫర్‌కు 2 కంపెనీలు రెడీ

పబ్లిక్ ఇష్యూల ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు తాజాగా రెండు కంపెనీలు అనుమతులు పొందాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి పటేల్ రిటైల్, గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్‌లలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి.

పటేల్ రిటైల్

సూపర్‌మార్కెట్ చైన్ పటేల్ రిటైల్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా 90.18 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 10.02 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 250–325 కోట్లమధ్య సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 60 కోట్లను రుణ చెల్లింపులకు, రూ. 115 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

గరుడ కన్‌స్ట్రక్షన్

మౌలిక సదుపాయాల కంపెనీ గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూలో భాగంగా 1.83 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 95 లక్షల షేర్లను ప్రమోటర్లు పీకేహెచ్ వెంచర్స్ ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రెసిడెన్షియల్, కమర్షియల్, ఆతిథ్య, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులను కంపెనీ చేపడుతోంది.

‘లాస్ట్’ ఏంజెలిస్!

ఫిట్‌నెస్‌తో ఉంటే 2028 ఒలింపిక్స్‌తో కెరీర్ ముగిస్తా

వరుస ఒలింపిక్ పతకాలు అద్భుతం • గోల్‌కీపర్ శ్రీజేశ్ ‘గ్రేటెస్ట్’
భారత హాకీ స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ మనోగతం





2021లో...



2024లో...

న్యూఢిల్లీ: ఒకవేళ ఫిట్‌నెస్ సహకరిస్తే...2028లో జరిగే లాస్ ఏంజెలిస్ (ఎల్ఏ) ఒలింపిక్స్‌లోనూ ఆడి కెరీర్‌కు గుడ్‌బై చెబుతానని భారత హాకీ జట్టు స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తెలిపాడు. 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మూడేళ్ల క్రితం టోక్యో విశ్వక్రీడల్లో కాంస్య పతకాన్ని గెలిచిన భారత జట్టుకు మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వం వహించాడు. తాజా పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ కాంస్య పతకాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంలోనూ కీలకపాత్ర పోషించిన మన్‌ప్రీత్ వరుస ఒలింపిక్స్ పతకాల్లో భాగమయ్యాడు. ఇప్పటివరకు నాలుగు ఒలింపిక్స్ ఆడిన మన్‌ప్రీత్ దిగ్గజాలు ఉధమ్ సింగ్, లెస్లీ క్లాడియస్, ధనరాజ్ పిళ్లై, ఇటీవలే రిటైరైన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ సరసన నిలిచాడు. భారత హాకీకి శ్రీజేశ్ చేసిన సేవలు అందరికీ తెలుసని అన్నాడు. అతనో గ్రేటెస్ట్ ప్లేయర్ అని కితాబిచ్చాడు. సరిగ్గా ఒలింపిక్స్‌కు ముందు స్విట్జర్లాండ్‌లో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిబిరం జట్టుకు బాగా ఉపకరించిందన్నాడు. ఓ ఇంటర్వ్యూలో 32 ఏళ్ల స్టార్ మిడ్‌ఫీల్డర్ తన భవిష్యత్ లక్ష్యాలతో పాటు వరుస ఒలింపిక్ పతకాలపై తన మనోగతాన్ని వివరించాడు.

లక్ష్యం ఎల్ఏ–2028

‘లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌ను లక్ష్యంగా పెట్టుకున్నాను. అయితే ఇది సాధించాలంటే నేను పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో ఉండాలి. నేను ఇలాగే ఫామ్‌ను కొనసాగిస్తూ... ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటేనే లక్ష్యం చేరుకోగలను. ఇప్పుడు హాకీలో ఫిట్‌నెస్ ప్రధాన భూమిక పోషిస్తోంది. మైదానంలో చురుకైన పాత్రకు ఇదే కీలకం. ఆ తర్వాతే మిగతావన్నీ’ అని మన్‌ప్రీత్ చెప్పాడు. అదృష్టవశాత్తూ ఈ వెటరన్ స్టార్ సుదీర్ఘ కెరీర్‌లో చెప్పుకోదగ్గస్థాయిలో గాయాల బారిన పడలేదు. 378 అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లాడిన అతను 44 గోల్స్ చేశాడు.

వరుస ఒలింపిక్ పతకాలు

‘ఏ అథ్లెట్ లక్ష్యమైనా ఒలింపిక్ పతకమే! అది ప్రతి ఒక్కరి కల. మేం మూడేళ్ల క్రితం టోక్యోలో... ఇప్పుడేమో పారిస్‌లో ఇలా వరుస ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడం చాలా అద్భుతంగా అనిపిస్తుంది. కొన్ని దశాబ్దాల తర్వాతే భారత్... హాకీలో ఇలా వరుస విశ్వక్రీడల్లో పతకాలు గెలిచింది. నేను ఇప్పటివరకు నాలుగు ఒలింపిక్స్ ఆడాను. తొలి రెండు మెగా ఈవెంట్లలో పతకాల్లేవు. కానీ తర్వాత రెండు ఈవెంట్లలో పతకం కల నెరవేరడంతో నా ఆనందానికి హద్దుల్లేవు’ అని హర్షం వ్యక్తం చేశాడు.

జట్టు కోసం ఏ పాత్రకైనా...

పారిస్‌లో బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో అమిత్ రోహిదాస్‌కు ‘రెడ్ కార్డ్’ పడటంతో జట్టు పది మందితోనే ఆడాల్సి వచ్చింది. అప్పుడు మన్‌ప్రీత్ డిఫెండర్‌గా రక్షణపంక్తిలో ఉండి జట్టును ఆదుకున్నాడు. ‘నేను దేనికైనా సిద్ధంగా ఉంటాను. జట్టు అవసరాల కోసం నా స్థానం మారినా, ఎక్కడ సర్దుబాటు చేసినా సరే! జట్టు ఏం డిమాండ్ చేస్తే అదే పని నేనూ చేస్తాను. ఇందుకోసం నేను శిక్షణ తీసుకున్నా. ప్రో లీగ్ హాకీ మ్యాచ్‌ల్లో ఆదే చేశాను. కాబట్టే నా స్థానం మారినా నాకే బెంగ ఉండదు. కష్టమని అనిపించదు. జట్టులో నేను ఎంత కీలకమో... నా బాధ్యతలెంటో నాకు బాగా తెలుసు. మా ప్రణాళికల్ని అమలు చేసేందుకు ఎల్లప్పుడు రెడీగా ఉంటాను’ అని అన్నాడు.

మెడలో పతకం... పక్కన భార్యాపిల్లలు!

భార్యాపిల్లల సమక్షంలో పతకం గెలుపొందడం చాలా ఆనందాన్నిచ్చిందని చెప్పుకొచ్చాడు. ‘పతకాల ప్రదానోత్సవం ముగిసిన వెంటనే నా భార్య ఇలి నజ్వా సాదిక్ (మలేసియన్), కుమార్తె జాస్మిన్ గ్రౌండ్‌లోకి రావడం... వారితో నేను సాధించిన పతకం, నా సంతోషం పంచుకోవడం చాలా గొప్ప అనుభూతినిచ్చింది’ అని మన్‌ప్రీత్ చెప్పాడు. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో తాను సాధించిన కాంస్య పతకాన్ని తల్లి మెడలో వేసిన మన్‌ప్రీత్ ‘పారిస్’ నుంచి తిరిగి వచ్చిన వెంటనే అలాగే చేశాడు.



‘దివ్య’మైన ప్రస్థానం

- కెరీర్ బెస్ట్ 15వ ర్యాంక్‌కు చేరుకున్న భారత చెస్ రైజింగ్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్
- తొలిసారి టాప్–15లో నలుగురు భారత క్రీడాకారిణులు

ముంబై: ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న భారత చెస్ రైజింగ్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్ కెరీర్ బెస్ట్ 15వ ర్యాంక్‌ను అందుకుంది. అబుదాబి మాస్టర్స్ టోర్నీలో తొమ్మిది రౌండ్లకుగాను ఆరు పాయింట్లు సాధించిన 18 ఏళ్ల దివ్య 11 ఎలో రేటింగ్ పాయింట్లను సంపాదించింది. ఈ ప్రదర్శనతో నాగ్‌పూర్‌కు చెందిన దివ్య చెస్ లైవ్ రేటింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌లో నిలిచింది. వచ్చే నెల ఒకటో తేదీన అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) విడుదల చేసే ర్యాంకింగ్స్‌లో దివ్య అధికారికంగా 15వ ర్యాంక్‌ను అందుకుంటుంది. ఈ ఏడాది బరిలోకి దిగిన ప్రతి టోర్నీలో దివ్య రేటింగ్ పాయింట్లను సాధించింది. టాటా స్టీల్ చాలెంజర్స్, గ్రెన్‌కెచెస్, షార్జా మాస్టర్స్, వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్, టర్కిష్ లీగ్‌లలో దివ్య పాల్గొని ఓవరాల్‌గా 63 పాయింట్లను సంపాదించింది. సీజన్‌ను 2420 రేటింగ్ పాయింట్లతో ఆరంభించిన దివ్య ఖాతాలో ప్రస్తుతం 2483 పాయింట్లున్నాయి. దివ్య ర్యాంక్ మెరుగవ్వడంతో తొలిసారి ‘ఫిడే’ మహిళల ర్యాంకింగ్స్‌లో టాప్–15లో నలుగురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి ఏడో స్థానంతో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతుండగా... ద్రోణవల్లి హారిక 11వ ర్యాంక్‌లో, తమిళనాడుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలి 12వ ర్యాంక్‌లో, దివ్య దేశ్‌ముఖ్ 15వ ర్యాంక్‌లో ఉన్నారు. తదుపరి సెప్టెంబర్ 10 నుంచి 23 వరకు హంగేరిలో జరిగే చెస్ ఒలింపియాడ్‌లో దివ్య భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

వినేశ్‌కు సన్మానం



రోహ్‌తక్: భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు హరియాణా సర్వ్‌ఖాప్ పంచాయత్ స్వర్ణ పతకంతో సత్కరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ బరికి ముందు వందగ్రాముల అధిక బరువుతో ఊహించని రీతిలో వినేశ్ అనర్హతకు గురైంది. దీంతో ఓడినా కనీసం రజతం ఖాయమనుకున్న పతకం కూడా చేజారింది. సంయుక్త రజతం కోసం అప్పీలుకు వెళ్లినా... నిరాశే ఎదురైంది. ‘నిబంధన’తో పతకానికి దూరమైనా తన పోరాటపటిమతో యావత్ భారతావని హృదయాల్ని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో హరియాణాలోని సర్వ్‌ఖాప్ పంచాయత్ పెద్దలు ఆమె పోరాటానికి తగిన రీతిలో స్వర్ణ పతకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ‘నా పోరాటం ముగియలేదు. ఇప్పుడే మొదలైంది! ఆడపిల్లల కోసం పోరాటం కొనసాగుతుంది. ఇదే విషయాన్ని ఢిల్లీ రోడ్లపై చేసిన నిరసన దీక్ష, ధర్నాలోనూ గళమెత్తి చాటాం’ అని చెప్పింది. మహిళా రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని రెజ్లర్లు ఢిల్లీలో రెండుసార్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ‘అప్పుడు పారిస్‌లో ఫైనల్లో ఆడలేకపోవడం దురదృష్టమని కుంగిపోయాను. కానీ స్వదేశానికి తిరిగొచ్చాక జనం పలికే జేజేలు, కురిపించే అభిమానం, కనిపించే ఆదరణ చూస్తుంటే ఎంతో అదృష్టవంతురాలినని మురిసిపోతున్నా. దీన్ని మించిన గొప్ప పతకం ఇంకేముంటుంది చెప్పండి’ అని వినేశ్ పేర్కొంది.

ప్రముఖ కోచ్ ఎరిక్సన్ కన్నుమూత



సూన్ (స్వీడన్): అటు అంతర్జాతీయ జట్లకు, ఇటు క్లబ్ జట్లకు కోచ్‌గా ఎన్నో విజయాలు అందించిన ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ స్వెన్ గొరాన్ ఎరిక్సన్ (76) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్ 2001–06 మధ్య ఇంగ్లండ్ జాతీయ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. ఇంగ్లండ్‌కు శిక్షకుడిగా వ్యవహరించిన తొలి విదేశీ వ్యక్తిగా ఎరిక్సన్ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన నేతృత్వంలోనే ఇంగ్లండ్ 2002 వరల్డ్ కప్, 2004 యూరో కప్, 2006 వరల్డ్ కప్‌లలో క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లింది.

జోనసన్‌పై వేటు

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీకి ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

సిడ్నీ: వరుసగా నాలుగో టి20 ప్రపంచకప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టును సోమవారం ప్రకటించారు. అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈలో జరిగే ఈ మెగా టోర్నీలో పోటీపడే ఆస్ట్రేలియా జట్టుకు అలీసా హీలీ కెప్టెన్‌గా, తాలియా మెక్‌గ్రాత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టులో ఎడంచేతి వాటం సీనియర్ స్పిన్నర్ జెస్ జొనసన్‌కు చోటు లభించకపోవడం గమనార్హం. 31 ఏళ్ల జెస్ జొనసన్ ఆస్ట్రేలియా తరఫున 6 టెస్టులు ఆడి 7 వికెట్లు, 93 వన్డేలు ఆడి 141 వికెట్లు, 105 టి20 మ్యాచ్‌లు ఆడి 96 వికెట్లు పడగొట్టింది. జెస్ జొనసన్ 2012, 2014, 2018, 2020, 2023లలో టి20 ప్రపంచకప్ టైటిల్ సాధించిన ఆస్ట్రేలియా జట్టులో... 2016 టి20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యురాలిగా ఉండటం విశేషం.

ఆస్ట్రేలియా జట్టు: అలీసా హీలీ (కెప్టెన్), తాలియా మెక్‌గ్రాత్ (వైస్ కెప్టెన్), డార్సీ బ్రౌన్, యాష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, ఫోబీ లిచ్‌ఫీల్డ్, సోఫీ మోలినెక్స్, బెత్ మూనీ, ఎలీస్ పెరీ, మేగన్ షుట్, అనాబెల్ సదర్లాండ్, జార్జియా వేర్‌హమ్, టేలా వ్లామినిక్.



బెంగళూరు ఘన విజయం

చెన్నై: టీటీ లీగ్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)లో బెంగళూరు స్మాషర్స్ 10–5 తేడాతో పుణేరీ పల్టన్‌ను చిత్తు చేసింది. స్టార్ ప్లేయర్ మనికా బత్రా మహిళల సింగిల్స్‌లో విజయంతో జట్టును గెలుపు దిశగా నడిపించింది. ఈ ‘టై’ తొలి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో పుణేరీ కుర్రాడు అంకుర్ భట్టాచార్జీ 11–6, 5–11, 11–7తో జీత్ చంద్రను ఓడించి తన జట్టును శుభారంభం అందించాడు. ఐహిక ముఖర్జీతో జరిగిన మ్యాచ్‌లో మనికా అనూహ్యంగా తొలి గేమ్‌ను 8–11తో కోల్పోయింది. అయితే వెంటనే కోలుకున్న ఆమె 11–5, 11–6తో తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక-అల్వారో రొబల్స్ 11–6, 8–11, 11–10తో అనిర్బన్ ఘోష్-నటాలియా బాజర్‌లను ఓడించడంతో బెంగళూరు ఆధిక్యం మరింత పెరిగింది. రెండో పురుషుల సింగిల్స్‌లో అల్వారో రొబల్స్ 11–5, 10–11, 11–8తో పుణే ప్లేయర్ మాంటిరోను ఓడించగా... రెండో మహిళల సింగిల్స్‌లో అమెరికా క్రీడాకారిణి లిలీ జాంగ్ 11–9, 11–9, 11–5తో యశిని శివశంకర్‌పై గెలుపొంది స్మాషర్స్ విజయాన్ని ఖాయం చేసింది.

వన్స్‌మోర్... వరల్డ్ రికార్డు



పోల్‌వాల్ట్‌లో 10వసారి ప్రపంచ రికార్డు నెలకొల్పిన డుప్లాంటిస్

సిలెసియా (పోలాండ్): క్రీడాకారులెవరైనా ఒకసారి ప్రపంచ రికార్డు సృష్టిస్తేనే ఎంతో గొప్ప ఘనతగా భావిస్తారు. రెండుసార్లు బద్దలు కొడితే అద్భుతం అనుకుంటారు... మూడుసార్లు వరల్డ్ రికార్డు నెలకొల్పితే అసాధారణం అనుకుంటారు... మరి 10 సార్లు ప్రపంచ రికార్డులను సవరించిన వారిని ఏమనాలి...! ప్రస్తుతానికి మోండో డుప్లాంటిస్ అని అనాల్సిందే. వరల్డ్ రికార్డులు తన చిరునామాగా మలుచుకొని... ప్రపంచ రికార్డులు సృష్టించడం ఇంత సులువా అన్నట్లు స్వీడన్ పోల్‌వాల్టర్ మోండో డుప్లాంటిస్ చెలరేగిపోతున్నాడు. మూడు వారాల క్రితం పారిస్ ఒలింపిక్స్‌లో తొమ్మిదోసారి తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన డుప్లాంటిస్... తాజాగా పోలాండ్‌లో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో 10వసారి వరల్డ్ రికార్డును నెలకొల్పాడు. తన రెండో ప్రయత్నంలో డుప్లాంటిస్ 6.26 మీటర్ల ఎత్తును దాటేసి కొత్త ప్రపంచ రికార్డును లిఖించాడు. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్‌లో 6.25 మీటర్లతో తానే సృష్టించిన వరల్డ్ రికార్డును డుప్లాంటిస్ సవరించాడు. ప్రపంచ రికార్డు సృష్టించినందుకు డుప్లాంటిస్‌కు 50 వేల డాలర్ల ప్రైజ్‌మనీ లభించింది. మరోవైపు ఇదే మీట్‌లో నార్వేకు చెందిన జాకబ్ ఇంగ్‌బ్రిగ్‌స్టెన్ పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో కొత్త ప్రపంచ రికార్డును సృష్టించాడు. ఇంగ్‌బ్రిగ్‌స్టెన్ 7 నిమిషాల 17.55 సెకన్లలో గమ్యానికి చేరాడు. ఈ క్రమంలో 1996లో కెన్యా అథ్లెట్ డేనియల్ కోమెన్ (7 నిమిషాల 20.67 సెకన్లు) నెలకొల్పిన వరల్డ్ రికార్డు తెరమరుగైంది. ప్రపంచ రికార్డు సృష్టించినందుకు జాకబ్‌కు కూడా 50 వేల డాలర్ల ప్రైజ్‌మనీ అందించారు.



ఇంగ్‌బ్రిగ్‌స్టెన్

స్వీడన్‌ను వీడి స్వదేశానికి

గత ఆర్నెల్లలో 171% పెరిగిన భారతీయుల ఘర్ వాపసీ ● లే ఆఫ్స్, వాతావరణం, 'వర్క్ ఫ్రం హోం' కారణాలు

స్వీడన్.. ఐరోపాలో ఐదో పెద్ద దేశం. అందమైన ప్రకృతి దృశ్యాలు, ప్రత్యేకమైన సంస్కృతి. అయినప్పటికీ చాలామంది భారతీయులు స్వీడన్‌ను వీడి స్వదేశానికి వచ్చేస్తున్నారు. ఇలా వస్తున్న వారి సంఖ్య 2024లో జనవరి–జూన్ మధ్య ఏకంగా 171% పెరగడం విశేషం! 1998 తర్వాత ఇంత భారీగా భారతీయులు స్వీడన్ వీడి రావడం ఇదే తొలిసారి. ఇందుకు కారణాలను తెలుపుతూ స్వీడన్‌లో ఉంటున్న భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, స్వీడన్–ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈఓ అంకుర్ త్యాగి చేసిన పోస్టు వైరల్‌గా మారింది. – న్యూఢిల్లీ

సామాజిక అనైక్యత...

స్వీడన్‌లో సాంస్కృతిక, భాషా అవరోధాల వల్ల స్థానికులతో భారతీయులు సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోలేకపోతున్నారు. స్వదేశంలో ఉండగా బాగా అలవాటైన బలమైన సామాజిక బంధాలను కోల్పోతున్నారు. స్వీడిష్ సమాజంలో పూర్తిగా కలిసిపోలేకపోతున్నారు. ఒంటరితనం, స్నేహితుల లేమివ వంటివి వారిని కుంగదీస్తున్నాయి. వృద్ధులైన తల్లిదండ్రులకు తోడుగా, కుటుంబానికి దగ్గరగా ఉండటానికి తిరిగి వచ్చేస్తున్నారు. కఠినమైన స్వీడిష్ వాతావరణం, అధిక జీవన వ్యయం కూడా ముఖ్యమైన సమస్యలే.

సాంస్కృతిక సవాళ్లు...

స్వీడన్‌లో భారతీయ నిపుణుల జీవిత భాగస్వాములూ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అర్హతలు, పని అనుభవం ఉన్నా స్వీడిష్ భాషా నైపుణ్యాలు లేకపోవడం వల్ల చాలామందికి ఉద్యోగాలు రావడం లేదు. సర్వీస్ అపార్ట్‌మెంట్ల కొరతతో వసతి కూడా సమస్యగా మారుతోంది. వీటికి తోడు భారత్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుండటంతో అక్కడ అవకాశాలు అపారంగా పెరుగుతుండటమూ మనవాళ్లు స్వదేశీ బాట పట్టేందుకు ప్రధాన కారణమని త్యాగి పేర్కొన్నారు. నిపుణులకు భారత్‌లో మెరుగైన అవకాశాలు, మంచి వేతనాలు, ఉత్తేజకరమైన కెరీర్ ఉంటున్నట్టు చెప్పుకొచ్చారు.



కొవిడ్ తర్వాత...

కొవిడ్ మహమ్మారి అనంతరం పలు రంగాల్లో ఎక్కడి నుంచైనా పని చేయడానికి వీలుండటం కూడా మనవాళ్లు స్వీడన్ వీడేందుకు కారణంగా మారుతోంది. భారత్‌కు తిరిగి వచ్చి ఇక్కడి నుంచే పలు అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్నారు. తమ దేశానికి వలసలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా విదేశాల్లో జన్మించిన స్వీడిష్ పౌరులు దేశం విడిచి వెళ్ళడానికి స్వీడిష్ ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. స్వచ్ఛంద నిష్క్రమణ పథకం కింద ప్రస్తుతం 10,000 స్వీడిష్ క్రౌన్లు (సుమారు 960 డాలర్లు), వారు దేశం విడిచి వెళ్ళడానికి ప్రయాణ ఖర్చులను అందిస్తోంది. ఇది కూడా ఓ కారణమై ఉంటుందని, అయితే దేనిని అంచనా వేయాలన్నా ఏడాదిపాటు వలసలను అధ్యయనం చేయాలని స్వీడన్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈఓ, సెక్రటరీ జనరల్ రాబిన్ సుఖియా చెబుతున్నారు.

గత ఆర్నెల్లలో 2,461 మంది వెళ్లారు!

నిజానికి స్వీడన్‌కు వెళ్లే భారతీయుల సంఖ్య తక్కువేమీ కాదు. 2024లో ఇప్పటిదాకా స్వీడన్‌కు వలస వెళ్లినవారిలో ఉక్రేనియన్ల తరువాత ఎక్కువమంది భారతీయులే. గత జనవరి నుంచి జూన్ దాకా 2,461 మంది మనవాళ్లు స్వీడన్ బాటపట్టారు. అయితే గత ఆరేళ్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. 2020, 2021 కోవిడ్ సంవత్సరాలను మినహాయిస్తే 2017–2024 మధ్య ఒక ఏడాదిలో ఇంత తక్కువ సంఖ్యలో భారతీయులు స్వీడన్ వెళ్లడం ఇదే తొలిసారి.

హరియాణాలో ఆప్ బలపరీక్ష!

మొత్తం 90 స్థానాల్లో పోటీకే మొగ్గు

- ఢిల్లీ–పంజాబ్ సరిహద్దుల వెంట ఉన్న 27 నియోజకవర్గాలపై ఫోకస్
- కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ
- ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రుల భార్యలు ప్రచారంలోకి

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అంతగా ప్రభావం చూపలేకపోయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రస్తుత హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమైంది. తాము అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న హరియాణాలో వీలైనన్ని ఎక్కువ సీట్లలో గెలవడం ద్వారా తన బలాన్ని పెంచుకునే ఎత్తులు వేస్తోంది. రాష్ట్రంలోని 90 స్థానాల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధమైన ఆప్ ఢిల్లీ, పంజాబ్‌ల సరిహద్దుల వెంట ఉన్న 27 నియోజకవర్గాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది.

పొత్తులకు దూరంగా.. ఒంటరి పోరాటం

2019 ఎన్నికల్లోనూ హరియణా అసెంబ్లీలో 46 స్థానాల్లో పోటీ పడిన ఆప్ కేవలం 0.48 శాతం ఓట్లను మాత్రమే రాబట్టుకోగలిగింది. ఆ పార్టీకి చెందిన 35 మందికి పైగా అభ్యర్థులకు వెయ్యి కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల అనంతరం మొదలైన రైతు ఉద్యమాల సమయంలో ఆప్ ఆ రాష్ట్రంలో పుంజుకునే ప్రయత్నాలు చేసింది. ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన హరియాణా రైతులకు అటు పంజాబ్‌లోని, ఇటు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం సహకరించింది. ఆప్‌కు పెరిగిన బలాన్ని దృష్టిలో పెట్టుకునే మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో పొత్తులు పెట్టుకుంది. హరియాణాలోని మొత్తం 10 లోక్‌సభ స్థానాలకు గానూ ఆప్ కురుక్షేత్ర నుంచి ఒక్క స్థానంలోనే పోటీ చేసింది. ఆప్ పార్టీ అభ్యర్థి సుశీల్ గుప్తా 29,021 ఓట్ల స్వల్ప తేడాతో బీజేపీకి చెందిన నవీన్ జిందాల్ చేతిలో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఒంటరిగానే బరిలోకి దిగుతున్న ఆప్, రాష్ట్రంలోని పెహోవా, షహబాద్, కలయత్, గుహ్లా, అంబాలా, తోహానా, రతియా, సర్వానా, రానియా, కలన్‌వాలి, దబ్వాలీ, సోహ్నా, బల్లాబ్‌ఘర్, బహదూర్‌ఘర్‌తో వంటి సరిహద్దు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు ఆప్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ఇక్కడ ఇప్పటికే ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తోంది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ భార్య గురుప్రీత్ కౌర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత ఇప్పటికే రాష్ట్రంలో ప్రచారం మొదలు పెట్టారు. తమ పార్టీ ప్రధాన హామీలైన ఉచిత విద్యుత్, యువతకు ఉపాధి, ప్రతి విద్యార్థికి ఉచిత విద్య, ఉచిత వైద్యం, 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ. వెయ్యి సాయం అంశాలను వారు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సెప్టెంబర్ మొదటివారంలో అభ్యర్థుల ప్రకటన పూర్తయిన వెంటనే ఆప్ తన ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది. హరియాణాలో అక్టోబర్ ఒకటిన ఎన్నికలు జరుగనున్నాయి.

దర్శన్‌కు రాచమర్యాదలపై సీరియస్

- చీఫ్ జైలు సూపరింటెండెంట్ సహా 9 మంది అధికారుల సస్పెన్షన్
- కర్ణాటక హోం మంత్రి ప్రకటన

బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా జైలు గదిలో ఉండాల్సిన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు రాచమర్యాదల అంశం చివరకు తొమ్మిది మంది జైలు అధికారులపై సస్పెన్షన్ వేటుకు దారితీసింది. తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో బ్యారక్‌లో ఉండాల్సిన దర్శన్ స్వేచ్ఛగా జైల్లో తిరుగుతూ, సిగరెట్లు కాలుస్తూ, వీడియో కాల్ మాట్లాడినట్లు ఫొటో, వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమవడంతో కర్ణాటక పోలీసు శాఖ క్రమశిక్షణా చర్యలకు దిగింది. జైల్లో ఉన్న రౌడీషీటర్ వేలు ఈ ఫొటోను రహస్యంగా సెల్‌ఫోన్‌లో తీసి బయట ఉన్న తన భార్య సెల్‌ఫోన్‌కు పంపించినట్లు తెలుస్తోంది. జైలు చీఫ్ సూపరింటెండెంట్, జైలు సూపరింటెండెంట్‌సహా 9 మందిని సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వర సోమవారం ప్రకటించారు. ''చీఫ్ సూపరింటెండెంట్ స్థాయిలో తప్పిదం జరిగింది. అసలు ఫోన్లు, కుర్చీలు, సిగరెట్లు, టీ, కాఫీలు ఎవరు సమకూర్చారో దర్యాప్తుచేస్తున్నాం. సీనియర్ ఐపీఎస్‌తో విచారణ జరిపిస్తున్నాం. దర్శన్‌ను వేరే జైలుకు తరలించే అంశాన్నీ పరిశీలిస్తున్నాం'అని మంత్రి చెప్పారు. ''ఆగస్ట్ 22న ఈ ఘటన జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా, జైల్లో ఫోన్లను గుర్తించే కృత్రిమ మేథ పరికరాలను బిగిస్తాం''అని అదనపు డైరెక్టర్ జనరల్(జైళ్లు) మాలిని కృష్ణమూర్తి చెప్పారు. జైళ్ల అధికారుల తప్పిదాల వల్లే ఇలాంటి ఘటన జరిగిందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. జూన్ 9న సుమనహళ్లి వద్ద కాల్వలో రేణుకాస్వామి మృతదేహం లభ్యమైన కేసులో దర్శన్, అతని సన్నిహిత నటి పవిత్రా గౌడ సహా 17 మందిని పోలీసులు అరెస్ట్‌చేసి విచారణఖైదీలుగా కారాగారానికి పంపడం తెల్సిందే.



వందేళ్ల తర్వాత వేలానికి

కొందరికి నాణేలు, ఇంకొందరికి పోస్టల్ స్టాంప్స్, మరికొందరికి కరెన్సీ. బాల్యంలో సేకరణ చాలామందికి ఓ అభిరుచి. అచ్చం ఇలాగే ఆ దానిష్ వాణిజ్యవేత్తకూ నాణేలంటే పిచ్చి. అందుకే పదీ, ఇరవై కాదు 20వేల నాణేలను సేకరించాడు. అత్యంత ఖరీదైన ఆ నాణేల నుంచి కొన్నింటిని వచ్చే నెలలో వేలం వేయనున్నారు. ఆ నాణేల ప్రత్యేకత ఏమిటి? వందేళ్ల తరువాతే ఎందుకు వేలం వేస్తున్నారు? ఆ విశేషాలు ఓసారి చూద్దాం..

అత్యంత ఖరీదైన కింగ్ హాన్స్ నాణెం..

సెప్టెంబర్ 14 న జరిగే మొదటి సేల్ కోసం డెన్మార్క్, నార్వే, స్వీడన్‌కు చెందిన బంగారం, వెండి నాణేలతో సహా 280కి పైగా లాట్లను స్టాక్స్ బోవర్స్ ఉంచనుంది. వీటిలో 15వ శతాబ్దం చివరి నుంచి బ్రూన్ జీవితం చివరి సంవత్సరాల వరకు ఉన్నాయి. వీటి విలువ 10 మిలియన్ డాలర్లకు పైగా ఉంటుంది. ఇందులో స్టార్‌లాట్.. స్కాండినేవియా పురాతన బంగారు నాణేలలో ఒకటి. 1496 నాటి కింగ్ హాన్స్ నాణెం అత్యంత ఖరీదైనది. డెన్మార్క్ ముద్రించిన మొదటి బంగారు నాణెం. దీనిని 600,000 యూరోలు లేదా 672,510 డాలర్లకు విక్రయించవచ్చు. ఈ నాణేలను వివిధ గత కొన్ని నెలలుగా వివిధ ఎగ్జిబిషన్స్‌లో, స్టాక్స్ బోవర్స్ గ్యాలరీలలో ప్రదర్శించారు. అమ్మకానికి ముందు వీటిని కోపెన్‌హాగన్‌లో ప్రదర్శనకు ఉంచనున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

డెన్మార్క్‌కు చెందిన లార్స్‌ఎమిల్ బ్రూన్ (ఎల్.ఇ.బ్రూన్) భూస్వాముల కొడుకు. అయితే కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని 20 ఏళ్ల వయసులోనే తెలుసుకున్నారు. మరి కొంత రుణం తెచ్చి వెన్న వ్యాపారాన్ని ప్రారంభించారు. అమ్మకాలు, ఎగుమతులతో అత్యంత ధనవంతుడిగా ఎదిగారు. అతని మేనమామకు నాణేల సేకరణ ఇష్టం. అది కాస్తా బ్రూన్‌కు వారసత్వంగా వచ్చింది. చిన్నతనంలో 1859 నుంచే కరెన్సీని సేకరించడం ప్రారంభించారు. సంపన్నుడిగా ఎదిగాక.. అతని నాణేల సేకరణ కూడా సుసంపన్నమయ్యింది. దాదాపు 20వేల అత్యంత విలువైన నాణేలను సేకరించారు. 1885లో డానిష్ న్యూమిస్మాటిక్ (నాణేల సేకరణ, అధ్యయనం) సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా మారారు. 1923లో బ్రూన్ మరణించారు. తన నాణేల సేకరణను వందేళ్లపాటు దాచి ఉంచేలా వీలునామా రాశారు.

వింత వీలునామా..

''ఆరు దశాబ్దాలకు పైగా కూడబెట్టిన విస్తారమైన నాణేలు, నోట్లు, పతకాలు డెన్మార్క్ జాతీయ సేకరణ అత్యవసర రిజర్వ్‌లో ఉంచాలి. అంతా సవ్యంగా ఉంటే.. నా వారసులకు ప్రయోజనం కలిగేలా వందేళ్ల తరువాత వాటిని విక్రయించవచ్చు''అని బ్రూన్ తన వీలునామాలో పేర్కొన్నారు. నిధిని ఇంతకాలం దాచడానికి ఓ కారణం ఉంది. మొదటి ప్రపంచ యుద్ధంలో విధ్వంసం చూసిన అతను.. తన రాయల్ డానిష్ కాయిన్ అండ్ మెడల్ కలెక్షన్ ఏదో ఒక రోజు బాంబు దాడి ఎదుర్కోవచ్చు లేదా దోపిడీకి గురికావచ్చని భావించారు. అందుకే వందేళ్ల తరువాత అని వీలునామాలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ వందేళ్లు నాణేలను రహస్యంగా ఉంచారు. అవి ఎక్కడున్నాయో చాలా తక్కువ మందికి తెలుసు.

గతేడాది ముగిసిన గడువు..

వందేళ్ల గడువు 2023తో ముగిసిపోయింది. బ్రూన్ వ్యక్తిగత 20,000 నాణేల సేకరణ నుంచి మొదటి సెట్ నాణేలు వచ్చే నెలలో వేలానికి రానున్నాయి. బ్రూన్ ఖజానా మొత్తం ఖాళీ కావాలంటే.. అనేక వేలాలు నిర్వహించాలి. వేలం మొత్తం పూర్తయితే ఇప్పటివరకు విక్రయించిన అత్యంత ఖరీదైన అంతర్జాతీయ నాణేల సేకరణ అవుతుందని అరుదైన నాణేల డీలర్, అమ్మకాలను నిర్వహించే వేలం సంస్థ స్టాక్స్ బోవర్స్ తెలిపింది. బ్రూన్ కలెక్షన్ 500 మిలియన్ డానిష్ క్రోనర్ లేదా సుమారు 72.5 మిలియన్ డాలర్లకు బీమా చేసినట్లు వెల్లడించింది. మార్కెట్లోకి వచ్చిన ప్రపంచ నాణేలలో అత్యంత విలువైన సేకరణగా వేలం సంస్థ దీనిని అభివర్ణించింది.

హిందువునని ఆధారాలు చూపమన్నారు: నమిత

మదురై: హిందువునని నిరూపించుకునేందుకు ఆధారాలు చూపించాలని, కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని మీనాక్షి సుందరేశ్వర ఆలయ అధికారులు డిమాండ్ చేశారని ప్రముఖ నటి నమిత ఆరోపించారు. ఆలయ అధికారులు తనతో దురుసుగా ప్రవర్తించారని, దర్శనం చేసుకోకుండా అడ్డుకున్నారని ఆమె తెలిపారు. దేశంలో ఏ దేవాలయంలోనూ తాను ఇలాంటి పరీక్ష ఎదుర్కోలేదన్నారు. తాను హిందువుగా పుట్టానని, తిరుపతిలో తన వివాహం జరిగిందని, తన కుమారుడికి శ్రీకృష్ణుడి పేరు పెట్టారని నమిత చెప్పారు. అయితే ఈ ఆరోపణలను ఆలయ సీనియర్ అధికారి ఒకరు ఖండించారు. మాస్కులు ధరించి ఉండటంతో నమితను, ఆమె భర్తను ఆపి, హిందువులా? కాదా అని ఆరాతీశామన్నారు. అది ఆలయంలోని సంప్రదాయమని తెలిపారు. వివరణ ఇవ్వగానే ఆమె నుదుటిపై కుంకుమతో అభిషేకం చేసి మీనాక్షి అమ్మవారి దర్శనం కోసం ఆలయంలోకి తీసుకెళ్లామన్నారు. దీనిపై నమితను ప్రశ్నించగా.. అడగడానికి ఓ పద్ధతి ఉంటుందని, కానీ తనను 20 నిమిషాలపాటు వేచి ఉండేలా చేశారని ఆరోపించారు. తనను గుర్తుపట్టే భక్తులను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకే తాను మాస్క్ ధరించానని, తన పర్యటన గురించి ఆదివారమే మదురై పోలీసులకు సమాచారం అందించానని ఆమె తెలిపారు. మదురై పర్యటన ఆధ్యాత్మికమని, ఇస్కాన్‌లో కృష్ణ జన్మాష్టమిని జరుపుకోవడానికి వచ్చానని ఆమె చెప్పారు. కాగా, ఈ ఘటనపై ధార్మిక శాఖ మంత్రి పీకే శేఖర్ బాబుకు వీడియో సందేశం పంపిన ఆమె.. దురుసుగా ప్రవర్తించిన ఆలయ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నదిలో కొట్టుకుపోయిన ట్రాక్టర్ ట్రాలీ.. ఏడుగురు గల్లంతు

మోర్బి: ట్రాక్టర్ ట్రాలీ నదిలో కొట్టుకుపోయిన ఘటనలో ఏడుగురు గల్లంతు కాగా, మరో 10 మందిని సహాయక సిబ్బంది కాపాడారు. గుజరాత్‌లోని మోర్బి జిల్లాలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాల ధాటికి హల్వాద్ తాలూకాలోని ధావన గ్రామ వద్ద నది కాజ్‌వేపైకి వరద చేరింది. కాజ్‌వేపైగా వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా వచ్చిన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్)సభ్యులు ముమ్మర గాలింపు చేపట్టారు. పది మందిని రక్షించగలిగారు. ట్రాలీ సహా గల్లంతైన మరో ఏడుగురి కోసం అన్వేషణ సాగిస్తున్నారు. గుజరాత్‌లోని చాలా ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి.

ఢిల్లీ నుంచి పాలించాలనుకోవడం అవివేకం

- జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా డిమాండ్‌ను పునరుద్ఘాటించిన రాహుల్‌గాంధీ
- ఇటీవలి కశ్మీర్ పర్యటనలో విద్యార్థినులతో రాహుల్ ముఖాముఖి
- వీడియోను విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలనే డిమాండ్‌ను రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఢిల్లీ నుంచి జమ్మూకశ్మీర్‌ను పాలించాలనుకోవడం అవివేకమన్నారు. గత వారం ఆ రాష్ట్ర పర్యటన సందర్భంగా విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముఖాముఖి మాట్లాడారు. ఆ వీడియోను కాంగ్రెస్ పార్టీ సోమవారం విడుదల చేసింది. ఈ వీడియోలో రాహుల్ గాంధీ జమ్ముకశ్మీర్‌లో జరగబోయే ఎన్నికల గురించి మాట్లాడుతూ, ఒక రాష్ట్రం నుంచి రాష్ట్ర హోదాను తొలగించడం భారత చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. అది చేసిన విధానం తమకు నచ్చలేదని, రాష్ట్ర హోదాను తిరిగి పొందడం, అందులో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజలకు ప్రాతినిధ్యం ఉండటం తమ ప్రధాన లక్ష్యమని రాహుల్ తెలిపారు. ఢిల్లీ నుంచి కశ్మీర్‌ను, జమ్మూను నడపాలనుకోవడంలో అర్థం లేదని ఆయన కొట్టిపారేశారు. ''ప్రధాని నరేంద్ర మోదీ ఎవరి మాటా వినరు. మొదటి నుంచి తాము చెప్పింది కరెక్ట్ అనుకుంటారు. అదే అసలు సమస్య. తనది తప్పని చూపించినా ఒప్పుకోరు. అలాంటి వ్యక్తులు నిత్యం ఏదో ఒక సమస్యను సృష్టిస్తారు. తాము చెప్పిందే కరెక్ట్ అనుకోవడం బలం కాదు.. బలహీనత. ఆత్మన్యూనత నుంచే ఇలాంటివి వస్తాయి''అని రాహుల్ విద్యార్థులతో వ్యాఖ్యానించారు.

మళ్లీ.. పెళ్లి మాట.. నవ్వులు

ఇక రాహుల్‌గాంధీ నిత్యం ఎదుర్కొనే అత్యంత పెద్ద ప్రశ్నను విద్యార్థినుల నుంచి మరోసారి ఎదుర్కొన్నారు. సంభాషణలో భాగంగా పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి గురించి విద్యార్థినులను ఆయన అడగ్గా.. వెంటనే వారు రాహుల్‌ను అదే ప్రశ్న అడిగారు. అయితే తాను 20, 30 సంవత్సరాల నుంచి ఎదుర్కొంటున్నా ఆ ఒత్తిడిని అధిగమించానని చె ప్పారు. పెళ్లి చేసుకుంటారా? అని మరో విద్యార్థిని అడగ్గా.. 'ఇప్పటికైతే ఆలోచన చేయలేదు.. భవిష్యత్‌లో చెప్పలేను'అని సమాధానమిచ్చారు. చేసుకుంటే మాత్రం మమ్మల్ని ఆహ్వానించండంటూ విద్యార్థినులంతా ఒకేసారి కోరారు. 'తప్పకుండా'అని చెప్పడంతో విద్యార్థినుల నవ్వులతో ప్రాంతమంతా సందడిగా మారిపోయింది.

యూట్యూబ్ ఛానల్‌లో వీడియో...

ఇదే వీడియోను రాహుల్‌గాంధీ తన వ్యక్తిగత యూట్యూబ్ చానల్లోనూ పోస్టు చేశారు. వివిధ కళాశాలల్లో లా, ఫిజిక్స్, జర్నలిజం, పొలిటికల్ సైన్స్ వంటి సబ్జెక్టులను చదువుతున్న విద్యార్థుల సమస్యలను, ఆకాంక్షలను తాను లోతుగా అర్థం చేసుకున్నానని రాహుల్ ఆ పోస్టులో పేర్కొన్నారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో మహిళలపై వేధింపుల గురించి కూడా విద్యార్థినులతో మాట్లాడానని, ఇటువంటి ఘటనలు వ్యవస్థాగత సమస్యలను ఎలా ప్రతిబింబిస్తాయి, ప్రాంతాలకతీతంగా మహిళల భద్రత, గౌరవాన్ని ఎలా ప్రభావితం చేస్తాయని విద్యార్థులు తమ ఆందోళనలను పంచుకున్నారని వెల్లడించారు. కశ్మీర్ మహిళలకు గొప్ప శక్తి, నిలదొక్కుకునే ధైర్యం, వివేకం ఉన్నాయని, ఒక్కసారి వారికి అవకాశం ఇస్తే అద్భుతాలు చేసి చూపుతారని కొనియాడారు. వారికి గౌరవం, భద్రతతోపాటు సమాన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని రాహుల్ నొక్కి చెప్పారు.

ఉక్రెయిన్ పర్యటన విశేషాలను బైడెన్‌తో పంచుకున్న మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఉక్రెయిన్ పర్యటన వివరాలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో పంచుకున్నారు. ఉక్రెయిన్‌లో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతను నెలకొల్పడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. మోదీ సోమవారం బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో అశాంతిపైనా వీరిద్దరూ చర్చించుకున్నారు. బంగ్లాదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. బంగ్లాలో మైనారిటీలు.. ముఖ్యంగా హిందువులకు రక్షణ కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. 'పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై సమగ్రంగా చర్చించాం. ఉక్రెయిన్‌పై కూడా' అని మోదీ ఎక్స్‌లో తెలిపారు. ఉక్రెయిన్ పర్యటన వివరాలను మోదీ వివరించారని అధికారిక ప్రకటన తెలిపింది. క్వాడ్‌తో సహా అంతర్జాతీయ వేదికలపై సహకారాన్ని పెంపొందించుకోవడానికి కట్టుబడి ఉన్నామని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. ఇరుదేశాల ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా భారత్– అమెరికా బంధం కొనసాగుతోందన్నారు.

రాజ్యసభకు నలుగురు

ముంబై/గువహటి: మహారాష్ట్ర, అసోం నుంచి ఇద్దరేసి చొప్పున నలుగురు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్సీపీ (అజిత్)కు చెందిన నితిన్ పాటిల్, బీజేపీ అభ్యర్థి దరియాశీల్ పాటిల్ మహారాష్ట్ర నుంచి ఎన్నికయ్యారు. ఎన్సీపీ, శివసేన (షిండే), బీజేపీలతో కూడిన మహాయుతికి మహారాష్ట్ర అసెంబ్లీలో సంఖ్యాబలం ఉండటంతో విపక్షాలు పోటీకి దూరంగా ఉన్నాయి. కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఉదయన్‌రాజే బోసాలేలు సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నిక కావడంతో రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చాయి. అస్సాం నుంచి బీజేపీ అభ్యర్థులు రామేశ్వర్ తేలి, మిషన్ రంజన్ దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

44.. తూచ్ పదహారే..!

- జమ్మూకశ్మీర్ బీజేపీలో అభ్యర్థుల జాబితా రగడ
- 44 మందితో లిస్ట్ విడుదల చేసిన అధిష్టానం
- పారాచూట్లకే సీట్లా అని బీజేపీ నేతల ఆందోళన
- జాబితా రద్దు చేసి తాజాగా 16 మంది పేర్ల విడుదల


సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటన బీజేపీలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. తొలుత అధిష్టానం 44 మందితో జాబితా విడుదల చేసింది. ఆ జాబితాపై జమ్మూలో కమలం శ్రేణులు భగ్గుమన్నాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే టిక్కెట్లు ఇచ్చారంటూ పార్టీ కార్యాయంలో ఆందోళనకు దిగారు. వారికి సమాధానం చెప్పలేక పార్టీ అధ్యక్షుడు తన కార్యాలయంలోకి వెళ్లి తలుపులు వేసుకోవాల్సి వచ్చింది. చివరికి ఆ జాబితాను రద్దు చేసి..16 మంది పేర్లతో మరో జాబితాను వెలువరించింది.

రగడ రాజుకుందిలా..!

పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బీజేపీ అధిష్టానం మొత్తం మూడు జాబితాలు విడుదల చేసింది. మూడు దశలకు కలిపి మొత్తం 44 మంది పేర్లను ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడగానే జమ్మూలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పార్టీ కోసం జెండాలు మోసిన వారిని కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన 'పారాచూట్'లకు టికెట్లు ఇచ్చారంటూ ఆందోళకు దిగారు. 18 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తనను పక్కనబెట్టి, ఇటీవలే పార్టీలోకి వచ్చిన ఓ వ్యక్తికి టికెట్ ఇవ్వడమేంటని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జగదీశ్ భగత్ నిలదీశారు. అసంతృప్తులకు సమధానం చెప్పుకోలేక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రైనా తన క్యాబిన్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 18న జరగనున్న తొలి దశ ఓటింగ్‌పై మాత్రమే దృష్టి సారించామని, ప్రతి కార్యకర్తతో తాను వ్యక్తిగతంగా మాట్లాడుతానని వివరించారు. తామంతా ఒక కుటుంబమని చెప్పారు.

వెనక్కి తగ్గిన అధిష్టానం

కార్యకర్తల ఆందోళన విషయంపై ఆదివారం సాయంత్రం పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై ఈ విషయం చర్చించింది. తొలుత విడుదల చేసిన 44 మంది పేర్లను పార్టీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌ల నుంచి తొలగించింది. రెండు గంటల తర్వాత తొలి దశలో పోటీ చేయనున్న 15 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఆ తర్వాత కొంకర్‌నాగ్ నుంచి చౌదరి రోషన్ హుస్సేన్ ఒకే ఒక్క పేరుతో మరో జాబితా విడుదల చేసింది. ఇందులో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలతోపాటు మహిళా అభ్యర్థి షగున్ పరిహార్ పేరుంది. పరిహార్ సోదరులు బీజేపీలో కొనసాగుతున్నారు. షగున్ తండ్రి అజిత్ పరిహార్, అజిత్ సోదరుడు అనిల్ పరిహార్‌లను 2018లో ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. తొలిదశ పోలింగ్ కోసం నామినేషన్లకు ఈనెల 27 ఆఖరు తేదీ. కశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీల్లో మూడు దశల్లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు అక్టోబర్ 4న వెలువడనుండటం తెలిసిందే.



విజయవాడ ఇంద్రకీలాద్రిపై రాజగోపురం వద్ద ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న యువత



ఏలూరు గోసంరక్షణ కేంద్రంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు



విశాఖలోని శ్రీకృష్ణ చైతన్యమఠంలో భక్తుల సందడి

వాడవాడలా వేడుకగా..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయాలను సుందరంగా అలంకరించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో దేవదేవునికి పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టే వేడుకలో యువత సందడి చేశారు. వివిధ సంస్థలు నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

ప్రియుడితో కలిసి భర్త ప్రాణాలు తీసిన భార్య!

వైఎస్సార్ జిల్లాలో దారుణం



సిద్దవటం: వైఎస్సార్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిందో భార్య. సిద్దవటం మండలం లింగంపల్లికి చెందిన గాజుల గంగయ్య(45) కడప కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. అతనికి జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురానికి చెందిన సంధ్యతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కాగా, సంధ్యకు ఏడాది కిందట పసుపులేటి బలరామ్‌తో పరిచయమైంది. ఈనెల 21వ తేదీన రాత్రి సంధ్య తన ఇంట్లో ప్రియుడితో కలిసి ఉండటం చూసిన గంగయ్య భార్యను మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న సంధ్య.. తమకు అడ్డుగా ఉన్న భర్తను చంపేయాలని నిర్ణయించుకుంది. ప్రియుడితో కలిసి అదే రోజు రాత్రి హత్య చేసినట్లు సమాచారం. ఈనెల 24న భర్త గంగయ్య కనిపించడం లేదని పోలీసులుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ నెల 25న లింగంపల్లికు వెళ్లి సంధ్యను విచారించారు. ఆమె పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానించారు. మొదట పెన్నానదిదిలో దూకాడేమోనని చెప్పింది. దీంతో అక్కడ ఆదివారం సాయంత్ర వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తమదైన శైలిలో సంధ్యను విచారించగా.. గువ్వల చెరువు ఘాట్‌లో పడేశామని చెప్పింది. సోమవారం తెల్లవారు జామున గంగయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి శవపరీక్షలు చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వలంటీర్ల జీవితాలతో చెలగాట మాడొద్దు

ఏపీ వలంటీర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: గ్రామ,వార్డు వలంటీర్ల జీవితాలతో చెలగాటం ఆడవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 28న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, వలంటీర్లకు న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారమే అండ.. అక్రమాలే అజెండా

న్యాయశాఖ మంత్రి ఫరూక్ తీరిది

రూ.58 కోట్లకు పైగా విలువైన భూమిని కొట్టేసేందుకు విశ్వప్రయత్నం

కోర్టు తీర్పులను పట్టించుకోకుండా అడ్డదారిలో దక్కించుకునేందుకు మాస్టర్‌ప్లాన్

సాక్షి, నంద్యాల/నంద్యాల (సిటీ): అధికారమే అండగా న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రెచ్చిపోతున్నారు. కనిపించిన భూమిని హస్తగతం చేసుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. సామాన్యులను వేధిస్తూ మాట వినని వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. సుప్రీం కోర్టులో కేసు ఓడిపోయిన తర్వాత కూడా ఆయన తీరు మారడం లేదు. నంద్యాల పద్మావతి నగర్‌లోని సర్వే నంబర్ 706–ఏ9లో 1.16 సెంట్ల భూమి ఉంది. ఇందులో 58 సెంట్లను రామిశెట్టి వెంకటన్న (28 సెంట్లు), నిమ్మకాయల బాలనారాయణ (30 సెంట్లు) ఖతీఫ్ ఖాజా హుస్సేన్, ఖతీఫ్ నూర్‌అహ్మద్ నుంచి 2010లో కొనుగోలు చేశారు. ఈ స్థలం పక్కనే సర్వే నంబర్ 700–ఏలో మంత్రి ఫరూక్‌కు స్థలం ఉంది. దీంతో పక్కనే ఉన్న స్థలంపై ఆయన కన్ను పడింది. స్థలాన్ని కబ్జా చేయాలని విశ్వప్రయత్నాలు చేశారు. డాక్యుమెంట్స్ పక్కాగా ఉండటంతో కోర్టుల్లో దొంగ కేసులు వేసి బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు.

సర్వే రిపోర్టు బయటకు రాకుండా రిట్

మంత్రి వేధింపులు భరించలేక రామిశెట్టి వెంకటన్న, నారాయణ ఇద్దరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాలు సాగిన తర్వాత 2023లో బాధితులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆర్డర్ కాపీని స్థానిక కోర్టులో అందజేశారు. ఆ తర్వాత తమ స్థలాన్ని సర్వే చేయాలని కోరుతూ ఇద్దరు ప్రభుత్వానికి చలానాలు కట్టారు. ఇదే అంశంపై అదే ఏడాది జూలై 10న నంద్యాల కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. తమ స్థలాన్ని సర్వే చేసి తమకు అప్పగించాలని కోరారు. స్పందించిన అప్పటి కలెక్టర్ సెప్టెంబర్ 5న సిబ్బందితో సర్వే చేయించి నివేదికను సిద్ధం చేశారు. నివేదిక బాధితులకు అనుకూలంగా ఉందన్న విషయం తెలుసుకున్న ఫరూక్ హైకోర్టులో అధికారులపై ఆగమేఘాల మీద రిట్ పిటిషన్ వేశారు. తప్పుల తడకగా సర్వే చేశారని గొలుసుల ద్వారా కాకుండా శాటిలైట్ ద్వారా సర్వే చేయడంతో తప్పులు దొర్లినట్టు రిట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం సర్వే అంశం మాత్రమే కోర్టులో నడుస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు.

సుప్రీం తీర్పుతో ఖాళీ స్థలానికి పన్ను

706–ఏ9లో ఉన్న భూమి మంత్రి ఫరూక్, ఆయన బంధువులకు చెందినదిగా చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టు తేల్చడంతో బాధితులకు కొండంత భరోసా వచ్చింది. సుప్రీం తీర్పు కాపీని స్థానిక మున్సిపల్ కార్యాలయానికి కూడా పంపించారు. దీంతో ఇన్‌చార్జి ఆర్వో వెంకటకృష్ణ, ఆర్ఐ గులాం హుస్సేన్ సంబంధిత స్థలానికి రూ.55,980 వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేశారు. విషయం తెలుసుకున్న మంత్రి పీఏ అనిల్ మంగళవారం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి ఇద్దరు అధికారులను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ మీ అంతు చూస్తామని బెదిరించారు. మంత్రి ఒత్తిడి మేరకు అదే రోజు రాత్రి ఎలాంటి విచారణ చేయకుండానే ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



	A LOKA KOTTAM Link Doc:55/2015 of SRO 1312		
11	VILL/COL: NANDYAL/CHOBI PETA W-B: 25-0 SURVEY: 706A HOUSE: 75-262-A EXTENT: 40. 115SQ.Yds Boundries: [N]: ANNAGIRI GEETHADEVI HOUSE [S] MADDELA SUBRAMANYAM HOUSE [E]: RASTHA [W]: CLA I HOUSE Link Doc:5276/1574 of SRO 1313	(R) 25-10-2010 (E) 25-10-2010 (P) 25-10-2010	0101 Sale Deed Mkt.Value Rs. 98220 Cons.Value:Rs. 100000
	VILL/COL: NANDYAL/AGRL BITS ABUTTING WARD W-B: 25-0 SURVEY: 706/A9 HOUSE: , EXT ENT: 1452SQ.Yds Boundries: [N]: KALWA [S] HAJI ABDUL NABI SONS LAND [E]: BHAVANASI SREERAMAMURTHY OTHERS LAND [W]: TODAY RAMISETTY VENKATANNA PURCHASED LAND Link Doc: 180/1968 of SRO 1313 Link Doc:414/1963 of SRO 1313	(R) 24-08-2010 (E) 24-08-2010 (P) 24-08-2010	0101 Sale Deed Mkt.Value:Rs. 871206 Cons.Value:Rs. 1453600
	VILL/COL: NANDYAL/AGRL BITS ABUTTING WARD W-B: 25-0 SURVEY: 706/A9 HOUSE: , EXT ENT: 1355.2SQ.Yds Boundries	(R) 24-08-2010 (E) 24-08-2010 (P) 24-08-2010	0101 Sale Deed Mkt.Value Rs. 813129

సర్వే నంబర్ ఏ9లో ఉన్న భూమిని రామిశెట్టి వెంకటన్న, బాలనారాయణ కొనుగోలు చేసినట్టు చూపిస్తున్న ఈసీ

కౌన్సిల్ ఆమోదానికి చైర్‌పర్సన్‌పై ఒత్తిడి

మునిసిపల్ పరిధిలోని ఆస్తి లేదా స్థలాలపై ఒకసారి పన్ను విధిస్తే దాన్ని రద్దు చేయాలంటే కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. దీంతో 706–9ఏపై విధించిన వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను కౌన్సిల్ ముందుంచి రద్దు చేయాలని మంత్రి అనుయాయులు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. అధికారం తమ చేతిలోనే ఉందని.. తమకు అనుకూలంగా పని చేయకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఆ స్థలం విలువ రూ.58 కోట్ల పైనే..

పట్టణ నడిబొడ్డున గల ఈ స్థలం విలువ సెంటు రూ.కోటిపైనే పలుకుతోంది. రూ.58 కోట్లకు పైగా విలువ కలిగిన 58 సెంట్లను కొట్టేసేందుకు మంత్రి ఫరూక్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు పట్టణంలో ఆయనకు చెందిన థియేటర్‌ను సెటిల్‌మెంట్లకు అడ్డాగా చేసుకున్నట్టు తెలుస్తోంది. వివాదాస్పద భూములకు సెటిల్‌మెంట్ చేయడం, అధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, తన అనుచరులకు సంబంధించిన గొడవల సెటిల్‌మెంట్లు అన్నీ థియేటర్ నుంచే సాగుతున్నాయని బాధితులు చెబుతున్నారు.



విశాఖలో సినీ నటుడు రజనీకాంత్ సందడి

విశాఖ విమానాశ్రయంలో సినీ నటుడు రజనీకాంత్ సోమవారం సందడి చేశారు. చెన్నై నుంచి విశాఖలో జరిగే షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. విమానాశ్రయంలో ఆయన్ని చూడగానే అభిమానులు, ప్రయాణికులు కేరింతలు కొట్టారు. సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఆయన రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లారు.

– గోపాలపట్నం

గుండెలో బరువు... భుజాలపై బాధ్యత...!

తండ్రి అంటే నమ్మకం, బాధ్యత. ప్రతి తండ్రీ తన కడుపున పుట్టిన బిడ్డల కోసం ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడడు. ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కూడా ఆ కోవకు చెందిన వాడే. మానసిక, శారీరక వైకల్యం కారణంగా తన కూతురు అనారోగ్యం బారిన పడటంతో ఆమెకు వైద్య చికిత్స అందించడం కోసం సోమవారం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకువచ్చాడు. కృష్ణాష్టమి సందర్భంగా సెలవు కావడంతో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిరాశగా కూతురిని ఇలా తన భుజాలపై మోసుకుంటూ వెనుదిరిగాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



కొబ్బరి.. ఆటుపోట్లతో సరి

- నేటినుంచి కోనసీమ కేంద్రంలో జాతీయ కొబ్బరి సదస్సు
- దక్షిణాది రాష్ట్రాల నుంచి రైతు ప్రతినిధుల రాక
- వెంటాడుతున్న తెగుళ్లతో పడిపోతున్న దిగుబడులు
- కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు లేక రైతుల అవస్థలు
- విలువ ఆధారిత పరిశ్రమలు ఊసేలేదు

సాక్షి, అమలాపురం: ఉద్యాన పంటల్లో అత్యంత విలువైనది కొబ్బరి. పది కొబ్బరి చెట్లు ఉంటే జీవనం సాఫీగా సాగిపోతుందని భావిస్తుంటారు. కానీ.. ఇప్పుడా పరిస్థితి లేదు. ధరల్లో స్థిరత్వం లేకపోవడం.. తెగుళ్ల వెంటాడుతుండటం.. విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడం.. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొబ్బరి సాగు అటుపోట్లు ఎదుర్కొంటోంది.

ఉత్పాదనలో మనదే పైచేయి

ఒక్క కోనసీమలోనే 54 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉన్నట్టు అంబాజీపేట పరిశోధనా కేంద్రం రికార్డులు చెబుతున్నాయి. మరో 10 వేల హెక్టార్లకు సరిపడా కొబ్బరి చెట్లు రోడ్లు, చెరువులు, ఇళ్ల వద్ద ఉన్నాయని అంచనా. అంటే.. రాష్ట్రంలో సాగయ్యే కొబ్బరి పంటలో 50 శాతం విస్తీర్ణం కోనసీమలోనే ఉంది. సాగు విస్తీర్ణం పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాలుగో స్థానంలో ఉండగా.. ఉత్పాదకతలో మాత్రం ముందంజలో నిలిచింది. హెక్టార్‌కు సగటున ఏడాదికి ఉత్పత్తి చేసే కాయలను లెక్కగడితే.. కేరళలో 7,486, కర్ణాటకలో 9,745 ఉండగా తమిళనాడులో 14,872గా ఉంది. ఏపీలో మాత్రం 14,997 కాయల ఉత్పాదకత ఉందని కోకోనట్ బోర్డు లెక్కలు చెబుతున్నాయి. లక్షదీవుల తర్వాత ఏపీలోనే అత్యధికంగా కొబ్బరి ఉత్పాదకత కనిపిస్తోంది.

అప్పట్లో ఎర్ర నల్లి.. ఇప్పుడు తెల్లదోమ

రాష్ట్రంలో కొబ్బరి సాగు 15 ఏళ్లుగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. 2008లో నల్లి తెగులు (ఇరియోఫిడ్ మైట్) మొదలై.. 2019లో తెల్లదోమ (రూగోస్ వైట్ ఫ్లై) వరకు తెగుళ్ల, పురుగుల దాడితో కొబ్బరి చెట్టుకు తీరని గాయాలవుతున్నాయి. ఆకు తేలు, ఎర్రముక్కు పురుగు, గానోడెర్మా వంటి తెగుళ్ల సోకగా.. వీటి నివారణకు చేపట్టే చర్యలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వడం లేదు. తెల్లదోమ వల్ల 30 శాతం సగటు దిగబడి పడిపోతున్నట్టు అంబాజీపేటలోని ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల సర్వేలో తేలింది.

ఎకరాకు రూ.35,500 నష్టం


కొబ్బరి సాగు పెట్టుబడులు గణనీయంగా పెరగడంతో ఏటా పెట్టుబడి రూ.78 వేలు అవుతోంది. ఎరువులు, పురుగు మందుల ధరలు, తెల్లదోమ నివారణ చర్యలు, దింపు కార్మికులు, రవాణా కూలీల రేట్లు గణనీయంగా పెరిగాయి. కొబ్బరికాయ ప్రస్తుత ధర రూ.10.50 కాగా, ఈ ఏడాది సగటు ధర రూ.8. దింపు, కూలీ, చేరవేత ఇలా అన్ని ఖర్చులు పోనూ కాయకు రూ.6 మిగులుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఎకరాకు రూ.42,500 ఆదాయం వస్తోందని అంచనా. పెట్టుబడి పోగా రైతుకు రూ.35,500 నష్టం వస్తోంది. కొబ్బరి రైతులకు ప్రభుత్వాల ప్రోత్సాహం అంతంత మాత్రంగానే ఉంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకాన్ని కొబ్బరి తోటలకు అనుసంధానం చేయడంతో కొంతవరకు వెసులుబాటు కలిగింది. కొబ్బరి చెట్లకు పళ్లాలు వేయడం, పంట బోదెలు తవ్వకాలు వంటి పనులు ఉపాధి పథకంలో చేపట్టడం వల్ల రైతులకు ఎకరాకు రూ.12 వేల వరకు మేలు కలిసొచ్చింది. దీనికితోడు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అర్హులైన రైతులకు ఏటా రూ.13,500 వరకు ప్రోత్సాహం అందేది. దీంతో సన్న, చిన్న కారు రైతులకు కొంతవరకు పెట్టుబడి కలిసి వచ్చేది.

విలువ ఆధారిత పరిశ్రమల ఊసేలేదు

కొబ్బరి చెట్టు నుంచి, కాయ నుంచి 106 విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే అవకాశం ఉంది. తమిళనాడు, కేరళలో రైతు, స్థానిక వ్యాపారులు కలిసి స్థానికంగా 26 రకాల ఉత్పత్తులు తయారు చేస్తుండగా, ఇక్కడ క్వాయర్ ఉత్పత్తులతో కలిపి కనీసం 10 రకాల ఉత్పత్తులు కూడా తయారు కావడం లేదు. కొబ్బరి, కొబ్బరి నీరు, కొబ్బరి నీరా వంటి ఉత్పత్తులు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం లేక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విలువ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. పైగా ఏపీలో ఉత్పత్తి అయ్యే కొబ్బరి ఉప ఉత్పత్తులకు పెద్దగా గిట్టుబాటు లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

నేటి నుంచి జాతీయ సదస్సు

కోనసీమ కేంద్రం అమలాపురంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు కొబ్బరిపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతు ప్రతినిధులు తరలివస్తున్నారు. తొలి రోజు స్థానిక జనహిత భవన్‌లో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చిస్తారు. రెండో రోజు కిమ్స్ మెడికల్ కాలేజీలో జరిగే సదస్సుకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన రైతులతోపాటు విశాఖ జిల్లా నుంచి రైతులు రానున్నారు.






2020లో తెల్లదోమ (రూగోస్ వైట్ ఫ్లై) ఉధృతంగా ఉన్న సమయంలో కొబ్బరి చెట్టు (ఫైల్)



కేరళలో కొబ్బరితో తయారు చేసిన ఉప ఉత్పత్తులు

దిగుబడి దారుణంగా పడిపోయింది



కొబ్బరి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, కూలీల ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు చవిచూస్తున్నాం. మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతుండటం వల్ల రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. అంతేగాని కొబ్బరి ఆదాయం మీద ఆధారపడితే జీవనం సాగటం లేదు.

– దొమ్మేటి త్రిమూర్తులు, కొబ్బరి రైతు, మాచవరం, అంబాజీపేట మండలం

యువత భయపడుతున్నారు



నిపుణుల లోటు ఉంది. క్వాయర్ బోర్డు, కోకోనట్ బోర్డు (సీడీబీ) నైపుణ్య శిక్షణ ఇస్తున్నా యువత ముందుకు రావడం లేదు. మార్కెట్‌పై యువతకు అవగాహన ఉండటం లేదు. గతంలో పెట్టిన పరిశ్రమలు దెబ్బతినడంతో కొత్తవారు, యువత భయపడి ముందుకు రావడం లేదు. ప్రభుత్వం, ఆయా సంస్థలు ఇచ్చే రాయితీలు వెంటనే విడుదల చేయడం లేదు. సాంకేతికత పరిజ్ఞానం రైతులకు చేరడం లేదు.

– పెదమల్లు నాగబాబు, క్వాయర్ నిపుణుడు, పాశర్లపూడిలంక, మామిడికుదురు మండలం

క్లుప్తంగా...

ముక్కంటి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ

శ్రీకాళహస్తి: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

'తక్షణమే ఈ-క్రాప్ నమోదు చేయాలి'



సాక్షి, అమరావతి: తక్షణమే ఈ-పంట నమోదు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హరిబాబు, వై రాధాకృష్ణలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ-క్రాప్ నమోదు సజావుగా సాగడం లేదని తెలిపారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన యాప్ సాంకేతిక సమస్యలతో సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఈ-పంట నమోదులో ఆర్బీకే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నిర్ణీత గడువులోగా ఈ-పంట నమోదు పూర్తికాకపోతే వారికి సంక్షేమ ఫలాలు అందవని వివరించారు. కాగా, రాష్ట్రంలో కౌలురైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య డిమాండ్ చేశారు. గడిచిన ఐదేళ్లలో 3.10 లక్షల మంది కౌలు రైతులకు రూ.676.90 కోట్ల పంటల బీమా పరిహారం చెల్లించారని గుర్తు చేశారు. సమగ్రమైన కౌలు రైతు చట్టం రూపకల్పనపై ఈ నెల31న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో చర్చాగోష్టి జరుగనుందని పేర్కొన్నారు.

మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

నెల్లూరు (క్రైమ్): అక్రమ మైనింగ్‌పై గడిచిన మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మైనింగ్ శాఖ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు విజయకుమార్, ఆంజనేయరెడ్డి తమ సిబ్బందితో కలిసి నెల్లూరు ఆటోనగర్‌లోని మైనింగ్ డీడీ కార్యాలయంలో సోదాలు చేస్తున్నారు. సోమవారమూ సోదాలు కొనసాగాయి. జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లకు అనుమతులు ఉన్నాయి? ఎంత మేరకు తవ్వకాలు జరిగాయి? రవాణా తదితర శాఖలకు సంబంధించి మైనింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు క్షుణ్ణంగా ప్రతి ఫైల్‌ను పరిశీలిస్తున్నారు. మైనింగ్ అనుమతులు, తవ్వకాలు నిబంధనల మేరకు జరిగాయా తదితరాలకు సంబంధించిన ఫైల్స్‌ను సైతం పరిశీలిస్తున్నారు.

సిబిల్ గుబులు!



నేడు ప్రతి చిన్న వస్తువు కొనుగోలూ ఈఎంఐ విధానంలోనే
చెల్లింపుల్లో జాప్యంతో సిబిల్ స్కోర్‌కు దెబ్బ
భవిష్యత్‌లో ఇతర రుణాలు తీసుకోలేని పరిస్థితి
ఆలస్య రుసుములు, వాటిపైన పన్నుల బాదుడు సరేసరి
ఆయా కంపెనీల ప్రకటనల వలలో చిక్కుకుంటున్న ప్రజలు
నియంత్రణ అవసరమంటున్న నిపుణులు

- విజయవాడకు చెందిన గౌస్ మొహియుద్దీన్ ఐదు నెలల క్రితం టీవీ కొన్నారు. గత నెలలో ఈఎంఐ కట్టాల్సిన సొమ్ము కంటే రూ.10 బ్యాంకులో తక్కువగా ఉండటంతో రూ.580 ఆలస్య రుసుము పడటమే కాకుండా సిబిల్ స్కోర్ భారీగా తగ్గింది.
- రమేశ్ నాయుడు అనే డిగ్రీ విద్యార్థి ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి శాంసంగ్ మొబైల్ కొన్నాడు. నాలుగో నెలలో ఈఎంఐ చెల్లించకపోవడంతో మొబైల్‌ను బ్లాక్ చేశారు. తిరిగి దీన్ని పనిచేయించేందుకు ఈఎంఐ కట్టడంతో పాటు రూ.600 ఆలస్య రుసుం చెల్లించాడు. అతడు ఇప్పుడు ద్విచక్ర వాహనం కొనడానికి వెళ్తే.. సిబిల్ స్కోర్ పడిపోయింది.. రుణం ఇవ్వలేం' అని చెప్పారు.

.. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది సిబిల్ స్కోర్ సరిగా లేక వాహన, వ్యక్తిగత, గృహ రుణాలను పొందలేకపోతున్నారు. చెక్ బౌన్స్ అయితే భారీగా సిబిల్ స్కోర్ పడిపోతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఏ రుణం తీసుకున్నా సకాలంలో చెల్లించాలంటున్నారు. ఆయా రుణ సంస్థలు, బ్యాంకులు నిర్దేశించిన తేదీల్లోగా చెల్లింపులు చేయాలంటున్నారు. ఇలా చేస్తేనే చక్కటి సిబిల్ స్కోర్ సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. సిబిల్ సరిగా లేకపోతే ఏ రుణం కూడా మంజూరు కాదని చెబుతున్నారు. – సాక్షి ప్రతినిధి, అనంతపురం



300-499	500-600	601-660	661-780	781-850

సిబిల్ లెక్కలివి..

- సగటున ఉండాల్సిన కనీస స్కోర్ 650
- ఏదైనా రుణం రావాలంటే కనీసం ఉండాల్సిన స్కోర్ 600
- గృహరుణం కావాలంటే ఉండాల్సిన స్కోర్ 700కు పైన

ఈఎంఐల్లోనే ఎక్కువ..

ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరూ నెలసరి వాయిదా చెల్లింపు (ఈఎంఐ) విధానంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వివిధ బ్యాంకులతోపాటు ప్రైవేటు ఆర్థిక సంస్థలు సైతం క్రెడిట్ (సిబిల్) స్కోర్ ఆధారంగా రుణాలు ఇస్తుండటంతో చాలా మంది ఈఎంఐ విధానంలో వస్తువులను కొంటున్నారు. అయితే నిర్దేశిత తేదీల్లోగా ఈఎంఐ చెల్లించకపోవడం, అందుకు తగ్గట్టుగా బ్యాంకులో నగదు నిల్వ ఉంచకపోవడంతో బౌన్సుల బారినపడుతున్నారు. దీంతో భారీగా ఆలస్య రుసుం, దానిపైన ఇతర పన్నులు చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా ఫోన్లలో ఆయా రుణ సంస్థలు, బ్యాంకుల ప్రతినిధుల బెదిరింపులూ తప్పడం లేదు.

నియంత్రించుకోకుంటే కష్టం..

ఇప్పుడు చాలా సులువుగా ఆన్‌లైన్‌లోనూ, వివిధ యాప్స్ ద్వారా రుణాలు లభిస్తున్నాయి. కేవలం పాన్ కార్డు నంబర్‌ను సంబంధిత వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేయగానే కొద్ది నిమిషాల్లోనే రుణం వచ్చేది, రానిదీ తెలిసిపోతుంది. అలాగే వివిధ ఎలక్ట్రానిక్ మాల్స్, షాపుల్లోనూ పాన్ కార్డు నంబర్‌ను నమోదు చేసి వెంటనే ఎంతవరకు రుణం వస్తుందో చెబుతున్నారు. దీంతో తమకు అవసరమున్నా, లేకున్నా చాలామంది ఎలక్ట్రానిక్స్ వస్తువులపై ఆసక్తితో రుణాల ద్వారా వాటిని కొనుగోలు చేస్తున్నారు. 'జీరో వడ్డీ', 'ప్రాసెసింగ్ ఫీజు లేదు' అంటూ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు ఇచ్చే ప్రకటనల వలలో పడుతున్నారు. ఏ ప్రయోజనం లేకుండా ఆయా సంస్థలు ఎందుకు ఇలా చేస్తాయనే కనీస అవగాహన కూడా లేకుండా వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇలా ఆయా ప్రకటనలకు

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రధాన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో వస్తువుల కొనుగోలు తీరు ఇలా..	వస్తువు	మొబైల్	ఫ్రిజ్‌లు	టీవీలు	ఇతరత్రా ఉపకరణాలు
	రుణగ్రహీతల సంఖ్య (నెలకు)	45,000కు పైగా	38,000 వరకు	51,500కు పైగా	65,800కు పైగా


తీసుకుని సకాలంలో చెల్లించలేకపోవడంతో భారీగా ఆలస్య రుసుం, ఇతర జరిమానాలు తప్పడం లేదు. అంతేకాకుండా సిబిల్ స్కోర్ కూడా గణనీయంగా పడిపోతోంది. తద్వారా భవిష్యత్తులో రుణాలు పొందలేని పరిస్థితి తలెత్తుతోంది.

పదిశాతం మందికి పైగా డిఫాల్టర్లే..

రాష్ట్రంలో ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లింపులు చేయక డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారిలో మొబైల్ ఫోన్‌లు తీసుకుంటున్నవారు ఎక్కువ మంది ఉన్నట్టు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు చెబుతున్నాయి. సాధారణంగా సిబిల్ స్కోర్ 650 దాటితేనే ఏ రుణమైనా లభిస్తుంది. అయితే రుణాలు తీసుకున్న వారు నిర్దేశిత తేదీల్లోగా చెల్లించకపోవడంతో ప్రతి పదిమందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కొనుగోలు చేస్తున్న వారిలో రుణాల రికవరీ అత్యంత తక్కువగా ఉన్నట్టు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు గుర్తించాయి. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో డిఫాల్టర్లు 14 శాతంగా ఉన్నారని ఆయా సంస్థలు చెబుతున్నాయి. జరిమానాలు ఎక్కువగా పడటం, చెక్ బౌన్స్ కేసులు నమోదు కావడం, ఈఎంఐల చెల్లింపుల్లో జాప్యం వంటివన్నీ అత్యధికంగా ఈ మూడు ప్రాంతాల్లోనే నమోదవుతున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ మూడు చోట్లా సిబిల్ స్కోర్ కూడా గణనీయంగా తగ్గినట్టు తేలింది. ఈ మూడు నగరాలు కాకుండా మిగతా జిల్లాల్లో సగటున 10 శాతం డిఫాల్టర్లు ఉంటున్నారు.

> **సకాలంలో చెల్లిస్తేనే సిబిల్ బాగుంటుంది..**
>
> ప్రస్తుతం సిబిల్ స్కోర్ చాలా కీలకమైంది. సిబిల్‌కు ఆయా ఫైనాన్స్ సంస్థలు చిన్న చిన్న అప్పుల సమాచారాన్ని కూడా ఇస్తాయి. చెల్లింపుల్లో జాప్యం లేదా మొండి బకాయిలు కారణంగా మా దగ్గరకు వచ్చే చాలామందికి సిబిల్ స్కోర్ లేక రుణాలు ఇవ్వడం లేదు. వస్తువు తీసుకున్నాక సకాలంలో చెల్లిస్తేనే సిబిల్ స్కోర్ బాగుంటుంది. లేదంటే భవిష్యత్తులో పరపతి లభించడం చాలా కష్టం.
> – సునీల్ కుమార్, మేనేజర్, ఎస్‌బీఐ

28 ఏళ్లకే క్యాన్సర్



ధూమపానం అలవాటు లేని వారిలోనూ వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్
పరిశ్రమలు, వాహనాల వినియోగంతో పెరిగిన వాయుకాలుష్యం
పాశ్చాత్య దేశాలతో పోలిస్తే దశాబ్దం ముందుగానే భారత్‌లో దీని ప్రభావం
1990లో 6.62 శాతం.. 2019 నాటికి 7.7 శాతానికి పెరుగుదల
ముంబై టాటా మెమోరియల్ ఆస్పత్రి అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: మానవ మనుగడకు ఆధారమైన వాయువు పరుగులు పెడుతున్న ప్రస్తుత పారిశ్రామిక యుగంలో స్వచ్ఛతను కోల్పోతోంది. ఆయుష్షును పెంచాల్సిన స్థితి నుంచి ఆయువు తీసే దశకు చేరింది. దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ధూమపానమే ఇందుకు ప్రధాన కారణమని అందరూ భావిస్తున్నారు. కానీ జీవితంలో ఎన్నడూ ధూమపానం చేయని వ్యక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో దీని బారిన పడుతున్నారని, దీనికి వాయు కాలుష్యమే ప్రధాన కారణమని ముంబైలోని టాటా మెమోరియల్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులు, పరిశోధకులు ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై చేపట్టిన అధ్యయనాన్ని ఇటీవల లాన్సెట్ ఈ-క్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించారు. ఆ అధ్యయనం ప్రకారం పాశ్చాత్య దేశాల కంటే పదేళ్ల ముందే భారత్‌లో ధూమపానం అలవాటు లేని వారిపై ఈ జబ్బు ప్రభావం చూపుతోంది. ఏపీలో ఏటా 70 వేలకు పైగా ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయి.

2025 నాటికి గణనీయంగా పెరుగుదల

దేశంలో వ్యాధి సంభవించే రేటు 1990లో ఒక లక్ష జనాభాకు 6.62 శాతం ఉండగా 2019 నాటికి 7.7 శాతానికి చేరింది. 2025 నాటికి పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్యం కారణంగా ఈ వ్యాధి గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. నేడు ప్రజల జీవనం వాయుకాలుష్య కారకాల మధ్యే సాగడంతో దేశంలో కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి.

కాలుష్య దేశంగా భారత్

అధ్యయనంలో వైద్య నిపుణులు 2022లో ప్రపంచ వాయు నాణ్యత నివేదికను ఉటంకించారు.

- ఈ నివేదిక ప్రకారం క్యూబిక్ మీటర్‌కు సగటున 53.3 మైక్రోగ్రాముల పీఎం 2.5 సాంద్రతతో భారత్ ఎనిమిదో అత్యంత వాయు కాలుష్య దేశంగా నిలిచింది.
- 2023లో మూడవ అత్యంత వాయు కాలుష్య దేశంగా ఆవిర్భవించింది.
- ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 కాలుష్య నగరాల్లో 42 భారత్‌లోనే ఉన్నట్లు వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2023లో స్పష్టం చేసింది.

వ్యాధిబారిన పడుతున్నవారి సగటు వయసు	అమెరికా	చైనా	భారత్
	38	39	28.2

గత డిసెంబర్‌లో పార్లమెంట్‌లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం క్యాన్సర్ కేసులు..

రాష్ట్రంలో..	
2018	67,370
2022	73,536

దేశంలో..	
2022	14,61,427
ఉత్తరప్రదేశ్	2.10 లక్షలు
మహారాష్ట్ర	1.21 లక్షలు
పశ్చిమబెంగాల్	1.13 లక్షలు



ఇంటా, బయట జాగ్రత్తలు పాటించాలి

ఊపిరితిత్తుల క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాల్లో కాలుష్యం ఒకటి. పొల్యూషన్‌ను ఇండోర్, అవుట్‌డోర్ అని రెండు విధాలుగా పరిగణించాలి. అవుట్‌డోర్ పొల్యూషన్‌కు ఎక్కువగా పురుషులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాహనాల నుంచి వెలువడే డీజిల్, పెట్రోల్ అన్‌బార్న్ ఉద్గారాలు గాలిలో కలుస్తుంటాయి, వీటితో పాటు సల్ఫర్ డయాక్సైడ్, ఇతర ఉద్గారాలు, ఫ్యాక్టరీలు, పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ము, ధూళి గాలిలో ఉంటాయి. వీటిని పీల్చడం ఆరోగ్యానికి హానికరం. ప్రస్తుత రోజుల్లో వాహనాల రద్దీ బాగా పెరిగింది. జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లు, ఇతర కారణాలతో ఎక్కువ సేపు నిల్చోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో మాస్క్ వాడటం తప్పనిసరి. అదే విధంగా వీలైనంత వరకూ కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండాలి. ఇక ఇంట్లో వంటింటి నుంచి వెలువడే పొగ నుంచి మహిళలు జాగ్రత్తలు పాటించాలి. వంటింటిలోకి గాలీ, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. అదే విధంగా ఎయిర్ ఎక్స్‌ట్రాక్టర్‌లను అమర్చుకోవడం ఉత్తమం.
– డాక్టర్ రఘు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, గుంటూరు

తణుకు అన్న క్యాంటీన్‌లో దారుణం

అపరిశుభ్రమైన నీటితో ప్లేట్లు కడుగుతున్న వైనం



తినేసిన ప్లేట్లను వాష్‌బేసిన్‌లోని నిల్వ ఉన్న మురికి నీటితో కడుగుతున్న దృశ్యం

తణుకు: పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని అన్న క్యాంటీన్‌లో అపరిశుభ్రమైన నీటితో తినేసిన ప్లేట్లు కడుగుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సొసైటీ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో ఈ ఘటన జరిగింది. ఈ నెల 19న జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా తీసిన వీడియో వైరల్ అయ్యింది. అన్న క్యాంటీన్‌లో పేదలు ఉదయం టిఫిన్ తిన్న ప్లేట్లను వాష్ బేసిన్‌లో వేసి పూర్తి అపరిశుభ్రంగా ఉన్న నీటిలో కడుగుతున్న విషయం ఆ వీడియోలో స్పష్టంగా తెలుస్తోంది. తినేసిన ప్లేట్లను చేతులు కడుక్కునే వాష్ బేసిన్‌లో.. నిల్వ ఉన్న మురికి నీటిలో ఉంచి శుభ్రం చేస్తున్న విషయం ఆ వీడియోను చూస్తే అర్థమవుతోంది. పేదలు తింటున్న అన్నం ప్లేట్లు ఎలా కడిగినా.. ఎవరు చూస్తారులే అనుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ బీవీ రమణను వివరణ కోరగా తినేసిన ప్లేట్లు సాధారణంగా వాష్ బేసిన్‌లో వేస్తుంటారని, అయితే ఆ రోజు ఒకేసారి తాకిడి రావడంతో మిగిలిన వ్యర్థాలు వాష్ బేసిన్‌లో ఉండిపోవడం వల్ల నీరు నిలిచిపోయిందని, అక్కడి నుంచి ప్లేట్లు తీసి వేరే చోట కడుగుతుంటారని చెప్పారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,060 మంది స్వామివారిని దర్శించుకోగా 34,985 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.01 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితోఅభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు.

కనులపండువగా రాధాకృష్ణుల కల్యాణం

రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని మద్దెలమడుగులో ఉన్న రాధాసమేతర గోపాలకృష్ణమందిరంలో సోమవారం కృష్ణాష్టమినిపురస్కరించుకుని రాధా కృష్ణుల కల్యాణం రంగరంగవైభవంగా నిర్వహించారు.

శ్రీమఠంలో గోకులాష్టమి వేడుకలు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన కర్నూలు జిల్లా మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గోకులాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. శ్రీమఠం ఊంజల మంటపంలో అక్షోభ్య మఠం ఉప పీఠాధిపతి అక్షోభ్య రామప్రియ తీర్థులు ఆశీస్సులతో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో కనువిందు చేశారు.

శాస్త్రోక్తంగా గోపూజ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజ నిర్వహించారు. ప్రతినిత్యం ఆలయంలో ప్రాతఃకాల సమయంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించబడుతున్నప్పటికీ, కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించారు.

నేడు సింహగిరిపై కృష్ణాష్టమి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల వరకే స్వామివారి దర్శనాలు భక్తులకు లభిస్తాయని పేర్కొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

నేడు ద్వారకా తిరుమలలో ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు. బుధవారం క్షేత్రంలో ఉట్ల పండుగను, స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకుని కాకినాడ జిల్లాలోని పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి నీటితోను, పాలతోను స్వయంగా అభిషేకాలు చేశారు. ధ్వజ స్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూల విరాట్లతో పాటు స్వామివారిని, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.



రేపటి వరకు పీజీసెట్ వెబ్ ఆప్షన్లకు అవకాశం

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలోని వర్సిటీల పరిధిలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎమ్‌కాం కోర్సుల్లో అడ్మిషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పీజీసెట్-2024 వెబ్‌ఆప్షన్లకు బుధవారం వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పీజీసెట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ నెల 23వరకు వెబ్ ఆప్షన్లకు చివరి తేదీగా నిర్ణయించిన అధికారులు విద్యార్థుల విన్నపం మేరకు ఈ నెల 28వరకు పొడిగిస్తున్నట్లు తెలియజేశారు. 29వతేదీ ఆప్షన్ల మార్పునకు అవకాశమిస్తూ, 31వతేదీన మొదటి విడత సీట్లు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా వర్సిటీల్లో వచ్చేనెల 2వతేదీ నుంచి 5వతేదీ లోపు ఒరిజినల్ ధృవపత్రాలతో అడ్మిషన్లు పొందాలని తెలియజేశారు.

ఎమ్మెస్సీ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను కొనసాగించండి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఒక్కొక్కటిగా తొలగించడం దారుణమని విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్‌లో ఎంతో డిమాండు ఉన్న ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లలో ఎంత వెతికినా కనబడకపోవడంతో అడ్మిషన్ల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు నిరాశే ఎదురైందని తెలిపారు. ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కోర్సును పూర్తి స్థాయిలో ఆపివేయాలని కుట్రపూరితంగా కొందరు వర్సిటీ అధికారులను తప్పుదోవపట్టించడం దారుణమన్నారు. ఈ నెల 28వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఉందని, తిరిగి ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సును కొనసాగేలా అధికారులు చొరవ చూపాలని ఆ ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు.

ఏయూ హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను సోమవారం ఏయూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్. రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబు ముందుగా మెస్‌లలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను స్వయంగా రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్ల తనిఖీ చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ పథకం అంగీకారం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో ప్రవేశపెట్టిన కొత్త పథకం గ్యారంటీ పెన్షన్ స్కీమ్ వంటిదేనని, సర్వీసు వ్యవధితో సంబంధం లేకుండా అందరికీ పాత పెన్షన్ వర్తింపజేయడమే న్యాయ సమ్మతమన్నారు. ఇది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు మరో రూపమే తప్ప పాత పెన్షన్ విధానం కాదని సీపీఎస్ పథకంలో లాగానే ఉద్యోగి జీతంలో నుంచి 10% మినహాయింపు ఉంటుందన్నారు. ఏప్రిల్ ఒకటి 2025 నుంచి అమల్లోకి రానున్న కొత్త పెన్షన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

అండర్-19 ఏపీ జట్టుకు ఎంపిక

అమలాపురం రూరల్: ది అమలాపురం కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వర్ధబండి బాలప్రసాద్‌రెడ్డి కడపలో జరిగిన అండర్-19 క్రికెట్ జట్టు సెలక్షన్స్‌లో ఏపీ జట్టుకు అర్హత సాధించాడు. గతంలో ఢిల్లీలో జరిగిన యంగ్ స్టార్ ప్రీమియం లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో 100 పరుగులు చేశాడు. అదేవిధంగా హైదరాబాద్‌లో జరిగిన ఆర్ఎస్‌పీఎల్ లీగ్‌లో సత్తా చాటిన బాలప్రసాద్‌రెడ్డిను అండర్-19 ఏపీ టీమ్ సెలక్షన్స్‌కు ఎంపిక చేశారు. కర్ణాటకలో జరిగే ఐపీఎల్, ఎస్‌సీఎల్ జోనల్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాడు. సోమవారం ఆ కళాశాలలో బాలప్రసాద్‌రెడ్డిని డైరెక్టర్లు కిరణ్‌కుమార్, నాయుడు, సతీష్, ఎం.రాంబాబులు అభినందించారు.


నోటొద్దండీ... నొక్కండి చాలు!



వంద నోటు కన్నా... యూపీఐకే ఓటు

డిజిటల్ లావాదేవీల హవా..	నిరక్షరాస్యుల్లో 90 శాతం ఫోన్ పేకు మొగ్గు	మధ్యతరగతి వాళ్లూ అటువైపే..	డిజిటల్ లావాదేవీలపై మార్కెట్ సర్వే

సాక్షి, హైదరాబాద్: తలాపిన సముద్రం ఉన్నా ఏం లాభం? దాహం తీర్చడానికి గుక్కెడు నీళ్ళు కూడా తీసుకోలేం. ఇప్పుడు జేబులో రూ.500 నోటు ఉన్నా... ఇదే పరిస్థితి. షాపుకెళ్ళి నోటు ఇస్తే వచ్చే మాటేంటో తెలుసా? 'వామ్మో నోటా... చిల్లర లేదు.. ఫోన్ పే కొట్టండి' ఇదీ వరస. జేబులో నోట్ ఉంటే సాధారణంగా ధీమా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి...? పాకెట్‌లో మొబైల్ లేకుంటే డైలమానే. ఒక్క రూపాయి జేబులో లేకున్నా పర్వాలేదు. కానీ ఆండ్రాయిడ్ ఫోన్ లేకుండా బయటకెళ్తే సవాలక్ష తలనొప్పులు. నిత్య జీవితంలో ప్రతీ ఒక్కరికీ ఎదురయ్యే పరిస్థితే ఇది. ఫోన్ పే... గూగుల్ పే... పేటీఎం... ఇలాంటి యూపీఐ పేమెంట్స్ వచ్చిన తర్వాత జనం నోటు గురించే మరిచిపోతున్నారు. కోవిడ్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఇండియన్ మార్కెట్ సర్వే చెబుతోంది. గడచిన ఐదేళ్ళలో పల్లె నుంచి పట్నం దాకా... చిన్నా పెద్దా.. అందరూ డిజిటల్ లావాదేవీలనే అలవాటు చేసుకున్నారు. మార్కెట్ సర్వే ప్రకారం నిరక్షరాస్యుల్లో 90 శాతం డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారట. పొలం దగ్గర కూలీలకు ఇచ్చే డబ్బులు కూడా ఇలాగే వెళ్తున్నాయి. ఆఖరుకు కూరగాయలమ్మే వృద్ధులు కూడా డిజిటల్ పేమెంట్స్‌నే ఇష్టపడుతున్నారు. వెతికి వెతికి చిల్లరివ్వడం ... ఒక్క రూపాయి తక్కువైనా అదో గొడవ.. ఇప్పుడీ బాధలన్నీ లేవని చెప్పుకొచ్చారు సూర్యాపేటకు చెందిన రత్తాలు. రోజూ రూ.500 కూరలమ్మితే కేవలం రూ.50 వరకు మాత్రమే నోట్లు వస్తాయని తెలిపారు.



రూ. 500 వరకూ ఓకే...

తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వంద గ్రామీణ, 90 పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ సర్వే జరిగింది. ఇందులో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. రూ. 500 లోపు ఏ కొనుగోలు చేసినా 20 శాతంపైగా డబ్బులే ఇస్తున్నారు. 60 శాతం మంది యూపీఏ లావాదేవీలు చేస్తున్నారు. మిగతా వాళ్ళంతా క్రెడిట్, డెబిట్ కార్డులు వాడుతున్నారు. రూ. 500-999 వరకూ 80 శాతం మంది యూపీఐపై ఆధారపడుతున్నారు. రూ. వెయ్యి నుంచి 1999 వరకూ కేవలం 15 శాతం మందే నగదు ఇస్తున్నారు. రూ.5 వేలు ఆపైన లావాదేవీలుంటే 10 శాతం మందే నగదు ఇవ్వడానికి ఇష్టపడుతున్నారు.

మధ్యతరగతి నేస్తం యూపీఐ...

ఎగువ మధ్య తరగతి కన్నా... మిడిల్ క్లాసులోనే యూపీఏ లావాదేవీలు ఎక్కువగా ఉన్నాయి. మధ్య తరగతి ప్రజలు 20 శాతం నగదు వాడుతుంటే, అప్పర్ మిడిల్ క్లాసులో మాత్రం 30 శాతం నగదు వాడుతున్నారు. యూపీఐ వాడే వాళ్ళు మిడిల్ క్లాసులో 80 శాతం ఉంటున్నారు. అప్పర్ మిడిల్ క్లాసులో ఇది 70 శాతం మేర ఉంటోంది. ఆన్‌లైన్ లావాదేవీల్లో 53 శాతం ప్రజలు యూపీఐని వాడుతున్నారు. 10 శాతమే క్యాష్ ఇస్తున్నారు. 14 శాతం డిజిటల్ వ్యాలెట్‌ను వినియోగిస్తున్నారు.

లొల్లి కూడా తక్కువేం కాదంట..

ప్రతీ షాపులోనూ ఏదో ఒక డిజిటల్ స్కానర్ ఉంటోంది. ఫోన్‌తో స్కాన్ చేయగానే ఎంత చెల్లించిందీ వాయిస్‌గా వస్తుంది. ఇక్కడే కొన్ని సమస్యలూ వస్తున్నాయి. కొన్ని సార్లు ఆ మోత మోగడం లేదు. ఫోన్‌లో డబ్బులైతే కట్ అవుతున్నాయి. 2023లో తెలంగాణ సహా 18 రాష్ట్రాల్లో ఇలాంటి కేసులే ఏకంగా 18,000 నమోదయ్యాయి. డబ్బులు కట్ అయ్యాయని కస్టమర్... లేదు రాలేదని షాపు యజమాని... వివాదం కొన్ని సందర్భాల్లో ముదురుతోందని మార్కెట్ సర్వే అధ్యయనాల్లో తేలింది. ఇలాంటప్పుడు ఎవరిని సంప్రదించాలనే సమస్య తలెత్తుతోంది. కాల్ సెంటర్‌తో మాట్లాడే విధానం తెలియని వాళ్ళు ఎక్కువగా ఉంటున్నారు. కొన్ని సార్లు నెట్ స్లో అవ్వడం వల్ల కూడా సమస్యలొస్తున్నాయి.

డిజిటల్ చోరులూ ఎక్కువే

స్కాన్ చేసి... డబ్బులు వేసినట్టు ప్రూఫ్ చూపిస్తారు. కానీ షాపు యజమానికి మాత్రం నగదు రాదు. ఆరు నెలలుగా ఇలాంటి కేసులు 38 వరకూ నమోదయ్యాయి. అయితే, చిల్లర దుకాణాదారుల వద్ద మాత్రం ఇలాంటివి చేయలేకపోతున్నారు. మాల్స్, మార్కెట్లో చేసినా సీసీ కెమెరాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ ఉన్నందున దొరికి పోతున్నారు. ఏదేమైనా రానురానూ నోట్ పట్టుకుని బయటకెళ్ళే పరిస్థితి ఉండదనేది వాస్తవం.

పనితీరుకు పురస్కారం

- ఐదు విభాగాల్లో రామగుండం
- ఎన్టీపీసీకి టస్కర్ జాతీయ అవార్డులు
- కేరళలోని కోజికోడ్‌లో కార్యక్రమం
- పలు విభాగాల్లో సత్తాచాటిన సంస్థ
- ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి చేతులమీదుగా అవార్డులు



అవార్డులు అందుకుంటున్న రూపాలి రంజన్, ప్రజ్ఞాన్ ప్రియదర్శిని

జ్యోతినగర్ (రామగుండం): భారతావనికి వెలుగులు పంచుతున్న రామగుండం ఎన్టీపీసీ ఐదు టస్కర్ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడం ఆ సంస్థ పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తోంది. ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధి, బాలికా సాధికారత తదితర రంగాల్లో చేస్తున్న కృషికి కేరళ రాష్ట్రం కోజికోడ్‌లోని తాజ్ గేట్‌వేలో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మక మూడు బంగారు, రెండు కాంస్య అవార్డులు సొంతం చేసుకుంది. జాతీయ అవార్డులను కేరళ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాజ్ చేతుల మీదుగా ఎన్టీపీసీ రామగుండం హెచ్‌ఆర్ సీనియర్ అసిస్టెంట్ ప్రజ్ఞాన్ ప్రియదర్శిని, కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ రూపాలి రంజన్‌లు ఇటీవల అందుకున్నారు. ఈ క్రమంలో అవార్డులు సాధించిన విభాగాల వారీగా పరిశీలిస్తే..

గ్రామీణ క్రీడల ప్రమోషన్‌లో నైపుణ్యం
గ్రామీణ క్రీడా విభాగంలో బంగారు పతకం

ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత, పునరావాస గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా ప్రతిభను సంస్థ వెలికి తీస్తోంది. వారిని భవిష్యత్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు వారికి అవసరమయ్యే క్రీడా పరికరాలు అందిస్తోంది. దీంతో ఈ విభాగంలో సంస్థకు బంగారు అవార్డు లభించింది.

సోషల్ అవేర్‌నెస్ యాడ్ ఫిల్మ్
బాలికా సాధికారతలో బంగారు పతకం

సంస్థ విద్యుత్ ఉత్పత్తితోపాటు బాలికా సాధికారతకు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాలికలకు సమాజంలో ఎదురవుతున్న అవరోధాలను వివరించడంతోపాటు వాటిని ఎలా ఎదుర్కోవాలనే సందేశాత్మకమైన సందేశంతో చిత్రీకరించిన చిత్రం. బాలికా సాధికారతలో భాగంగా 120 మంది ఆరో తరగతి బాలికలకు వేసవిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని విద్యావంతులను చేయడంతోపాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడే స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ అందించడంతో బంగారు పతకం లభించింది.

మానవ వనరులు
వైవిధ్యం విభాగంలో బంగారు అవార్డు

ఎన్టీపీసీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ప్రతి ప్రాజెక్టులో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయాలను అందరికీ తెలియజేయడంతోపాటు ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసి దేశ సమగ్రతను చాటి చెప్పడంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. దీంతో ఈ విభాగంలో సంస్థ బంగారు పతకం సాధించింది.

పీపుల్-ఓరియెంటెడ్ ప్రాక్టీసెస్
విభాగంలో కాంస్యం

మానవవనరుల విభాగం ద్వారా సంస్థలోని అధికారులు, ఉద్యోగులకు అవసరమయ్యే ఉద్యోగ పదోన్నతుల శిక్షణ, వారిని సాంకేతిక రంగంలో ముందుకు నడిపించేందుకు అవసరమయ్యే విషయాలను తెలియజేయడం, నూతన విధానాలను అమలుపరిచే విషయాలను తెలియజేయడం వలన కాంస్య అవార్డు సాధించింది.

సీఎస్సార్ విభాగంలో కాంస్యం..

ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన సామాజిక సేవా బాధ్యత పథకం (సీఎస్సార్) అమలులో సంస్థ ముందంజలో ఉంది. విద్యుత్ వెలుగులను అందించడంతోపాటు ప్రభావిత, పునరావాస ప్రాంతాల్లో ఎన్టీపీసీ తమవంతుగా సీఎస్సార్ ద్వారా నిధులు కేటాయిస్తోంది. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలను కల్పించడం, యువతకు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు శిక్షణ, రైతులకు సమీకృత వ్యవసాయ పథకం వంటి వివిధ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా కాంస్య పతకం సాధించింది.



కృషితోనే అవార్డులు..

కమ్యూనికేషన్ విభాగం కృషితోనే ఐదు జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నాం. భవిష్యత్‌లోనూ మరింత కృషి చేసి సంస్థకు మంచిపేరు తీసుకొస్తాం. ఈ ప్రాంతంలోని మీడియా ద్వారా సంస్థ కార్యకలాపాలు ప్రజలకు చేరువకావడం అభినందనీయం.

-బిజయ్‌కుమార్ సిగ్దర్, ఏజీఎం (హెచ్‌ఆర్) ఎన్టీపీసీ రామగుండం

పనితీరుకు నిదర్శనం



ఐదు జాతీయ అవార్డులు రావడం ప్రాజెక్టు పనితీరుకు నిదర్శనం. విద్యుత్ ఉత్పత్తితోపాటు పర్యావరణ పరిరక్షణ, కమ్యూనికేషన్, బాలికా సాధికారత, సీఎస్సార్ ద్వారా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనులపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

-కేదార్ రంజన్ పాండు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు

అభివృద్ధి, సేవలకు ప్రామాణికం



ఎన్టీపీసీ అభివృద్ధికి అందిస్తున్న సేవలకు అవార్డులు ప్రామాణికంగా నిలిచాయి. సంస్థ ప్రతిభ, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంలో కమ్యూనికేషన్ విభాగం కృషి ఎంతో ఉంటుంది. మీడియాతో సంస్థ పరస్పర సహకారం, సాధారణ పరస్పర చర్య, క్రియాశీలతలు అవార్డులు రావడానికి ఉపయోగపడ్డాయి.


రూపాలి రంజన్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎగ్జిక్యూటివ్, ప్రజ్ఞాన్ ప్రియదర్శిని, హెచ్‌ఆర్ సీనియర్ అసిస్టెంట్, రామగుండం ఎన్టీపీసీ

ప్రతి జిల్లాలో క్రీడల కోసం భూమి కేటాయించాలి

మాజీ ఎంపీ వీహెచ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం ప్రతి జిల్లాలో 10-12 ఎకరాల భూమిని కేటాయించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. తద్వారా తెలంగాణ గ్రామీణ యువత క్రీడారంగంలో ముందుకెళ్లగలుగుతుందని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన మారథాన్‌లో పెద్దఎత్తున యువత పాల్గొందని, యువత ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని హైదరాబాద్‌ను క్రీడా నగరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని వీహెచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.


మోజంజాహి మార్కెట్ వద్ద..

గురుకుల బదిలీలపై విజి'లెన్స్'!

- ఎస్సీ గురుకుల సొసైటీ బదిలీలపై సీఎంకు వెల్లువెత్తిన ఫిర్యాదులు
- మైనార్టీ గురుకుల సొసైటీలోనూ పొరపాట్లు జరిగినట్లు ఆరోపణలు
- నిగ్గుతేల్చాలని కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశం!
- వారం రోజుల్లోగా సర్కారుకు చేరనున్న నివేదిక?
- ఎటూ తేలని డిస్‌లోకేషన్ టీచర్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో బదిలీలు, పదోన్నతులతో పాటు జోనల్ కేటాయింపుల్లో వస్తున్న విమర్శలపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు ఆ ప్రక్రియలో జరిగిన అవకతవకల నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. ప్రధానంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు, జోనల్ కేటాయింపులు జరిగాయంటూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉద్యోగులను ఆరా తీస్తున్నారు.

15 వేల మందికి స్థానచలనం

బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీల పరిధిలో గత నెలాఖరులోనే దాదాపు 15 వేలమంది ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. అయితే పోస్టింగ్‌ల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, సొసైటీ కార్యాలయాల్లోని కొందరు ఉద్యోగులు అతిగా జోక్యం చేసుకుంటూ కొందరు టీచర్లకు మేలు జరిగేలా వ్యవహరించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ సంఘానికి చెందిన నేతలు అధికారులను ప్రలోభాలకు గురిచేశారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు, విమర్శలపై ఉద్యోగులు ఏకంగా లిఖితపూర్వక ఫిర్యాదులు ఇవ్వడం, సొసైటీ కార్యాలయాల్లో, సచివాలయం, ప్రజాభవన్ ప్రాంగణాల్లో ఆందోళన చేపట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది.

స్థానికతకు దక్కని ప్రాధాన్యత...

పోస్టింగుల విషయంలో ప్రధానంగా జోనల్ కేటాయింపులపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. జీఓ 317 ప్రకారం గతంలోనే ఉద్యోగులందరికీ మల్టీజోన్లు, జోన్లను కేటాయించినప్పటికీ... ఎస్సీ, మైనార్టీ సొసైటీలు పలువురికి మార్పులు చేస్తూ నూతన జోన్లు, మల్టీజోన్లు కేటాయించాయి. ఈ ప్రక్రియలో స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వకుండా సొసైటీ అధికారులు ఇష్టానుసారంగా కేటాయింపులు జరిపారని ఉద్యోగులు మండిపడుతు న్నారు. ఈ అంశంపై ఉద్యోగులు సొసైటీ కార్యదర్శులకు వినతులు సమర్పించినప్పటికీ... ఫలితం లేకపోవడంతో చివరికి ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. దరిమిలా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగడంతో వాస్తవాల గుర్తింపు ప్రక్రియకు తెరలేచింది. నిబంధనలకు అనుగుణంగానే బదిలీలు, పదోన్నతులు జరిగాయా? లేదా? అనే అంశంపై విజిలెన్స్ అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. అదేవిధంగా అక్రమాలు జరిగితే ఎవరి ప్రమేయముంది? ఏస్థాయిలో జరిగాయనే కోణంలోనూ పరిశోధన చేస్తున్నారు. వారం రోజుల్లోగా ఈ అంశంపై విజిలెన్స్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అంతర్గత నివేదిక ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.


నగరంపై కమ్ముకున్న దట్టమైన మేఘాలు ఎల్‌.బి. నగర్ ప్రాంతంలో కనిపించిన దృశ్యం

మందు ఖర్చులో మనమే టాప్

- దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకంటే తెలంగాణలోనే మద్యం కోసం ఎక్కువ ఖర్చు
- వార్షిక తలసరి ఖర్చు రూ. 1,623... బెంగాల్‌లో కేవలం రూ.4 మాత్రమే
- 2016-17తో పోలిస్తే 2022-23లో ఏపీలో తగ్గిన ఖర్చు
- కరోనా సమయంలో తెలంగాణలో మరింత ఎక్కువ ఖర్చయిందని వెల్లడిస్తున్న సర్వే గణాంకాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెళ్లి అయినా, చావు అయినా... సందర్భమేదైనా... పది మంది కూడారంటే ఒకటి మాత్రం తప్పనిసరిగా ఉంటుంది. అదేంటో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. మీకు అర్థమయినా కాకపోయినా, మీరు ఊహించినా లేకున్నా దానిపేరు మద్యం. ఈ మద్యం కిక్కు లేకుండా మన దగ్గర ఏ సంబురం నడవదంటే అతిశయోక్తి కాదు. అందుకేనేమో దేశంలోకెల్లా అత్యంత ఎక్కువ తలసరి మద్యం ఖర్చు మన రాష్ట్రంలోనే నమోదయింది. కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ) నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో మద్యం మీద తలసరి ఖర్చు బాగానే నమోదైంది. తెలంగాణ తలసరి ఖర్చు రూ. 1,623 కాగా, ఏపీలో అది రూ.1,306గా నమోదైంది. అయితే, 2016-17తో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఖర్చు తగ్గిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. 2016-17లో ఏపీలో సగటు మనిషి ఏడాదికి రూ. 1,324 మద్యం మీద వెచ్చిస్తే, 2022-23 వచ్చేసరికి అది రూ.1,306కి తగ్గడం గమనార్హం. ఇక, కరోనా సమయంలో అయితే తెలంగాణలో అత్యధిక సగటు ఖర్చు నమోదైంది. 2020-21లో ఏకంగా రూ.1,719 తలసరి ఖర్చు వచ్చిందని అధ్యయన గణాంకాలు చెబుతున్నాయి. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు తోడుగా రూ. 1,000 కంటే ఎక్కువ ఖర్చు పెడుతున్న రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయి.

మందు కోసం పలు రాష్ట్రాల్లో అవుతున్న తలసరి ఖర్చు గణాంకాలు:

రాష్ట్రం	తలసరి ఖర్చు (ఏడాదికి రూపాయల్లో)	
	2014-15	2022-23
ఛత్తీస్‌గఢ్	500	1,227
ఒడిశా	193	1,156
పంజాబ్	364	1,245
అసోం	151	198
గోవా	1,413	445
కేరళ	1,020	379
తమిళనాడు	594	841
కర్ణాటక	429	374
మహారాష్ట్ర	177	346
యూపీ	216	49
బెంగాల్	30	4

భారత రాజ్యాంగ పీఠికలోని పదజాలం!

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రవేశిక - తాత్విక పునాదులు

(Preamble - Philosophical Foundations)

ఏ ప్రజాస్వామ్య రాజ్యాంగమైనా సాధారణంగా ప్రవేశికతోనే ప్రారంభమవుతుంది. భారత రాజ్యాంగం కూడా ప్రవేశికతోనే మొదలైంది. ప్రవేశికకు బదులు పీఠిక, అవతారిక, ముందుమాట, ఉపోద్ఘాతం లాంటి పర్యాయ పదాలను వాడతారు. ప్రవేశికనే ఆంగ్లంలో 'Preamble' అంటారు. ప్రవేశిక రాజ్యాంగం లక్ష్యాలను, ఆదర్శాలను, మూలతత్వాన్ని సూచనప్రాయంగా తెలుపుతుంది. రాజ్యాంగాన్ని ఏ ఉన్నత ఆశయాలతో రచించారు, ఏ తరహా ప్రభుత్వాన్ని, ఎలాంటి సమాజాన్ని నిర్మించాలని భావించారు మొదలైన అంశాలను స్పష్టీకరిస్తూ రాజ్యాంగ నిర్మాతలు ముందుమాటగా తెలుపుతారు.

ప్రవేశిక-ఆధారం

ప్రవేశిక ఉన్న మొదటి లిఖిత రాజ్యాంగం అమెరికా రాజ్యాంగం. మన రాజ్యాంగంలో ప్రవేశిక భావాన్ని అమెరికా నుంచి గ్రహించినప్పటికీ, అందులోని లక్ష్యాలు, ఆధారాలకు డిసెంబర్ 13, 1946న రాజ్యాంగ పరిషత్ సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన 'ఆశయాల' తీర్మానమే ప్రధాన ప్రాతిపదిక. ఫ్రెంచి రాజ్యాంగం నుంచి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, గణతంత్రం అనే అంశాలను గ్రహించారు. ఐక్య రాజ్య సమితి చార్టర్‌లోని ప్రవేశిక కూడా భారత రాజ్యాంగానికి ఆధారమని చెప్పవచ్చు.

భారత రాజ్యాంగ ప్రవేశికకు నందన్ లాల్ బోస్ అనే శిల్పి నగిషీ చెక్కారు.

ప్రవేశిక-పదజాలం, భావాలు అర్థవివరణ

ప్రవేశికలో గొప్ప భావజాలాన్ని ప్రయోగించారు. ప్రతి పదానికి, భావానికి ఒక విశిష్ట అర్థాన్ని, పరమార్థాన్ని ఆపాదించవచ్చు. 'భారత ప్రజలమైన మేము' అని ప్రవేశిక ప్రారంభమవుతుంది. ప్రజలే రాజకీయాధికారానికి మూలం, ప్రజలే రాజ్యాంగాన్ని రచించుకున్నారని దీని అర్థం.

రాజకీయ స్వభావాన్ని తెలియజేసే పదాలు:

భారతదేశం ఏ తరహా రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటుందో, దాని స్వభావం ఏమిటో స్పష్టంగా పేర్కొన్నారు.

సార్వభౌమత్వం (Sovereignty):

సార్వభౌమత్వం అంటే సర్వోన్నత అధికారం అని అర్థం. భారతదేశం అంతర్గతంగా సర్వోన్నత అధికారాన్ని, బాహ్యంగా విదేశీ, దౌత్య విధానాల్లో స్వేచ్ఛ (External Independence and Internal Supremacy)ను కలిగి ఉంటుంది. ఏ బాహ్య శక్తీ మన విదేశాంగ విధానాన్ని నియంత్రించలేదు.

సామ్యవాదం (Socialist): ఈ పదాన్ని 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చారు. సామ్యవాదం అంటే సమ సమాజ స్థాపన. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలను క్రమేణా తగ్గించడం. ఉత్పత్తి శక్తులను (Land, labour and capital) ప్రభుత్వం నియంత్రించడం ద్వారా సంపద కొద్ది మంది వ్యక్తుల చేతిలో కేంద్రీకృతం కాకుండా, సాధ్యమైనంత వరకు జాతీయం చేయడం. తద్వారా ప్రజలకు సమాన అవకాశాలతో పాటు వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన తోడ్పాటు అందిస్తారు.

సామ్యవాదానికి వివిధ రూపాలున్నాయి. కమ్యూనిజం, మావోయిజం, సిండికాలిజం, గిల్డ్ సోషలిజం, ఫెబియనిజం, స్టేట్ సోషలిజం మొదలైన రూపాలు వివిధ దేశాల్లో అమల్లో ఉన్నాయి. భారతదేశంలో ప్రజాస్వామ్యవాదం (Democratic Socialism) అమల్లో ఉంది. దీన్నే 'రాజ్యాంగ సామ్యవాదం' అంటారు. అంటే ఆర్థిక వ్యవస్థలో చట్టపరంగా నిర్దిష్ట పద్ధతిలో మార్పులు చేపడతారు. మన సామ్యవాదం గాంధీయిజం+మార్క్సిజంల మేలు కలయిక. కానీ గాంధీతత్వం వైపు కొంత మొగ్గు కనిపిస్తుంది. ప్రపంచీకరణ, ఆర్థిక ఉదారవాదం, ప్రైవేటీకరణ నేపథ్యంలో సామ్యవాదతత్వం మసక బారుతోందని చెప్పవచ్చు.

లౌకిక తత్వం (Secular): ఈ పదాన్ని కూడా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చారు. లౌకిక రాజ్యం అంటే మత ప్రమేయం లేని రాజ్యం. లౌకిక దేశాల్లో అధికార మతం, మత వివక్ష ఉండవు. మత విషయంలో పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం ఉంటాయి. మతపరంగా ఎవరికి ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం లేదా నష్టం వాటిల్లదు. అధికార మతం ఉన్న రాజ్యాలను మతస్వామ్య రాజ్యం (Theocratic State) అంటారు.

ఉదా: పాకిస్తాన్, బంగ్లాదేశ్.

ప్రజాస్వామ్యం (Democracy): ప్రజాస్వామ్యం అంటే ప్రజలతో, ప్రజల కోసం, ప్రజల వల్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం. అంటే ప్రజలే పాలితులు, పాలకులని అబ్రహం లింకన్ నిర్వచించారు. భారత్‌లో పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమల్లో ఉంది. ఎలాంటి వివక్ష లేకుండా కేవలం నిర్ణీత వయసున్న పౌరులందరికీ ఓటు హక్కు, ప్రభుత్వ పదవులకు పోటీ చేసే హక్కును కల్పించారు. పాలన చట్టపరంగా(Rule of law) జరుగుతుంది. చట్టబద్ధత లేకుండా ఏ చర్యా చెల్లుబాటు కాదు. సాధారణంగా ఏ వ్యక్తికీ ప్రత్యేక హోదా లేదా మినహాయింపు ఉండదు.

గణతంత్ర (Republic): 'గణం' అంటే ప్రజలు, తంత్రం అంటే పాలన. ఇది ప్రజాపాలన. వారసత్వ లేదా అధికార హోదాలు ఉండవు. భారత రాష్ట్రపతి, ఇతర ప్రజా పదవుల్లోని వ్యక్తులను నిర్ణీత కాలానికి ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. లేదా పరోక్షంగా ఎన్నికవుతారు. బ్రిటిష్ రాణి/రాజు తరహాలో వారసత్వ అధికారం ఉండదు.

సామాజిక ఆశయాలు (Social Objectives): ప్రవేశికలో కొన్ని ఉదాత్తమైన ఆశయాలను పొందుపరిచారు. రాజ్యాంగం ద్వారా వాటిని సాకారం చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు.

న్యాయం

న్యాయం అంటే ఒక సర్వోన్నతమైన సమతా భావన. అసమానత లు, వివక్షలు లేని ఆదర్శ సమాజాన్ని నిర్మించడం. రాజ్యాంగంలో మూడు రకాల న్యాయాలను ప్రస్తావించారు.

రాజకీయ న్యాయం(Political Justice): రాజ్య కార్యకలాపాల్లో పౌరులంతా ఎలాంటి వివక్ష లేకుండా పాల్గొనడమే రాజకీయ న్యాయం. సార్వజనీన ఓటు హక్కు, పోటీ చేసే హక్కు, ప్రభుత్వ పదవులు చేపట్టే హక్కు, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, విజ్ఞాపన హక్కు మొదలైనవి రాజకీయ న్యాయ సాధనకు ప్రాతిపదికలుగా పేర్కొనవచ్చు.

సామాజిక న్యాయం (Social Justice): సమాజంలో పౌరులంతా సమానులే. జాతి, మత, కుల, లింగ, పుట్టుక అనే తేడాలు లేకుండా అందరికీ సమాన హోదాను, గౌరవాన్ని కల్పించడమే సామాజిక న్యాయం. అన్ని రకాల సామాజిక వివక్షలను రద్దు చేయడం, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, కులాలు, తెగల అభ్యున్నతికి కృషి చేయడం ఇందులో భాగం.

ఆర్థిక న్యాయం (Economic Justice): ఆర్థిక అంతరాలను తగ్గించడం, సంపద ఉత్పత్తి, పంపిణీ, వృత్తి, ఉద్యోగాల్లో అందరికీ సమాన అవకాశాలు, పేదరిక నిర్మూలన, ఆకలి నుంచి విముక్తులను చేయడం.

ఉన్నత ఆదర్శాలు

స్వేచ్ఛ(Liberty): నిజమైన ప్రజాస్వామ్య రాజ్య స్థాపనకు, ఉదాత్త నాగరిక, సామాజిక జీవనానికి స్వేచ్ఛాయుత వాతావరణం అవసరం. స్వేచ్ఛ అంటే నిర్హేతుకమైన పరిమితులు, నిర్బంధాలు లేకుండా వ్యక్తి పరిపూర్ణ వికాసానికి అవసరమైన పరిస్థితులను కల్పించడం. ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో, ఆరాధనలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛ ఉండాలి. **ఉదా:** లౌకిక రాజ్య స్థాపనకు పునాది మత స్వేచ్ఛ.

సమానత్వం(Equality): ప్రజాస్వామ్యంలో అతి ముఖ్య ఆదర్శం సమానత్వం. అంటే అన్ని రకాల అసమానతలను, వివక్షలను రద్దు చేసి, ప్రతి వ్యక్తి వికాసానికి అవసరమైన అవకాశాలను కల్పించడం.

సౌభ్రాతృత్వం (Fraternity): సౌభ్రాతృత్వం అంటే సోదర భావం అని అర్థం. పౌరుల మధ్య సంఘీభావం, పరస్పర గౌరవం ఉండాలి. అసమానతలు, వివక్షలు లేనప్పుడు పౌరుల మధ్య సోదరభావం వర్ధిల్లుతుంది. సార్వజనీన సోదర భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో సౌభ్రాతృత్వం అనే భావనను ప్రవేశికలో పొందుపరచాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించారు.

ఐక్యత, సమగ్రత (Unity & integrity): ఐక్యతా భావం దేశ ప్రజలు కలిసి ఉండేందుకు దోహదం చేస్తుంది. ఇది ఒక మానసిక ఉద్వేగం (Psychlological emotion). మతం,కులం, ప్రాంతం లాంటి సంకుచిత ఆలోచనలకు అతీతమైన ఆదర్శం. సమగ్రత అనే పదాన్ని 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. సమగ్రత ప్రజల్లో జాతీయ దృక్పథాన్ని పెంపొందిస్తుంది.

సమగ్రతను చేర్చాల్సిన ఆవశ్యకత: 1970 తరువాత దేశంలో అనేక ప్రాంతాల్లో ప్రాంతీయ వాదం, వేర్పాటువాదం తలెత్తాయి. దేశ సమగ్రతను దెబ్బతీసేలా మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. ఈ నేపథ్యంలో సమగ్రత అనే పదాన్ని చేర్చాల్సిన పరిస్థితి అనివార్యమైంది.

ప్రవేశిక సవరణకు అతీతం కాదు

ఆర్టికల్ 368 ప్రకారం ప్రవేశికను పరిమితంగా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ప్రవేశిక రాజ్యాంగ మౌలిక నిర్మాణం అనే నిర్వచనం పరిధిలోకి వస్తుంది కాబట్టి దాని సారాంశం (Spirit) మార్చకుండా, ప్రాముఖ్యతను ద్విగుణీకృతం చేసేలా నిర్మాణాత్మకంగా సవరణలు చేయవచ్చని స్పష్టం చేసింది. అందువల్ల స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాదం, లౌకికతత్వం, సమగ్రత అనే పదాలను చేర్చారు. ఇప్పటి వరకూ ఒకసారి మాత్రమే ప్రవేశికను సవరించారు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. భారత్‌లో రాజ్యాధికారానికి మూలం?
   ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
   సి) ప్రజలు డి) రాష్ట్రపతి
2. భారత రాజ్యాంగ పీఠికలోని పదాలు?
   ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్ర రాజ్యం
   బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
   సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక రాజ్యం
   డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం
3. భారత రిపబ్లిక్ రాజ్యాంగం?
   ఎ) రాజ్యాంగ సభ ద్వారా నిర్మితమై గవర్నర్ జనరల్ ఆమోదం పొందింది.
   బి) బ్రిటిష్ పార్లమెంట్ ప్రతిపాదనతో రాజ్యాంగ సభ ద్వారా ఆమోదం పొందింది.
   సి) భారత జాతీయ కాంగ్రెస్ ప్రస్తావించింది, రాజ్యాంగ సభ ద్వారా ఆమోదం పొందింది.
   డి) రాజ్యాంగ పరిషత్ రచించి, స్వీకరించింది.
4. రాజ్యాంగంలోని ఏ భాగం రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, అభిప్రాయాలను ప్రతిబింబిస్తుంది?
   ఎ) ప్రవేశిక
   బి) ప్రాథమిక హక్కులు
   సి) ఆదేశిక సూత్రాలు
   డి) అత్యవసర పరిస్థితికి సంబంధించిన ప్రకరణలు

సమాధానాలు

1) సి; 2) డి; 3) డి; 4) ఎ.

మాదిరి ప్రశ్నలు

1. ప్రవేశికలో ప్రస్తావించిన సౌభ్రాతృత్వం అనే ఆదర్శాన్ని పెంపొందించే అంశాలు?
   1. ఏక పౌరసత్వం
   2. కేంద్రీకృత సమాఖ్య
   3. ప్రాథమిక హక్కులు
   4. ప్రాథమిక విధులు
   ఎ) 1, 2 బి) 1, 3, 4
   సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4
2. ప్రవేశికలో పేర్కొన్న 'సమానత్వం' దేనికి హామీ ఇస్తుంది?
   ఎ) హోదా బి) అవకాశాలు
   సి) ఉపాధి డి) ఎ, బి
3. ఈ కింది వాటిలో సరైంది?
   ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం కాదు, పరిమితి కాదు
   బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
   సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు, చివరిగా ఆమోదించారు
   డి) పైవన్నీ
4. ప్రవేశికకు ఈ కింది వాటిలో వేటిని ఆపాదించవచ్చు?
   ఎ) రాజ్యాంగానికి అనివార్యమైన భాగం
   బి) రాజ్యాంగ ప్రకరణలను ప్రభావితం చేయదు
   సి) రాజ్యాంగంలోని అంశాలకు సూచనాత్మకమైంది
   డి) పైవేవీ ఆపాదించలేం

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) డి.

పరస్పర భావాలను పంచుకునే విధానం?

మూలకాల వర్గీకరణ

డాబర్‌నీర్ మూలకాల వర్గీకరణకు నాంది పలికారు. మూలకాలను వాటి ధర్మాల ఆధారంగా మూడు సమూహాలుగా విభజించి, ట్రయాడ్ (త్రికం) అని పేరు పెట్టారు.

- Li, Na, K, Cl, Br, I, S, Se, Te మొదలైనవి డాబర్‌నీర్ త్రికాలు.
- అష్టక సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది – **జాన్ న్యూలాండ్స్**
- స్వతంత్రంగా ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించినవారు – **మెండలీఫ్, లోథర్ మేయర్.**
- మూలకాల వర్గీకరణకు పరమాణు ధర్మం ఆధారం కావాలని మెండలీఫ్ భావించాడు.
- మెండలీఫ్ ఆవర్తన నియమం ప్రకారం మూలకాల ధర్మాలు వాటి పరమాణు భారాల ఆవర్తన ప్రమేయాలు.
- ఆధునిక ఆవర్తన నియమం ప్రకారం మూలకాల ధర్మాలు వాటి పరమాణు సంఖ్య లేదా ఎలక్ట్రాన్ విన్యాసాల ఆవర్తన ప్రమేయాలు.
- నవీన ఆవర్తన పట్టికను విస్తృత ఆవర్తన పట్టిక అంటారు.
- విస్తృత ఆవర్తన పట్టికలో అడ్డుగా ఉన్న వరసలను పీరియడ్‌లు అని, నిలువుగా ఉన్న వరసలను గ్రూపులు అని అంటారు.
- విస్తృత ఆవర్తన పట్టికను 7 పీరియడ్‌లు, 18 గ్రూపులుగా విభజించారు.
- మొదటి పీరియడ్‌లో రెండు, రెండో, మూడో పీరియడ్లలో ఎనిమిదేసి మూలకాలు ఉంటాయి.
- 4, 5, 6వ పీరియడ్లలో 18 మూలకాలుంటాయి.
- 7వ పీరియడ్ అసంపూర్ణంగా నిండి ఉంది.
- పరమాణు సంఖ్య 57 నుంచి 70 వరకు ఉన్న మూలకాలను లాంథనైడ్‌లు అంటారు.
- పరమాణు సంఖ్య 89 నుంచి 102 వరకు ఉన్న మూలకాలను ఆక్టినైడ్‌లు అంటారు.
- రసాయనశాస్త్ర బోధనలో హ్యూరిస్టిక్ పద్ధతిని తొలిసారిగా ప్రవేశ పెట్టినవారు – **ఆర్మ్‌స్ట్రాంగ్**
- అన్వేషణా పద్ధతిని ఒక ప్రధాన విజ్ఞాన శాస్త్ర బోధనా పద్ధతిగా అంగీకరించని రిపోర్ట్ – **థామ్సన్ రిపోర్ట్**
- జాన్ డ్యూయి ప్రతిపాదించిన వ్యవహారిక సత్తావాదాన్ని అనుసరించి రూపొందించిన పద్ధతి – **ప్రకల్పన పద్ధతి.**
- ప్రకల్పన పద్ధతిని మొదటిసారిగా ఆచరణలో పెట్టిన విద్యావేత్త – **కిల్ పాట్రిక్**
- అనువైన సహజ పరిసరాల్లో పూర్తిచేసే సమస్యాకృత్యమే ప్రకల్పన అని నిర్వచించినవారు – **స్టీవెన్‌సన్**



- పాఠశాలలోకి దిగుమతి చేసిన నిజజీవిత భాగమే ప్రకల్పన అని పేర్కొన్నవారు – **బిల్లార్డ్**
- **ప్రాజెక్టు పద్ధతిలో ఇమిడి ఉన్న సూత్రాలు:**
  1. వాస్తవికత సూత్రం
  2. క్రియాత్మక సూత్రం
  3. ఉపయుక్త సూత్రం
  4. స్వేచ్ఛా సూత్రం
  5. పొదుపు
  6. సహసంబంధం
- థార్న్‌డైక్ అభ్యసన సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్న పద్ధతి – **ప్రాజెక్టు పద్ధతి**
- ప్రయోగశాల పద్ధతిని మూడు రకాలుగా నిర్వహించవచ్చు.
- ప్రయోగశాలలోని ప్రయోగాలను 5 రకాలుగా విభజించవచ్చు.
- సమస్యా పరిష్కార పద్ధతిలో మొదటి సోపానం – **సమస్యను గుర్తించడం**
- లెక్చర్ అంటే – **బిగ్గరగా చదవడం**
- **అన్వేషణా పద్ధతిలో పాటించాల్సిన నియమాలు:**
  1. చేయడం ద్వారా నేర్చుకునే నియమం
  2. పరిశోధనా నియమం
  3. తార్కికంగా ఆలోచించే నియమం
  4. అభ్యసనా నియమాల నియమం
  5. ప్రజాస్వామ్య వాతావరణ నియమం
  6. ప్రయోజనాత్మక అనుభవాల నియమం
- **ఉపాధ్యాయ కేంద్రక పద్ధతుల ప్రయోజనాలు:**
- బోధనోపకరణాలు, ప్రయోగశాలల ఆవశ్యకత లేదు.
- సకాలంలో సిలబస్ పూర్తవుతుంది.
- ఎక్కువ తరగతి గదులు, ఉపాధ్యాయులు అవసరం లేదు.
- పాఠ్య పరిచయం, ముగింపు, సింహావలోకనం, సాధారణీకరణం చేయడం, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు లాంటివి బోధించడానికి ఇదే ఉత్తమ పద్ధతి.
- విద్యార్థి కేంద్రక పద్ధతుల ప్రయోజనాలు:
- ప్రత్యక్ష అనుభవం, ఇంద్రియ శిక్షణ కారణంగా విద్యార్థుల్లో మూర్త భావనలు కలుగుతాయి.
- ఈ పద్ధతులు సమస్యా పరిష్కార శక్తిని పెంపొందిస్తాయి.
- విద్యార్థుల మానసిక అవసరాలను తృప్తి పరుస్తాయి.
- ఇవి మనోవైజ్ఞానిక పద్ధతులు.

డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక రసాయనశాస్త్రం

బోధనోపగమాలు

- కమ్యూనికేషన్ అనేది 'కమ్యూనిస్' అనే లాటిన్ పదం నుంచి ఆవిర్భవించింది. లాటిన్‌లో కమ్యూనిస్ అంటే కామన్ అని అర్థం.
- భావ ప్రసార ప్రక్రియలోని దశల సంఖ్య 4. ఈ ప్రక్రియలో సందేశం అంటే చెప్పాల్సిన విషయం, మాధ్యమం అంటే చెప్పే విధానం.
- బోధనాభ్యసన ప్రక్రియకు మూలాధారాలు – చర్య, పరస్పర చర్య, పునర్చలనం.
- 'బోధన అనేది ఉపాధ్యాయుడు, విద్యార్థుల మధ్య జరిగే పరస్పర చర్యా ప్రక్రియ' అని పేర్కొన్నవారు – **ఎడ్మండ్ ఎమిడాన్**
- బోధన ఒక పరస్పర చర్యా ప్రక్రియ అని పేర్కొన్నవారు – **ఎ.ఫ్లాండర్స్**
- బోధనలో అతి తక్కువ స్థాయికి చెందింది. – **శిక్షణ**
- బోధనలో ఉన్నత స్థాయికి చెందింది – **ఉపదేశం**
- స్మృతి స్థాయి బోధనా నమూనాను రూపొందించినవారు – **జె.ఎఫ్. హెర్బర్ట్**
- అవగాహన స్థాయి బోధనా నమూనాను రూపొందించినవారు – **మోరిసన్**
- పర్యాలోచక స్థాయి బోధనా నమూనాను ప్రతిపాదించింది – **హంట్**
- మెథడ్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది.
- పద్ధతి అంటే అర్థం – **విధం లేదా మార్గం**
- బోధనా పద్ధతులు రెండు రకాలు
  ఉపాధ్యాయ కేంద్రక పద్ధతులు
  1. ఉపన్యాస పద్ధతి
  2. ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
  3. చారిత్రక పద్ధతి
  విద్యార్థి కేంద్రక పద్ధతులు
  1. అన్వేషణ పద్ధతి
  2. ప్రకల్పన పద్ధతి
  3. ప్రయోగశాల పద్ధతి
  4. ఆగమన, నిగమన పద్ధతి
  5. సమస్యా పరిష్కార పద్ధతి
- **ముఖత:** విషయ పరిజ్ఞానాన్ని బోధించే పద్ధతి – **ఉపన్యాస పద్ధతి**
- చారిత్రక పద్ధతిని ఉపయోగించే పద్ధతులు – **ఉపాఖ్యాసన పద్ధతి, జీవిత చరిత్ర పద్ధతి, పరిణామ పద్ధతి, సాంఘిక పద్ధతి**
- అన్వేషణ పద్ధతికి మరో పేరు – **హ్యూరిస్టిక్ పద్ధతి**
- గ్రీకు భాషలో 'హ్యూరిస్కో' అంటే కనిపెట్టడం లేదా పరిశోధించడం అని అర్థం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హ్యూరిస్టిక్ పద్ధతిని రూపొందించినవారు? (డీఎస్సీ-2001)
   ఎ) జాన్ డ్యూయి బి) పెస్టాలజీ
   సి) కిల్ పాట్రిక్ డి) హెచ్.ఎ. ఆర్మ్‌స్ట్రాంగ్
2. ఉపాధ్యాయ కేంద్రక పద్ధతికి ఉదాహరణ? (డీఎస్సీ-2001)
   ఎ) అన్వేషణా పద్ధతి బి) ప్రకల్పనా పద్ధతి
   సి) చారిత్రక పద్ధతి
   డి) ప్రయోగశాల పద్ధతి
3. విద్యార్థులు తాము గుర్తించిన సమస్యలను విడిగా గానీ, గ్రూపుల్లో గానీ పరిశోధించి పరిష్కారాన్ని కనుగొనే పద్ధతి? (డీఎస్సీ-2003)
   ఎ) చారిత్రక పద్ధతి బి) నియోజన పద్ధతి
   సి) ప్రదర్శన పద్ధతి డి) ప్రకల్పన పద్ధతి
4. 'సహజమైన సన్నివేశంతో పూర్తిచేసిన సమస్యాత్మక కార్యకలాపమే ప్రాజెక్టు' అని నిర్వచించినవారు? (డీఎస్సీ-2002)
   ఎ) కిల్ పాట్రిక్ బి) బిల్లార్డ్
   సి) బైనింగ్ అండ్ బైనింగ్
   డి) జె.ఎ. స్టీవెన్‌సన్

సమాధానాలు

1) డి; 2) సి; 3) డి; 4) డి.

మాదిరి ప్రశ్నలు

1. పరస్పర భావాలను పంచుకునే విధానం?
   ఎ) కమ్యూనికేషన్ బి) చర్చ
   సి) ప్రక్రియ డి) సందేశం
2. లాటిన్‌లో కమ్యూనిస్ అంటే అర్థమేమిటి?
   ఎ) మాధ్యమం బి) ప్రత్యక్షం
   సి) కామన్ డి) పైవన్నీ
3. భావ ప్రసార ప్రక్రియలోని దశల సంఖ్య?
   ఎ) 2 బి) 3 సి) 5 డి) 4
4. 'బోధన అనేది ఒక పరస్పర చర్యా ప్రక్రియ' అని పేర్కొన్నవారు?
   ఎ) ఫ్లాండర్స్ బి) ఎడ్మండ్ ఎమిడాన్
   సి) బి.ఒ. స్మిత్ డి) మోరిసన్
5. ప్రవర్తన అలవాట్లలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించే ప్రక్రియను ఏమంటారు?
   ఎ) ఉద్దీపన బి) శిక్షణ
   సి) నిబంధన డి) ప్రక్రియ
6. బోధనలో అతి తక్కువ స్థాయికి చెందింది?
   ఎ) ఉపదేశం బి) నిబంధనం
   సి) శిక్షణ డి) సిద్ధాంతీకరణ
7. బోధనలో ఉన్నత స్థాయికి చెందింది?
   ఎ) నిబంధనం బి) ఉపదేశం
   సి) శిక్షణ డి) సిద్ధాంతీకరణ
8. స్మృతి స్థాయి బోధనా నమూనాను రూపొందించినవారు?
   ఎ) హంట్ బి) బెర్లో
   సి) జె.ఎఫ్.హెర్బర్ట్ డి) మోరిసన్
9. అవగాహన స్థాయి బోధనా నమూనాను రూపొందించినవారు?
   ఎ) హంట్ బి) మోరిసన్
   సి) హెర్బర్ట్ డి) ఎమిడాన్
10. కిందివాటిలో ఉపాధ్యాయ కేంద్రిత పద్ధతి కానిది?
    ఎ) ప్రాజెక్టు పద్ధతి బి) ఉపన్యాస పద్ధతి
    సి) చర్చా పద్ధతి
    డి) పాఠ్య పుస్తక పద్ధతి
11. కిందివాటిలో విద్యార్థి కేంద్రిత పద్ధతి కానిది?
    ఎ) ఉపన్యాస పద్ధతి బి) ప్రాజెక్టు పద్ధతి
    సి) ప్రయోగ పద్ధతి డి) సమస్యా పద్ధతి
12. మెథడ్ అనేది ఏ భాష నుంచి వచ్చింది?
    ఎ) లాటిన్ బి) గ్రీకు
    సి) ఫ్రెంచి డి) ఇటాలియన్
13. ఆగమనాత్మక దృక్పథానికి వ్యతిరేకమైంది?
    ఎ) విశ్లేషణ బి) సంశ్లేషణ
    సి) నిగమన డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) ఎ;
5) సి; 6) సి; 7) బి; 8) సి;
9) బి; 10) ఎ; 11) ఎ; 12) ఎ;
13) సి.

ఉద్యోగాలు

ఎన్‌సీసీఆర్, చెన్నైలో 42 పోస్టులు

చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్, సీనియర్ రీసెర్చ్ ఫెలో, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 42

» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్ 3-01, ప్రాజెక్ట్ సైంటిస్ట్2-12, ప్రాజెక్ట్ సైంటిస్ట్1 -18, సీనియర్ రీసెర్చ్ ఫెలో-10, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-01.
» **విభాగాలు:** మెరైన్ బయాలజీ, రిమోట్ సెన్సింగ్ జీఐఎస్, డేటా బేస్, కంప్యూటర్ సైన్స్, కోస్టల్ హజార్డ్-మ్యాపింగ్, కోస్టల్ డైనమిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెరైన్ స్ట్రక్చర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ, గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎన్‌సీసీఆర్, ఎన్ఐఓటీ క్యాంపస్, రెండో అంతస్తు, వెలచ్చేరి-తాంబరం మెయిన్ రోడ్, పల్లికరణై, చెన్నై చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 06.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.nccr.gov.in

ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూలులో ఫ్యాకల్టీ పోస్టులు

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం).. వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్ 2), అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్ 1), అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సైన్సెస్(మ్యాథ్స్).
» **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** టీచింగ్ డెమాన్‌స్ట్రేషన్, రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2024.
» **వెబ్‌సైట్:** http://https//iiitk.ac.in

ప్రాచీన కాలంలో ప్రధాన ఓడరేవు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



ప్రాచీన భారతదేశ పట్టణీకరణ

రాఖీగర్హ్, మొహంజొదారో, కాళీభంగన్, దోలవీరాలను పరిశీలించాక పట్టణ ప్రణాళిక విషయంలో ఆనాటి పట్టణాల్లో ఏకరూపత ఉన్నట్లు తెలుస్తోంది. నగరాల్లో పశ్చిమ వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనిపిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలిచారు. కోట్‌డిజి వంటి వాటి ద్వారా కోట చుట్టూ ఆగడ్త ఉండటమే కాకుండా, కోట పై భాగంలో బురుజులున్నాయి అని తెలుస్తోంది. 12-14 అడుగుల ఎత్తు వరకు ప్రాకారాలు సురక్షితంగా ఉన్నట్లు అవగతమవుతోంది.

మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్థూపాలు, స్తంభ మండపం, కళాశాల భవనం వంటి నిర్మాణాలను గుర్తించారు. హరప్పాలో దిగువ భాగాన ఒక గ్రామం, ఒక దిబ్బ ఉండి, దిబ్బకు తూర్పు వైపున పోలీస్‌స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని కనుగొన్నారు. ప్రధాన వీధులు 4 నుంచి 6 మీటర్ల వరకు వెడల్పుతో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు ఒకదానికొకటి లంబ కోణంలో ఉన్నాయి. లోథాల్ (గుజరాత్) వంటి పట్టణాల్లో కుమ్మరులు, లోహ కర్మ, శిలాకర్మలు చేసే వారి కార్ఖానాలు ఏర్పడ్డాయి.

పట్టణాలన్నింటిలో రోడ్ల పక్కన మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావాల్సిన రంధ్రాలను ఏర్పర్చారు. అదేవిధంగా ఎక్కువగా పారిన నీరు ఇంకడానికి చిన్న చిన్న గోతులను తవ్వారు.

ప్రత్యేక నిర్మాణాలు

మొహంజొదారోలో గొప్ప స్నాన వాటిక, స్తంభ మండపం, హరప్పాలో ధాన్యాగారాలు, లోథాల్‌లో ఓడరేవును గుర్తించారు. మొహంజొదారోలోని స్నానవాటిక 30×23×8 అడుగుల కొలతలతో నిర్మితమైంది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పడ్డాయి. దీనికి ఒకవైపు మెట్లవరుస, గ్యాలరీలా కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు ఉన్నాయి. దీనికి పైభాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఉన్నాయి. హరప్పాలోని ధాన్యాగారాలను 50×20 అడుగుల కొలతతో ఆరు నిర్మాణాలను నదీ తీరాన నిర్మించారు. రెండు వరుసల్లో మొత్తం 12 ధాన్యాగారాలు ఉన్నాయి. లోథాల్ ప్రసిద్ధ ఓడరేవు. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమ కాల్వలను తవ్వారు. ఈ నిర్మాణాలన్నింటికి ఒకే కొలతతో కూడిన కాల్చిన ఇటుకలను వాడారు. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో, 4:2:1 నిష్పత్తిలో పొడవు, వెడల్పు, మందాన్ని కలిగి ఉండేవి.

నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

నాగరికత కాలాల్లోని కట్టడాల్లో బానిసలను అధిక సంఖ్యలో వినియోగించినట్లు వాల్టేర్ రూబెన్ అభిప్రాయం. ఇళ్ల పరిమాణాల్లోని మార్పులు, వివిధ విలాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత.. పట్టణ నిర్మాణ వ్యవస్థ, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేయగా నగర, గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్తిత్వానికి దోహదపడ్డాయి. కానీ వ్యవసాయక వృత్తుల ప్రాముఖ్యత కలిగిన గ్రామీణ నిర్మాణాల గురించి ఎలాంటి ఆధారాలు లభించడం లేదు.

రెండో పట్టణీకరణ

క్రీ.పూ. 600-300 మధ్యకాలంలో గంగానది లోయలో చోటు చేసుకున్న పట్టణీకరణను భారత ఉపఖండంలో రెండో పట్టణీకరణగా పేర్కొంటారు. రాజ్‌గాట్, చిరండ్ తవ్వకాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో, బీహార్ పశ్చిమ ప్రాంతంలో ఇనుము వినియోగం విస్తృతంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ఇనుము వాడకం విశాల సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది. ఈ సామ్రాజ్యాలన్నీ సైనికపరంగా ఆయుధ సంపత్తితో కూడుకొన్నవి. వీటిలో యుద్ధవీరుల వర్గం ప్రధాన పాత్ర పోషించింది. కొత్త వ్యవసాయ పనిముట్లు రైతులు అధిక ఉత్పత్తి చేయడానికి దోహదం చేశాయి. ఈ ఉత్పత్తులు పాలక వర్గ అవసరాలను తీర్చడమే కాకుండా అసంఖ్యాకమైన ఇతర నగరాలను పోషించాయి. ఈ భౌతిక వస్తు వినియోగశక్తి కోసల, మగధ సామ్రాజ్యాల విస్తరణకు దోహదం చేసింది. వైదికేతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సామ్రాజ్యాల్లో కలిసిపోయారు. తద్వారా కొత్త సామ్రాజ్యాలు పరిపాలనా సంబంధమైన కొత్త సమస్యలను, సామాజికంగా ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాయి.

పాళీ, సంస్కృత గ్రంథాల్లో పేర్కొన్న అనేక నగరాలు కౌశాంబి, శ్రావస్తి, అయోధ్య, కపిలవస్తు, వారణాసి, వైశాలి, రాజగిరి, పాటలీపుత్రం మొదలైనవి తవ్వకాల్లో బయటపడ్డాయి. ఆవాసాలు, మట్టి నిర్మాణాల చిహ్నాలు కన్పించాయి. వాస్తవానికి ఇవి భారతదేశంలో రెండో నగరీకరణ ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. మొత్తం దేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే శ్రావస్తిలాంటి పెద్ద నగరాలు దాదాపు 20 వరకు ఉంటాయి. తర్వాత కాలంలో నగరాలు గణనీయంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం గ్రీకు నుంచి అలెగ్జాండర్ సైన్యం భారతదేశానికి తరలి రావడమేనని గుర్తుంచుకోవాలి. దీని వల్ల అనేక వ్యాపార రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాయవ్య భారతదేశం, పశ్చిమ ఆసియాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

నగర ఆర్థిక వ్యవస్థ

నగరాల ఆవిర్భావానికి కారణాలు (రాజకీయ, ఆర్థిక, మతపరమైనవి) విభిన్నంగా ఉన్నప్పటికీ చివరికి ఈ నగరాలన్నీ మంచి వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిలో రకరకాల వృత్తి నిపుణులు, వ్యాపారులు స్థిరపడ్డారు. వీరు కొన్ని సంఘాలుగా ఏర్పడ్డారు. జాతక కథల్లో అంటే బుద్ధుడి పుట్టుకకు సంబంధించిన కథల్లో ఇలాంటి సంఘాలను దాదాపు 18 వరకు పేర్కొన్నారు. అందులో నాలుగు పేర్లు (వడ్రంగులు, కుమ్మరులు, తోలుపని చేసేవారు, చిత్రకారులు) మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి సంఘం నగరంలో ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసించేది. అంటే ఇలాంటి నివాసాలు, పరిశ్రమలు వృత్తుల స్థానికీకరణకు తోడ్పడటమే కాకుండా వారసత్వంగా తండ్రుల నుంచి వారి సంతానానికి సంక్రమించడానికి ఈ కళలు దోహదపడ్డాయి. సాధారణంగా వ్యాపారులంతా నగరాల్లోనే జీవించేవారు. కానీ వ్యాపారులు జీవనోపాధి కోసం రాజు జారీ చేసిన మాన్యాలు (భోగ గ్రామాలు) చేసుకోవడానికి గ్రామాలతో సంబంధం పెట్టుకోక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థకు వ్యాపారులు చేస్తున్న సేవలను బట్టి పరమ నిరంకుశులైన రాజులు కూడా వారిని తగిన రీతిలో గౌరవించేవారు. వీటన్నింటినీ గమనిస్తే వృత్తి నిపుణులు, వ్యాపారులు నగరాల్లో ప్రధానమైన సామాజిక వర్గాలుగా అభివృద్ధిలోకి వచ్చారన్న విషయం అవగతమవుతోంది.

వృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువులను వ్యాపారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. జాతక కథల్లో 500 బండ్లకు సరిపాయే వస్తువులు, వస్త్రాలు, దంతపు వస్తువులు, కుండలు మొదలైనవి తీసుకెళ్లినట్లు ప్రస్తావించారు. ఆ కాలంలో అన్ని ప్రధాన నగరాలు నదీ తీరాలకు ఆనుకునే ఉండేవి. వాటిని కలుపుతూ వ్యాపార మార్గాలు చాలా ఏర్పడ్డాయి. ఉదా।। శ్రావస్తి పట్టణాన్ని కౌశాంబి, వారణాసి, కపిలవస్తు, కుశినార మొదలైన నగరాలతో అనుసంధానం చేశారు. లోహాలతో తయారైన నాణేలు మొట్టమొదట ఈ కాలంలోనే కన్పిస్తాయి. వైదిక గ్రంథాల్లో కనిపించే నిష్క, శతమాన అనే పదాలను నాణేల పేర్లుగానే గుర్తించినప్పటికీ అప్పటికే దొరికిన నాణేలు క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి కంటే పాతవి మాత్రం కావు. ఈ కాలంలో మొట్టమొదటి దశలో నాణేలు చాలావరకు వెండితో తయారుచేశారు. కొన్ని రాగి నాణేలు కూడ లభించాయి. లోహ నాణేలపైన కొన్ని గుర్తులు అంటే.. కొండలు, చెట్లు, చేప, వృషభం మొదలైన చిహ్నాలతో రంధ్రాలు చేయడం వల్ల వీటిని రంధ్రపు గుర్తులున్న నాణేలనేవారు. పాళీ గ్రంథాలు ధనాన్ని విస్తారంగా ఉపయోగించేవారని, జీతభత్యాలు ధన రూపంలోనే చెల్లించేవారనీ పేర్కొన్నాయి.

అశోకుడికి ముందు రెండు శతాబ్దాల కిందటే ప్రారంభమైన లిపి కూడా వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ఈ కాలంలో గ్రంథాలన్నీ కొలతలకు సంబంధించిన సునిశిత పరిజ్ఞానాన్ని వివరించాయి. బహుశా ఇవి ఇళ్లు, భూముల సరిహద్దుల గుర్తింపులకు, నిర్మాణాలకు ఉపయోగపడి ఉంటాయి. ఆ విధంగా లేఖనం అనేది చట్టాలు, మతాచారాల సంకలనానికి మాత్రమే కాకుండా వ్యాపార వివరాలు, పన్నుల చెల్లింపు, విస్తృతమైన సైనిక ఉద్యోగుల వివరాలు రాసి పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. కానీ ఈ కాలంలో లిపి ఉండేదనే విషయానికి సంబంధించి ఎలాంటి పురావస్తు ఆధారాలు లేవు. అయితే ఈ ప్రాచీన రికార్డులను శిలలు, లోహపు ఫలకాలపై రాయకపోవడం వల్ల అవి నాశనమై ఉండొచ్చని అందుకే అవి అలభ్యాలని చెప్పొచ్చు.

మౌర్యుల తర్వాత పట్టణీకరణ

వ్యాపారం అభివృద్ధి చెందడం, ద్రవ్య ఆర్థిక విధానం విస్తరించడం పట్టణీకరణకు కారణభూతమయ్యాయి. చైనా యాత్రికులు తమ రచనల్లో పాటలీపుత్రం, వైశాలి, వారణాసి, కౌశాంబి, హస్తినాపురం, మధుర, ఇంద్రప్రస్థం మొదలైన నగరాలను పేర్కొన్నారు. కుషాణుల కాలంలో చిరండ్, సోన్‌పూర్, బక్సార్ (బీహార్), తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఖేరత్, మాసన్, ఉత్తరప్రదేశ్‌లో సోహ్‌గౌరా, భీటా, కౌశాంబి, శృంగవేర్‌పూర్, ఆంత్రజిఖేరా, మీరట్, మజఫర్‌పూర్ ప్రాంతాలు సంపదలతో తులతూగేవి. అదేవిధంగా పంజాబ్‌లోని జలంధర్, లూధియానా, రూపార్‌ల్లో కూడా కుషాణుల కాలం నాటి నిర్మాణాలు బయటపడ్డాయి. మొత్తం మీద కుషాణుల కాలంలో నగరీకరణ అత్యున్నత స్థాయికి చేరుకుంది. పశ్చిమ భారతదేశంలో మాళ్వా ప్రాంతాన్ని పరిపాలించిన శకుల నగరాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. వారి ప్రధాన నగరం ఉజ్జయిని. కౌశాంబి నుంచి మధుర, మధుర నుంచి పశ్చిమ తీర ప్రాంతానికి వచ్చే రెండు ప్రధాన రహదారులు ఉజ్జయినిలో కలవడం వల్ల ఆ నగరానికి అధిక ప్రాధాన్యత లభించింది. దీనికితోడు ఉజ్జయిని అతి విలువ కలిగిన ఆగేట్, కార్నిలియన్ రాళ్ల వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. క్రీ.పూ. 200 నుంచి ఇక్కడ కార్నిలియన్, జాస్పర్ రాళ్లతో పూసల్ని తయారు చేసేవారని తవ్వకాలు నిరూపిస్తున్నాయి. క్షిప్రా నదీ గర్భంలో పుష్కలంగా ముడిసరుకు లభించడం వల్ల ఈ పరిశ్రమ గొప్పగా వర్ధిల్లింది.

శకులు, కుషాణుల యుగంలా శాతవాహనుల కాలంలో టగర్, పైఠాన్, ధాన్యకటకం, అమరావతి, నాగార్జునకొండ, బరూచ్, సొపారా, అరికమేడు, కావేరిపట్నం ప్రసిద్ధి చెందాయి. తెలంగాణలో ఫణిగిరి, మునుల గుట్ట, పోతన్ ప్రసిద్ధి చెందిన బౌద్ధ పట్టణాలని 'ప్లిని' అనే చరిత్రకారుడు తన రచనల్లో పేర్కొన్నారు.

గుప్తుల యుగం నాటి పట్టణీకరణ క్షీణత - ప్రభావం

6వ శతాబ్దం నుంచి వ్యాపారం తీవ్రంగా తగ్గుముఖం పట్టింది. రోమన్ సామ్రాజ్యంతో, పశ్చిమ దేశాలతో వ్యాపారం ఆగిపోయింది. 6వ శతాబ్దంలో ఇరాన్, బైజాంటియన్‌లతో పట్టువస్త్రాల వ్యాపారం ఆగిపోయింది, భారతదేశం.. చైనా, ఆగ్నేయ ఆసియాతో వ్యాపారం కొనసాగించడంలో దళారీలైన అరబ్బుల పాత్ర ప్రధానం. లాభాలు కూడా పూర్తిగా వారే పొందారు. వ్యాపారం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో దేశంలో బంగారం నాణేలు పూర్తిగా తగ్గిపోయాయి. క్రమంగా పట్టణాలు శిథిలం కావడంతో మధుర, శ్రావస్తి, చరండ్, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాలు కాలగర్భంలో కలిసినట్లు తవ్వకాలు నిరూపిస్తున్నాయి. భారతీయ ఎగుమతులకు అవకాశాలు తగ్గడం వల్ల చేతివృత్తులవారు, వ్యాపారులు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. 5వ శతాబ్దం చివరలో పట్టు నేసేవాళ్లు పశ్చిమ తీరం నుంచి మాళ్వా ప్రాంతంలోని మాంద్‌సోర్‌కు వలస వెళ్లారు. పట్టణాలు శిథిలం కావడం వల్ల, వ్యాపారం తగ్గుముఖం పట్టి గ్రామాలు తమకు కావలసిన నూనె,ఉప్పు, సుగంధద్రవ్యాలు, బట్టలు మొదలైన వస్తువుల్ని సమకూర్చు కోవాల్సివచ్చింది. అందువల్ల ఉత్పత్తి కేంద్రాలు చిన్నవిగా మారి, తమ అవసరాలకు మాత్రమే పరిమితంగా ఉండి పోయాయి. తర్వాత సామాజిక నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో వైశ్యులను స్వతంత్ర రైతులుగా పరిగణించేవారు.

భూదానాలు రాజుకు, రైతుకు మధ్య భూస్వాములను సృష్టించాయి. అందువల్ల వైశ్యులు శూద్రులతో సమానమైపోయారు. ఈ మార్పు ఉత్తర భారతదేశం నుంచి బెంగాల్‌కు, దక్షిణ భారతదేశానికి విస్తరించింది.

వర్ణ వ్యవస్థలో మార్పులు

ధర్మశాస్త్రాల ప్రకారం వ్యక్తుల సామాజిక స్థాయి వర్ణంపై ఆధారపడి ఉండేది. ఒక వ్యక్తికి ఉన్న ఆర్థిక హక్కులు కూడా అతని వర్ణంపై ఆధారపడి ఉండేవి. పరిస్థితులు మారిన తర్వాత కొత్త భూస్వామ్య వర్గానికి ఇవ్వాల్సిన స్థానాన్ని గురించి ధర్మశాస్త్ర గ్రంథాల్లో మార్పులు చేశారు.

What is Miloni's overall percentage?



BANK EXAMS

Quantitative Aptitude

MODEL QUESTIONS

1. The length of a rectangle is three-fifth the side of a square. The radius of a circle is equal to side of the square. The circumference of the circle is 132 cm. What is the area of the rectangle if the breadth of the rectangle is 8 cm.?
a) 112.4 sq.cm. b) 104.2 sq.cm.
c) 100.8 sq.cm d) 114.0 sq.cm.
e) None of these

2. Five- ninth of a number is equal to twenty five percent of second number. Second number is equal to one-fourth of third number. The value of third number is 2960. What is 30 percent of first number?
a) 88.8 b) 99.9 c) 66.6
d) 77.7 e) None of these

3. The respective ratio between present age of Manoj and Wasim is 3:11. Wasim is 12 years younger than Rehana. Rehana's age after 7 years will be 85 years. What is the present age of Manoj's father who is 25 years older than Manoj?
a) 43 years b) 67 years
c) 45 years d) 69 years
e) None of these.

4. Dinesh's monthly income is four times Suresh's monthly income. Suresh's monthly income is twenty percent more than Jyothi's monthly income. Jyothi's monthly income is Rs.22,000/. What is Dinesh's monthly income?
a) Rs. 1,06,500/-
b) Rs. 1,05,600/-
c) Rs. 1,04,500/-
d) Rs. 1,05,400/-
e) None of these

5. Smallest side of a right angled triangle is 8 cm less than the side of a square of perimeter 56 cm. Second largest side of the right angled triangle is 4 cm less than the length of rectangle of area 96 sq.cm. and breadth 8 cm. What is the largest side of the right angled triangle?
a) 20cm b) 12cm c) 10cm
d) 15cm e) None of these

6. The ratio between the adjacent angles of a parallelogram is 7:8 respectively. Also the ratio between the angles of quadrilateral is 5:6:7:12. What is the sum of the smaller angle of parallelogram and second largest angle of the quadrilateral?
a) 168° b) 228° c) 156°
d) 224° e) None of these

7. Raju runs 1250 meters on Monday and Friday. Other days he runs 1500 meters except Sunday(He does not run on Sunday). How many kilometers will he run in 3 weeks (first day starting from Monday)?
a) 12.5kms b) 20.5 kms
c) 8.5 kms d) 25.5 kms
e) None of these

8. The sum of nine consecutive odd numbers of set-A is 621. What is the sum of different set of six consecutive even numbers whose lowest number is 15 more than the lowest number of set-A?
a) 498 b) 468 c) 478
d) 488 e) None of these

9. In a school there are 250 students out of whom 12 percent are girls. Each girl's monthly fee is Rs. 450/- and each boy's monthly fee is 24 percent more than a girl. What is the total monthly fee of a girl and boys together?
a) Rs. 1,36,620/-
b) Rs. 1,36,260/-
c) Rs. 1,32,660/-
d) Rs. 1,32,460/-
e) None of these

10. The average speed of a train is 10/7 times the average speed of a car. The car covers a distance of 588 kms in 6 hours. How much distance will the train cover in 13 hours?
a) 1750kms b) 1760kms
c) 1720kms d) 1820kms
e) None of these

11. What would be the cost of laying a carpet on a floor which has, its length and breadth in the respective ratio of 32:21 and where its perimeter is 212 feet, if the cost per square foot of laying the carpet is Rs. 2.5?
a) Rs. 6,720/- b) Rs.5,420/-
c) Rs. 7,390/- d) Rs. 7,890/-
e) None of these.

12. The simple interest accrued on a amount at the end of five years at 12.5 p.c.p.a is Rs. 1,575/-, what is the amount?
a) Rs. 2,050/- b) Rs. 2,550/-
c) Rs. 2,250/- d) Rs.2,520/-
e) None of these

13. A 260 meters long train crosses a platform thrice its length in 80 seconds. What is the speed of the train in Kms/hour?
a) 52.4 b) 46.8 c) 35.1
d) 64.1 e) None of these

14. If the cost of 8 erasers and 5 sharpeners is Rs.31/-, what will be the cost of 24 erasers and 10 sharpeners?
a) Rs.62/- b) Rs.84/-
c) Rs.78/- d) Rs.80/-
e) Cannot be determined

15. In how many different ways can the letters of the word 'PRETTY' be arranged?
a) 120 b) 36 c) 360
d) 720 e) None of these

16. A boat while travelling upstream covers a distance of 18 kms. at the speed of 3 Kms/hr. whereas while travelling downstream it covers the same distance at the speed of 9 kms/hr. what is he speed of the boat in still waters?
a) 3 kms/hr b) 5 kms/hr
c) 7kms/hr d) 8 kms/hr
e) None of these

17. What is the area of a circle whose circumference is 132cms.?
a) 1562 sq.cms. b) 1386 sq.cms.
c) 1434 sq.cms. d) 1643 sq.cms.
e) None of these

18. Shreya's bought an article and sold it for 125% percent of its cost price. What was the cost price of the article, if Shreyas sold it for Rs.30,750/-?
a) Rs.24,600/- b) Rs.24,640/-
c) Rs.24,250/- d) 23,200/-
e) None of these

19. The ages of Mira Tina and Sania are in the ratio of 6:4:7 respectively. If the sum of their ages is 34 years, what is Sania's age?
a) 12 years b) 10 years
c) 18 years d) 20 years
e) None of these

20. A basket contains three red and four green balls. If four balls are drawn at random from the basket, what is the probability that two are red and two are green?
a) 4/7 b) 2/7 c) 18/35
d) 3/14 e) None of these

Direction (Q. 21-25): Each of the questions given below consists of a question and two statements numbered I and II given below. You have to decide whether the data provided in the statements is sufficient to answer the question Read both the statements and

Give answer (a): If the data in the statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question.

Give answer (b): If the data in the statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question

Give answer (c): If the data statement I alone or in statement II alone is sufficient to answer the question.

Give answer (d): If the data in both the statements I and II is not sufficient to answer the question.

Give answer (e): If the data in both statements I and II together is necessary to answer the question.

21. What is the product of X and Y?
I) Y=X–28 II) –42 –12=X

22. What is the rate of interest % p.(a).?
I) An amount double itself in five years at simple interest.
II) Simple interest of Rs.1,600/- is obtained in two years on an amount of Rs.4,000/-.

23. In how many hours an A alone complete the piece of work?
I) B alone can complete the piece of work in 28 hours.
II) A,B and C together can complete the piece of work in 18 hours.

24. What will Anjali's age be five years from now?
I) Anjali's present age is twice Tosha's present age.
II) Tosha who is half Anjali's present age, was 21 years old five years ago.

25. What is the perimeter of the square?
I) The measure of one of its side is 10 cms.
II) The measure of its diagonal is 10 cms.

Direction (Q. 26-30): Study the following table carefully to answer the questions that follow:

Percentage of marks obtained by five students in three subjects

Subject (Max. Marks)	Maths (150)	Science (100)	English (50)
Student			
Miloni	94	83	74
Satish	72	88	68
Rachana	86	75	66
Purab	90	61	82
Mansi	68	67	72

26. What are the total marks obtained by Satish in all the subjects together?
a) 230 b) 232 c) 228
d) 226 e) None

27. What are the average marks obtained by all the students in Maths?
a) 137 b) 123 c) 127
d) 132 e) None

28. What is Miloni's overall percentage in the exam?
a) 75 b) 79 c) 87
d) 85 e) None

29. What is the respective ratio of marks obtained by Purab in Science and English together to the marks obtained by Rachana in the same subjects?
a) 17:18 b) 11:13 c) 15:19
d) 21:23 e) None

30. How many students have highest scored more than one subject?
a) None b) One c) Three
d) Two e) Four

(Q.31-35): Study the table carefully to answer the questions that follow-

Product of People	Total No.	Percentage of People		
		Men	Women	Children
A	46280	35	25	40
B	45540	25	35	40
C	32240	25	55	20
D	60430	20	50	30
E	36230	10	20	70
F	53990	40	40	20

31. What is the total number of children selecting Product E?
a) 27172 b) 25361 c) 23413
d) 21781 e) None

32. What is the average number of women selecting all the Products together?
a) 20859 b) 18765 c) 19076
d) 17383 e) None

33. What is the respective ratio of total number of women selecting Product A to those selecting Product D?
a) 1:3 b) 42:51
c) 2314:6043 d) 413:678
e) None

34. Number of children selecting Product C forms what percent of those selecting Product B? (rounded of to two digits after decimal)
a) 35.40 b) 287.10 c) 59.71
d) 185.40 e) None

35. Total number of men selecting Product F forms approximately what percent of the total number of people selecting all the Products together?
a) 19 b)14 c) 3 d) 23 e) 8

KEY

1) c 2) b 3) a 4) b 5) c
6) a 7) d 8) e 9) b 10) d
11) a 12) d 13) b 14) e 15) c
16) e 17) b 18) a 19) e 20) c
21) e 22) c 23) d 24) b 25) c
26) a 27) b 28) c 29) a 30) a
31) b 32) d 33) c 34) a 35) e